
రంగనాయకమ్మ

# స్త్రీ

## రంగనాయకమ్మ

స్వీట్‌హోమ్ పబ్లికేషన్స్
76, లేక్-సైడ్ కాలనీ
(దుర్గం చెరువు దగ్గిర)
జూబ్లీహిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033

# స్త్రీ

( నవల )

రచనా కాలం : 1965

పేజీలు : **133**

[ $\frac{1}{8}$ డెమ్మీ సైజులో ]

ధర : **35** రూ.లు

ఈ నవల మొదట
"ఆంధ్రప్రభ" వార పత్రికలో
1965లో సీరియల్‌గా వచ్చింది.


**'పుస్తకం'గా :**
**1**వ ముద్రణ : 1966 అక్టోబర్
**2**వ ముద్రణ : 1968 డిసెంబర్
**3**వ ముద్రణ : 1970 అక్టోబర్
**4**వ ముద్రణ : 1975 ఆగస్టు
**5**వ ముద్రణ : 1980 ఫిబ్రవరి
**6**వ ముద్రణ : 1985 ఫిబ్రవరి
**7**వ ముద్రణ : 1996 సెప్టెంబర్
**8**వ ముద్రణ : 2003 జనవరి
**9**వ ముద్రణ : 2009 జనవరి

**ముఖ చిత్రం :** 'బాపు'

**8 వ ముద్రణకు :**
కంపోజింగ్ & పేజ్ మేకప్ :
ఎన్. రఘురామయ్య

**ముద్రణ :**
చరితా ఇంప్రెషన్స్
1-19-1126/బి,
ఆజామాబాదు ఇండిస్ట్రియల్ ఏరియా,
హైదరాబాదు - 500 020.

**ప్రతులకు :**
అరుణా పబ్లిషింగ్‌హౌస్
ఏలూరు రోడ్డు, విజయవాడ - 520 002
(ఫోన్: 0866 - 2431181)



రంగనాయకమ్మ అడ్రసు :
76, లేక్ సైడ్ కాలనీ
( దుర్గం చెరువు దగ్గిర )
జూబ్లీ హిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033

# ముందు మాట
## [ 8 వ ముద్రణ సమయంలో, 2002 డిసెంబరులో రాసినది. ]

**ఒక** పుస్తకంలో ఒక 'ముందు మాట' ఉందంటే, ముందు దాన్నే చదివి, మిగిలిన పుస్తకాన్ని తర్వాత చదవాలనేది అసలు నియమం. నవల కన్నా ముందు వున్న దాన్ని, **'ముందు మాట'** అనడంలో అర్థం అదే!

కానీ ఈ నియమం, కొన్ని సందర్భాలకు పూర్తిగా సరిపోతే, కొన్ని సందర్భాలకు బొత్తిగా సరిపోదు. సైన్సూ, చరిత్రా వంటి వాటిని చెప్పే పుస్తకాల్లో, 'అసలు పాఠాన్ని' అర్థం చేసుకోవడానికి, 'ముందు మాట' చాలా సహాయంగా ఉంటుంది. అలాంటి పుస్తకాల్లో 'ముందు మాట'ని చదవకుండా లోపలికి వెళ్తే తప్పకుండా ఇబ్బంది పడవలసివస్తుంది. కాబట్టి అలాంటి పుస్తకాల్లో ముందు మాటల్ని చదవడం మొట్టమొదట చెయ్యవలిసిందే!

కానీ, కథలకూ నవలలకూ రాసే ముందు మాటల విషయంలో, పరిస్థితులు అలా ఉండవు. ఈ సందర్భాలు రక రకాలుగా ఉంటాయి. ఒక నవలకి రాసిన 'ముందు మాట'లో, 'కథావస్తువు' గురించో, 'పాత్రల' గురించో, విమర్శలు వున్నాయనుకుందాం. అలాంటప్పుడు, ఆ ముందు మాటనే మొదట చదివితే, అప్పటికి ఆ కథ ఏమిటో తెలిసి ఉండదు కాబట్టి, దాని మీద విమర్శల్ని ఎలా అర్థం చేసుకోగలం? — అర్థం చేసుకోలేం. అంటే, ఇలాంటి సందర్భాల్లో, మొదట ఆ కథనో నవలనో పూర్తి చేసిన తర్వాతే 'ముందు మాట'ని చదవాలి కదా?

కానీ, పుస్తకం తెరవగానే ముందు మాటనే మొదట చూస్తాం. అందులో ఏమైనా విమర్శల్లాంటివి ఉన్నాయో లేదో, దాన్ని మొదటే చదవాలో లేదో, దాన్ని చదవకపోతే ఎలా తెలుస్తుంది? అందులో ఏం ఉందో దాన్ని చదివితేనే కదా తెలిసేది? అంటే, 'ముందు మాట'ని మొదట ఒక సారి చదివి చూసి, అందులో అప్పుడే అర్థం చేసుకోలేని చర్చల్లాంటివి ఏమైనా ఉంటే, "అయ్యెయ్యో, దీన్ని చదవకుండా ఉండవలసిందే!" అనుకోవాలా? ఇదో తమాషా పరిస్థితి!

'కథా వస్తువు' మీదా, 'పాత్రల' మీదా, విమర్శలేమైనా రాసినప్పుడు, అలాంటి దాన్ని 'ముందు మాట'గా ఇవ్వకుండా 'చివరి మాట'గా పుస్తకానికి చివర్లో ఇస్తే, ఈ సమస్య తీరిపోవచ్చు. పుస్తకంలో ముందు మాటే లేకపోతే, మొదట అసలు కథనే పూర్తి చేస్తాం. దాని మీద విమర్శల్ని తర్వాతే 'చివరి మాట'లో చదువుతాం. ఇది బాగానే ఉన్నట్టుంది కదా?

సాధారణంగా నేను, కథల పుస్తకాల్లో ముందు మాటల్ని మొదట చదవను. మొదట అసలు కథే పూర్తి చేస్తాను. దాని మీద నా అభిప్రాయానికి నేను వస్తాను. ఆ తర్వాతే 'ముందు మాట' చదువు తాను. అందులో అభిప్రాయాలు సరిగా వున్నాయో లేవో, దాన్ని రాసిన వ్యక్తి ఆలోచించినట్టే నేను కూడా ఆలోచించగలిగానో లేదో, నా అభిప్రాయాల్ని ఎక్కడైనా

సవరించుకోవాలో యేమో — అదంతా తెలుసుకోడానికి ప్రయత్నిస్తాను.

'ముందు మాట'నే మొదట చదివితే, కథ చదవక ముందే కొన్ని సంఘటనలు తెలిసిపోతాయి, సినిమా చూడకముందే సినిమా కథ తెలిసిపోయినట్టు!

అంతేగాక, ముందు మాటని మొదట చదివితే, తర్వాత అసలు కథ చదివేటప్పుడు, ముందు మాటలో వున్న అభిప్రాయాల ప్రకారమే మనం కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నా ఉండొచ్చు. ఆ కథ మీద ఇంకో వ్యక్తి అభిప్రాయం తెలియకుండా, మనమే స్వయంగా ఆలోచించి ఒక అభిప్రాయానికి రావాలంటే, ముందు మాటని చదవకుండానే అసలు కథని పూర్తి చెయ్యాలి. ఆ తర్వాతే ముందు మాటలో అభిప్రాయాలు చూడాలి.

కానీ, కొన్ని ముందు మాటల్లో సందర్భాలు అలా కూడా వుండవు. ఇంకో రకంగా వుంటాయి. నేను దాదాపు నా పుస్తకాలన్నిటికీ కొత్త ముందు మాటలు రాయడం గతంలోనే మొదలు పెట్టాను.

'కథావస్తువు'లో గానీ, పాత్రల ప్రవర్తనల్లోగానీ, శైలిలోగానీ, సంభాషణల్లోగానీ, ఎక్కడ పొరపాట్లు వున్నా, వాటి గురించి నేను చెప్పకుండానే పాఠకులు గ్రహించగలిగితే అది మంచిదే! కానీ, 'కొత్త ముందు మాటలు' అలాంటి పాఠకుల కోసం కాదు. ఈ పాఠకులు, నేను చెప్పిన దాన్నే ఆధారం చేసుకొని, దాన్ని హెచ్చరికగా తీసుకొని, 'కథ'ని చదివేటప్పుడు, ఆ ఫలానా ఫలానా రకాల పొరపాట్ల గురించి సరిగా ఆలోచించాలని తెలుసుకుంటారు. అలా ఆలోచించాలంటే, 'ముందు మాట'లో ఉన్న హెచ్చరికల్ని మొదటే చదవాలి కదా? — ఇది ఒక కొత్త రకం పరిస్థితి! ఇలాంటి ముందు మాటల్ని మొదట చదివినా, 'కథని'ని పూర్తిచేశాక మళ్ళీ కూడా చదివితే, ఎక్కువ ఉపయోగం ఉంటుంది.

మొత్తం మీద 'ముందు మాట'ని మొదటే చదవాలా, తర్వాత చదవాలా అనేది — రక రకాల పరిస్థితుల్ని బట్టి ఉంటుంది. కానీ, ఒక ముందు మాట ఏ పరిస్థితి కిందకి వస్తుందో ఆ ముందు మాటని చదివితే తప్ప తెలీదు!

ఇలాంటి సమస్యలో రచయిత చెయ్యగలిగేది ఏమిటంటే — 'కథ' గురించి కొన్ని విషయాలు చెప్పదల్చినప్పుడు, దాన్ని 'ముందు మాట'గా ఇవ్వాలో, 'చివరి మాట'గా ఇవ్వాలో, ఎలా ఇస్తే ఎక్కువ సమంజసంగా వుంటుందో ఆలోచించి, దానికి తగినట్టు చెయ్యాలి.

ఇక, పాఠకులు చేసేది ఏమిటంటే, ఒక పుస్తకంలో 'ముందు మాట'ని చూసినప్పుడు, దాన్ని మొదటే చదవాలో తర్వాత చదవాలో తమకు ఇష్టమైనట్టు చేస్తారు. అది పాఠకుల ఇష్టాయిష్టాల్ని బట్టి ఉంటుంది. దాన్ని వారి ఇష్టానికి వదిలెయ్యవలిసిందే!

25-12-2002

**గమనిక :** ఈ 'ముందు మాట'లో నించి, తర్వాత భాగాన్ని తీసి, ఈ పుస్తకంలోనే చివరికి చేరుస్తున్నాను. ఎందుకంటే, ఆ భాగంలో, కథకీ, పాత్రలకూ సంబంధించిన ప్రస్తావనలు వున్నాయి. వాటిని చివరిలోనే చదవాలి. ఆ భాగాన్ని, చివరిలోకి చేర్చే పని, 9 వ ముద్రణ సమయంలో, 2008 డిసెంబరులో చేశాను. చివరలో చూడండి!

★

# స్త్రీ

**'అమ్మా!** ఒక్కసారి ఇలా వచ్చి వెళ్ళు!'' వంటింటి ముందు వరండాలో తచ్చాడుతూ విజయశాస్త్రి చివరకి ధైర్యం చేసి గొంతు పెగుల్చుకుని ఆ రెండు మాటలూ అనేశాడు.

కొడుకు కంఠం విన్న కామేశ్వరమ్మ బయ టికి చూడకుండానే అంది. ''నేను మడిలో ఉన్నానురా, జానకి వస్తోంది, ఏం కావాలో చెప్పు!''

''కాదమ్మా! నువ్వే ఒకసారి లేచిరా!'' అసహనంగా మళ్ళీ పిలిచాడు శాస్త్రి.

ఓ క్షణం తటపటాయించి చేతులు కడుక్కుని లేచి వచ్చింది కామేశ్వరమ్మ.

చేతిలో పేపరు పట్టుకుని, పాలిపోయిన ముఖంతో నిలబడివున్న కొడుకుని చూడగానే కాస్త కంగారుపడింది తల్లి. ప్రశ్నార్థకంగా కొడుకు ముఖంలోకి చూస్తూ, ''ఏమిటిరా శాస్త్రీ? ఎందు కలా పిలిచావు?'' అంటూంటే, మాట్లాడకుండా తెరిచివున్న పేపరు తల్లికి అందించి రెండడు గులు స్తంభంకేసి నడిచి ఎటో చూస్తూ నించు న్నాడు శాస్త్రి. కొడుకు వైఖరి అర్థంగాని కామే శ్వరమ్మ తెలియని జంకుతో చేతిలో విడమరచి ఉన్న పేపరులోకి చూసింది ఎగా దిగా.

పెద్ద పెద్ద పూలదండలతో సన్నిహితంగా నిలబడివున్న వధూవరుల ఫొటోలో స్త్రీమూర్తిని పోల్చగలిగింది, వెంటనే. ''ఇది... ఇది... పద్మజ కాదూ?... మన పద్మజ!'' అప్రయత్నంగా అంటూ కొడుకుకేసి చూసింది. ''ఏమిటిరా, శాస్త్రీ? ఏమిటిది?'' అంది అయోమయంగా.

శాస్త్రి మాట్లాడలేదు సరికదా, ముఖం కూడా కనిపించనీయకుండా నించున్నాడు. కామేశ్వరమ్మ మళ్ళీ మళ్ళీ చూసింది పేపర్లో పడ్డ ఫొటోకేసి. గుండెల్లో ఏదో దుశ్శంక జర జరా పాకుతూంటే చటుక్కున రెండడుగులు ముందుకు వేసి కొడుకు భుజం తట్టి వెనక్కు తిప్పుతూ కంగారుగా అడిగింది. ''శాస్త్రీ! మాట్లాడ వేం? మన పద్మ ఫొటో పేపర్లో వేశారెందుకూ? ఈ పక్కన నిలబడ్డ కుర్రాడెవరూ? నేనేం చదువుకు చచ్చానా, అలా నోరుమూసుకు నించున్నావు?''

శాస్త్రి ముఖం జేవురించింది. కను గుడ్లు నిప్పు కణికలయ్యాయి. పళ్ళు పట పటలాడిం చాడు. ''ఇంకేం చెప్పనమ్మా? మన బతుకులు బండలయ్యాయి. ఆ పూలదండలూ, ఆ వ్యవ హారం చూస్తుంటే కూడా అర్థం కాలేదా? పద్మజ, జార్జివిలియమ్స్ అనే ఆంగ్లో — ఇండియన్ వాణ్ణి రిజిష్టర్ పెళ్ళి చేసుకుంది. వాడూ డాక్టరేనట!''

''శాస్త్రీ!''కెవ్వున కేక బెట్టింది కామేశ్వరమ్మ. ఆందోళనతో ఆవిడ ఒళ్ళంతా వణకసాగింది. ''చాల్లే అర్థం పర్థం లేని వాగుడూ నువ్వూనూ. మన పద్మజ అలాంటి వెధవ పని చేస్తుందా?''

వెర్రి వాడిలా చూశాడు శాస్త్రి.

కామేశ్వరమ్మ తీక్షణంగా అంది మళ్ళీ. ''రెండు కళ్ళూ పెట్టుకుచదివావూ? నోటికి ఎంత వస్తే అంతా అనేస్తావా! అదేం గొప్ప పని చేసిం దని ఫొటో వేశారోగానీ...''

''అమ్మా!'' కోపంగా అన్నాడు శాస్త్రి. ''ఆవిడ దృష్టిలో ఇది కూడా ఘన కార్యమేనని ఫొటో వేయించుకుంది. పత్రికలో అచ్చుపడ్డ సంగతి చదివి నీకు చెప్పానంతే. ఆ పిల్ల మన పద్మజే అయితే అది ఆంగ్లో — ఇండియన్ వాణ్ణి కట్టు కున్న సంగతి కూడా నూటికి నూరు పాళ్ళూ యదార్థమే!''

పిచ్చి పట్టినట్టే చూసింది కామేశ్వరమ్మ. ''పద్మ... మన పద్మ... మనతో చెప్పకుండానే... ఇలాంటి పనెలా చేస్తుందిరా? నాన్నగారు కుది ర్చిన సంబంధం ఉండగా ఎక్కడో తెల్ల వాణ్ణి... ఎలా నమ్మేదిరా?''

"బాగా నమ్ముదువులే, వెళ్ళి నాన్నగారినే అడుగు!" విసురుగా వరండా దిగి వెళ్ళిపోయాడు శాస్త్రి.

అయోమయంగా పదే పదే పేపర్లోకి చూస్తూ నించుంది కామేశ్వరమ్మ.

"అత్తయ్యా! కుంపటి మీద పోపు మాడిపోతోంది. నే నెలా ముట్టుకునేది?" వరండాలోకి వినిపించేలా కంఠ స్వరం హెచ్చించి పిలిచింది జానకి వంటింట్లోనుంచి. అప్పటికే కామేశ్వరమ్మ దడ దడా కొట్టుకుంటున్న గుండెలతో పేపరు పట్టుకుని పరుగు పరుగున భర్త గది వైపు నడిచిపోయింది.

"ఏమండీ! ఇది విన్నారూ? మన పద్మ..."

ఈశ్వర సోమయాజి నిర్లిప్తంగా చూస్తూ కూర్చుని ఉన్నాడు పక్క మీద.

పొంగి పొంగి వస్తున్న కన్నీళ్ళతో ఆరాటం వెల్లడిస్తూ అంది కామేశ్వరమ్మ. "శాస్త్రి ఏమంటున్నాడో చూశారా? మన పద్మతల్లి ఇంత వివేకం లేని పనిచేస్తుందా? అసలు దాని ఫోటో ఎందుకు వేశారో కాస్త మీరైనా సరిగ్గా చదివి..."

"కాముడూ!"

మంచు తాకిడి వంటి భర్త పిలుపుతో తెల్లబోయింది కామేశ్వరమ్మ. ఆయన ముఖంలో, కళ్ళల్లో, ఏదో కాంతి ప్రకాశిస్తున్నట్టు తోచింది. మరేమీ అడగటానికి నోరు రాక ఇంకా దగ్గిరికి వెళ్ళి నిలబడింది.

ఒక్క నిట్టూర్పు విడిచాడు ఈశ్వర సోమయాజి. పేపరు చూడకుండానే అన్నాడు — "అబ్బాయి చెప్పింది నిజమే కాముడూ!"

"అలాక్కాదు. మీరు స్వయంగా చూసి చెప్పండి, నేను నమ్ముతాను. మన పద్మకేం మంచి చెడ్డలు తెలీవనా? అంత పాడు పని ఎన్నడూ చెయ్యదు!" అంటూ పేపరు తెరిచి భర్త ఒడిలో పెట్టి దగ్గిరగా కూర్చుంది ఆందోళనగా చూస్తూ.

క్షణ కాలం కుమార్తె పెళ్ళిఫోటోని తీక్షణంగా చూశాడు సోమయాజి. చూస్తుండగానే ఆయన కళ్ళలో నీళ్ళు ఊరాయి. చటుక్కున ఉత్తరీయంతో ఒత్తుకున్నాడు.

కుప్పలా కూలిపోయింది కామేశ్వరమ్మ. కొడుకంటే ఏ నాడూ అపనమ్మకం లేకపోయినా, అకస్మాత్తుగా అంత ఆపదని అంగీకరించలేక, అంత వరకూ పెనుగులాడింది. ఆ ధైర్యం యావత్తూ నీరుగారిపోయింది. "ఇదేం ఘోరమండీ? మనకి మాటవరసకైనా చెప్పకుండానే దాని పెళ్ళి అదే చేసుకోడం ఏమిటండీ? కులం గోత్రం, జాతీ మతం — ఏమీ చూడకుండా..." దుఃఖ భారంతో ఆవిడ కంఠం మరి పెగలలేదు. కొంగు అడ్డుపెట్టుకుని విల విల్లాడింది.

ఒక్క సారి వేదాంతిలా చూశాడు సోమయాజి. "కాముడూ! ఇక యేడ్చి ప్రయోజనం లేదు. మన పద్మ... కోరుకున్నవాణ్ణి వివాహం చేసుకుంది. జరిగిపోయింది... అంతా!" ఎంత తమాయించుకోబోయినా గాంభీర్యం సడలి మళ్ళీ కళ్ళు చెమర్చుతూంటే ఉత్తరీయంతో ఒత్తుకుంటూనే కూర్చున్నాడాయన.

ఎన్నడూ అధైర్యపడని భర్త కంట నీరు తిరగటంతో కామేశ్వరమ్మ శోకావేశం తాత్కాలికంగా శాంతించింది. ఆయన ముఖం తుడుచుకుంటున్న ఉత్తరీయాన్ని చేతుల్లోకి తీసుకుంటూ, "ఒక్కసారి ఇలా చూడండి! ఇది ఇలా చేస్తానని మీకు గాని చెప్పిందీ?" అంది అర్థంలేని ఆశతో.

సూటిగా భార్య కళ్ళలోకి చూస్తూ అన్నాడాయన—"చెప్పింది కాముడూ! చెప్పింది! నేడో రేపో ఇది జరుగుతుందనే..."

గొల్లుమంది కామేశ్వరమ్మ, పొంగులు వారుతున్న దుఃఖంతో వణికిపోతూ, "మీకు... మీకు తెలిసీ... ఇలా ఊరుకున్నారా? ఒక్క ముక్కైనా నా చెవిని వేశారా? నయాన్నో భయాన్నో ఏడ్చో మొత్తుకునో ఈ అప్రతిష్ఠ రాకుండా కాపాడుకునే దాన్ని కాదూ? కట్టుకున్న దాన్నంటూ నేను ఉన్నానని, ఎన్నడైనా మీకు కష్టసుఖాలకి గుర్తువచ్చానా?" అని నిష్ఠూరాలాడుతూ ఏడ్చింది. "మీ చేతులతోనే మీ ఇంటికి నిప్పు పెట్టుకున్నారు! మీ వేలితోనే నా కన్ను పొడిచారు!"

సోమయాజి స్థాణువులా కూర్చున్నాడు.

"అది పెళ్ళికి ఒప్పుకుందని నాతో అబద్ధం ఆడారు! పెళ్ళి కళతో ఇల్లు కల కల్లాడుతుందని మురిసి ముక్కలయ్యాను! మమ్మల్నందరినీ ఇంత మభ్యపెట్టి చివరికి ఇంత నవ్వులపాలు చేశారా? అయ్యో, భగవంతుడా?" అంటూ బావురుమని యేడ్చింది.

"కాముడూ!" భార్య శిరస్సు మీద అప్యాయంగా చేయివేశాడు సోమయాజి. "నువ్విలా బాధపడకూడదు! నా మాట విను! కొంచెం ధైర్యం తెచ్చుకో! మన బిడ్డ మనకు కాకుండా పోయినా, ఎక్కడ ఉన్నా సుఖంగానే ఉండాలి. ఒక్క సారి మనస్సులోనయినా పద్మని ఆశీర్వదించు కాముడూ! తప్పదు — నువ్వు కన్న తల్లివి!"

"కాదు, కాదు! నేనా పాపిష్టి దానికి తల్లిని కాదు!" గొల్లుమంది కామేశ్వరమ్మ. "అది నా కడుపున పుట్టనే లేదు! నా బిడ్డలు ఇద్దరే... ఇద్దరే!"

పై నుంచి గబ గబా మెట్లు దిగి వస్తున్న సుజాత, ఊహించలేని స్థితిలో తల్లిదండ్రుల్ని చూసి నిర్ఘాంతపోయింది. తండ్రి ఒడిలో తల దాచుకుని రోదిస్తున్న తల్లినీ, తల్లి తల నిమురుతూ ఓదార్చప్రయత్నిస్తున్న తండ్రినీ, కారణం తెలియని వారి దుఃఖాన్నీ చూస్తూ స్థాణువులా నిలబడిపోయింది.

"మనం కాదనుకున్నా లోకం కాదనదు, కాముడూ! బిడ్డల్ని కనగలమేగానీ వాళ్ళ రాతల్ని కూడా కనగలమా? మన నుదుటి రాత ఇలా ఉందని సరిపెట్టుకోటం తప్పితే ఇంకేం చెయ్యగలం?.... ఊరుకో!"

"అవేం మాటలండీ? మన నీతీ జాతీ పరువూ ప్రతిష్టా ఇవన్నీ ఏ గంగలో కలిపారు? ఇక ఇంకో మనిషి ఎదట తల ఎత్తుకు తిరగగలమంటారా? మీకు మాత్రం కడుపు చెరువై పోవడం లేదూ, అగ్ని హోత్రం లాంటి ఇంట పుట్టిన బ్రాహ్మణ బిడ్డ ఎక్కడో జాతి కాని జాతి వాణ్ణి కట్టుకుంటే?"

అదిరిపడింది సుజాత! — ఎవరూ? ఎవరి సంగతీ? అక్కయ్యా? ఏం చేసింది? — అలాగే నించుని వింటే అంతా అర్థమైపోయింది. నేల మీద పడివున్న పేపరు తీసి చూసి తన కళ్ళను తానే నమ్మలేకపోయింది. "అక్కయ్య ఎంత పని చేసిందీ!"

పద్మజ సాహసం, తోడబుట్టిన సుజాతను అంతులేని విస్మయంలో, దిగ్భ్రమలో ముంచి వేసింది. ఆపైన ఆలోచనలు కూడా సాగనీయనంత జడురాలిని చేసింది.

"సుజా!"

తలుపు వార నిలబడి ఎప్పటి నుంచో పిలుస్తున్న జానకి పిలుపు వింటూ ఒక్క ఉదుటున లోపలికి పరిగెత్తింది. "చూశావా వదినా? అక్కయ్య మన కెవ్వరికీ చెప్పకుండా, మద్రాసు లోనే పెళ్ళి చేసేసుకుంది!" అడక్కుండానే చెప్పేసి బావురుమంది.

అకస్మాత్తుగా ఆవహించిన భర్త ఆగ్రహానికీ, అత్త మామల దుఃఖానికీ కారణం తెలియక కంగారుపడుతున్న జానకి, తీరా కారణం విని మ్రాన్పడిపోయింది.

★ ★ ★

"ఏ సాహసం చెయ్యకుండా పద్మజ కూడా పది మంది లాగే సామాన్యంగా ఉండిపోతే విస్తుపోవాలి గానీ, ఎంత చిత్రమైన పనిచేస్తే మాత్రం పద్మజ విషయంలో విడ్డూరం ఏముందీ?" అనుకున్నాడు రఘుపతి.

పద్మజ పెళ్ళి ఫోటో పేపర్‌లో చూసినప్పుడు రఘపతికి ఆశ్చర్యం కలగలేదు. సహజంగా పద్మజ చేసి తీరవలసినపనేదో చేసిందని అనుకున్నాడు. "అదృష్టవంతురాలు! ఆడ పిల్లయి పుట్టినా ఆది నుంచీ కోరుకున్నవన్నీ సాధించుకో గలిగిన సమర్థురాలు! జీవితమంతా కలిసి బతకవలసిన భాగస్వామి కోసం తల్లిదండ్రులనూ, సంఘాన్నీ ధిక్కరించటం పద్మజ వంటి వాళ్ళకి విశేషం కానేకాదు!" చిన్న నాటి స్నేహితురాలి సాహసం తలుచుకుంటున్న కొద్దీ రఘుపతి

మనసు ఆవేశపూరితమైంది. తన వంటి అప్రయోజకులు పద్మజ ముందు ఎందుకు పనికి వస్తారు? జీవితాన్ని శాసించుకోగలిగిన స్వశక్తి తనకు ఎండమావి! జీవితం విలువే గ్రహించలేక పోయిన తనకు జీవితాన్ననుభవించే అర్హత ఎక్కడిది? నిరాశగా నిట్టూర్చాడు రఘుపతి.

మరో సారి పద్మజకేసీ, ఆమె ప్రేమించి సాహసించి పెళ్ళాడిన ఆ అదృష్టవంతుడికేసీ, మార్చి మార్చి చూస్తూ కూర్చున్నాడు. ఆ నూతన వధూవరుల ముఖాల్లో ఎంత ఆనందం! లోకాన్నే ధిక్కరించగలిగిన ఆ ప్రేమికుల్లో ఎంత సంతోషం! ప్రత్యేకించి పద్మజ కన్నుల్లో ఆ గాంభీర్యం, ఆ నైర్మల్యం! అందుకే పద్మజ కళ్ళల్లోకి యెన్నడూ తను లోతుగా చూడటానికి సాహసించలేక పోయేవాడు! ఆ చూపులు అకారణంగా తనను చిత్ర వధ చేస్తాయేమోనన్న భయంతోనే బతికాడు! చిన్న నాడే ఆ నేస్తం స్నేహంతో, ఆ సాహసపూరితమైన చూపుల్లో ఇచ్చే సందేశం తెలుసుకోగలిగితే ఈ నాడిలా, ఇలా కుమిలిపోయే దౌర్భాగ్యం పట్టేది కాదేమో! జీవితాన్నింత నిర్లక్ష్యం చేసుకోగలిగే వాడూ కాదేమో! మించిపోయింది అంతా!

"రఘూ! ఇక్కడే ఉన్నావూ? పిలిస్తే పలకవేం?" అంటూ వచ్చింది అన్నపూర్ణమ్మ. "మీ అత్తగారి ఊర్నించి ఉత్తరం వచ్చిందిరా! సుశీలకి మళ్ళీ సుస్తీ చేసిందట! ఒకసారెళ్ళి చూసిరా కూడదూ?"

కొంతసేపు మౌనంగా ఊరుకున్నాడు రఘుపతి! "సుశీలకా? మళ్ళీ ఏమైంది?"

"ఏమో! సుస్తీ తిరగబెట్టిందని రాశారంతే! అదేం తెగులో, ఖర్మ! రాక్షసిలా దాన్ని పట్టి పీడిస్తోంది! అదక్కడా, నువ్విక్కడా! లక్షణంగా మీ రిద్దరూ కాపరం చేసుకుంటూవుంటే చూసే రాతే లేనట్టుంది మా మొహాన!"

ఉదాసీనంగా చూస్తూ కూర్చున్నాడు రఘుపతి. "పద్మజ పెళ్ళి మాట అమ్మకు చెబితేనో!" అనిపించిందో క్షణం. "ఊహుఁ! వద్దు! గతమంతా తవ్వుకుంటూపోయి పార్వతి పెళ్ళి మాట కూడా అడుగుతుంది అమ్మ"

"ఒక్క సారి చూసిరా నాయనా! నువ్వే కాదనుకుంటే..."

"వెళతాలే అమ్మా!"

కుర్చీలో నుంచి లేచి బయటికి వెళ్ళిపోతున్న కొడుకుని చూస్తూ అపరాధిలా నిల్చుంది అన్నపూర్ణమ్మ.

★ ★ ★

**మ**ధ్యాహ్నం వేళ ఆఫీసు వెయిటింగ్ రూములో కాలక్షేపంగా పాత పేపర్లు తిరగవేస్తూ కూర్చున్న పార్వతి తుళ్ళిపడింది. విస్మయంతో ఒకటికి నాలుగు సార్లు చూసిందా పెళ్ళి ఫోటోను! తన కళ్ళు తనను మభ్యపెడుతున్నాయేమోనన్నంత అనుమానంతో చుట్టూ పరికించింది. ఎక్కడి వస్తువులక్కడ, ఎక్కడి మనుష్యులక్కడ, ఏమీ మార్పు లేదు!

"ఏమిటండీ, అంత ఆశ్చర్యంగా చూస్తున్నారు!" ఫ్లాస్క్ ఖాళీ చేసి మూత బిగిస్తూ పలకరించాడు తోటి గుమస్తా నారాయణరావు.

"అబ్బే! ఏం లేదండీ! ఇక్కడ... ఈ పేపర్లో... ఓ పెళ్ళి ఫోటో" చెప్పాలన్న ప్రయత్నం లేకుండానే చెప్పేసింది.

"ఏదీ?..."

అయిష్టంగానే అందించింది పేపరు.

"ఓ, ఇది వారం రోజుల కిందటిదండీ! ఇప్పుడు చూసి విస్తుపోతున్నారేమిటి? ఆ రోజు ఈ ఫోటో చూసినప్పుడు నేనూ మీలా కొంచెం ఆశ్చర్యపడక పోలేదులెండి! మన వెర్రి గానీ ఇది రాకెట్ల యుగమండీ! ఒక గోళం మీద నుంచి ఇంకో గోళం మీదికి ఎగరాలని ప్రయాణాలు కడుతూంటే, వర్ణాంతర వివాహాలూ, మతాంతర వివాహాలూ, ఇంకా యేం విడ్డూరం? డాక్టర్ చదువు చదివిన ఓ ఆడ పిల్ల ఆ మాత్రం సాహసమైనా చెయ్యలేకపోతే ఇక మనమేం పురోగమిస్తున్నట్టు?"

అయోమయంగా చూసింది పార్వతి. నారాయణరావు నిజంగానే మెచ్చుకుంటున్నాడో,

వెటకారం చేస్తున్నాడో అర్థంకాలేదు. "ఈవిడ... ఎవరో కాదండీ! నా స్నేహితురాలు! చిన్ననాడు కలిసి మెలిసి చదువుకున్నాం. నా ప్రాణ స్నేహితురాలు! పద్మజ... పద్మ... ..." అనెయ్యాలన్నంత తొందర కలిగింది. తమాయించుకుంది. బలవంతంగా, పేపరు అందుకుని మళ్ళీ చూస్తూ కూర్చుంది. పద్మజ అందంగా, నిర్లక్ష్యంగా నవ్వుతోంది. అతను... జార్జి విలియమ్స్... పద్మజ ప్రియుడు... ప్రియుడేమిటి? పద్మజ భర్త. సంతోషంగా, చురుగ్గా చూస్తున్నాడు. ఇద్దరికీ అంద చందాల్లో మంచి పొందిక కుదిరింది. ఒకరి కోసమే ఒకరు పుట్టినట్టు, ఒకరు లేక మరొకరు లేనట్టు, ఆ చూపుల్లో, వారి సాన్నిధ్యంలో, అనురాగ స్రవంతులు ప్రవహిస్తునట్టున్నాయి!

చూసినకొద్దీ చూడబుద్ధి కలుగుతూన్నా, ఆ తన్మయత్వంలో వాస్తవం గుర్తు వచ్చింది కొంత సేపటికి. "పద్మజ ఎంత పని చేసింది!" కొత్తగా విస్తుపోయింది పార్వతి. ఈ విషయం మాట మాత్రమైనా ఎన్నడూ అనలేదే! "నువ్వు నా ప్రాణాధికమైన నేస్తానివి పారూ!" అనే పద్మ తన ప్రేమ ఇంత మరుగుపరుచుకుందా? ఆఖరికి మాట మాత్రమైనా తెలియనివ్వకుండా పెళ్ళి చేసుకుందా? ఈ విషయం ఇంట్లో వాళ్ళకు కూడా తెలిసి ఉండదు బహుశా! బహుశా ఏమిటి? ఎంత మాత్రం తెలిసి ఉండదు! ముందు తెలిస్తే సుజాత తనకు తప్పకుండా ఉత్తరం రాసేది!

అనుకోకుండా పద్మజ ఇలా చేసిందంటే ఆశ్చర్యంగానే ఉంది. పద్మజ సాహసం పార్వతికేమీ కొత్తకాకపోయినా, ఈ సంఘటన కొత్తగానే బాధించింది. "ఇష్టాల్ని చంపుకుని, మనసుల్ని మభ్య పెట్టుకుని చేజేతులా జీవితాలెలా నాశనం చేసుకుంటారో నా కర్థం కాదు, పారూ!" అంది పద్మజ, రఘు పెళ్ళి కొడుకై తరలి వెళ్ళుతున్న రోజు! తమ మీద కోపంతో అలా ఆవేశంతో మాట్లాడిందేమో అనుకుందేగానీ, నిజంగా చేతలకువస్తే ఇంత సాహసం ప్రదర్శించగలదని ఊహించ లేక పోయింది తను!

పద్మజ ఇలా చెయ్యకుండా ఉంటేనే బాగుండేదేమో! సంఘం ఎంత సంస్కరణ పొందుతున్నా, కాలం ఎంత రాకెట్ల మయమైనా, పద్మజ పుట్టిపెరిగిన బ్రాహ్మణ కుటుంబంలోయే ఆచారం మాసిపోయింది? పద్మజ తల్లిదండ్రులు పాటించే నియమ నిష్టలలో ఏది కొరవపడింది? పార్వతికి తెలిసినంత వరకూ పద్మజ పుట్టింటిని గురించి ఒక్క మాటలో చెప్పాలంటే, నిప్పుని నీళ్ళతో కడిగి శుద్ధి చేసేటంత ఆచారం ఆ ఇంట తర తరాలుగా వస్తున్నది. ఈశ్వర సోమయాజి తాత యజ్ఞయాగాలు చేసి సోమయాజి అయ్యాడట! తండ్రి శుద్ధ బ్రాహ్మణ పండితులనూ, శ్రోత్రీయ కుటుంబీకులనూ విశేషంగా ఆదరించాడట జీవితమంతా! ఇక సోమయాజి ఎంత ఇంగ్లీషు విద్య అభ్యసించి తాసీల్దారు ఉద్యోగం సంపాదించినా, నెత్తి మీద పంచ శిఖల్లో ఓ శిఖని 'పవిత్ర బ్రాహ్మణ్యానికి' గుర్తుగా పెంచుకుంటూనే ఉన్నాడు. తను ముప్పూటలా సంధ్య వార్చటంతోపాటు ఏకైక పుత్రుడు విజయ శాస్త్రికి కూడా ఆ ఆచారాన్ని విధిగా సంక్రమింపజేశాడు. తాతల నాటి రక్తం నర నరానా ప్రవహిస్తున్న శాస్త్రికి, బ్రాహ్మణ్యం మీద మహా గౌరవం. తొమ్మిదేళ్ళ నాడే ఒడుగు చేసుకుని, తల్లిదండ్రులతోపాటు బంధు కోటి నంతా భిక్ష అడుక్కుని, శ్రోత్రీయ బ్రాహ్మణుడిగా అర్హత సంపాదించుకున్నాడు. క్రిమినల్ లాయరుగా ఊరూ వాడా మంచి పేరు సంపాదించిన శాస్త్రి, గాయత్రి జపించి సంధ్యవార్చనిదే పీట మీద కూర్చోడు. పాతికేళ్ళ క్రితం ఆ ఇంటి కోడలుగా అడుగుపెట్టిన కామేశ్వరమ్మ, చిమ్మ చీకటిలో శిరస్సు మీద చన్నీళ్ళు దిమ్మరించుకుని, పట్టు పంచె చుట్టబెట్టుకుని మడిగా, శుద్ధిగా, వండి వార్చని రోజు వుండదు. కంచెంబూ, తుంగ చాపా దగ్గిరగా జరుపుకుని వాకిట చేరినప్పుడూ, ముచ్చటగా మూడు సార్లు బాలెంతరాలై పురిటి గది విడిచి రానప్పుడూ తప్ప, ఆవిడ ఆచార వ్యవహారాలకు ఏ నాడూ ఆటంకం రాలేదు. సూర్యుడు నడి నెత్తికెక్కి కడుపు కర కరా కాలుతున్నా, భర్త సుష్టుగా తిని

లేచిన ఎంగిలి కంచంలో తప్ప మరో చోట ముద్ద ఎత్తదు. ఇక ముందు కూడా తమ ఇంట ఆ నియమ నిష్ఠలు అలా నిర్విఘ్నంగా కొనసాగి పోవాలనే ఆ ఇల్లాలి కాంక్ష!

అదేం చిత్రమో, అన్నింటికీ అతీతంగా పుట్టిందా ఇంట్లో పద్మజ. పది పన్నెండేళ్ళ వరకూ కూతురి తత్వాన్ని పసితనంగా నిర్లక్ష్యం చేసిన తల్లితండ్రులు అప్పటికిక ఆ పిల్ల మీదో ప్రత్యే కాభిప్రాయం ఏర్పరుచుకోక తప్పలేదు. "పెంకి ఘటం! ఇంటా వంటా లేని రాలుగాయి!" అను కుని చూసీ చూడనట్టే ఊరుకుంటూ వచ్చింది తల్లి. "గడుసు తల్లి! తాతగారి పట్టుదలా, నాన్నగారి తెలివి తేటలూ అక్షరాలా అబ్బాయి! మనం ఎలాగూ విసర్జించలేని ఈ పాత ఆచా రాలు దాని నెత్తిన కూడా రుద్దకుండా ఉంటే మహా బాగు!" అనుకున్నాడు తండ్రి గారాబంగా.

భోజనం ముందు కూర్చుని మంత్రాలేవో ఉచ్చరిస్తూ పుడిసెడు నీళ్ళు గుటకవేసి కంచం చుట్టూ నీళ్ళు చిమ్ముతున్న శాస్త్రిని చిన్నతనంలో ఓ సారి నవ్వుతూ అడిగింది పద్మజ — "ఎందు కన్నాయ్, నువ్వు ఎప్పుడూ ఇలా చేస్తావు?"

"ఇది మన బ్రాహ్మణ నియమం! చేసి తీరాలి!"

"దీని వల్ల ఏం ప్రయోజనం ఉంటుంది?"

"ఏదో ఉంటుంది. లేకుండా మన పూర్వులు పెట్టివుండరు"

"నిజంగా అదేమిటో నీకు తెలియదూ? అయితే నేను చెప్పనా?" కుతూహలంగా చూస్తూ అంది పద్మజ. "కంచం చుట్టూ నీళ్ళు చిమ్మి చోటు తడిగా చేస్తే చుట్టు పట్ల పాకే సూక్ష్మక్రిము లేవీ ఆహారంలోకి రాలేవట! భోజనం ప్రారం భించే ముందు కాసిని నీళ్ళు తాగితే కంఠ నాళం నిరాటంకంగా ఉండి తర్వాత తినే దాన్ని సులు వుగా వెళ్ళనిస్తుందట!... మా సైన్స్ మాస్టారు చెప్పారులే!"

"మరి ఏదో ప్రయోజనం కోసమేగా పెద్దలీ ఆచారం ఏర్పరిచారు!" గర్వంగా చూశాడు శాస్త్రి.

"అయితే, అన్నాయ్! ఈ ప్రయోజనం అందరికీ అవసరం లేదూ? ఒక్క బ్రాహ్మణుల కేనా? ఇలా నియమించటంలో అర్థం యేమిటి?"

తిక మక పడ్డాడు విజయశాస్త్రి. "మరి... మరి... అందరూ అంత శ్రద్ధగా పాటిస్తారా ఏమిటి?"

"పూర్వం నుంచీ వస్తోందని మనం పాటిం చటం లేదూ? అలా అందర్నీ శాసిస్తే ఎందుకు పాటించరూ?"

"అబ్బ! ఏమిటే, నీ తర్కాలూ నువ్వూనూ — తిండి తినక" అని విసుక్కుంది కామేశ్వ రమ్మ.

తర్వాత కూడా పద్మజ ఆ విషయం మీద చాలా సేపు ఆలోచించింది. చివరికి తన సందేహం తండ్రి దగ్గర బైట పెట్టింది కూడానూ.

రాత్రి భోజనాలయ్యాక వీధి వాకిట్లో వాలు కుర్చీలో తమల పాకులు నములుతూ ఆకాశం లోకి చూస్తూ కూర్చున్న తండ్రి దగ్గరికి వెళ్ళి కూర్చుంది. అన్న గారికీ, తనకూ జరిగిన సంభా షణ అంతా చెప్పింది — "అయితే, నాన్నా! మత్స్య మాంసాలు తినకూడదనీ, శాస్త్ర గ్రంధా లన్నీ పఠించాలనీ, నియమ నిష్టలు పాటించా లనీ, యజ్ఞ యాగాదులు చేయాలనీ, ఇలా బోలెడు నియమాలు ఒక్క మన కులానికే విధించారు గదా? మరి మిగిలిన మనుష్యులకు మాత్రం అవన్నీ ఎందు కవసరం కాదూ? అన్నయ్య నడిగితే చెప్పలేదు. నువ్వు చెప్పు నాన్నా!"

కూతురు వేసిన ప్రశ్నకు ఈశ్వర సోమ యాజి ముందు విస్తుపోయాడు. కుతూహలంగా చూస్తున్న చిన్నారి పద్మజ ఆలోచనా శక్తిని అంచనా వేయడానికి ప్రయత్నించాడు. "మను ష్యులందరినీ నాలుగు జాతులుగా విభజించా రమ్మా! అందులో బ్రాహ్మణ జాతినే పవిత్రమైన జాతిగాయెంచి, కఠినమైన ఆచార వ్యవహారా లన్నీ వారికే ఏర్పరిచారు!"

"అదేమిటి నాన్నా? మొట్టమొదట అందరూ సమానమేగా? ఏ ఆధారం చూసి మనుషుల్ని విడదీశారు?"

"పెద్దలు యెందుకు చేశారో మనకేం తెలస్తుంది తల్లీ? వంశ పారంపర్యంగా వస్తున్న విధుల్ని ఆచరించటమే మన ధర్మం!"

"ఊఁహూ!" పద్మజకేమీ నచ్చలేదు. "అందులో ఏదో అన్యాయం ఉందనిపిస్తోంది నాన్నా! ఎవరో, ఎప్పుడో విధించారని దాన్నే నమ్మమంటే బాగా లేదు!"

కూతురు అంత పెద్ద పెద్ద ఆలోచనలతో మనస్సు పాడుచేసుకోవటం సోమయాజికి నచ్చలేదు. "ఇవ్వాళ పాఠాలన్నీ చదువుకున్నావా అమ్మా!" అన్నాడు ప్రసంగం మార్చటానికి.

"లేదు నాన్నా! చదువుకుంటాను" అంటూ లేచింది పద్మజ.

పద్మజ లోపలికి వెళ్ళగానే సోమయాజి భార్యను ఉద్దేశిస్తూ అన్నాడు — "విన్నావుటే కాముడూ, దాని మాటలు?"

"అది పెంకి ఘటమని నే నేనాడో నిర్ధారణ చేసుకున్నాను" అంది కామేశ్వరమ్మ, ఆవలించి మంచం మీదకి ఒరుగుతూ.

సోమయాజి నిశ్శబ్దంగా నవ్వుకున్నాడు.

ఒక రోజు మిట్టమధ్యాహ్నం కామేశ్వరమ్మ ఒంటి గంట దాటినా నక నకలాడే కడుపుతో ఉస్సురని నిట్టూరుస్తూ, లోతుకుపోతున్న కళ్ళతో వీధి పొడుగుకూ పరికిస్తూ, గడపలో చెంగు పరుచుకుని నడుంవాల్చింది. సోమయాజి భోజనానికి రాని కారణంగా ఆవిడ నోరు అన్నం తినడానికిససేమిరా ఒప్పుకోటం లేదు.

అప్పుడే స్కూలు నించి వచ్చిన పద్మజకు అన్నం వడ్డించి తల్లి నీరసంగా చతికిలపడింది గడపలో.

"అమ్మా! అలా ఉన్నావేం?"

కస్సుమంది కామేశ్వరమ్మ. "ఇంకెలా ఉంటానే? ఈయనా, ఈయన గారి పెత్తనాలూనూ! ఎంత కోర్టు వ్యవహారాలైతే మాత్రం తిండీ తిప్పలూ గుర్తురావద్దూ? ఇంటి దగ్గర కట్టుకున్న పెళ్ళాం ఉసూరుమంటూ పడిగాపులు కాస్తుందన్న ఇంగితమైనా ఉండొద్దూ మనిషికి? రోజూలా ఇవాళ పొద్దున్న ఆ పాల చుక్కలూ తాగలేదు. రాత్రి ఉపోషం అవనే అయింది. కళ్ళు తిరిగి చీకట్లు కమ్ముతూంటే, కాళ్ళు పీక్కుపోతూంటే... ఎక్కడ విరుచుకు పడతానో అని భయంతో చస్తున్నాను!"

విషయమంతా అర్థమైంది పద్మజకు. నాన్న తిని ఇవ్వాల్సిన ఎంగిలి కంచం కోసం అమ్మ అన్నం తినకుండా కూర్చుంది! అలా ఎంత సేపైనా కూర్చుంటుంది. నాన్న ఏ కేసు పరిష్కారంలో నిమగ్నమై ఉన్నాడో యేమో!

"తిండి తినక ఏమిటే అలా ఆలోచిస్తావు?" అంది తల్లి.

"నీకు చెప్పాలనుకుంటూనే మరచిపోయానే అమ్మా! నాన్న ఓ గంట కిందట జట్కాలో వెళుతూ స్కూలు దగ్గర నాకు కనిపించారు."

"ఏమిటి? జట్కాలో వెళుతూనా?"

"నేను డబ్బులడగడానికి పరిగెత్తుకు వెళ్ళాను. ఊరెళుతున్నానని నీకు చెప్పమన్నారే!"

"నిజంగానే?" కామేశ్వరమ్మ ముఖం వికసించింది.

"నిజంగానే అమ్మా! చెప్పడం మరిచిపోయానే!"

"పోనీలే తల్లీ! బతికించావు! సాయంత్రం దాకా ఎదురు తెన్నులు చూసి కళ్ళు తిరిగి పడి చచ్చేదాన్ని!" అంటూ లేచి గబ గబా కంచం పెట్టు కుని నిండుగా అన్నం, కూరలు, నేతి గిన్నె, పెరుగు తెపాళా అన్నీ చేరవేసుకుని కూర్చుంది కామేశ్వరమ్మ.

పద్మజ, వస్తున్న నవ్వు ఆపుకుంటూ, "పప్పు మరికాస్త వడ్డించుకో అమ్మా! చాలా బాగుంది!" అంది.

జవాబు కూడా చెప్పకుండా ఆవురావురుమంటూ తినటం ప్రారంభించింది కామేశ్వరమ్మ. నాన్నగారు సరిగ్గా ఎప్పుడు కన్పించారో, ఏ ఊరు వెళతానన్నారో, ఎటువంటి జట్కాలో ప్రయాణం చేస్తున్నారో, మళ్ళీ ఎప్పుడు వస్తానన్నారో వివరాలతో సహా చెబుతూ కూర్చుంది పద్మజ.

కామేశ్వరమ్మ పెరుగు వంపుకుని జుర్రుతూంటే వీధి గుమ్మంలో పిలుపు వినిపించింది

— "కాముడూ!" అని!

తుళ్ళిపడింది... కా... ము... డు!

చెంగునలేచి వీధిలోకి పరుగెత్తింది పద్మజ!

ఈశ్వర సోమయాజి లోపలికివస్తూ, తన కన్నా ముందు భార్య భోజనం చేస్తున్న సంఘటన చూసి, కాస్త విస్తుపోయినా, తమాయించుకున్నాడు. "మంచి పని చేశావే కాముడూ! నువ్వు కనిపెట్టుకు కూర్చుంటావని కంగారుపడుతూ వచ్చాను!"

సిగ్గుతో చితికిపోయింది కామేశ్వరమ్మ. నోరు పెగుల్చుకుని అడిగింది — "మీరు — ఊరు వెళ్ళలేదుటండీ?"

"నీకు ఆకలేస్తే తిండి తినొద్దని నే నన్నానా? నన్నే ఊరు పొమ్మంటావు?"

"జట్కాలో వెళుతూ... పద్మకి కనిపించి చెప్పారటనే!"

పెళ్ళుమంటూ నవ్వాడు సోమయాజి. "అయితే ఇది పద్మ చేసిన పనన్న మాట! పోనీలే. ఇప్పుడేం మించిపోయింది? రోజూ నా ఎంగిలి కంచంలో నువ్వు తినటం లేదూ? ఈ పూట నీ ఎంగిలి కంచంలో నాకు వడ్డించు!"

కామేశ్వరమ్మ కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. "పాపిష్టి దాన్ని! ఆకలిగొట్టు దాన్ని! చస్తానో ఏమిటో అనుకుని కంచెడు కూడూ మింగికూర్చున్నాను. నా తిండి మాసిపోనూ! నా కడుపు విచ్చిపోనూ!" అని తిట్టిపోసుకుంటూ కూర్చుంది.

"ఆ రామాయణమంతా తర్వాత! ముందు నాకు వడ్డించు!" సోమయాజి నూతిదగ్గర కాళ్ళు కడుక్కుని సంధ్య వార్చుకోవటానికి కూర్చున్నాడు.

తండ్రి భోజనం చేస్తూంటే పిల్లి పిల్లలా దగ్గర చేరింది పద్మజ. తల్లి పెళపెళా తిడుతూంటే పకపకా నవ్వుతూ కూర్చుంది. "చూడు, నాన్నా! ఇంత సేపు అన్నం తినకుండా ఉంటే జబ్బు చెయ్యదూ? అమ్మ తినకుండా కూర్చుంటే నాకు మాత్రం అన్నం ఎలా సహిస్తుంది? నే నలా అబద్ధం ఆడితే తప్పా ఏమిటి?"

"ఏమీ తప్పులేదమ్మా! మంచిపని చేశావు!"

"ఏమిటా మంచి పని? ఇన్నేళ్ళకి నా నియమం నాశనం చేసింది. తలుచుకుంటోంటే నా కడుపంతా దేవుతోంది!" అంటూ గోల పెట్టింది కామేశ్వరమ్మ.

"ఆడ వాళ్ళు తినకుండా కూర్చుంటే మగ వాళ్ళు వేళపట్టుకు ఇంటికి వస్తారనే ఈ నియమం పెట్టారు నాన్నా! అంతే కదూ?"

చిరునవ్వు నవ్వాడు సోమయాజి. "అఖండురాలివమ్మా నువ్వు! నీ ఆలోచనలన్నీ చిత్రంగానే ఉంటాయి!"

"అమ్మ మీద నీకు అంత ప్రేమ ఉంటే వేళకి భోజనం చేసి ఆరోగ్యం కాపాడుకోమని చెప్ప రాదూ? ఎప్పుడుపడితే అప్పుడు ఆహారం తీసుకోకూడదని మా సైన్సు మాష్టారు చెప్పారు."

విస్మయంగా చూశాడు సోమయాజి. తనెంత మూర్ఖుడు! నీరసాలతో, అనారోగ్యాలతో సతమతమవుతున్న భార్య విషయంలో కనీసపు బాధ్యత గానీ, సానుభూతి గానీ ప్రకటించలేక పోయాడెన్నడూ! తను తిని విడిచిన ఎంగిలి కంచంలో వడ్డించుకుంటున్న భార్యని మహా పతివ్రతగా తలుచుకుని గర్వపడ్డాడు! పవిత్ర బ్రాహ్మణ జాతికీ, పరువు ప్రతిష్టలతో అలరారే తమ కుటుంబానికీ, తన భార్య, మణి పూసలా మెరిసిపోవాలని దురాశపడ్డాడు. ఇంత కాలం ఒక్క సారి కూడా భార్య కష్ట సుఖాలు... పట్టించుకోలేదు.

"నాన్నా! కోపం వచ్చిందా?" పద్మజ చిన్నబుచ్చుకుంది.

సోమయాజి కూతురిని సముదాయించాడు. "లేదమ్మా, లేదు! నీ మాటలే ఆలోచిస్తున్నాను. ఆఁ, చూడు కాముడూ! రేపటి నుంచి నీ తిండికీ నా తిండికీ ఏమీ లంకె ఉండకూడదు. ఎవరి ఆకలి వారిదే! వేళపట్టున నువ్వు భోజనం చేస్తూండాలి! నేను ఇంట్లో ఉన్ననాడైనా నా ఎంగిలి కంచంలో నువ్వు వడ్డించుకోకూడదు. తెలిసిందా?"

"చాల్లెద్దురూ! పసి దాని మాటలు పట్టుకుని..."

"ఇక అలా అంటే కుదరదు! నేను చెప్పినట్టు చెయ్యకపోతే నన్ను చంపుకు తిన్నంత ఒట్టే!"

"అయ్యో! అయ్యో! ఇదేం అఘాయిత్యమండీ? ఇదేం పొయ్యేకాలమండీ?" అంటూ నెత్తి నోరూ బాదుకుంటూ కూలబడి పోయింది కామేశ్వరమ్మ.

★ ★ ★

పార్వతికి తెలియని పద్మజ చిన్న నాటి విశేషాలు చాలా అరుదే. తను చూసి గానీ, విని గానీ, స్నేహితురాలి సంగతులన్నీ పార్వతి ఆకళింపు చేసుకోగలిగింది.

పద్మజ గురించి ఎంత తెలిసినా... పద్మజ చేసిన సాహసాన్ని మాత్రం సరిపెట్టుకోలేక పోయింది పార్వతి. కూతురు చేసిన ఘోరానికి సనాతనులైన ఆ తల్లిదండ్రులెంత తల్లడిల్లిపోతున్నారో! నిత్యపూజా పునస్కారాలతో, నియమ నిష్టలతో కళ కళలాడే ఇల్లు ఎంత కళాహీనమైపోయిందో! పద్మజ ఎంత కర్కశంగా ప్రవర్తించిందీ! తన సుఖం మాత్రమే తనకు చాలనుకుందా?

ఆఫీసులో ఆ పూట చాలా ముభావంగా కూర్చుంది పార్వతి. ఇంటికి వచ్చి కుంపటి అంటించి కాఫీ నీళ్ళు పెడుతూంటే, సంధించి విడిచిన బాణంలా రివ్వున దూసుకు వచ్చిన సూర్యం, పార్వతిని గాలి దుమారంలా చుట్టేశాడు. "అక్కయ్యా! అక్కయ్యా! రిజల్ట్సు వచ్చేశాయి, వచ్చేశాయి!"

"రిజల్ట్సు తెలిశాయా! నువ్వు...."

"ఫాసయ్యా నక్కయ్యా! నేను పాసైపోయాను!"

"ఎంత చల్లటి కబురు చెప్పావురా! ఎన్నేళ్ళుగా ఎదురు చూశాను ఈ క్షణం కోసం! ఇక నా బాధ్యత తీరిపోయింది. నీ రెక్కలు నీకు వచ్చాయి. ఎంతో సంతోషంగా ఉందిరా సూర్యం!" పార్వతి కళ్ళలో నీళ్ళు నిలిచాయి. "తమ్ముడూ, నాన్న ఉంటే ఎంతో సంతోషించే వాడు! నూరేళ్ళూ నిండినట్టే మనల్ని అనాథుల్ని చేసి పోయాడు. అంతా నా కళ్ళకు కట్టినట్టే ఉంది. నాన్న చచ్చిపోయే ముందు నాతో ఎంత తెలివిగా మాట్లాడా డనుకున్నావూ! నీ చేతినీ, చెల్లాయి చేతినీ, నా చేతుల్లో పెడుతూంటే నాన్న చేతులు గజ గజా వణికాయి. నువ్వూ, రుక్కూ, బిక్క మొహాలు వేసుకుని నుంచుంటే నేను బావురుమని యేడ్చాను. 'అమ్మా! ఇక నువ్వే ఈ పసి వాళ్ళకి తల్లీ, తండ్రీ! జాగ్రత్త!' -అంటూ కళ్ళు మూశాడు."

సూర్యం ఆవేశంగా అన్నాడు "అంతా నీ చలవే అక్కా! నీ చలవే...!"

"ఛ! తప్పురా సూరీ! అంతా నాన్న దీవనే!"

"కాదక్కా! నాన్న ఎప్పుడో చచ్చిపోయాడు. నీ కష్టార్జితంతోనే చదివి డిగ్రీ సంపాదించాను నేను. ఇదంతా నీ భిక్షే!"

కన్నీళ్ళతో నవ్వింది పార్వతి. "మరీ పిచ్చి వాడిలా మాట్లాడకు! నేనేం పరాయిదాన్నా, నీకు భిక్ష పెట్టటానికి? నా తోడబుట్టిన వాళ్ళని నేను పెంచుకోక వదిలేసుకుంటానా! అమ్మా నాన్నా చచ్చిపోతే మాత్రం నేనూ చచ్చిపోయానా?"

"కాదక్కా! అలా కాదు, నీ కసలు స్వార్థం లేదు!"

విస్మయంగా చూసింది పార్వతి.

రెట్టించాడు సూర్యం. "అవును. నీకు స్వార్థమే లేదక్కా! మా కోసం నీ సుఖాలు వదులుకున్నావు. మమ్మల్ని కంటికి రెప్పలా కాచి పెంచావు. అక్కయ్యా, నువ్వు దేవతవి! నిజంగా దేవతవి!" —సూర్యం కళ్ళు చెమ్మగిల్లాయి.

పార్వతి చిరునవ్వు నవ్వుతూ — "ఎంత పిచ్చిగా మాట్లాడుతున్నావు సూరీ?" అంది.

"నువ్వు చేసింది ఎప్పుడూ మర్చిపోనక్కా!"

"చాల్లే, ఊరుకో! రుక్కు కూడా నీ లాగే రాసింది ఉత్తరం! మీ కేదో మతులు పోయినట్టున్నాయి!"

రుక్కు ఉత్తరంలో, "నాకు ఆడ పిల్లే పుట్టాలనీ, దానికి నీ పేరు పెట్టుకోవాలనీ, ఇలాగయినా నీ రుణం తీర్చుకోవాలనీ కోరుకుంటు

న్నాను'' అని రాసింది. అది గుర్తొచ్చి, చిరునవ్వు చిందింది పార్వతి పెదవుల మీద.

''ఏమిటక్కయ్యా ఆలోచిస్తున్నావు?''

''రుక్కు రాసిన ఉత్తరం గుర్తు వస్తోందిరా. ఈ ఆదివారం తప్పకుండా వెళ్ళి చూసిరావాలి. చిన్నతనంలోనే వేవిళ్ళతో ఎలా ఉందో ఏమిటో! ... సూరీ! రుక్కుకి కూతురే పుడితే నా పేరు పెడుతుందట! చూశావా దాని కబుర్లు! ఆ పుట్టే పసిదానికి పార్వతి పేరు నచ్చకపోతే ఏం చేస్తుంది?''

''నచ్చదూ? ఎందుకు నచ్చదూ? నచ్చినా మానినా దానికా పేరే ఖాయం!''

పార్వతి నవ్వుతూ అంది. ''నా పేరు కోసం కాదు గానీ రుక్కుకి ఆడ పిల్లే పుట్టాలి. మేన మామ ఉండగా వేరే సంబంధాలు వెతుక్కో నక్కర్లేదు!''

''ఛీ! పో, అక్కయ్యా!''

''ఛీ పో అంటే వీల్లేదు. ఆరు నెలల్లో అది పుట్టనే పుడుతుంది. మేనమామని కాదని దాన్నె వరికిస్తాం? ఇద్దరికి మంచి ఈడూ —జోడూనూ! మహా అయితే ఇరవై ఏళ్ళు వ్యత్యాసం! ఆఁ, ఏమంత లెక్కలోది కాదు! ఆడ పిల్ల ఎంతలో ఎదిగి వస్తుందీ!'' పక్కుమని నవ్వేసింది పార్వతి.

సూర్యం నిలబడకుండా వీధిలోకి మాయ మయ్యాడు.

పార్వతి మనస్సంతా ఆలోచనల మయమై పోయింది. చెప్పలేనంత సంతోషంగానూ ఉంది! ఏమిటో ఆపద వచ్చి మీద పడినంత విచారం గానూ ఉంది! సూర్యానికీ బాగా ఇష్టమైనదేమైనా చేసిపెడదామనుకుంది. కానీ కాలూ చెయ్యీ కూడిరానట్టు ఎక్కడ కూర్చుంటే అక్కడే, ఎక్కడ నిలబడితే అక్కడే, అయింది పరిస్థితి.

పద్మజ మాటి మాటికీ కళ్ళల్లో మెదులు తున్నది.

''ఈ రోజుల్లో ఎవరి సుఖం వాళ్ళదే! తల్లి దండ్రుల ఇష్టాయిష్టాలూ మంచిచెడ్డలూ ఎవ రాలోచిస్తున్నారు? రెక్కలు రాగానే సరి, ఎగిరి పోతారు!'' అనుకుని నవ్వుకుంటున్నారు మధ్యాన్నం వెయిటింగ్ రూమ్‌లో పద్మజ పెళ్ళి ఫోటో మీద దుమారం లేవదీస్తూ! తన కెంతో కష్టం తోచింది. కాని ఏం చెయ్యగలదు? పద్మజ అలాంటిది కాదని ఎలా వాదించగలదు?

''నీకు స్వార్ధమే లేదక్కయ్య!'' అన్న సూరి మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

''ఇలా అయినా నీ రుణం తీర్చుకుం టాను'' అని రుక్కు రాసిన వాక్యాలు కళ్ళ ముందు కదులుతున్నాయి. తోడ బుట్టినవాళ్ళే కాదు, చుట్టాలూ స్నేహితులూ కూడా తనని పొగుడుతూనే ఉంటారు.

★ ★ ★

ఇరవై సంవత్సరాలకు పైగానే అయ్యుం టుంది. ఆ రోజు బాగా గుర్తే!

అప్పుడు, పార్వతీ పద్మజా కూడా చిన్న పిల్లలే. బుట్ట బొమ్మలా, దొర సానమ్మలా పెద్ద పెద్ద పువ్వుల గౌను తొడుక్కుని నవ్వుతూ కొత్త సంచి భుజం మీద వేళ్ళాడేసుకుని తరగతిలో కాలుపెట్టింది పద్మజ. జడలు రెండూ ఎగిరెగిరి పడేలా ఒకే సారి గిర్రున తల తిప్పి, క్లాసులో పిల్లలందర్నీ చూసింది. చోటు కోసం ఎప్పుడూ కీచులాడుకొనే సీతా, సత్యావతీ వాళ్ళు, ఎదర బెంచీలో దగ్గిరిగా ఇరుక్కుని తమ పక్కనే ఖాళీ చూపించినా పద్మజ టక్కు టక్కుమంటూ బూట్లు చప్పుడు చేసుకొంటూ రెండు బెంచీలు దాటి వెనక్కే నడిచింది.

అంత చక్కటి కొత్త అమ్మాయి వచ్చి నిజంగా తనదగ్గరే కూర్చునే సరికి సిగ్గుతో బిగుసుకు పోయిందా మూడవ బెంచీలో పిల్ల.

కొంత సేపు చుట్టూ చూసి, పక్కన తల వంచుకు కూర్చున్న పిల్లనడిగింది పద్మజ. ''నీ పేరేమిటి?''

ఆ పిల్ల ఓ ఘడియ మాట్లాడలేదు సిగ్గుతో.

''దాని పేరేనా? పార్వతి! నా పేరేమో సీతా, దీని పేరు సత్యవతి!'' అంటూ వెనక్కి వంగి కుతూహలంగా ఏకరువు పెట్టింది సీత.

పద్మజ, పార్వతితో రెట్టించింది! ''ఏం, నీ

పేరు పార్వతా?''

''ఊ. అవును, పార్వతే!'' కాస్త తల ఎత్తింది పార్వతి.

''నా పేరు పద్మజ. మా చెల్లాయి పేరు సుజాత. అది ఇంకా పెద్ద బడిలో చదువుకోవడం లేదు.''

కాస్త బెరుకు తగ్గింది పార్వతికి. ఎగా దిగా పద్మజ పువ్వుల గౌను చూస్తూ కూర్చుంది.

''నీ పరికిణీ ఎంచక్కా ఉంది'' అంది పార్వతి పరికిణీ కొంచెం ముట్టుకుని చూస్తూ పద్మజ.

పార్వతికి మళ్ళీ సిగ్గువేసింది. తన పరికిణీ ఏం బాగుంది? పరుపు గళ్ళలా వెడల్పాటి చారలూ అదీనూ!

''ఈ పరికిణీ కొత్తదా?'' అంది పద్మజ మళ్ళీ.

''ఉహు! పాతదే. చిరిగింది కూడా!'' అంటూ కుచ్చెళ్ళల్లో వెతికిపట్టుకుని రెండు మూడు కుట్లు కూడా చూపించింది పార్వతి, ''తొందరగా మాసి పోకుండా ఉంటుందని ఈ గళ్ళ పరికిణీ కుట్టించింది మా అమ్మ. నీ గౌనే బాగుంది. పెద్ద పెద్ద పువ్వులు!

''మరి నీకు కొత్త పరికిణీలు లేవూ?'' కుట్టిన చిరుగుల కేసి జాలిగా చూసింది పద్మజ.

''ఉంది ఓ పరికిణీ! అది పండక్కి కట్టు కుంటా!''

పద్మజ చేతులు తిప్పుతూ చెప్పింది. ''నాకూ మా చెల్లాయికీ బోలెడు గౌనులున్నాయి, అన్నీ కొత్తవే! సిల్కువీ, పట్టువీ వేరే అద్దాల బీరువాలో ఉన్నాయి. మా యింటికి రాకూడదూ, నీకు చూపి స్తాను.''

అడ్డంగా తల తిప్పింది పార్వతి.

''ఏం? ఎందుకు రావు?''

''ఉఁహూఁ! నువ్వే మా యింటికి రా ముందు.''

''వస్తాను. రేపు నువ్వు మా ఇంటికి వస్తావా మరీ?''

మళ్ళీ తల తిప్పి అంగీకారం తెలిపింది పార్వతి.

స్కూలు నుంచి పార్వతి వెంటబడి వచ్చింది పద్మజ.

కొత్త అమ్మాయిని ఇంటికి తీసుకువస్తూంటే చాలా సంతోషం కలిగింది పార్వతికి. పార్వతీ వాళ్ళమ్మ సావిత్రి, పద్మజకు కూడా ఓ గిన్నెలో అటుకులూ, బెల్లం పొడీ కలిపి పెట్టింది, కబు ర్లడుగుతూ. అటుకులు తింటూ పద్మజ, ఎంత తియ్యగా, ఎంత స్నేహితంగా చూసిందనీ!

ఆ చూపు పార్వతి ఎన్నటికీ మరిచిపోలేదు.

★ ★ ★

పద్మజకి, వాళ్ళ ఇంట్లో, వాళ్ళ అమ్మా నాన్నల దగ్గిర ఒక ప్రత్యేక స్థానం ఉందన్న సంగతి, కొద్ది కాలంలోనే పార్వతి కని పెట్టగలిగింది. అక్క చెల్లెళ్ళైనా, ఒక తల్లి కడుపున పుట్టినా, పద్మజా సుజాతల అంద చందాలలో, హావ భావాలలో తేడా ఉంది.

ఇంట్లో అమ్మా నాన్నల దగ్గర కూడా ముక్కు సూటిగా, ఇచ్ఛానుసారం ప్రవర్తించే ధైర్యం ఉంది పద్మజకు! సాహస గాంభీర్యాలు ఉట్టిపడే పద్మజ రూపం, తల్లిదండ్రులకు కూడా అపురూపమైనది గానే తోచేది. రూపవతే గాక, తెలివితేటలలో కూడా అఖండురాలైన పద్మజంటే అన్న గారికి ప్రత్యేకాభిమానం. నాలుగయిదేళ్ళు చిన్నదైన సుజాత సన్నగా పొడుగ్గా, చామన ఛాయతో, సామాన్యంగా ఉంటుంది. తళ తళా మెరిసే కళ్ళు తిప్పి ప్రతి విషయాన్నీ ఆశ్చర్యంగా, కుతూ హలంగా చూస్తూ ఉండేది. ''చిన్నక్కయ్యా!'' అని పార్వతిని పిలుస్తూ ఉండేది. పెద్ద కూతురు పట్ల వ్యక్తం కాని సన్నిహితత్వమేదో కామేశ్వరమ్మ మాతృ హృదయంలో చిన్న కూతురు పట్ల నిండి ఉండేది. ''ఆ పెద్దది ఉత్తరాలు గాయి. పెంకి భడవ! అది మీ కూతురూ, ఈ చిన్నది నా కూతు రూనూ. నా సుజా తల్లి అన్నెం పున్నెం ఎరగని పిచ్చితల్లి!'' అనేది కామేశ్వరమ్మ నవ్వుతూ ఎన్నో సార్లు. పద్మజకు తండ్రి దగ్గరా, సుజాతకు తల్లీ దగ్గరా చనువు ఎక్కువ. భయంతోనో సిగ్గుతోనో తండ్రి ఛాయలకైనా వెళ్ళని సుజాత, తల్లి

కొంగులో దూరి మొహం దాచుకుంటే, సిసిం ద్రీలా పద్మజ మాత్రం తండ్రి సరసనే కూర్చుని నవ్వుతూ మాట్లాడేది! నిర్భయంగా వాదించేది. నిర్లక్ష్యంగా ఎదిరించేది!

ప్రతి తరగతి లోనూ ఫస్టు మార్కులతో పేసవుతూ తెలివిగా చదువుతున్న పెద్ద కూతు రంటే ఈశ్వర సోమయాజి హృదయం సంతో షంతో పొంగిపోతూ ఉండేది.

ఇంటి కంతకూ ఓ ప్రత్యేక స్థానం పొంద గలుగుతున్న స్నేహితురాలంటే పార్వతి కళ్ళకు సాక్షాత్తూ దేవ కన్యే!

సిరి సంపదలకు లోటు లేని కుటుంబంలో పెరుగుతున్న పద్మజ, నెలకు కొన్ని పూటలైనా మజ్జిగ మెతుకులతో సంతృప్తిపడే బీద బడి పంతులుగారి అమ్మాయి పార్వతితో చేసిన స్నేహం చిలవలు పలవలతో ఏపుగా ఎదుగుతూ వచ్చింది.

అభమూ, శుభమూ తెలియని ఆ చిన్ననాటి అమాయకపు స్నేహ మాధుర్యాన్ని పంచుకోవ టానికి మరో నేస్తం తయారయ్యాడు, రఘుపతి!

ఓ ఆదివారం పొద్దుటే ఆడుకోవటానికి వచ్చింది పద్మజ. వీధి వరండాలో లక్కపిడతల బుట్ట దిమ్మరించుకుని కూర్చున్నారిద్దరూ. పార్వతి తమ్ముడు సూరి కూడా ఆటలోకి వచ్చి కలిశాడు.

"నన్ను వంట చేసుకోనివ్వటం లేదు. రుక్కుని కూడా తీసుకెళ్ళవే పారూ!" అంటూ కేక పెట్టింది సావిత్రి. రానని మారాంచేస్తూ కాళ్ళు రెండూ నేల కేసి బాదుకొంటున్న చెల్లెలిని బలవంతగా వీధి వరండాలోకి లాక్కు వచ్చింది పార్వతి. చిన్న పటిక బెల్లం పిసరు రుక్కు నోట్లో పడేసింది పద్మజ. ఠక్కువ ఏడుపు ఆపేసి, బెల్లం ముక్క తియ్య తియ్యగా చప్పరిస్తూ కూర్చుంది రుక్మిణి. రెండు మూడు లక్కపిడతలు దాని ముందుకు విసిరింది పార్వతి.

ఆట జోరుగా సాగుతున్నది.

అన్నం వుడికింది. చారూ, వేపడం కూడా అయ్యాయి. మడి గానే పచ్చడి రుబ్బుతున్నది పార్వతి. గోడకు చేరబడి వాలు కుర్చీలో కూర్చుని పేపరు చదువుతూ భోజనం కోసం హడావుడి పడుతున్నది పద్మజ. లక్క పిడతలో ఉడుకు తున్న కంది పప్పు తింటానని ఎగబడుతున్నది రుక్మిణి.

"అంటుకోకే వెర్రి పీనుగా, వంటలన్నీ అంటు చేసేలా ఉన్నావు!" అంటూ గద్దించింది పార్వతి ఆరిందాలా.

ఓ సారి నాలుగు వైపులా చూసి బావురు మంది రుక్కు.

"అబ్బ! అంటూ లేదు గింటూ లేదు, కాస్త పప్పు పడేద్దూ! అది ఏడ్చిందంటే ఊరుకోదు" అంది పద్మ విసుగ్గా.

ఏడుపు మానేసి కంది బద్దలు ఏరుకు తింటూ కూర్చుంది రుక్మిణి. ఏడుపు మొహం పెట్టి ఎక్కాలు చదువుతూ దిక్కులు చూస్తు న్నాడు సూర్యం.

"వంటయ్యింది. లేచి మడి కట్టుకుం టారా?" అంటూ దీర్ఘం తీసింది పార్వతి, గోడ కుర్చీలో పడుకున్న భర్త గారిని ఉద్దేశించి.

"ఆఁ వచ్చే వచ్చే!" అంటూ బద్ధకంగా లేచింది పద్మజ.

ఒక్కసారిగా వీధిలో బస్సు హారన్‌ల మోత వినవచ్చింది. మడీ దడీ చాలించి బయటికి పరుగెత్తింది పద్మజ. వంటా గింటా ఆపేసి వెనకే దారితీసింది పార్వతి. పటికబెల్లం పెచ్చు దొరక బుచ్చుకుని ఉడాయించాడు సూర్యం. వంట తప్పాలాలన్నీ చెల్లాచెదురుచేస్తూ కేరింతలు కొట్టింది రుక్మిణి.

పార్వతీవాళ్ళ ఇంటి ఎదర మేడలోకి ఎవరో కొత్తగా దిగినట్టున్నారు. నాలుగయిదు లారీలు, నిండుగా సామానుతో వచ్చి రోడ్డుకడ్డంగా నిల బడ్డాయి. మనుషులు మాత్రం క్రితం రాత్రే వచ్చి నట్టున్నారు. గేటులో నుంచి పరిగెత్తుకువచ్చాడో కొత్త కుర్రాడు. పద్మజా పార్వతీ కూడా కుతూ హలంగా లారీల్లోంచి దింపుతున్న సామానులు చూస్తూ నిలుచున్నారు. లారీల దగ్గిరికి రాబో యిన ఆ అబ్బాయి చటుక్కున ఆగిపోయి

ముఖం తిప్పుకుని ఎటో చూస్తూ నిలబడి పోయాడు.

వదులుగా వేలాడుతున్న పొడుగు లాగూ, పసుపు రంగు సిల్కు చొక్కా, మెడలో సన్నటి గొలుసూ, రెండు చేతుల వేళ్ళకూ ఉంగరాలూ, దుబ్బులా ముఖం మీదకి పడుతున్న ఒత్తు జుట్టూ, బాగా తెల్లగా బొద్దుగా ఉన్న ఆ అబ్బాయిని వింతగా చూస్తూ అంది పద్మజ — "చూడు, పారూ! ఆ అబ్బాయి గమ్మత్తుగా లేడూ?"

పార్వతి కూడా చూస్తూనే ఉంది. ఏమంత గమ్మత్తుగా కనిపించలేదా అబ్బాయి.

పద్మజ నవ్వుతూ అంది. "ఆ అబ్బాయితో మాట్లాడదామా?"

"అమ్మో, వద్దు బాబూ!" బెరుగ్గా చూసింది పార్వతి.

"ఏం?"

"ఉహుఁ! వద్దు. అసలా అబ్బాయి మనతో మాట్లాడతాడో లేదో?"

"మాట్లాడడూ? అయితే రా, వెళ్ళి అడుగుదాం!"

పద్మజ చక చకా పోతూంటే వెనకే వెళ్ళక తప్పలేదు పార్వతికి. గేటు దగ్గిరే నిలబడి లారీలలో నుంచి దిగుతున్న బల్లలకేసీ కుర్చీలకేసీ చూస్తున్న ఆ అబ్బాయి, తన ముందుకు వచ్చి ఇద్దరు ఆడ పిల్లలు నిలబడటంతో ఉలిక్కిపడి చూశాడు. ఎదురుగా నించున్న పద్మజ తిన్నగా ఆ అబ్బాయి ముఖంలోకి చూస్తూ అడిగింది — "నీ పేరేమిటి?"

కంగరుగా కళ్ళు మిల మిలలాడించాడా అబ్బాయి, మాట్లాడకుండా! "ప్రసాదా?" అంది పద్మజ నవ్వుతూ.

"ఉఁహూఁ?" బిక్క మొహం వేసి నసుగుతూ అన్నాడు. "రఘు... రఘు... బా... బు."

"రఘుబాబు!" విజయ గర్వంతో చూసింది పద్మజ పార్వతికేసి. మళ్ళీ మాటలు పొడిగిస్తూ అంది. "నువ్వేం చదువుతున్నావు రఘుబాబూ? ఎనిమిదో క్లాసా?"

తెల్లబోయాడు రఘుబాబు. తల అడ్డంగా తిప్పాడు— "ఊహూ, ఆరో క్లాసే!"

"ఆరో క్లాసే ఇంకా!" ఆశ్చర్యపడింది పద్మజ.

సిగ్గుపడిపోయాడు రఘుబాబు.

జాలివేసింది పార్వతికి.

పద్మజ మళ్ళీ అంది "నువ్వు మా కన్నా పెద్దవాడివి కావూ? నేనూ ఆరో క్లాసే, పార్వతీ ఆరో క్లాసే. నా పేరు పద్మజలే. రఘుబాబూ, మనం అందరం జట్టుగా ఉందామా?"

రఘుబాబు తల దించేసుకున్నాడు.

"ఏం, మాట్లాడవేం? ఎంచక్కా పార్వతి మీ ఇంటి ఎదురుగానే ఉంటుంది, వాళ్ళ తమ్ముడూ చెల్లాయి కూడా ఉన్నారు. నేనూ మా చెల్లాయిని తీసుకొస్తాను. మనం అందరం కలిసి మీ తోటలో ఆడుకుంటే బాగుండదూ?"

ఆశగా చూసింది పార్వతి.

నెమ్మది నెమ్మదిగా తలెత్తి పద్మజ వెనకగా నిలబడివున్న పార్వతి కేసి చూశాడు రఘుబాబు. తనతో మాట్లాడుతున్న పద్మజ కన్నా మంచి పిల్లలా కనిపించింది పార్వతి. అంత మంచి పిల్లతో జట్టు ఉండి ఆడుకుంటే ఎందుకు బాగుండదూ? రఘుబాబు ముఖంలో కొంచెం నవ్వు కనిపించింది. "మీ అందరి జట్టూ ఉంటాను" అన్నాడు.

పార్వతి ముఖం వికసించింది. నవ్వుతూ చూసింది పద్మజకేసి.

"అయితే, రఘుబాబూ! నువ్వు ఆడ పిల్లలా గొలుసు వేసుకున్నావేం?" కుతూహలంగా అడిగింది పద్మజ.

వినీ వినిపించనంత నెమ్మదిగా అన్నాడు రఘుబాబు" ఏమో మరి, మా అమ్మే వేస్తుంది."

"మరి నీకు సిగ్గు కాదూ?"

జవాబు చెప్పకుండా దీనంగా చూశాడు రఘుబాబు.

"పోనీ గొలుసు మీ చెల్లాయి కిచ్చెయ్యి." నోరు పెగుల్చుకుని మాట్లాడింది పార్వతి.

దాదాపు ఏడ్చేవాడిలా అన్నాడు రఘుబాబు

"చెల్లాయి లేదుగా? చచ్చిపోయింది."

జాలిగా చూసింది పార్వతి. "తమ్ముడో?"

"ఊఁహూఁ! ఎవ్వరూ లేరు. నేను ఒక్కణ్ణే!"

"పోనీలే. రఘుబాబూ! ఏడవకు. మేమందరం ఆడుకుంటాంగా నీతో!" సానుభూతిగా ఓదార్చింది పార్వతి.

ఏడుపు రాబోయినా పార్వతిని చూస్తూ ఊరుకున్నాడు.

"నాయనా, రఘూ! ఎందుకలా ఎండలో నిల్చున్నావు?" మేడ వరండా మీద నుంచి గట్టిగా కేకపెట్టింది అన్నపూర్ణమ్మ.

"ఆవిడ ఎవరు రఘుబాబూ? మీ అమ్మేనా?" పద్మజ అంది.

"ఊఁ, మా అమ్మే! ఎండలో నించోవద్దనీ."

"ఏం? ఎండలో నించుంటే ఏమౌతుంది?"

"జబ్బు చెయ్యదూ!" విస్మయంగా చూశాడు రఘుబాబు.

"జబ్బు చేస్తుందా?" మరీ విస్మయంగా చూసింది పద్మజ. "వానలో తడిస్తే జబ్బు చేస్తుందిగానీ, ఎండలో నుంచుంటే ఎందుకు జబ్బు చేస్తుంది? అయితే నువ్వు ఎండలో బడి కెళ్ళవూ?"

"మా నాన్న గారు బడికి పంపించరుగా? ఇంటి దగ్గరే ప్రయివేటు చదువుకుంటాను."

ఆశ్చర్యంగా చూసింది. పార్వతి.

"బడికి వెళ్తే కూడా జబ్బుచేస్తుందా నీకు?" జాలిగా అడిగింది పద్మజ.

అస్తమానూ జవాబులు చెప్పాలంటే విసు గేసింది రఘుబాబుకి. మాట్లాడకుండా నించు న్నాడు.

"లోపలికి రా. నాయనా! రఘుపతీ!" మళ్ళీ కేక పెట్టింది అన్నపూర్ణమ్మ.

"మనం ఇంటికి పోదామా పద్మా?" అంది పార్వతి.

రఘుబాబు కొంచెం ధైర్యంగా పార్వతి ముఖంలోకి ఆశగా చూశాడు. "మా ఇంట్లోకి రాకూడదూ? మా అమ్మకి ఆడ పిల్లలంటే చాలా ఇష్టం!"

ఆ ఆహ్వానం కోసమే ఎదురు చూస్తున్న దానిలా ముందే దారితీసింది పద్మజ.

సామాను సర్దుకుంటున్న హడావిడిలో ఉన్నా, అన్నపూర్ణమ్మ ఆడ పిల్లల్ని చూచి సంబరంగా పలకరించింది. పార్వతి ఎదరింటి అమ్మాయేనని తెలుసుకుని దగ్గిరకు తీసుకుని తల కూడా నిమిరింది. "రోజూ వస్తూ ఉండమ్మా మా ఇంటికి!" అంది నవ్వుతూ.

కాస్సేపు మేడ అంతా చూసి వచ్చేస్తూంటే ఇద్దరినీ వెనక్కు పిలిచి, చెరోలడ్డూ ఇచ్చింది. ఆ లడ్డూలు నేతి వాసన వేస్తూ కమ్మ కమ్మగా ఉన్నాయి. కొంచెం కొరికి మిగతాది పరికిణీలో దాచుకుంది పార్వతి!

"ఏం, తినవూ?" అంది పద్మజ.

"మా రుక్కుకీ, సూరికీ ఇస్తాను."

"అయితే నా లడ్డూలో పెడతాలే నీకు" అంటూ పద్మజ సగం ముక్క విరిచి పార్వతికి ఇచ్చింది.

రఘుబాబు కూడా ఓ లడ్డూ తింటూ ఎండ లోకి రాకుండా వరండా మీదే నించున్నాడు.

పద్మజ పార్వతి చెవిలో నోరు పెట్టి రహ స్యంగా అంది. "రఘుబాబు పిరికివాడు కదూ?"

పార్వతి ఏదో మాట్లాడే లోపునే — "నేను పోతున్నానోయ్! రేపు మళ్ళీ వస్తాగా?" అంటూ రోడ్డు మీదికి పరుగుతీసింది పద్మజ.

వెనక్కి తిరిగి ఓ సారి రఘుబాబు కేసి చూసి చటుక్కున తల దించుకుని రోడ్డు దాటి ఇంట్లో జొరబడింది పార్వతి.

★ ★ ★

"ఎండ వేళ కాస్సేపు పడుకోకూడదటే పారూ! ఎందుకలా కొరివిలా కూర్చున్నావు?" — అప్పటికి నాలుగయిదు సార్లయినా పిలిచింది సావిత్రి.

అన్నం తిన్న దగ్గిర నుంచీ ఎదర మేడకేసి చూస్తూ వీధి అరుగు మీదే కూర్చుంది పార్వతి. తల్లి కేకలతో అయిష్టంగానే కదిలి లోపలికి వెళ్ళి రుక్కు పక్కనే పడుకుంది చాప మీద. కళ్ళు

బలవంతంగా మూసుకున్నా వాటంతట అవే తెరిపిళ్ళు పడి సూటిగా పై కప్పులోకి చొచ్చుకు పోతున్నాయి. ఎత్తుగా పైన దూలాల నిండా బూజూ, సాలె గూళ్ళూ, గాలికి సన్నగా రాలుతున్న దుమ్మూ!

"అమ్మా, మన ఇల్లు బాగా లేదు కదే?"

పాత చీర కుట్టుకుంటున్న సావిత్రి సూది గుచ్చటం ఆపుచేసి విచిత్రంగా చూసింది. "ఏం, ఎందుకు బాగా లేదు?"

"మేడ లాగా లేదుగా?"

"ఇదేమిటేవ్. ఇవ్వాళ కొత్త కబుర్లు పుట్టు కొస్తున్నాయి!"

"నిజమేనమ్మా! రఘుబాబూ వాళ్ళ మేడ, పద్మజా వాళ్ళ మేడ కన్నా బాగుంది."

"రఘుబాబెవరు?"

చటుక్కున లేచి కూర్చుంది పార్వతి. "మన ఇంటి ముందు మేడ లోకి కొత్త గారాలా, పొద్దున్న? బోలెడు కుర్చీలూ అవీ వచ్చాయి!"

"వాళ్ళ కుర్రాడా ఏమిటి? వాళ్ళింటి కెప్పు డెళ్ళావు?"

"పద్మజా నేనూ వెళ్ళాం, వాళ్ళమ్మ ఎంత మంచిదనుకున్నావు! లడ్డూ ఇచ్చింది తినటానికి. రుక్కుకీ, సూరికీ కూడా పెట్టాగా?"

"బాగుంది! పొద్దున్న వచ్చారో లేదో, అప్పుడే వాళ్ళింటి మీదకి ఎగబడటం ఏమిటి! వాళ్ళేం చిరాకు పడతారో, ఇంకెప్పుడూ వెళ్ళకండి!"

"వాళ్ళమ్మ రమ్మందమ్మా."

"రమ్మందా? అంటే మాత్రం? అస్తమానూ వెళ్ళకండి."

పార్వతి సంతోషమంతా ఎగిరిపోయింది. మళ్ళీ ఇంటి కప్పుకేసి చూస్తూ పడుకుంది.

"పోనీ, నిద్రరాకపోతే లేచి చదువుకోరాదూ? ఎందుకలా గుడ్లప్పగించి చూస్తావు?" కూతురి వైఖరి కనిపెట్టి అంది సావిత్రి.

గమ్మున లేచి సంచి తెచ్చుకు కూర్చుంది పార్వతి.

సాయంత్రం నీరెండలో సన్నజాజి పందిరి కింద కూనిరాగం తీస్తూ పువ్వులు మాల కడుతూ కూర్చున్న తల్లి దగ్గిర నెమ్మదిగా చేరింది పార్వతి. "ఇవ్వాళ పువ్వులు చాలా పూశాయి కదమ్మా?"

"రోజూ శ్రద్ధగా నీళ్ళు పొయ్యవే అంటే వింటున్నావూ? ఇంకా పూసేవిగా?"

"రేపటి నుంచీ తప్పకుండా పోస్తానమ్మా!"

"ఆ, పోశావులే!" మళ్ళీ కూనిరాగం అందు కుంది సావిత్రి.

"అమ్మా..."

"ఏం, ఏవిటా నసుగుడు?"

"పువ్వులు చాలా ఉన్నాయి కదమ్మా? రఘుబాబు వాళ్ళ అమ్మకి కాసిన్ని ఇస్తేనో?"

"రఘుబాబెవరు? ఓహో, మేడలో కొచ్చిన వాళ్ళా?"

"అవునమ్మా! పొద్దున్న లడ్డూ కూడా ఇచ్చింది వాళ్ళమ్మ."

"పోనీ తీసుకెళ్ళువుగానిలే. మాల కట్టనీ!"

పార్వతికి బ్రహ్మానందమైంది. మాల పూర్తయ్యే వరకూ పువ్వులు పేర్చి అందిస్తూ కూర్చుంది. చిక్కగా కట్టిన మాల ఓ జానెడు తెంచి మెత్తటి అరిటాకులో చుట్టి ఇచ్చింది సావిత్రి. "నలపకుండా జాగ్రత్తగా తీసుకెళ్ళి ఇచ్చిరా! తొందరగా రా!"

పార్వతి అప్పటికే రోడ్డు దాటేసింది.

★ ★ ★

అరిటాకు పొట్లాం అపురూపంగా పరికి ణీలో చుట్టుకుని బెరుకు బెరుగ్గా చూస్తూ గేటు దాటి వీధి గుమ్మం ముందు మెట్ల దగ్గిరికి వెళ్ళి నిలబడిపోయింది పార్వతి.

బయట ఎవ్వరూ కనిపించలేదు. ఒక్క దానికే లోపలికి వెళ్ళే సాహసం లేదు. అలాగే నిలబడింది ఆశగా లోపలికి చూస్తూ.

వీధి గేటు ముందు జట్కా ఆగింది. చలపతి రావు దిగి లోపలికి వస్తూ మెట్ల దగ్గిర తలదించుకుని నిలబడి వున్న పార్వతిని చూశాడు. "ఎవ రమ్మా పాపా నువ్వు? ఏం కావాలి?" అని అడిగాడు.

భయంతో బిగుసుకుపోతున్నా, ధైర్యం

తెచ్చుకుని, పరికిణీలో చుట్టి తెచ్చిన పొట్లాం తీసి చూపిస్తూ తడబడుతూ చెప్పేసింది పార్వతి. "మా అమ్మ...పువ్వులు...పువ్వులు...రఘుబాబుకి, ఊహుఁ రఘుబాబు అమ్మగారికి...."

నవ్వాడు చలపతిరావు. "వెళ్ళమ్మా ఇంట్లోకి. ఒరేయ్ రఘూ! రఘూ!" అంటూ మెట్లెక్కుతూ కేకలు పెట్టాడు. వెనకాలే నడిచింది పార్వతి.

పరుగెత్తుకు వచ్చిన రఘుబాబు పార్వతిని చూస్తూ ఆశ్చర్యపడ్డాడు.

"ఈ అమ్మాయి పువ్వులు తెచ్చిందిరా మీ అమ్మకి. లోపలికి తీసుకెళ్ళు అమ్మ దగ్గిరకి."

రఘుబాబు సంతోషంగా చుశాడు పార్వతి కేసి. తల దించేసుకుంది పార్వతి.

"అమ్మా, అమ్మా! పార్వతి పువ్వులు తెచ్చిందే" అంటూ సంబరంగా అరిచాడు రఘు బాబు.

అన్నపూర్ణమ్మ నవ్వుతూ ఎదురు వచ్చింది.

సిగ్గు, సిగ్గుగా అరిటాకు పొట్లాం అందించి నిలబడింది పార్వతి.

అన్నపూర్ణమ్మ పొట్లం విప్పి సన్నజాజుల మాల చూసింది. విచ్చీ విచ్చకుండా పుష్టిగా ఉన్న ఆ మొగ్గల్నీ, అందంగా ఆ మాలకట్టిన నేర్పునీ చుస్తూంటే అవిడకెంతో ముచ్చటేసింది.

"ఎక్కడివమ్మా ఈ పువ్వులు?"

"మా దొడ్లోనే పూశాయండీ!"

"ఎవరు కట్టారీ మాల?"

"మా అమ్మే కట్టిందండీ!"

"అలాగా? మీ అమ్మగారు చాలా అందంగా కట్టారు. మరి నువ్వు ఉంచుకున్నావా పువ్వులు?"

"నేనూ మా చెల్లీ రాత్రిళ్ళు పూలు పెట్టుకో మండీ! మా అమ్మ ఒక్కతే పెట్టుకుంటుంది. మాకు పొద్దున్నే జడలు వేసి పెడుతుంది."

"అవును మరి. చిన్న పిల్లలు పగలే పెట్టు కోవాలి."

చలపతిరావు బట్టలు మార్చుకుని లోపలికి వచ్చాడు.

"చూశారా, ఎంత చక్కటి పూల దండ తెచ్చిందో ఈ అమ్మాయి?" మాలని భర్తకు చూపించింది అన్నపూర్ణమ్మ.

"ఎవరమ్మాయి?"

"మన ఎదురింటి వాళ్ళమ్మాయే నాన్న గారూ! ... పేరు పార్వతి!" వివరాలు చెప్పేశాడు రఘుబాబు.

" మీ నాన్నగారేం చేస్తుంటారమ్మా పార్వతీ?"

"మా బళ్ళోనే మాస్టారండీ!"

"అలాగా! అయితే, పూర్ణం! మన రఘుకి మరెవరినో వెదుక్కోవటం దేనికి? ఈ మాస్టారినే అడిగి చూస్తే?" సాలోచనగా చూశాడు చలపతి రావు.

"సరే! ఆలోచించుకుని అడుగుదాంలెండి, కంగారేముంది?" అంది అన్నపూర్ణమ్మ, పార్వతి ఎదట ఆ ప్రసంగం ఎత్తటం ఇష్టంలేనట్టు.

వాళ్ళ మాటలు పార్వతికి అర్థం కాలేదు. "వెళ్తానండీ!" అంది నెమ్మదిగా.

"ఒక్క నిమిషం నిల్చోమ్మా, వెళ్దువుగాని" అంటూ అన్న పూర్ణమ్మ అర డజను అరటి పళ్ళు కాగితంలో చుట్టి తెచ్చింది. "అప్పుడప్పుడూ వస్తూ వుండు పాపా!"

ఆ పొట్లాం అందుకోకుండా సంశయంగా చూసింది పార్వతి. "వద్దండీ! మా అమ్మ... కేక లేస్తుందేమో!"

నవ్వింది అన్నపూర్ణమ్మ. పార్వతిని ఒప్పించి అరటి పళ్ళిచ్చి గేటు దాటించి వెనక్కి తిరిగి, "కుదురైన పిల్ల! చూస్తూంటే ముచ్చటేస్తోంది!" అనుకుంటూ వెనక్కి తిరిగింది.

★ ★ ★

రఘుబాబుకు ప్రైవేటు మేస్టారిగా ఆ ఇంట్లో అడుగు పెట్టిన పార్వతి తండ్రి — రామ నాథం మేస్టారు — అనతి కాలంలోనే చలపతి రావుకు సన్నిహితులయ్యారు. మేస్టారి పట్ల చలపతిరావు వెల్లడించే అభిమానం చూస్తే, ఆయన హృదయంలో అంతస్తుల భేదం అనే జాడ్యం లేనేలేదనిపిస్తుంది ఎవరికైనా.

"ఈ సంవత్సరం నుంచీ రఘుపతిని

స్కూలుకే పంపించాలనుకుంటున్నాం మాస్టారూ!'' అన్నాడు చలపతిరావు ఓ రోజు.

''నేనూ ఆ విషయమే మీకు చెప్పాలను కొన్నాను. నన్నపార్థం చేసుకోకపోతే ఒక్క మాట! మన గారాబం పసి వాళ్ళ భవిష్యత్తుని పాడు చేసేదిగా ఉండకూడదు చలపతిరావు గారూ! చిన్నతనంలో లోకాన్ని తెలుసుకోనివ్వకుండా పెంచితే, వాళ్ళు పెద్ద వాళ్ళయినా, ప్రయో జకులు కాలేరు.''

''అయ్యో, గారాబం చెయ్యటం కాదండీ! మా దురదృష్టం కొద్దీ పరిస్థితి అలా వచ్చింది. ఏడో యేట జామచెట్టెక్కి ఆడుకుంటూ కొమ్మ విరిగి కిందపడ్డాడు. ఆ పడటంలో పైకి దెబ్బ తగిలినట్టు కనిపించకపోయినా బుర్రలో నరా లేవో దెబ్బతిన్నాయన్నారు డాక్టర్లు. వరసగా కొన్ని నెలలు కాయిలా పడిపోయాడు. మళ్ళీ తేరుకుని మనిషయినా, ఇక వాడిలో పూర్వపు చురుకు దనం, తెలివితేటలూ అన్నీ మాసిపోయాయి. కుర్రవాడే పూర్తిగా మారిపోయాడు. చదువన్నా, బడి అన్నా బొత్తిగా ఆసక్తి లేకుండా పోయింది. బలవంతం చేసి బడికి పంపించటం మంచిది కాదని ఇంట్లో చెప్పిస్తున్నాం. పది మంది పిల్లలతో చేరి ఆడుకోటం కూడా వాడి కేమంత ఇష్టం ఉండదు మాస్టారూ!''

అంతా విన్న రామనాథం మాస్టారు సాను భూతిగా అన్నారు. ''అయ్యో, అంత జరిగిందా? కష్టం సుమండీ! అదృష్టవశాత్తూ మనిషి మనిషి లాగయినా దక్కాడు! అయినా ఫర్వాలేదు. నెమ్మదిగా స్కూలులో చేర్పిస్తే నేను జాగ్రత్తగా చూస్తూ ఉంటాను. క్రమంగా చదువు మీద ఆసక్తి అదే పుడుతుంది.''

''అదే నేనూ అనుకుంటున్నాలెండి. ఇక్క డికి వచ్చాక వాడిలో చాలా మార్పు వచ్చిందనే అనుకోవాలి. మీ పార్వతీ, ఆ తాసీల్దారుగా రమ్మాయీ, వీడూ, తోటలో చేరి ఆటలు కూడా ప్రారంభించారు!... చాలా మారాడు...''

అలా మరి కాస్సేపు సాగిందా సంభాషణ. నాలుగైదు రోజులకోసారైనా తీరిక చేసుకుని ఆ ఇద్దరు పెద్ద మనుషులూ పిచ్చా పాటీ చెప్పు కుంటున్నారు. 'స్నేహం' అనటానికి వీల్లేని ఆ అనుబంధం, ఏదో చిత్రమైన అనురాగాల్ని పెంచుతూ వచ్చింది.

రఘుబాబు పుట్టిన రోజు వేడుక, సావిత్రికీ అన్నపూర్ణమ్మకూ కూడా ముఖా ముఖీ పరి చయం చేసింది.

ఒంటి మీద ఎక్కడా ఖాళీ లేదనిపించేలా ఒంటెడు నగలూ, పెద్ద పెద్ద జరీ పువ్వులున్న ఎర్ర పట్టు చీరా, ముడిచుట్టూ ఒత్తుగా కనకాంబ రాలూ, పాదాలకు పచ్చగా పసుపు పూతా — అనుకోకుండా ఇంట్లో అడుగుపెట్టిన పేరంటా లిని చూసి, తొట్రుపడింది సావిత్రి. ఆవిడ వెనకే నిలబడివున్న రఘుపతిని చూడటంతో మాత్రం కొంత ఊహించగలిగింది.

''అమ్మా, అమ్మా! రఘు బాబూ, వాళ్ళ అమ్మ గారూ వచ్చారే!'' అంటూ పిల్లలు సంబ రంగా అరుస్తుంటే, ఉన్న అనుమానం కూడా తీరిపోయింది.

కంగారుగా చాప పరుస్తూ, ''రండి! రండి! నిలబడిపోయారు, రండి!'' అంటూ ఆహ్వానిం చింది, ఆవిణ్ణి.

అన్నపూర్ణమ్మ చాప మీద కూర్చుని సంగ తంతా చెప్పింది. ''మీ ఇంటికి రావాలని ఎప్పటి కప్పుడే అనుకుంటూ బద్ధకించేశాను వదిన గారూ!'' అంటూ సంభాషణకు ఉపక్రమించింది.

ఆ ''వదిన గారూ!'' అన్న సంబోధన సావి త్రికి చాలా ఇంపుగా తోచింది. ''బొత్తిగా అతి శయంలేని మనిషి'' అనుకుంది. నవ్వుతూ అంది —''ఆఁ, దాని కేముందిలెండి! నేనూ ఎన్నో సార్లు అనుకున్నాను. ఈ పిల్లలతో, ఇంటి పనులతో తీరి చస్తేనా? మన ఆడ వాళ్ళకి ఇల్లే కైలాసం కదా?''

''అవుననుకోండీ. అయినా కాస్త ఇరుగూ పొరుగూ అంటూ రాక పోకలు వుండొద్దా? రేపు మా వాడి పుట్టిం రోజండీ! కొత్తగా వచ్చిన ఊరు. ఎవరున్నారు పిలవటానికి? కాస్త ఈ వీధిలో నయినా నలుగురినీ పిలిచి వెళ్దామని బయల్దే

రాను. మీరు తప్పకుండా రావాలి సుమా వదిన గారూ!''

"అయ్యో! ఎంత మాట! తప్పకుండా వస్తా నండీ! మీ కేమైనా పని పాటల్లో సాయం కావా లన్నా నాకు చెప్పండి.''

"అంత మాటన్నారు — అదే చాలు. ఈ సారి ఏమంత వేడుకగా చెయ్యాలనుకోవటం లేదండీ!''అన్నపూర్ణమ్మ ముఖం నిండా విచార రేఖలు అలుముకున్నాయి. "కిందటి సంవత్సరం సరిగ్గా ఈ రోజుల్లోనే మా అమ్మాయి — ఏడెనిమిదేళ్ళ పిల్ల, టైఫాయిడ్ జ్వరం వచ్చి పోయింది వదిన గారూ! ఆ దుఃఖంతో, గడిచిన పుట్టిన రోజు ఎలాగూ చెయ్యలేక పోయాము. ఈ సారైనా వాడి నెత్తి మీద పది మంది పేరంటాళ్ళ చేతా నాలుగక్షింతలు వేయించాలనీ ... నలుసులా మిగిలిన వాడు వీడొక్కడే! ఎన్ని కానుపులు కన్నా దక్కించు కోలేకపోయాను!

సావిత్రికి చాలా జాలివేసింది. "అయ్యో! అలా విచారించకండి! మన చేతిలో ఏముంది?'' అంది ఓర్పుగా.

"మీ పార్వతిని చూస్తే నాకెంతో ముచ్చటగా ఉంటుంది. ఆడ పిల్ల తిరగని ఇల్లు ఏం ఇల్లు చెప్పండీ!''

"అయితే పార్వతిని మీ ఇంట్లోనే అట్టే పెట్టుకోండి. మాకు రుక్మిణి ఉందిగా?'' అన్న పూర్ణమ్మ దిగులు మరిపించి కాస్త కబుర్లలో పెట్టాలని నవ్వుతూ అంది సావిత్రి.

"ఎన్ని కాయలు కాస్తే మాత్రం చెట్టుకి బరు వంటారా?'' అంటూ లేచింది అన్నపూర్ణమ్మ. కుంకుం భరిణె తీసి సావిత్రికి బొట్టుపెట్టింది. భరిణె ముయ్యబోతూ మళ్ళీ జ్ఞాపకం వచ్చి పార్వతి నొసట కూడా కుంకం దిద్దింది. ఎగబడు తున్న రుక్కు ముఖాన కూడా ఓ పిసరు అంటించి ముద్దు పెట్టుకుంది! "అన్నట్టు చెప్పటం మరిచే పోయాను! రేపు మీ పిల్లలు ముగ్గురూ మా ఇంట్లోనే భోజనం చేస్తారు వదిన గారూ!'' అంది రెండడుగులు ముందుకు వేసిన అన్నపూర్ణమ్మ ఆగి నిలబడి.

"మీ రడిగితే నేను కాదంటానా? కానీ ఈ కుర్ర కుంకలతో... ఎందుకండీ మీకు శ్రమ?''

"శ్రమ అయినా తప్పదు. అది నాకు సంతోషంగానే ఉంటుంది'' అంటూ రోడ్డు మీదకి నడిచింది ఆవిడ.

మర్నాడు పేరంటం అయ్యాక కూడా సావిత్రి అన్నపూర్ణమ్మ దగ్గిర కూర్చుని గంట సేపు కబుర్లతో గడిపింది. ఆ ఆడంగుల కబుర్లలో అత్త వారిళ్ళూ, పుట్టిన వారిళ్ళూ, పెళ్ళిళ్ళూ, కాప రాలూ, చుట్టాలూ, వంశాలూ గోత్రాలూ — సమస్తం దొర్లిపోయాయి.

"అయితే... మా వెంకటాద్రి తాతగారు...మీ వేలు విడిచిన మేనత్తగారికి బంధువేనంటారా? ఇంత సేపూ చెప్పరేమండీ? మీరు నిజంగానే నాకు వదినగారయ్యారే!'' ఆశ్చర్యంగా గొంతు పెద్దది చేసుకుంది అన్నపూర్ణమ్మ. "ఏమం డోయ్! విన్నారా? మన రఘుబాబు మాస్టారూ, సావిత్రి వదిన గారూ మనకి దగ్గరవాళ్ళేనండీ! ఎదురెదురుగా ఉంటూనే తెలుసుకోలేక పోయాం. మా వెంకటాద్రి తాతకీ...'' అంటూ వీధి గదిలోకి వినిపించేలా అరిచింది.

"చుట్టరికం లేకపోతే మాత్రం మీ అభి మానాల కేం తక్కువ వదిన గారూ?''

"ఇక గారూ, గీరూ అంటూ మన్నింపు లెందుకులే వదినా! మనం మనం పరాయి వాళ్ళమా ఏమిటి? సాక్షాత్తూ వదినా మరదళ్ళ మయ్యాము!''

"అమ్మా! మాస్టారికి ఫలహారం...'' అంటూ వచ్చాడు రఘు!.

"ముందు లోపలికి పిలిచి, పంచెల చాపు ఇచ్చి దణ్ణం పెట్టరా! తర్వాత ఫలహారం వడ్డిద్దువు గాని'' అంటూ లేచింది అన్నపూర్ణమ్మ.

★ ★ ★

"నిన్న నీ పుట్టినరోజు కదూ రఘుబాబూ? పార్వతీ వాళ్ళని పిలిచావుట! నన్ను కూడా పిలవ లేదేం?'' నిలదీసి అడిగినట్టే అడిగింది పద్మజ.

బిత్తరపోయిన రఘుబాబు కాస్సేపు

మాట్లాడలేకపోయాడు. "నేను., నేను... పిలవ లేదుగా? మా అమ్మే, పార్వతీ వాళ్ళని పిలిచింది" అన్నాడెలాగో.

"పోనీ... నువ్వైనా నన్ను పిలవకూడ దేమిటీ?" నిష్ఠూరంగా చూసింది పద్మజ.

తన దోష మేమీ లేదన్నంత ధీమాగా అన్నాడు రఘుబాబు. "మీ ఇల్లు నాకు తెలీ దుగా?"

"పార్వతికి తెలుసుగా? మీ రిద్దరూ కలిసి రాకూడదేమిటీ?"

సంశయంగా నసిగాడు రఘుబాబు. "మీ ఇల్లు... చాలా దూరం అన్నావుగా? అంత దూరం ... మా అమ్మ వెళ్ళనిస్తుందా?

"ఛ! నువ్వు ఉత్త పిరికివాడివి!"

మాట్లాడలేదు రఘుబాబు.

తర్వాత పార్వతితో కూడా ఆ మాటే రెట్టిం చింది పద్మజ. "రఘుబాబు ఉత్త పిరికివాడే పారూ!"

అయిష్టంగా చూసింది పార్వతి.

పద్మజ మళ్ళీ, "మా ఇంటికి రావటానికి భయం వేస్తున్నట్టు మాట్లాడతాడేం పారూ?"

దానికీ పార్వతి ఏమీ జవాబు చెప్పలేదు. అస్తమానూ రఘుబాబుని పద్మజ అలా వెక్కిరిం చటం పార్వతికేం నచ్చలేదు. "అలా అనకు పద్మజా!" అని చెప్పాలనుకున్నా ధైర్యం చాల లేదు. అసలు రఘుబాబుమీదే కోపం వచ్చింది పార్వతికి. "రఘూ! నువ్వు పిరికివాడవటగా? అస్తమానూ అంటోంది పద్మజ" అనేసింది సాయంత్రం రఘుబాబుతో.

రఘుబాబు నవ్వేసి ఊరుకున్నాడు.

పార్వతికి చిరాకు వేసింది. "నువ్వు పిరికి వాడివని పద్మజ నాతో ఎన్ని సార్లో చెప్పింది, తెలుసా?"

"ఊఁ! నాతోనూ చెప్పింది పొద్దున్న."

"మరి నువ్వేమీ అనలా? నీకు కోపం రాలా?" విచిత్రంగా చూసింది పార్వతి.

మాట్లాడలేదు రఘుబాబు. ఇంకా కోపం వచ్చింది పార్వతికి.

"నేనేం పిరికివాణ్ణి కాదు. అలా అంటే ఊరుకోను" అని తనతో దెబ్బలాడతాడేమోననీ, ఆటలోంచే లేచిపోతాడేమోననీ, ముందు భయ పడింది పార్వతి. రఘుబాబు దెబ్బలాడలేదు సరిగదా, జవాబైనా చెప్పకుండా నవ్వుతూ కూర్చు న్నాడు. పార్వతి పౌరుషంగా లేచింది. "నువ్వు నిజంగా పిరికివాడవే! పద్మజ అబద్ధం చెప్పదు. ఛీ! నీ జట్టు ఉండనే ఉండను" అనేసి, వెనక్కితిరిగి చూడకుండా వచ్చేసింది.

మర్నాడు ఆదివారం అయినా పార్వతి అడు కోటానికి తోటలోకి వెళ్ళలేదు.

దిగులుగా కూర్చున్న కొడుకుని మంద లిస్తూ — "ఏంరా, రఘూ, అలా కూర్చున్నావు? పార్వతి ఆడుకోటానికి రాలేదేం?" అంటూ దగ్గిరికి వచ్చింది అన్నపూర్ణమ్మ.

రాత్రి నుంచి లోలోపలే ఏడుపు ఆపు కొంటున్న రఘుబాబు ఒక్కసారిగా తల్లి ఒడిలో పడి బావురుమన్నాడు. ఎంత ఓదార్చినా విన కుండా వెక్కి వెక్కి ఏడ్చాడు.

"అసలేమైందిరా? మీ రిద్దరూ దెబ్బలాడు కున్నారా?" అని అడిగితే అడ్డంగా తల తిప్పాడు.

"మరేమిటి? ఎందుకేడుస్తావు?" అడిగి అడిగి విసిగిపోయినా జవాబు చెప్పలేదు రఘు బాబు.

"ఉండు, నేను పార్వతి నడిగివస్తాను" అంటూ బయల్దేరింది అన్నపూర్ణమ్మ. రఘు బాబు దిగ్గునలేచి తోటలోకి పరిగెత్తాడు.

"వదినా! మా కోడలు పిల్లేదమ్మా! ఇవ్వాళ రానేలేదేం?" అంటూ సావిత్రిని పిలుస్తూ ఇంటి గడపలో కాలు పెట్టింది అన్నపూర్ణమ్మ.

గోడ వార కూర్చుని చదువుకుంటున్న పార్వతి తలదించుకుని ముడుచుకుపోయింది.

"ఇక్కడే ఉన్నావటే? ఏం, రఘూ నువ్వూ దెబ్బలాడుకున్నారా?"

"ఏమిటి వదినా! పొద్దున్నే వచ్చావు?" అంటూ వంటింట్లోంచి బయటికి వచ్చింది సావిత్రి.

"చూడు వదినా ఈ పిల్లలు. చక్కగా ఆడుకో

కూడదూ? ఏమైందో యేమో! రాత్రి నుంచి మా వాడు అదో మాదిరిగా ఉన్నాడు. ఏమిరా అని పలికరించబోతే బావురుమని ఏడుస్తూ కూర్చు న్నాడు. అసలు సంగతేమిటో అడుగుదామని చక్కా వచ్చాను.''

''ఏమే పార్వతీ? ఏమైంది?'' సావిత్రి అడి గినా పార్వతి దించిన తల ఎత్తలేదు.

''అందుకే కాబోలు పొద్దున్న మీ ఇంటికి వెళ్ళి ఓ గిన్నెడు పంచదార తెమ్మంటే వినకుండా కూర్చుంది. అప్పుడు సూరిని పంపించాను. ఏమో వదినా! దీన్ని నేను పట్టించుకోనే లేదు!''

''ఓ సారి లేచి రావే పార్వతీ! వాడెందుకు ఏడుస్తున్నాడో అడుగుదువుగాని'' అంది అన్న పూర్ణమ్మ.

''వెళ్ళు! ఓ సారి వెళ్ళిరా! తప్పు కదూ? అలా దెబ్బలాడుకోవచ్చా? రఘుబాబుకి చెప్పిరా!'' అంటూ పార్వతిని తొందర చేసింది సావిత్రి.

పార్వతికిక లేవక తప్పలేదు. అడుగులు లెక్క పెట్టుకుంటూ అన్నపూర్ణమ్మ వెనకే నడిచింది.

''అడుగో! ఆ సపోటా చెట్టు కింద కూర్చున్న ట్టున్నాడు. దగ్గిరికెళ్ళి పలకరించు. నా వంటెలా తగలబడిపోయిందో ఖర్మ!'' అంటూ గబ గబా లోపలికి పోయింది అన్నపూర్ణమ్మ.

పార్వతి, పిల్లిలా నడుస్తూ చెట్ల దగ్గిరికి వెళ్ళింది. మోకాళ్ళ చుట్టూ చేతులు బిగించి ముడుచుకు కూర్చున్నాడు రఘుబాబు పార్వ తిని చూసినా చూడనట్టు!

కాస్సేపు సిగ్గుతో మాట్లాడలేకపోయింది పార్వతి. చివరికి ధైర్యం చేసి రెండడుగులు ముందుకు నడిచి, రఘుబాబు పక్కనే కూర్చుని భుజం మీద చెయ్యివేసింది.

''రఘుబాబూ!''

''....................................''

''నా మీద కోపం వచ్చిందా రఘుబాబూ? నాతో మాట్లాడవూ?''

''....................................''

''నిన్నెప్పుడూ ఏమీ అనను రఘుబాబూ! నాతో మాట్లాడవూ?''

రఘుబాబు తల తిప్పి చూశాడు. రెండు కన్నీటి చుక్కలు పార్వతి చేతుల మీద పడ్డాయి.

తెల్లబోయింది పార్వతి. ''ఎందుకూ? ఏడు స్తున్నా వెందుకూ?'' అంది

''నేను... నేను... పిరికివాణ్ణిగా!''

''నేను అన్నానా? పద్మజేగా అంది? నీతో కూడా అందిగా?''

''ఉఁహూ! నువ్వూ అన్నావు!''

సిగ్గుపడిపోయింది పార్వతి. పాపం రఘు బాబు ఏడుస్తున్నాడు కూడాను. ''ఇంకెప్పుడూ అననుగా!''

''నా జట్టు కూడా ఉండనన్నావుగా?''

''ఛీ! ఎందుకు ఉండనూ? తప్పకుండా ఉంటాను!''

రఘుబాబు ముఖం నిండా సంతోషం కని పించింది పార్వతికి.

''రఘుబాబూ! పద్మజ అంటే ఏడవలేదు గదా నువ్వు? పైగా నవ్వావు!''

''నువ్వెప్పుడూ నన్నలా అనకు పారూ!''

పార్వతి ఆశ్చర్యంగా చూసింది. రఘుబాబు ఎప్పుడూ అలా పిలవలేదు!

''నన్ను ఇలాగే పిలువు రఘుబాబూ! నా కెంతో బాగుంది!''

సిగ్గుగా నవ్వాడు రఘుబాబు.

''రా! మందార పువ్వులు కోసుకుందాం! మా ఇంటికి తీసుకెళ్తాను'' రఘుబాబు చెయ్యి పట్టుకుని లేచింది పార్వతి.

హఠాత్తుగా అన్నాడు రఘుబాబు తోటలో. ''పారూ! మనకిద్దరికీ పెళ్ళి చేస్తుందట మా అమ్మ!''

అయోమయంగా చూస్తూ అంతలో సిగ్గు పడిపోయింది పార్వతి. ''అలాంటి మాటలు అనకు బాబూ! నాకు సిగ్గు'' అంటూ మరో చెట్టు చాటుకు పరిగెత్తింది.

''నేనేం అనలేదు. మా అమ్మే మీ అమ్మతో చెబుతోంది నిన్న'' అంటూ దగ్గిరికి వెళ్ళాడు రఘు బాబు.

పెద్ద వాళ్లు అలా మాట్లాడుకోవటం పార్వతి

కూడా వినకపోలేదు అప్పుడప్పుడూ.

"మీ పార్వతిని మా వాడికి చేసుకుంటాం వదినా!" అంటూ నవ్వుతుంది అన్నపూర్ణమ్మ.

సావిత్రి కూడా నవ్వుతూనే, "అవెక్కడి మాటలులే వదినా! మీ అంతస్తేమిటి. మా అంతస్తేమిటి! అలాంటి వెర్రి మొర్రి ఆశలు మాకేం లేవు సుమీ!" అనేస్తుంది.

వదినా మరదళ్ళ హాస్యాలతో చలపతిరావు చనువుగా జోక్యం కల్పించుకుంటూ, "మీ వదిన మాట అబద్ధం కాదమ్మా సావిత్రీ! పార్వతి మా ఇంటి కోడలే! మా వెర్రిబాగులవాడికి మీ పార్వతిని కట్టబెడితే మాకు బెంగ తీరిపోతుంది!" అంటాడు.

"మన పార్వతి అదృష్టజాతకురాలే సావిత్రీ! లక్షాధికారి కోడలు కావడం అంటే..." అంటూ కూతురి అదృష్టానికి మురిసిపోతున్న భర్తని మందలిస్తుంది సావిత్రి—"మీ పిచ్చిగానీ వాళ్ళకీ మనకీ పొత్తేమిటి? ఎందుకొచ్చిన ఆశలు? ఎంతలో వాళ్ళం అంతలో వుండాలి!" అని!

"అన్నిటికీ అనుమానం నీకు! ఏమో! దాని అదృష్టం ఎంత గొప్పదో!" అనేస్తాడు తండ్రి ఆశ పోగొట్టుకోలేక!

పెద్ద వాళ్ళ హాస్యాలూ, వాదాలూ సరిగ్గా అర్థం కాకపోయినా, రఘుబాబు కూడా అలా పెళ్ళిమాట ఎత్తేసరికి పార్వతికి, ఏదో సిగ్గూ, ఆ సిగ్గులోనే అర్థంకాని సంబరమూ కలిగాయి. ఆ రోజంతా రఘుబాబుతో సరిగ్గా తలెత్తి మాట్లాడలేకపోయింది.

పెళ్ళిమాట ఎలా ఉన్నా, రఘు వాళ్ళింట్లో పార్వతి చాలా చనువుగా తిరగటానికి అలవాటు పడిపోయింది. అన్నపూర్ణమ్మని "అత్తా!" అనీ, చలపతిరావుని "మామయ్యా" అనీ పిలుస్తూ అరమరికల్లేకుండా, ఎవరి దగ్గిరా జంకు గొంకులు లేకుండా వేళాకోళాలతో కులాసా కబుర్లతో ఇంట్లో పిల్లలాగే మసలసాగింది.

తల్లిదండ్రులతో కూడా ఎక్కువ మాట్లాడే అలవాటులేని రఘు, పార్వతితో మాత్రం ఎన్ని గంటలైనా కబుర్లు చెబుతూ నవ్వుతూ కూర్చుంటాడు. పద్మజ వున్న కాసేపూ దిక్కులు చూస్తూ గడిపే రఘులో, పార్వతితో గడపాలన్న ఆసక్తీ కోరికా నానాటికీ బలపడుతూనే వచ్చాయి.

పార్వతి మూలంగా, ఆట పాటల్లో చదువు సంధ్యల్లో కొడుకు చూపే చురుకుదనం తల్లిదండ్రులకు సంతృప్తి కలిగించింది.

★ ★ ★

"అన్నయ్యా! స్త్రీ విద్య గురించి నాకో వ్యాసం రాసిపెట్టవూ? నేను డిబేట్లో మాట్లాడతాను రేపు!" అంది పద్మజ అన్నం తిని లేస్తున్న విజయ శాస్త్రితో.

"అబ్బో! ఈవిడగారప్పుడే ఉపన్యాసాలిచ్చేస్తుంది కాబోలు!" అంటూ తుండుతో చేతులు తుడుచుకుంటూ వచ్చి, వాకిట్లో మంచం మీద కూర్చున్నాడు శాస్త్రి.

"అప్పుడే ఏమిట్రా? పోర్తు ఫారం చదివే పిల్ల ఆ మాత్రం మాట్లాడకపోతే ఎలా?" అంటూ నవ్వి ఈశ్వరసోమయాజి కూతుర్ని దగ్గిరికి పిలిచి కూర్చోబెట్టుకున్నాడు. "అన్నయ్య తర్వాత రాస్తాడులే గానీ, అసలు స్త్రీ విద్య మీద నీకెలాంటి ఉద్దేశాలున్నాయో ముందు చెప్పమ్మా!" అన్నాడు.

పద్మజ కాప్రశ్నే అంతగా అర్థంకాలేదు. "అంటే" అంది అమాయకంగా.

"నీ ఉద్దేశ్యంతో స్త్రీకి విద్య అవసరమేనా?"

"అజ్ఞానాన్ని పోగొట్టి జ్ఞానాన్ని ఇస్తుంది విద్య. ఆ జ్ఞానం స్త్రీ కెందుకు అవసరం కాదు?"

"కాకపోనూ వచ్చు. నేను చదువుకున్నాను. ఉద్యోగం చేస్తున్నాను. మీ అమ్మ బొత్తిగా చదువుకోలేదు. అయితే మాత్రం ఏం నష్టం వచ్చింది మీ అమ్మకి?"

"ఇప్పుడు నువ్వు ఉద్యోగం మానేస్తే నీ చదువంతా అనవసరమేనా?"

తడబడ్డాడు సోమయాజి. "అహఁ, అలాక్కాదు. నేను ఉద్యోగం ఎందుకు మానేస్తాను? పురుషుడు సంసారాన్ని బ్రతికించుకోడానికి ఉద్యోగం చేస్తూనే వుండాలిగా?"

"ఉద్యోగం చేసినా మానినా, విద్యప్రయోజనం విద్యకి వుంటుందిగా నాన్నా? ఆడ వాళ్ళు అజ్ఞానంలో పడి వుండాలా? అయితే మా బడిలో ఇద్దరు పంతులమ్మలు ఉన్నారు. వాళ్ళు ఉద్యోగాలు చేస్తున్నట్టేగా?"

"అది మన సంఘానికి వ్యతిరేకమే కదమ్మా?"

"సంఘం అంటే?"

"మనకి హిందూమతంలో స్త్రీ పురుషులు పాటించవలసిన నీతి నియమాల్నీ, ఆచార వ్యవహారాల్నీ నిర్దేశించేది మన సంఘం."

"అది ఎక్కడుంటుంది?"

"ఎక్కడో ఉండటం కాదు, మనకి మనమే సంఘం! మనం ఏం చెయ్యబోయినా పది మందీ ఏమనుకుంటారోనన్న భయమే సంఘ భయం! అది ప్రతి ఒక్కరికీ వుండి తీరాలి!"

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? అందరూ ఒక పద్ధతికి కట్టుబడి కొన్ని నియమాల ప్రకారం వుండకపోతే శాంతి సౌఖ్యాలు ఎలా వుంటాయి?"

"శాంతి సౌఖ్యాలు లేని చెడ్డ పనులు ఎవరు మాత్రం ఎందుకు చేస్తారు నాన్నా?"

"చేస్తారమ్మా! నియమాలకు కట్టుబడి ఉండటం అందరికీ సాధ్యం కాదు!"

"పోనీ వాళ్ళకి ఇష్టంలేని నియమాల్ని ఎలా ఆచరించగలరు? వాళ్ళకేది నచ్చితే అలాగే బతుకుతారు. తప్పేమిటి?"

"అబ్బే, ఒకరికి హత్యలే ఇష్టం అనుకో, దొంగతనాలే ఇష్టం! దోపిడీలే ఇష్టం! అప్పుడేమవుతుంది? ఆ మనిషి అలాగే ప్రవర్తించవచ్చా? దాని వల్ల ఇతరులకు హాని కదా?"

"అది కాదు నాన్నా! ఇతరులకు హాని కలగని కోరికలైతే?"

"వాటిని సంఘం ఒప్పుకుంటే ఫర్వాలేదు."

"అదేమిటి నాన్నా? మనకై ఏర్పరచుకున్న సంఘంలో, ఎవర్నీ బాధించకపోయినా అంత తీర్చుకోకూడని కోరికలెలా ఉంటాయి? నాకు బాగా చదువుకోవాలని కోరిక కలిగిందనుకో! ఆడ పిల్లకి చదువెందుకని పది మందీ వెటకారాలు చేస్తారనుకో! అప్పుడు మనమేం చెయ్యాలి? సంఘ నియమాన్ని కాదని నేను చదువుకుంటే ఎవర్ని బాధించినట్టు? అలాంటి కోరికల్ని కూడా చంపుకోవాలా నాన్నా?"

సోమయాజి మౌనంగా కూతురి ముఖంలోకి చూశాడు.

పద్మజ మళ్ళీ అంది. "సంఘ నియమాలు తప్పు తప్పులుగా ఉండబట్టేకదా ఎప్పటి కప్పుడు మారుతూ ఉంటాయి? మా చరిత్ర పాఠాల్లో చదువుతున్నాం. రాజారామమోహనరాయ్ వల్లే సతీ సహగమనాలు ఆగిపోయాయి. అంత వరకూ ఆడ దాన్ని జీవాలతో కాల్చి చంపటం మంచి ఆచారమేగా? దాన్ని ఎవ్వరూ మీర కూడదుగా? ఆ తరువాత దాన్ని అన్యాయ మని ఆపుచేశారా, లేదా? వీరేశలింగం పంతులు గారు స్త్రీ పునర్వివాహాలు ప్రారంభించారు. బాల వితంతువులై ఏడ్చే స్త్రీలకు ఆనందాన్ని కలిగించారు. ఇప్పుడు దాన్ని కూడా అంతా మెచ్చుకుంటున్నారు. తర్వాత గాంధీ తాత దయ వల్ల ఆడ వాళ్ళ జీవితం ఇంకా బాగుపడింది. స్త్రీకి కూడా చదువు ముఖ్యమన్నారు. ఈ సంఘాన్ని ఎవరో ఒకరు ఎప్పటికప్పుడు దిద్దుతూనే ఉన్నారెందుకు? ఇప్పుడు కూడా సంఘంలో లోపాలు లేవని ఎలా చెప్పగలం?" స్కూలు పుస్తకాలు వల్లె వేసిన విజ్ఞానం కూతురి మాటల్లో యథాతథంగా దొర్లుతూంటే ముచ్చట కలిగేది సోమయాజికి.

"ప్రస్తుతం సంఘంలో ఉన్న లోపాల్ని దిద్దేదానివి నువ్వేలా ఉన్నావు!" అంటూ నవ్వాడు, అంత వరకూ మౌనంగా కూర్చుని వింటున్న విజయశాస్త్రి.

"పద్మజ అన్నట్టు సంఘాన్ని ఎల్లవేళలా సమర్థించలేం శాస్త్రీ! అందులో కూడ అవకతవకలు లేకపోలేదు" అంటూ, కూతుర్ని ఉద్దేశించి అడిగాడు సోమయాజి. "నీకు నచ్చని విషయాల్ని నువ్వు ధిక్కరించగలవా అమ్మా?"

"ఆఁ, నాకేం భయం లేదు. నా మంచి

చెడ్డలు నేనే ఆలోచించుకో గలను!''

సంతోషంగా నవ్వాడు సోమయాజి. ''పోనీ. నువ్వు తెలివిగల దానివి! స్వతంత్ర భావాలు కల దానివి! నీ బ్రతుకు నువ్వు నిర్ణయించుకోగలవు! కానీ... ఆ శక్తి లేనివాళ్ళ మాటేమిటి? అటువంటి సామాన్యుల పాలిట, సంఘం పెన్నిధి లాంటిది కాదా?''

''కాదు నాన్నా! ఎంత తెలివి తక్కువ వాళ్ళయినా జీవితాల్ని సుఖంగా చేసుకోవాలనే ప్రయత్నిస్తారు. వాళ్ళు మంచిగా నిర్ణయించుకోనే శక్తిని సంఘం కలిగించాలి! జబ్బు వాళ్ళని చేసి 'ఇలాగే ఉండండి, జబ్బే ఉంచుకోండి! ఇదే పాటించండి, అంటే, అదేం న్యాయం? పురుషులకు ఆరోగ్యం వుంటే, స్త్రీలకు జబ్బు వుండాలా? అలాగే, పురుషులకు విద్య వుండొచ్చు కదా, స్త్రీలకు ఎందుకు ఉండకూడదు? విద్య అందరికీ మంచిదే కదూ? ఎవరి మంచి చెడ్డలు వారు తెలుసుకోవటానికైనా విద్య కావాలి కదా? ఇప్పుడు నాకు తెలిసింది నాన్నా!''

అంతలోనే హఠాత్తుగా గుర్తొచ్చినట్టు, ''చదువుల దేవత ఎవరు? సరస్వతి. ఆ దేవత ఆడ మనిషే కదా? మరి, స్త్రీకి విద్య అవసరమా అంటారేం?'' అంది పద్మ ఆశ్చర్యపడుతూ.

చెల్లెలి ధోరణి శాస్త్రికి కూడా సంతోషం కలిగించింది. కామేశ్వరమ్మ సరేసరి! విస్తుపోయి బుగ్గన వేలు తియ్యకుండానే కూర్చుంది.

''సుజా నీ వొడిలోనే నిద్రపోతున్నట్టుంది. లేచి పడుకోబెట్టరాదూ?'' అన్నాడు సోమయాజి.

''ఈ వాగుడంతా ఎప్పుడు నేర్చిందండీ ఇది?'' అంటూ లేచి సుజాను మంచం మీద పడుకోబెట్టింది కామేశ్వరమ్మ.

సోమయాజి నవ్వుతూ అన్నాడు. ''అమ్మా పద్మా! రేపటి నుంచీ మీ అమ్మకి కాస్త చదువు చెప్పరాదూ?''

''నిజంగా చెబుతాను నాన్నా! రేపే కొత్త పలక తీసుకొస్తాను అమ్మకి'' అంది సంబరంగా పద్మజ.

''చాల్లేవే, నీ హాస్యాలూ నువ్వునూ! ఆ చదువేదో నువ్వే వెలగబెడుతున్నావు చాలదూ?'' — కడుపులో ఎంత సంతోషం వున్నా కూతుర్ని పైకి ఎప్పుడూ ఈసడిస్తూనే ఉంటుంది కామేశ్వరమ్మ.

పద్మజ నవ్వేసింది. ''అమ్మకి కోపం వచ్చింది నాన్నా!''

''అమ్మ ఎప్పుడూ అంతేగా? నీతో ఇంకా ఎవరెవరు మాట్లాడుతున్నారు రేపు?'' అన్నాడు సోమయాజి.

''వాళ్ళ స్నేహితురాలు పార్వతి ఉండనే ఉందిగా?'' అంటూ నవ్వాడు శాస్త్రి.

''అది మాట్లాడనంది. దానికి బోలెడు సిగ్గు! ఎంత చెప్పినా వినదు. రఘుబాబు కూడా మాట్లాడతానని పేరిచ్చాడు. ఇంకా నలుగురైదుగురు మాట్లాడతారనుకుంటాను. నేను వెళ్ళి వ్యాసం రాసుకుంటాను నాన్నా!'' అంటూ లేచింది పద్మజ.

''అదే మంచిదమ్మా! నీకు తోచిన విధంగా నువ్వు వ్రాసుకో. ఎవరి కాళ్ళ మీద వాళ్ళు నిలబడాలి?''

పద్మజ, చదువుకునే గదిలోకి పోయి తెల్ల కాగితం తీసుకు కూర్చుంది.

★ ★ ★

**మా**స్టారి టేబులు పక్కన, బ్లాక్ బోర్డు ముందు, నిండుగా రాసుకున్న కాగితం చేతిలో పట్టుకుని నిలబడింది పద్మజ. పద్మజ మాట్లాడటానికి వెళుతూంటేనే సంతోషంగా చప్పట్లు కొట్టారు పిల్లలంతా. పది మందిలో నిలబడి మాట్లాడమంటే సిగ్గూ, భయం లాంటి వేమీ ఉండవు పద్మజకు. క్లాసులో అందరితోనూ చనువుగా మాట్లాడుతూనే ఉంటుంది. మాస్టార్లను సాధించి మరీ కావలసిన విషయాలు తెలుసుకుంటుంది. మాస్టార్లకూ తోటి విద్యార్థులకూ అందరికీ పద్మజంటే ప్రత్యేకాభిమానం. ప్రతి విద్యార్థీ పద్మజలా చదవాలని ఉవ్విళ్ళూరుతుంటాడు. ప్రతి మాస్టారూ పద్మజ తెలివితేటల్ని ఉదహరిస్తూ వుంటాడు.

నిగర్వంగా, నిర్భయంగా నవ్వుతూ తిరిగే

పద్మజ అంటే అందరికీ ప్రేమే!

"స్త్రీకి విద్య అవసరమా, అనవసరమా? అన్న ప్రశ్నకు ముందు, అసలు మనిషికి విద్య అవసరమా, కాదా?— అన్న ప్రశ్న వేసుకోవాలి మనం!, 'మనిషికి విద్య అవసరమే' అని మనిషైన ప్రతి వాడూ అంగీకరిస్తాడనుకుంటాను. ఇక 'స్త్రీ, మనిషేనా కాదా?' అన్న విషయం తేల్చాలి. స్త్రీ మనిషనే నేను వాదిస్తున్నాను. స్త్రీకి విద్య ఉండి తీరాలని చెప్పబోతున్నాను" అంటూ ప్రారంభించింది పద్మజ.

తరగతిలో పిల్లలంతా నిశ్శబ్దంగా కుతూహలంగా చూస్తూ కూర్చున్నారు. వరండాలోంచి వెళ్ళబోతూన్న హెడ్మాస్టారు శంఖారావం లాంటి పద్మజ కంఠ స్వరం వింటూ క్లాసు ముందే నిలబడిపోయారు. పదిహేను నిమిషాల సేపు తన భావాలన్నీ విపులంగా, క్షుణ్ణంగా వెల్లడించింది పద్మజ. మాట్లాడటంలో ఆ కంఠం ఆవేశంతో చిందులు తొక్కింది. తను ఒంటరిగా సంఘంతో దెబ్బలాడు తూన్నట్టూ, కోట్లాది ఆడ వాళ్ళను అన్యాయం నుంచి రక్షిస్తూన్నట్టూ గుప్పిళ్ళు బిగించి మరీ వాదించింది. స్త్రీలనూ పురుషులనూ విడదీయటమే మూర్ఖత్వమంది. పురుషుడికీ, స్త్రీకీ మానసికంగా భేదం లేనే లేదంది. స్త్రీ సుఖం, స్త్రీ దుఃఖం, స్త్రీ సమస్య, స్త్రీ జీవితం, స్త్రీ సర్వస్వం, పురుషుడితో పెన వేసుకొని ఉంటాయనీ, అలాగే పురుషుడి కష్ట సుఖాలు కూడా స్త్రీతో పెనవేసుకుని ఉంటాయని, ఇద్దర్నీ ఒకే సృష్టిగా చూసి తీరాలని వాదించి ముగించింది!

పిల్లలతోపాటు మాస్టారు కూడా చప్పట్లు కొట్టారు! హెడ్మాస్టారు నవ్వుతూ అన్నాడు, "నువ్వు తప్పకుండా లాయర్‌వి అవుతావు!"

పద్మజ సిగ్గుపడుతూనే అంది — "ఆడ వాళ్ళు అలాంటి ఉద్యోగాలు చెయ్యవచ్చునా మాస్టారూ?"

"నీ వంటి వాళ్ళు ఎలాంటి పనులైనా చెయ్యవచ్చునమ్మా! సంఘాన్ని కూలదోసి కొత్తగా నిర్మించే శక్తి నీ లాంటి వాళ్ళకుంటుంది!"

ఆ క్షణంలోనే అనుకుంది పద్మజ. ఏదేమైనా తను అన్యాయంగా, అక్రమంగా అధికారం చలాయించే సంఘానికి తలవంచకూడదని!

హెడ్మాస్టారు వెళ్ళిపోయాక ఇంకా ఇద్దరు ముగ్గురు విద్యార్థులు, రాసుకువచ్చిన వ్యాసాలు పురాణ పఠనంలా చదివి ముగించేశారు. రఘుబాబు పేరు పిలిస్తే తను మాట్లాడనే మాట్లాడనన్నాడు.

"అలా భయపడకు. నీకు వచ్చినంత వరకూ చెప్పు. ఏం ఫర్వాలేదు" అంటూ మాస్టారు బుజ్జగిస్తే, ఓ సారి పార్వతికేసి, మరోసారి పద్మజకేసీ చూసి నెమ్మదిగా నడిచి వెళ్ళాడు టేబుల్ దగ్గిరికి. డిబేట్లో మాట్లాడాలని ప్రయత్నించింది అదే మొదటి సారి రఘుకి. అక్కడ నిలబడి క్లాసంతా కలియ జూస్తే కాళ్ళు గజ గజలాడాయి. ముచ్చెమట్లు పోశాయి. దీనంగా చూశాడు మాస్టారికేసి.

మాస్టారు లేచి నిలబడి గట్టిగా అన్నాడు. "రఘుపతికి ఒంట్లో బాగా లేదు. ఈ సారికి విరమించుకుని మరో డిబేట్లో మాట్లాడతాడు."

రఘు తలదించేసుకుని కాళ్ళీడ్చుకుంటూ పోయి కూర్చున్నాడు. చొక్కాతో మొహం మీద చెమట తుడుచుకుంటూ కళ్ళు కూడా ఒత్తుకున్నాడు.

"అదేమిటి రఘుబాబూ, అంత భయపడ్డావ్ క్లాసులో?" అంది ఆశ్చర్యంగా పద్మజ తర్వాత.

ఎప్పటిలా సిగ్గుతో తల తిప్పేసుకున్నాడు రఘుబాబు.

పద్మజ ఏదో కాస్సేపు మాట్లాడి చివరికి హాస్యంగా అననే అంది — "రఘుబాబు పెద్దవాడైనా పిరికివాడే!"

చురుగ్గా చూసింది పార్వతి. "బాధపడకు రఘుబాబూ!" అన్నట్టు ఓదార్పుగా చూసింది రఘూ మొహంలోకి.

రఘు కళ్ళల్లో ఏ విధమైన వేదనా కన్పించలేదు.

★ ★ ★

స్కూల్ ఫైనల్ పరీక్షల్లో పార్వతి కన్నా, రఘుబాబు కన్నా, చాలా మంచి మార్కులు తెచ్చుకుంది పద్మజ. హెడ్మాస్టారు స్వయంగా పద్మజను ప్రశంసిస్తోంటే సంతోషంతో వికసించింది ఈశ్వర సోమయాజి ముఖం.

కూతురి ఘనత విన్న కామేశ్వరమ్మ కూడా కనీ కన్పించకుండా ముసి ముసిగా నవ్వుకుంది. తమ వంశంలో ఒక్క ఆడ పిల్లయినా ఇంగ్లీషు చదువు చదివిందీ? రామాయణాలేమో భారతాలేమో, అవి తప్పితే మరో ముక్క ఎవరికేనా తెలుసూ? "అక్కయ్య చూడవే సుజా! చక్కగా పరీక్ష పాసు అయ్యిందట!" అంటూ చిన్న కూతుర్ని ముద్దుపెట్టుకుని సంతోషం ప్రకటించుకుంది.

"నిన్ను చూసి నేను సిగ్గు పడుతున్నానే పద్మా!" అన్నాడు విజయశాస్త్రి నవ్వుతూ. శాస్త్రి స్కూలు ఫైనలు మొదటి సంవత్సరం తప్పి రెండో సంవత్సరం అత్తెసరు మార్కులతో పాసయ్యాడు మరి!

ఆడ పిల్లల స్వేచ్ఛ విషయంలో అన్న గారి వైఖరిని ఏ నాడో కనిపెట్టగలిగిన పద్మజ నవ్వుతూ "నిజాయితీగా సిగ్గుపడటం నేర్చుకున్నావు!" అంది. ఆ రోజు ఇంట్లో అందరికీ సంతోషం కలిగింది.

అందరూ అక్కయ్యను మెచ్చుకుంటూంటే పన్నెండేళ్ళ సుజా కూడా అమాయకంగా సంతోషించింది. పద్మజ వెనకే తిరిగింది. అక్కయ్య లాగే తనూ కావాలని అమాయకంగానే కోరుకుంది.

"నాన్నా! కాలేజీకి అప్లికేషన్ పెట్టేస్తాను!" అంది పద్మజ మర్నాడు.

పరధ్యాన్నంగా విన్న సోమయాజి అర్థం కానట్టు చూశాడు. చూస్తున్న కాగితాలు దూరంగా నెట్టి "ఏమిటమ్మా అంటు న్నావు?" అన్నాడు.

"కాలేజీ సీటు కోసం తొందరగా అప్లికేషన్ పెట్టాలి నాన్నా!"

కూతురి మొహంలోకి విస్మయంగా చూస్తూ అప్రయత్నంగానే అన్నాడు — "ఇంకా చదువుకుంటావా అమ్మా?"

కూతుర్ని చదివించాలనే ఉద్దేశ్యమైతే ఆయనకు లేదు. అప్పటికే చాలా సాహసంచేసి, ఇంట్లో భార్య పోరుకు తట్టుకుని, బయట బంధుబలగం హెచ్చరికలు ఎదుర్కొని, ఆడ పిల్లని హైస్కూల్లో చేర్పించాడు. చేసిన సాహసానికి ఫలితం కన్పించింది. పద్మజ స్కూల్ ఫైనల్ పాసైంది. ఇక చదువు ప్రసక్తి ముగిసిందనుకున్నాడాయన. కూతురి తెలివితేటలకు ఓ హద్దు గీస్తున్నానన్న సంగతి ఆయనకు అర్థం కాలేదు.

"స్త్రీ విద్య గురించి బాగా మాట్లాడానని నాకు బహుమతి ఇచ్చారు నాన్నా!" అని కూతురు ఫోర్తుఫారం చదివే రోజుల్లో తను సంపాదించుకున్న బహుమతి పుస్తకం తెచ్చి చూపించినపుడు, తను చాలా మంచి పనిచేస్తున్నానని సంతోషించిన ఆయన, తొందరలోనే ఆ సంగతి మరచిపోయాడు. "కాలేజికి అప్లికేషన్ పెడతాను నాన్నా" అన్న కూతురు మాటలూ, కూతురి అభిప్రాయమూ ఆయన అంతరంగాన్ని ఒక్కసారి కంపింపజేశాయి. అందుకే అప్రయత్నంగా, భయం భయంగా "ఇంకా చదువుకుంటావా అమ్మా?" అన్నాడు.

తేలిగ్గా నవ్వింది పద్మజ. "అదేమిటి నాన్నా? చదువుకోక ఏం చెయ్యను?"

నిజమే. పద్మజ చదువుకోక ఏం చేస్తుంది? కోయిల పాడకేం చేస్తుంది? నెమలి ఆడకేం చేస్తుంది? పువ్వు పరిమళించకేం చేస్తుంది? పద్మజ చదువుకోకేం చేస్తుంది?

ఈశ్వర సోమయాజి మాట్లాడలేక పోయాడు.

పద్మజ నవ్వుతూ అంది — "నేను ఇంటర్ తర్వాత మెడిసిన్ కూడా చదవాలనుకుంటున్నాను నాన్నా!" వజ్రాయుధానికి కూడా చెదరని స్థిరత్వం ధ్వనించిందా మాటల్లో!

కూతురి మొహంలోకి మరీ విస్మయంగా చూశాడు తండ్రి. డాక్టర్! పద్మజ డాక్టర్! అంత పెద్ద చదువు! నిజంగా చదువుతుందా పద్మజ? నిశ్చలంగా ప్రకాశిస్తున్న పద్మజ కళ్ళల్లో విద్యాకాంక్ష! ఆ అందాల ముఖంలో వింత తేజస్సు!

అద్వితీయమైన స్త్రీ శక్తి, ఆ చిరునవ్వులో మెరిసి పోతోంది!

"వైద్య వృత్తి ఎంత ఉన్నతమైనదో అంత సున్నితమైనది కదా? మన దేశంలో కావలసి నంత మంది లేడీ డాక్టర్లు ఉన్నారంటావా నాన్నా? అందుకే నాకు డాక్టరీ చదవాలని ఉంది. అవ కాశం వస్తే విదేశాలు కూడా వెళ్ళి చదువు కుంటాను!"

"అమ్మా పద్మా!" ఆనందం దుఃఖం ఒక్క సారిగా పెనవేసుకు వచ్చాయి సోమయాజికి. ఆ వేశంగా కూతుర్ని గుండెలకు హత్తుకున్నాడు. ఆయన హృదయ భారం తీరిపోయింది. హృదయం గులాబి రేకు కన్నా తేలికై గాలిలో తేలిపోయింది. తీర్చి దిద్దిన మార్గం కళ్ళ ముందు దీటుగా మెరిసింది. అవును, పద్మజ అందరిలా సామాన్యమైన ఆడ పిల్ల కాదు. సాక్షాత్తూ చదు వుల తల్లి! సరస్వతీ దేవే తన గర్భాన జన్మించింది! ఇక తను ఎంత మాత్రం సంశయించడు. పురాతనాచారాలకు తల వంచడు. పద్మజ డాక్టర్ కావాలి! అంతే. ఆ పసి హృదయాన్ని నొప్పించే శక్తి తనకే కాదు, భగవంతుడికి కూడా లేదు!

"నాన్నా! ఏమిటి నాన్నా, అంతగా ఆలో చిస్తున్నావు?"

"అమ్మా! ఎప్పుడైనా నీ ఇష్టానికి వ్యతిరే కంగా జరిగిందా? నాకే కాదమ్మా, నిన్ను ఆటంక పరిచే శక్తి ఎవ్వరికీ లేదు. నీకు కావలసినంత వరకూ చదువుకో అమ్మా! నీకు సంతోషం కలి గేంత వరకూ, సంతృప్తి నిచ్చేంత వరకూ, చదు వుకో! నీ కోరిక తీర్చగలగటం కన్న నాకు... ఇంకేం కావాలి?" ఆనందాతిశయంతో ఆయన కళ్ళు చెమర్చుతూంటే చిత్రంగా చూసింది పద్మజ. తన కోరికలో అంత చలింపజేసే విషయం ఏం ఉందనీ? అవకాశాలు కల్పిస్తే ఏ ఆడ పిల్ల మాత్రం డాక్టర్ కాలేదు? అదేమంత సాహస మైనదీ, దుర్లభమైనదీ కాదే!

"ఏమిటండీ అలా కూర్చున్నారూ? ఏవి టైందీ?" వరండాలోపోతూ తొంగిచూసిన కామే శ్వరమ్మ ఆత్రుతగా లోపలికి వచ్చింది. భర్త మాట్లాడకపోయేసరికి — "ఏమిటమ్మా పద్మా! ఏమైంది? నాన్నగారలా ఉన్నారేం?" అంటూ కూతురికేసి చూసింది.

"ఏమీ లేదమ్మా! నేను... కాలేజీకి... అప్లి కేషన్......"

"నువ్వు వెళ్ళమ్మా! లోపలికి వెళ్ళు!" తండ్రి ఆజ్ఞాపించినట్టే అనటంతో పద్మజ మౌనంగా లోపలికి వెళ్ళిపోయింది. లోపల పార్వతి కన పడింది.

పద్మజ మొహం విప్పారింది —" ఎంత సేపైంది నువ్వొచ్చి?"

"ఇప్పుడే లే!"

"కాలేజీలో అప్లికేషన్ పెడతానని నాన్నని అడిగాను. ఎంత కావాలంటే అంత చదువుకో మన్నారు. మెడిసిన్ చదువుతానని చెప్పాను."

"ఎంత అదృష్టవంతురాలివే! నువ్వు నిజం గానే ఎంత చదువైనా చదువుతావు. డాక్టరై నప్పుడు నన్ను మర్చిపోతావా?"

"ఛీ ఛీ! అవేం మాటలే? నేను నిన్ను మర్చి పోతే అలాంటి దాన్ని నువ్వూ మర్చిపోవాలి!"

"అమ్మో! నే నలా చెయ్యను. దీర్ఘ రోగం తెచ్చుకుని నీ ఆస్పత్రిలోపడి ఉంటాను. అప్పుడు నువ్వు నన్ను మర్చిపోవుగా!"

"చాల్లే నీ మాటలు! మీ నాన్నని అడిగావా నీ సంగతి?"

పార్వతి చిన్నబుచ్చుకున్నట్టు చూసింది — "కాలేజీలో చదివించమని మా నాన్న నెలా అడు గుతాను పద్మా? మా పరిస్థితులు నీకు తెలీనట్ట డుగుతావేం? ఈ మాత్రం చదవగలిగినందుకే అదృష్టం అనుకుంటున్నాను.

పద్మజ చాలా విచారపడుతున్నట్టు చూసింది—" మనం విడిపోతే ఎలాగే? ఇన్నాళ్ళు కలిసి చదువుకున్నాం!"

"మరేం చేస్తాం పద్మా? నేను లేకపోతే నీకు నిజంగా బాధగా ఉంటుందా?" అని ఆశ్చర్యంగా చూసింది పార్వతి.

"అదేమిటే పారూ? మనం విడిపోతే నాకు బాధగా వుండదూ? నీకు మాత్రం బాధగా

ఉండదూ, చెప్పు?''

పార్వతి వికసించిన మొహంతో నవ్వింది — ''ఊరికే అన్నాను. కలిసి చదువుకోకపోతే మాత్రం ఎందుకు విడిపోతామే? ఎప్పుడూ కలిసే ఉంటాం! నువ్వు చక్కగా చదువుకో!''

''అవునే పారూ! మనం ఎప్పుడూ స్నేహం గానే ఉండాలే!... మరి రఘుబాబు సంగ తేమిటే? ఏ కాలేజీలో చేరతాడు?''

''నిజం చెప్పాలంటే రఘుకి చదువు మీద ఆసక్తి లేదు పద్మా! అయినా మామయ్య కాలే జీలో చేర్పిస్తాననే అంటున్నాడులే.''

''రఘుబాబు బాగా చదవాలి పారూ! లేక పోతే ధైర్యం రాదు. ఉత్త పిరికివాడు. అలా అంటే అతనికి కోపం కూడా రాదు చూడు!'' అంటూ నవ్వింది పద్మజ.

పార్వతి నవ్వలేదు. ''కోపం రాదు, కానీ చాలా బాధపడతాడు. అతన్ని అస్తమానూ అలా అంటే, మరీ కుంగిపోతాడేమో!''

''రఘుబాబుని అన్నానని నీకు కోపం వచ్చింది కదూ?''

''కోపం కాదు! రఘుని నువ్విలా వెటకారం చేస్తే నాకు జాలేస్తుంది! అస్తమానూ అన కూడదే!''

పద్మజ కొంచెం సిగ్గుపడింది, ''నిజమే! సరే, ఇంకెప్పుడూ అననే. నిజం!''

వాళ్ళ పక్కనే కూర్చున్న సుజాత ఆ ఇద్దరి మాటలూ బొత్తిగా అర్థంకాక తెల్లపోయి చూస్తూ కూర్చుంది.

''అమ్మాయ్, పద్మా ఇలా రా ఒక సారి!'' ఉరుములేని పిడుగులా హుంకరిస్తూ పిలిచింది కామేశ్వరమ్మ.

తెల్లబోయిన పద్మజ పార్వతిని కూడా వెంటబెట్టుకు వెళ్ళింది.

కూతుర్ని ఎగాదిగా చూస్తూ అంది కామేశ్వ రమ్మ ''నాన్నగారేమంటున్నారో విన్నావా? నిన్ను డాక్టరమ్మ చదువు చదివిస్తారట!''

''అవునమ్మా! ముందు నేనే చదువు కుంటా నన్నాను. నాన్నగారు అలాగే చదువుకోమన్నారు!''

''చాల్లే, నోరు మూసుకో!'' విరుచుకు పడింది కామేశ్వరమ్మ. ''అడగడానికైనా హద్దూ పద్దూ ఉండాలి! ఇప్పటికి చదివింది చాలు! ఎంత చదివి మాత్రం ఆడ పిల్ల ఏం చేసుకోను? ఓ అయ్యచేతిలో ధారపొయ్యటానికేగా? కాస్త లక్షణమైన సంబంధం చూసి ఆ మూడు ముళ్ళూ వేయించేసి మా భారం తీర్చుకోవాలని చూస్తోంటే మధ్య ఈ గొడవేమిటి? ఈడేరిన ఆడ పిల్లవి! ఇంకా ఎన్నేళ్ళు చదివితే ఆ డాక్టరు పూర్తిగాను? నిక్షేపంలా పెళ్ళి చేసుకుని కాపరం చేసుకో!''

పద్మజకు నవ్వు వచ్చింది. కోపం కూడా వచ్చింది. అమ్మ మాటలు వింటూ అలాగే నిలబడింది.

కామేశ్వరమ్మ తన ధోరణి మళ్ళీ సాగిం చింది, ''నీ తోటి పిల్ల పార్వతిని చూడు! నీలా వెర్రి మొర్రి వేషాలు వేస్తోందా? ఇంటి పట్టున కూర్చుని తల్లికి సాయం చేస్తోంది! పెద్ద వాళ్ళు చెప్పినట్టు వింటోంది!''

వరండా దిగివస్తూ అనునయంగానే అన్నాడు సోమయాజి. ''కాముడూ! నేను చెప్పిన దంతా పెడ చెవినిబెట్టి ఎందుకలా అమ్మాయిని ఆరడి చేస్తావు? మన బిడ్డ పెద్ద డాక్టరైతే ఆ పేరు ప్రఖ్యాతులు మనవి కావూ? చదువుకుంటాన నడం తప్పా? దాన్నేమీ అనకు!'' భర్త పట్టుదల ఏళ్ళ తరబడీ ఎరిగి ఉన్న కామేశ్వరమ్మ కుంపటి ముందు కూర్చుని బొట బొటా కన్నీళ్ళుకార్చింది.

నెల్లాళ్ళ తర్వాత!

''శాస్త్రీ! ఇవ్వాళ కాలేజీ తీస్తారంటోంది పద్మ. దగ్గిరే ఉండి నువ్వు చేర్పించిరా పద్మని!'' తండ్రి ఆజ్ఞ ధిక్కరించలేని శాస్త్రి, మొహం ముడుచు కుని లోపలికి వచ్చేశాడు. చెల్లెల్ని కాలేజీలో చదివించటం విజయ శాస్త్రికి ఇష్టం లేదు. చదువుకు హద్దేమిటి? అంతెక్కడ? అంత మాత్రం ఆలోచన నాన్నగారి కెందుకు లేక పోవాలి?

అయిష్టాన్ని అణచుకోలేక పద్మజతో అననే అన్నాడు — ''అమ్మని అలా ఏడిపించి నువ్వు

కాలేజీ చదువులు చదవకపోతే ఏం పద్మా?''

పద్మజ నవ్వింది "నువ్వు అమ్మ కన్నా నాలుగు తరాలు ముందు పుట్టాల్సింది అన్నయ్యా! నేను బాగా చదువుతున్నానని ఏడ్చే అమ్మే నువ్వు బాగా చదవటం లేదని కూడా ఏడుస్తోంది! పాపం, ఇద్దరం అమ్మని ఏడిపిస్తున్నాం!''

శాస్త్రి మొహం ఎర్రబడిపోయింది. చదువు విషయంలో తనెలా ఉన్నాడో పద్మజకు తెలియందేమీ కాదు. తను, బి.యల్. పరీక్ష పాసు కాలేక సతమతమవుతున్నాడు.

"నీ కెందుకు శ్రమ? నేను వెళ్ళగలనులే అన్నయ్యా!'' అంటూ పద్మజ జోళ్ళు తొడుక్కుని బయల్దేరుతూంటే ఎడ మొహం పెడ మొహం గానే చెల్లెల్ని అనుసరించాడు శాస్త్రి.

★ ★ ★

గడిచిన రెండు మూడు సంవత్సరాల్లో చెప్పుకోదగ్గ మార్పులే జరిగాయి. పార్వతి విషయంలో, కాలం కుంటి కుంటిగా, నడిచింది. ఉన్నంతలో సంతృప్తిపడుతూ సంసారం ఈదుతోన్న సావిత్రి పుట్టెడు దిగులుతో, కళ్ళనిండా నీళ్ళు నింపుకుని నోరు పెగల్చుకుని మాట్లాడలేని స్థితిలో కన్నుమూసింది! రుక్కు వెనక పది పన్నెండేళ్ళకు దూరపుకానుపు కలిగింది సావిత్రికి. బిడ్డ కడుపులోనేపోయి పుట్టెడు జబ్బుపడి మరి తేరుకోలేక పసివాళ్ళను తండ్రికి అప్పగించి తన బాధ్యతలు చాలించుకుంది! అనుకోని ఆ పిడుగుపాటుతో కుంగిపోయిన తండ్రికి, ఈడేరిన కూతురు పార్వతే ధైర్యం చెప్తూ అండగా నిలబడింది! తల్లిలేని పసివాళ్ళకు తల్లి అయి బరువు బాధ్యతలు మీద వేసుకుంది.

మద్రాసులో మెడిసిన్ చదువుతూన్న పద్మజ ఎప్పటికప్పుడు ధైర్యం చెబుతూ రాసే ఉత్తరాలు పార్వతిని కొంత నిశ్చింత పరిచాయనక తప్పదు. రఘు అమాయక స్నేహం, అతని తల్లిదండ్రుల ఆదరణా, పార్వతి కన్నీటిని తుడిచి వేశాయి. ఏ ఘడియా నీడలా వెంటాడే రఘు స్నేహం, పార్వతిలో కొత్త కొత్త ఆశలు రేపుతూ వచ్చింది.

వరసగా రెండు మూడు పరీక్షలు తప్పటంతో, రఘుపతిలో కాలేజీ చదువు మీద ఉండే ఆసక్తి పూర్తిగా పోయింది. కొడుకు చదువులో రాణించడన్న సత్యం తెలుసుకొనగలిగిన చలపతిరావు, రఘుపతిని కాలేజీ మాన్పించి, స్వంత వ్యాపారంలో కొంత బాధ్యత మీద వేశాడు. రఘు, తేలిగ్గా గాలి పీల్చుకుంటూ వ్యాపారంలో సులువు బరువులన్నీ తెలుసుకొవాలన్న ఆసక్తి కనబరిచాడు. కానీ, అందులో కూడా సమర్థత చూపించ లేకపోతున్నాడన్న విషయం చలపతిరావు గ్రహించినా కాలం మీదే ఆశపెట్టుకుని ఊరుకున్నాడు.

"నువ్వు చదువు మానటం నాకెంత బాధగా ఉందో నీకు తెలీదు రఘూ! నువ్వు ఎంతో పెద్ద చదువు చదువుతావని ఆశపడ్డాను. మనం తలుచుకుంటే సాధించలేనిదేముంది?'' అంటూ నచ్చ చెప్పబోయింది పార్వతి.

రఘు అడ్డంగా తల తిప్పేశాడు. "నాకు చదువు రాదు పారూ! చాలా తెలివిగల వాళ్ళకి గానీ ఈ చదువులంటవు!''

"నువ్వు తెలివి తక్కువ వాడివని ఎవరన్నారు?''

"ఎవరో అనటం ఏమిటి? నాకే తెలుసు!''

"అలా అంటే నేను ఒప్పుకోను. నువ్వు చాలా తెలివైన వాడివి! నీకా ఆత్మ విశ్వాసమే లేకుండాపోయింది!'' అంది పార్వతి మందలింపుగా.

రఘు మారుమాట్లాడకుండా ఊరుకున్నాడు.

రఘుపతి టైఫాయిడ్ జ్వరంతో బాధపడ్డ నెల రోజులూ పార్వతి రఘుకు మరీ సన్నిహితంగా మసిలింది. ఆ బాధ్యతంతా అన్నపూర్ణమ్మ పార్వతి మీదే పెట్టింది.

గంటలకొద్దీ రఘు సమీపంలో గడుపుతున్న పార్వతి, రఘు మనస్తత్వం చాలావరకు అర్థం చేసుకోవటానికి ప్రయత్నించింది.

"ఒళ్ళంతా చెమట పోస్తోంటే ఇలా ఉక్కతో బాధపడకపోతే కొంచెం లేచి పంకా వేసుకోలేక పోయావా రఘూ?'' అంది ఓసారి గదిలోకి వస్తూ.

"అబ్బ! పోనీ పార్వతీ! నువ్వు వచ్చావుగా? తొందరగా స్విచ్చివెయ్యి! ఈ చెమటలతో చిరాగ్గా ఉంది!" అన్నాడు రఘు విసుగ్గా. పంకా తిరుగుతూంటే గాలిపోసుకున్న చొక్కా ఎగురుతూంటే సొమ్మసిల్లినట్టు కళ్ళుమూసుకున్నాడు.

అన్నపూర్ణమ్మ బార్లీ నీళ్ళు కాగబెట్టి తీసుకు వచ్చింది "నిద్రపోతున్నాడా పార్వతీ? పొద్దున్న నుంచీ బొత్తిగా ఏమీ తాగలేదు."

"ఇక్కడ పెట్టత్తా! లేచాక ఇస్తాను."

అన్నపూర్ణమ్మ గ్లాసు బల్ల మీద పెట్టి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"రఘుబాబూ!" మృదువుగా పిలిచింది పార్వతి.

కళ్ళు తెరిచి చూశాడు రఘు.

"ఒక్కసారి లేచి కూర్చుంటావా? బార్లీ తాగుదువు గాని,"

అయిష్టంగా మొహం చిట్లించాడు. "నాకు బార్లీ బాగుండదు పార్వతీ!"

"అలా అంటే ఎలా? జ్వరం వచ్చినప్పుడు బార్లీ కాకపోతే ఇంకేం తాగుతావు?" అంది పార్వతి బుజ్జగిస్తూన్నట్టు.

"సగ్గు జావ కూడా తాగొచ్చునన్నాడు డాక్టరు."

"నీకు సగ్గు జావ బాగుంటుందా? ఆ మాట చెప్పలేక పోయావా అత్తతో?"

"చెప్పకపోతే మాత్రం అమ్మకు తెలీదా?"

"ఎలా తెలుస్తుందీ? చెపితే సగ్గు జావే కాచేదిగా? సరేలే, నే కాచి తీసుకొస్తాను. కాస్సేపు పడుకో" అంటూ లేచింది పార్వతి.

"వద్దులే, ఇలాతే! అదే తాగుతాను!"

"బాగుండ దన్నావుగా?"

"ఫర్వాలేదు. ఎలాగో తాగేస్తాను!"

పార్వతి అయిష్టంగానే అందించింది గ్లాసు.

మొహం చిట్లిస్తూ బాధపడుతూ, వస్తున్న వెక్కిళ్ళు అణచుకుంటూ సగం గ్లాసు ఖాళీచేసి బల్ల మీద పెట్టేశాడు.

"పోనీ సగ్గు జావ కాచి తీసుకు వస్తాను, కూర్చుంటావా?"

"నాకేం తాగాలని లేదు"

"బత్తాయి పండు వలిచి పెట్టనా?"

"ఊఁ."

"నిజం చెప్పు, బత్తాయి తొనలు ఇష్టమేనా, ద్రాక్ష పళ్ళు తింటావా?"

"ఏదైనా ఫరవాలేదు. నీ ఇష్టం!"

నవ్వుతూ అంది పార్వతి — "నాకు రెండూ ఇష్టం లేదు. తినకుండా ఊరుకుంటావా?"

మాట్లాడలేదు రఘు.

"ఇంత అమాయకుడివైతే ఎలా రఘూ? నీకేం కావాలో కూడా నీకు తెలీదు. తెలిసినా పైకి చెప్పవు. ఇలా అయితే కష్టం కదూ?"

రఘు నీరసంగా నవ్వుతూ అన్నాడు. "ఏమీ కష్టం లేదు పారూ! నాకు కావలసినవన్నీ చూసుకోవటానికి నువ్వు ఉన్నావుగా?"

పార్వతి కళ్ళు దించుకుంది. బత్తాయి వలుస్తూ కూర్చుంది. ఎన్నడూ లేనిది రఘు తనకు సన్నిహితమౌతున్నాడు! ఆ మధ్య ఒక రోజు చటుక్కున తన పైటకొంగు అందుకుని మొహం తుడుచుకున్నాడు! తను భయం భయంగా "ఇదేం పని, రఘూ?" అంటే "తప్పు పని కాదులే" అన్నాడు నవ్వుతూ. ఇప్పుడు "నా గురించి చూసుకోడానికి నువ్వు ఉన్నావు" అంటున్నాడు!

"బత్తాయి పండు నీ కోసం వలుచుకుంటున్నావా పారూ?" రఘు పలకరింపుతో పరధ్యానం వదలి పార్వతి నవ్వుతూ తొనలు మౌనంగా అందించింది.

"ఇలా ఓ సంవత్సరం వరకైనా జ్వరం ఉండిపోతే బాగుండునను కుంటున్నాను పారూ!"

"దానికేం భాగ్యం? సంవత్సరం దాకా మంచం మీదే పడుకో! ఎన్నాళ్ళయినా ఉండిపోతుంది జ్వరం!"

"అలా నటించమంటావా?"

"రఘుబాబు లేచాడా పార్వతీ?" అంటూ వచ్చింది అన్నపూర్ణమ్మ.

"నీ కోసం తాసీల్దారుగారి అమ్మాయి వచ్చింది. నువ్వు వెళ్ళు! నేను కూర్చుంటాను!" అంది.

"ఎవరూ? సుజాతా?" అంటూ గదిలోంచి వెళ్ళిపోయింది పార్వతి.

సుజా, పద్మజ రాసిన ఉత్తరం తీసుకొచ్చింది. "నువ్వీ మధ్య బొత్తిగా అక్కయ్యకి ఉత్తరాలు రాయటం లేదటగా చిన్నక్కయ్యా? నిన్ను అడగమని అక్కయ్య నాకు రాసింది" అంది సుజాత తనకు వచ్చిన ఉత్తరం చూపిస్తూ.

పార్వతి ఉత్తరం చదివి నవ్వుతూ — "నిజంగానే ఆలస్యం చేశాను సుజా! రఘు బాబుకి జ్వరంగా ఉంటోంది. ఇంట్లో పని అయిపోగానే ఇక్కడే ఉంటున్నాను. ఖాళీలేక ఆలస్యం చేశాను. రా, మా ఇంటికి వెళ్దాం! ఇవ్వాళ తప్పకుండా రాస్తాను" అంది.

పద్మజ దగ్గిరకన్నా పార్వతి దగ్గిరే సుజాకు చనువు ఎక్కువ. తన మనస్సులో మెదిలే ప్రతి ఊహా అమాయకంగా పార్వతితో చెపుతుంది. "అక్కయ్య మద్రాసు వెళ్ళిపోయింది, చదువుకోటానికి! చాలా గొప్పది కదూ?" అంటుంది అప్పుడప్పుడూ.

"నీకు మాత్రం ఏం తక్కువ సుజా? అక్కయ్యలాగే నువ్వూ చదువుకుంటావు.

"అవును, అక్కయ్య అలాగే చెప్పింది. ఈ ఏడు థర్డుఫారం పాసైతే మంచి బహుమతి ఇస్తానంది"

"చూశావా మరి? చెయ్యాల్సిన సాహసమంతా పద్మజే చేసింది! నీ చదువుని ఎవరూ ఆపరు"

పార్వతి ఉత్తరం రాసుకుంటూ కూర్చుంటే, సుజా రుక్మిణితో ఆడుకోవటంలో మునిగిపోయింది.

★ ★ ★

**"రఘు** ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాడు పద్మా! పాపం ఇన్ని రోజులుగా పాడు జ్వరంతో బాధపడ్డాడు. బహుశా ఈ వేసంగిలో అతగాడు పెళ్ళికొడుకు కాబోతున్నా డనుకుంటాను..." ఉత్తరం రాయటం సగంలో ఆపుచేసి తనలోతనే నవ్వుకుంది పార్వతి.

పోస్టులో వెయ్యమని ఉత్తరం సూర్యం చేతికిచ్చి లేచింది పార్వతి.

తండ్రి, మెట్లెక్కి లోపలికి వస్తూ కనిపించాడు. తండ్రి మొహం చూసి గతుక్కుమంది పార్వతి. ఆయన అలా దిగులుగా, బాధగా...! విస్మయంగా చూస్తూ నించుంది. తండ్రి మొహం చూస్తున్న కొద్దీ ఏవిటో తెలీని భయం, అనుమానం, పెనుగులాడాయి. తండ్రి మాటా మంతీ లేకుండా కుర్చీలో కూలబడితే నెమ్మదిగా లోపలికి నడవబోయింది.

"అమ్మా! ఇలా వచ్చి కూర్చో!"

తండ్రి పిలుపుతో దగ్గిరికి వెళ్ళి నేల చూపులు చూస్తూ నించుంది. కొంత సేపు మళ్ళీ నిశ్శబ్దంగానే ఊరుకున్నాడు తండ్రి. చివరికి "మనం చాలా పొరపడ్డాం తల్లీ! చాలా పొరపడ్డాం!" అన్నాడు భారంగా.

వెర్రి దానిలా చూసింది పార్వతి.

"అందని పళ్ళకి అర్రులు చాచినట్టే అయింది! లోకం పోకడ తెలుసుకోలేక పిచ్చి భ్రమలు పెట్టుకున్నాం!"

పార్వతి గుండెలు ఒక్కసారి దడదడలాడి ఆగినట్టయిపోయాయి! ఊపిరి కూడా పీల్చకుండా తండ్రికేసి చూస్తూ అలాగే నించుంది. "ఏమిటి నాన్నా? ఏమిటి అంటున్నావు?"

"రఘుపతికి సంబంధం కుదుర్చుకున్నారమ్మా!"

విస్మయంగా వింది పార్వతి.

తండ్రి ఒక నిట్టూర్పు విడిచాడు.

"మీ అమ్మ ఎప్పుడూ అంటూనే ఉండేది. వాళ్ళ అంతస్తెక్కడా, మనంతస్తెక్కడా అనేది. వాళ్ళని మనం ఎలా అందుకోగలం? అర్థం లేని ఆశలు పెట్టుకున్నాం! ఆకాశాని కెగరాలని రెక్కలు కట్టుకున్నాం!"

"నాన్నా!" దించుకున్న తల ఎత్తి తండ్రి కళ్ళలోకి చూసింది పార్వతి. "అసలేం జరిగింది? ఇప్పుడా పెళ్ళి మాటలెందుకొచ్చాయి?" అంది నెమ్మదిగా. పార్వతికి తండ్రి మాటలు నమ్మ శక్యంగా లేవు. రఘుపతికి వేరే పెళ్ళి నిర్ణ

యించటం ఏమిటి? రఘుపతి ఒప్పుకుంటాడా?

"నేను మామూలుగానే వెళ్ళానమ్మా! చల పతిరావు ఎవరో పెద్ద మనిషితో పెళ్ళి విషయాలు మాట్లాడుతున్నాడు. అంత వరకూ లోపలి గడ పలో నిలబడి ఉన్న అన్నపూర్ణమ్మ నన్ను చూచి పలకరించకుండానే లోపలికి వెళ్ళిపోయింది. పెళ్ళి మాటలు వినగా నాకేదో అనుమానం పొడ చూపింది. చలపతిరావు మొహంకేసి చూశాను. మాట్లాడటానికే ఇబ్బంది పడుతోన్న వాడిలా కనిపించాడు. నేను నెమ్మదిగా లేచి రాబోతూంటే లేని నవ్వు మొహం మీద మెరిపిస్తూ కాయితా ల్లోంచి ఒక ఆడ పిల్ల ఫోటో తీసి, "కూర్చోండి మాష్టారూ! చూడండి, మీ శిష్యుడికి కాబోయే వధువుని!" అంటూ చేతిలో ఫోటో ముందుకు చాచాడు.

"ఎవరికీ? రఘుపతికా!" అని అప్రయ త్నంగా అడిగేశాను.

చలపతిరావు అలాగే నవ్వుతూ "అవునండీ! వాళ్ళమ్మ కోడలు కావాలని గొడవ చేస్తోంది. కుర్ర వాడికా పెళ్ళి వయసు వచ్చింది. సంబంధాలు కుప్పతెప్పలుగా వస్తున్నాయి. ఇక ఆలస్యం ఎందుకనీ..." అన్నాడు. "మరి... మరి..." అని ఏదో అడగాలనుకున్నాను గానీ, ఏం అడుగు తాను? నా నోరు పెగల్లేదు. చల పతిరావే మళ్ళీ "దగ్గిర సంబంధమేలెండి. కాదనుకుంటే నిష్టూ రాలు తప్పవు. పది మంది కుటుం బంలో పుట్టి పెరిగిన పిల్ల. కట్నం అడిగినంతా ఇస్తామంటు న్నారు గానీ, చూడండి మాష్టారూ! పెళ్ళిళ్ళు నిర్ణ యించడమంటే మాటలు కాదు గదా? అదే ఆలోచిస్తున్నాను" అన్నాడు. ఇక నే నక్కడ నిల బడలేకపోయానమ్మా! తల గిర్రున తిరిగి పోతూంటే, బలవంతంగా అడుగు లేస్తూ 'వస్తా' నంటూ చీడీలు దిగి గేటు తెరుచుకుని రోడ్డు దాటి ఇలా మన గడపలో పడ్డాను!"

పార్వతి శిలాప్రతిమే అయింది. చలపతి మామయ్య కట్నానికి ఆశపడి, ఇంత తేలికగా మనసు మార్చుకున్నాడా! "కట్నాలూవద్దు, కాను కలూ వద్దు, బంగారు బొమ్మలాంటి పార్వతే మాకు కట్నం! నీ చల్లని చేతితో ఎప్పుడు వండి పెడతావే తల్లీ!" అంటూ ఆప్యాయత కురిపించే మామయ్య!

"భార్య భర్తల మనస్సులు కలిసి బ్రతకాలి గానీ డబ్బుదేముంది?" అనే మామయ్య! నిజంగా ధనాశకు, లొంగిపోయాడా?

"మామయ్య చాలా మంచి వాడే కదా నాన్నా?"

"అతన్ని చెడ్డ వాడనే హక్కు మనకు లేదమ్మా! మంచి వాడే! మన లాంటి గర్భ దరి ద్రుల్ని చూసి ఎవరు మాత్రం ఎందుకు జాలి పడతారమ్మా?"

నిట్టూర్చింది పార్వతి. "పోనీ నాన్నా! మనల్ని చూసి ఎవ్వరూ జాలి పడొద్దు! నువ్వు బాధ పడకు!"

నిరాశగా నవ్వాడు తండ్రి. "బాధ! బాధ ఎందుకులేమ్మా!"

పార్వతికి కన్నీళ్ళు సుళ్ళు తిరిగాయి. తండ్రి ఇంతగా బాధపడినట్టు ఎన్నడూ గుర్తు లేదు. తల్లి పోయిన క్షణం నుంచీ వయస్సు మళ్ళిన తండ్రిని పసి వాళ్ళ కన్నా ఎక్కువ శ్రద్ధతో చూసుకుంటూనే ఉంది.

ఈ అనుకోని సంఘటన తనకూ తండ్రికీ కూడా పిడుగుపాటే! వేయి కళ్ళతో ఎదురు చూస్తూ ఎన్నో ఆశలు పెట్టుకున్న భవిష్యత్తు, ఎడారిలో ఎండమావిగా తయారౌతూంటే తన మాట ఎలా ఉన్నా, తండ్రి తట్టుకోలేడు. తను చిన్నదే అయినా పెద్దరికం వహించి తండ్రికి రెండు ముక్కలు చెప్పక తప్పదు.

"కొంచెం కాఫీ పెట్టి తెస్తాను నాన్నా!" అంటూ వంట గదిలోకి వెళ్ళిపోయింది. గబ గబా కుంపటి అంటించి గ్లాసుడు నీళ్ళు పడేసింది. బొగ్గులు ఎర్రగా రేగుతూన్నా విసురుతూ ఎదు రుగా కూర్చుంది.

తండ్రి చెప్పిన విషయం ఇంకా నమ్మ శక్యంగా లేదు పార్వతికి. చలపతి మామయ్య కేవలం కట్నం కోసం మరో సంబంధం కుదుర్చు తున్నాడా? ఇన్నాళ్ళూ చెప్పిన కబుర్లన్నీ మరిచే

పోయాడా? ఈ తతంగం అంతా రఘుకు తెలుసా? తెలిస్తే ఊరుకుంటాడా?

ఊహుఁ! ఇంకా రఘుకు తెలిసి ఉండదు! తెలిస్తే ఊరుకోడు! ఎప్పుడెలా ఉన్నా, తన విషయంలో మాత్రం ఇంత నిర్లక్ష్యం చెయ్యడు! రఘుని మాట మాత్రమైనా అడగకుండా తనిలా దిగులుపడటం దేనికి? ఇప్పుడేమంత మించి పోయిందని?

పార్వతి మనసులో ఆశా జ్యోతి దానంతటదే వెలిగింది. ఆ కాంతి కిరణాలు మినుకు మినుకుమంటూ ఎంతో బలాన్నీ, ధైర్యాన్నీ కలిగించాయి.

గిన్నె మాడుతున్న వాసనకు కంగారుగా నిప్పుల మీద గిన్నె కింద పడేసి మరోగిన్నెతో నీళ్ళు పెట్టింది. శ్రద్ధగా కాఫీ కలిపి పట్టుకెళ్ళింది గదిలోకి.

"కాఫీ తీసుకో నాన్నా!"

మాట్లాడకుండా గ్లాసు అందుకున్నాడాయన. పార్వతి మొహంలో ఎప్పటి కళా కాంతులు కనిపిస్తూంటే ఆయనకు ఆశ్చర్యం కలిగింది.

"అలా కాసేపు బజారుకేసి వెళ్ళొస్తానమ్మా!" గ్లాసు బల్లమీద పెడుతూ లేచాడు. "కూర లేమైనా తెమ్మంటావా? చిన్న సంచీ ఇస్తావా?"

"వంకాయలు వీధిలో కొస్తే మధ్యాన్నం కొన్నాను నాన్నా! కూరలేం వద్దు. కొంచెం కాఫీ పొడీ, పంచదారా తెచ్చుకోవాలి."

"అలాగే" చెప్పులు తొడుక్కుంటూ — "వీళ్ళేరీ? ఇంకా రానేలేదా? చీకటి కూడా పడుతోంది!" అంటూ వీధి గుమ్మం కేసి దారితీశాడు.

"ఇంటికి వచ్చే వెళ్ళారు నాన్నా! ఆడుకోడానికి పోయినట్టుంది."

"వాళ్ళ మొహం! చీకటిపడుతోన్నా ఏం ఆటలు? కొంచెం మందలించమ్మా వాళ్ళని!" అంటూనే రోడ్డు ఎక్కాడు.

తండ్రి కన్పించే వరకూ అలాగే చూస్తూ నించుంది పార్వతి. ఇంత మంచి తండ్రి అందరికీ ఉంటాడా? బిడ్డల మీద ఇంత ప్రేమ ప్రతి తండ్రికీ ఉంటుందా? అమ్మ పోయినా అమ్మలాగే చూసుకుంటున్నాడు నాన్న! పుట్టెడు బీదరికంతో రాత్రింబవళ్ళూ కష్టపడుతూన్నాడు నాన్న! ఇంత మంచి నాన్నకు తనేం ప్రతిఫలం ఇవ్వగలదు? తన కోసం కన్నీళ్ళు పెట్టుకునే నాన్నను ఎలా ఓదార్చగలదు?

"అక్కా, అక్కా! మాట్లాడవేమే?" వోణీపట్టుకుని లాగుతున్న రుక్కు బిక్క మొహం వేసి నించుంది.

"ఏమిటే? ఏమైంది? ఎందుకలా ఉన్నావు?" చెల్లెలి పలకరింపుతో తేరుకుని రుక్కును బుజ్జగిస్తూ అడిగిందిపార్వతి.

"అన్నయ్య కొట్టి పారిపోయాడక్కా!" ఏడ్చెయ్యడానికి సిద్ధంగా ఉంది రుక్కు.

"అన్నయ్య కొట్టాడా? ఛ! ఎందుకు కొట్టాడు?"

"నాకు చింతకాయ దొరికిందీ, వాడికి ఇవ్వనన్నానుగా. నెత్తి మీద మొట్టేసి..." బావురుమంది రుక్కు.

పార్వతి చెల్లెల్ని దగ్గిరికి తీసుకుని లాలించింది. "ఛ! ఏడవ కూడదే రుక్కూ! రానీ ఆ వెధవని, అడుగుతాను. మరి అన్నయ్యకి కొంచెం పెట్టకపోయావా? పాపం, నీ అన్నయ్యే కదా?"

"ఊహుఁ! నేను పెట్టను. చింత కాయ, చెట్టు కింద నాకే దొరికింది!"

"పోనీలే. ఊరుకో. వెళ్ళి నీళ్ళు పోసుకో! ఎసరు మరిగిపోతోందో యేమో!" అంటూ గబగబా లోపలికి పోయింది పార్వతి.

సూర్యం ఇంటికి చేరాక కాసేపు వాళ్ళ తగువు పరిష్కరించి, ఇద్దర్నీ మందలించి అన్నాలు పెట్టింది. తిళ్ళు తిని లేచి ఒక్క లైటుకే దూర దూరంగా ఎడ మొహం పెడ మొహాలతో చదువుకుంటూకూర్చున్నారు వాళ్ళిద్దరూ.

తండ్రి అన్నానికి కూర్చుంటూ, "అమ్మా! పార్వతీ! నే నొకటి అనుకుంటున్నానమ్మా!" అన్నాడు.

"ఏమిటి నాన్నా? ఏమైనా కావాలా?"

"అది కాదమ్మా! ఇలా కూర్చో!..."

పార్వతి అనుమానంగా చూస్తూ తండ్రి దగ్గిరే కూర్చుంది.

చలపతి మామయ్యకైనా మన మీద అభి మానం లేకపోలేదమ్మా! వేలకు వేలు గుమ్మరిస్తా మంటూ సంబంధాలు వస్తోంటే ఏం చేస్తాడు? ఎవరికయితే మాత్రం డబ్బు చేదా?"

అయోమయంగా చూసింది పార్వతి. ఏమిటి తండ్రి చెపుతున్నది? ఇన్నాళ్ళూ కబుర్లు చెప్పి, హాస్యాలాడి, ఆశపెట్టి, ఇప్పుడిలా చేస్తూంటే తప్పే లేదా?

"అంత లేసి కట్నాలూ కానుకలూ మనం ఇవ్వలేకపోయినా, ఏదో రెండు మూడు వేలు ఇస్తామని కాళ్ళా వేళ్ళా పడతాను. తప్పేం లేదమ్మా! ఐదారేళ్ళుగా హాస్యానికో, నిజానికో అనుకుంటూ ఉన్నదే!"

"నాన్నా!" ఆశ్చర్యంగా చూసింది పార్వతి. "రెండు మూడు వేలు మాత్రం మనం ఇవ్వ గలమా?"

"మీ అమ్మ పేరనున్న ఎకరం అమ్మేస్తే మూడు వేల పైచిలుకే వస్తుందమ్మా. నిక్షేపంలా వస్తుంది. ఇక ఆలస్యం చెయ్యను. ఇప్పుడే మామయ్యని అడిగేస్తానమ్మా!

"మరి మరి ఆ ఒక్క ఆధారం తెగనమ్ము కుంటే తమ్ముడి చదువూ, చెల్లాయి పెళ్ళీ..."

"మరేం ఫరవాలేదు. మరొక్క రెండేళ్ళు కష్టపడి చదివించానంటే, సూర్యం స్కూల్ ఫైనల్ పరీక్ష వ్రాస్తాడు. ఆ సెలవల్లోనే ఏ అయ్య కాళ్ళో పట్టుకుని వాణ్ణి ఏదైనా ఉద్యోగంలో వేయిం చేస్తాను. ఇక రుక్కు మాటంటావా? శాంతమ్మత్త కొడుకు ఉండనే ఉన్నాడు, చేసుకోమని బతిమి లాడుతాను. అత్త నా మాట కాదనదు."

తండ్రి మొహంలో చూస్తూండగానే ధైర్యం కనపడింది.

"తెలివి తక్కువగా ఈ సంబంధం వదులు కోవద్దమ్మా! రఘుపతి మన ఇంటి అల్లుడే కావాలి. మహా గుణవంతుడు. నీ మొహం చూసి మాట్లాడమని మామయ్యని మరీ మరీ అడుగు తాను. ఇదిగో, ఇప్పుడే వెళతాను."

నాన్న బజారులో తిరుగుతూ ఆ విషయమే ఆలోచించాడు కాబోలు! ఆ ఒక్క ఎకరం ఇంత కాలం కుటుంబానికి వేన్నీళ్ళకు చన్నీళ్ళుగా తోడు పడింది. దాన్ని ఇప్పుడు అమ్మేస్తే ఇల్లు గడిచే మాట అటుంచి సూర్యం చదువేమవుతుంది? రుక్కుకు మాత్రం పెళ్ళేలా అవుతుందీ? పాపం వాళ్ళ నిద్దర్నీ చిన్న వాళ్ళని చేసి, ఉన్నది కాస్తా తన కోసం ఖర్చుపెట్టేస్తే? ఛ, నాన్నకైనా జాలి వెయ్యటం లేదూ? పద మూడేళ్ళు నిండీ నిండని సూరి, ఇంకో రెండేళ్ళకే ఉద్యోగం చెయ్య గలడా? ఇంత చిన్న వాడికి ఉద్యోగం మాత్రం ఎవరిస్తారు? "వొద్దు నాన్నా! ఆ పొలం అమ్మటం అంటే మనస్కరించటం లేదు నాకు."

"అలాగంటే ఎలా గమ్మా? అవసరానికి ఉపయోగపడకపోతే పొలం ఉంది ఎందుకు?"

"అది కాదు నాన్నా! అసలు రఘు అభి ప్రాయం ఎలా ఉందో..."

"అతనేం చెపుతాడమ్మా పెద్ద వాళ్ళని కాదని?"

"అలాగంటే ఎలాగ? అతనికి ఇష్టం ఉంటే వేరే సంబంధాలు చూడొద్దని గట్టిగా చెప్పలేడా తల్లి దండ్రుల్తో?"

"అవుననుకో! అతను ఎప్పుడూ మెతక వాడేగా?"

"ఇలాంటి సందర్భంలో కూడానా? పొలం సంగతి నువ్వు వాళ్ళతో అనొద్దు నాన్నా! రఘు ఏమంటాడో వినాలని ఉంది నాకు."

తండ్రి జవాబు చెప్పలేదు.

సూరి ఏక దీక్షగా ఇంగ్లీషు పద్యాలు కంఠస్తం చేస్తున్నాడు. రుక్కు నిద్రతో జోగుతూ లైటు మీద పడబోయింది. దాన్ని వీపు మీద తట్టి లేపి పోయి పడుకోమంది పార్వతి. రుక్కు పడు కోవటంతో సూర్యం కూడా జోగటం మొద లెట్టాడు. వాణ్ణీపొమ్మని కసిరి, పుస్తకాలు సర్దేసి లైటు తగ్గించి రుక్మిణి పక్కనే ఒరిగింది పార్వతి.

★ ★ ★

**రఘు** మొహం చూస్తూంటే జరిగిన సంగతంతా అతనికి తెలుసో తెలిదో అంతుపట్ట లేదు పార్వతికి. రఘు ఎప్పుడూ అలా ముభావం గానే ఉంటాడు. ఎప్పుడూ అంత నిశ్శబ్దంగానే కూర్చుంటాడు. ఎప్పుడూ అదే నిర్లిప్తతతో చూస్తూంటాడు. అలాగే మామూలుగా గడపలో కాలుపెట్టి గదిలోకి వచ్చాడు.

పార్వతి క్షణం సేపు ఏమీ పాలుపోని దానిలా ద్వారం పట్టుకుని నిలుచుంది. పిల్లలూ, తండ్రీ బడికి వెళ్ళారు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. "కూర్చో రఘూ!" అతి కష్టంమీద కంఠం పెగుల్చుకో గలిగింది.

రఘుపతి కూర్చోలేదు. పార్వతి మొహం లోకి తదేకంగా చూస్తూనే ఉన్నాడు.

తనూ నిశ్శబ్ధంగానే గుమ్మాన్ని ఆనుకుని నిలబడింది పార్వతి.

"పారూ!"

"....................."

"మాష్టారు నీతో ఏమైనా చెప్పారా పారూ?"

"... మా నాన్నా? నా తోనా? ఏ విషయం గురించి?"

రఘు చూపుల్లో ఆందోళన తొణికిస లాడింది. "అదే, ... మా నాన్న దగ్గరికి వచ్చి ఏదో మాట్లాడారుగా' నీ కేమీ చెప్పలేదా?"

"నీకు... సంబంధం ఏదో చూస్తున్నారని చెప్పారు. అదేనా?"

పార్వతి చూపులు తప్పించుకుంటూ దోషిలా తల తిప్పుకున్నాడు రఘుపతి. "వాళ్ళ ఉద్దేశాలేమిటో అర్థంకావటం లేదు పారూ! అమ్మా నాన్నా ఇదివరకు చెప్పిన మాటలు మరిచి పోయినట్టే ఉంది!"

పార్వతి మాట్లాడలేదు.

"నాన్న మొన్న ఊరు వెళితే బంధువు లెవరో బలవంతం చేశారనీ, మాట ఇచ్చి వచ్చా ననీ అమ్మతో చెపుతున్నాడు!"

పార్వతికి చిరాకు వేసింది. "ఇంతకీ నీ ఉద్దేశ్యం ఏమిటి?" అని అడిగెయ్యాలనిపిం చింది. అంతలోనే ఇంటి విషయాలు తనతో చెబుతూన్న రఘుని చూస్తే అభిమానం పొంగి వచ్చింది. "రఘూ! అత్తయ్యా మామయ్యా ఆ నాడు వాళ్ళకై వాళ్ళే ఈ ఆశ కలిగించారు. ఈ నాడు వాళ్ళే దాన్ని చెదరగొడుతున్నారు. మా జీవితాలతో ఇలా చెలగాటాలాడతారని మేము అనుకోలేదు!"

రఘు నసుగుతూనే అన్నాడు. "మాస్టా రేదో... పొలం మాట....."

"రఘూ! నేను వద్దని చెప్పినా నాన్న వెళ్ళి అడిగాడు. మీ సిరి సంపదల ముందు ఈ దరి ద్రులు ఇవ్వబోయే కట్న కానుకలే పాటివి? నాన్న భ్రమే కానీ దానికి మామయ్య అంగీకరిస్తాడని నేను అనుకోనే లేదు."

"ఎక్కువా తక్కువా — అని కాదు పారూ! అదో ఆచారం! కట్నం తీసుకున్నారంటే పెద్ద వాళ్ళకో తృప్తి!"

విస్మయంగా చూసింది పార్వతి. రఘు యేనా మాట్లాడుతున్నది?

"నాన్న ఒప్పుకుంటాడనుకుంటాను, పారూ!"

"ఎలా? పొలం అమ్మి డబ్బు ఇస్తేనా? ఇంత తక్కువ డబ్బుకేనా? నా దారి నేను చూసు కుంటే... అసలే తల్లి లేని వాళ్ళు... పసి వాళ్ళు... ఏమవుతారు?"

"వాళ్ళు మనకి పరాయి వాళ్ళా పారూ? ఎలాగైనా ఈ పెళ్ళి జరిగిపోతే..."

హేళనగా నవ్వింది పార్వతి — "ఎలా జరుగుతుంది? జరగాలనే కోరిక ఉండవలసిన వాళ్ళకే లేనప్పుడు ఇంకెలా జరుగుతుంది?"

"పెద్ద వాళ్ళ వ్యవహారంలో ఎలా జోక్యం జేసుకోవటమో అర్థం కావడంలేదు. నాన్న బొత్తి గా పట్టూ విడుపూ లేని మనిషి. అమ్మ అయినా నా మాట వింటుందని నమ్మకం లేదు. నేను వాళ్ళని ధిక్కరిస్తే ఏమైనా బాగుంటుందా?"

"ఏమీ బాగుండ దన్నమాట! నిజమే, బాగుండదు! నువ్వు మాత్రం ఏం చెయ్యగలవు? నీ చేతిలో ఏమీ లేదు! నీ వివాహం, నీ జీవితం నువ్వు నిర్ణయించుకోలేవు! అవును. నువ్వు నీ

పెళ్ళి వ్యవహారంలో కలగజేసుకోకూడదులే రఘూ!''

''నీకు కోపం వచ్చిందా పారూ?''

''కోపం నాకా? ఎవరి మీద? దేవుడి మీదా? తాహతుకు తగని కోరికలు కోరుకుని అవి తీర్చలేదని భగవంతుడి మీదా కోపం?''

''నువ్విలా మాట్లాడితే నేనేమీ చెప్పలేను. ఆ పొలం అమ్మి... కొంత అప్పుచేసైనా ఈ పెళ్ళి జరిగేలా చూడు. పారూ! తర్వాత అవసరాలన్నీ మనం చూసుకుందాం. నువ్వెంత నిష్టూరంగా మాట్లాడినా ఇప్పుడు నా చేతుల్లో ఏముంది?''

పార్వతి శరీరం అపాద మస్తకం భగ్గుమంది. ఆవేశం కట్టలు తెంచుకుంది. ''వీల్లేదు రఘూ! వీల్లేదు! ఈ పెళ్ళి జరగదు. నేను గర్భ దరిద్రురాల్ని. నీ సాహచర్యానికి తగను!''

''పార్వతీ!''

దుఖం పెల్లుబికి వచ్చింది పార్వతికి. ''అందని పళ్ళకి అర్రులు చాచటం అవివేకమని ఇప్పటికి పూర్తిగా అర్థమైంది!''

''క్షమించు పారూ! నన్ను పూర్తిగా అపార్థం చేసుకుంటున్నావు!''

''నేనే నీ క్షమాభిక్ష అర్థిస్తున్నాను. మీ ఇంటి కోడలిగా, మీ భోగ భాగ్యాలకు వారసురాలిగా, ఓ దౌర్భాగ్యురాలు తగదు రఘూ! అన్ని విధాలా నీకు తగిన పిల్లని నిర్ణయించుకో!''

''పారూ! ఆవేశపడుతున్నావు. నాకు తగిన పిల్ల మరెవరో అయితే ఈ అరాటం నాకు లేకనే పోయేది! నన్ను నమ్ము! మీ నాన్న ఉద్దేశ్యానికి అడ్డు చెప్పకు. ఈ పెళ్ళి ఎలాగో జరిగిపోనీ!''

''రఘూ! ఒక్క రూపాయి కట్నం తీసుకుని నువ్వు ఔదార్యం చూపిస్తానంటే అది కూడా ఇవ్వ నివ్వను! తోడ పుట్టిన వాళ్ళకు నేను అన్యాయం చెయ్యను! వాళ్ళకు లేని ఏ భోగ భాగ్యాలూ నాకు అవసరం లేదు. ఇతరుల దయా ధర్మాల మీద ఆధారపడి ఉండే ఖర్మ వాళ్ళకు రానివ్వను. రఘూ! ఇక నువ్వు వెళ్ళిపో!''

రఘు పార్వతికి దగ్గిరగా వచ్చి నిలబడి మొహంలోకి చూశాడు —''వెళ్ళిపొమ్మని ఎంత తేలికగా చెప్పగలిగావుపారూ! ఈ మాట మన స్ఫూర్తిగానే అన్నావా? నా స్థితి అర్థం చేసుకో గలిగితే ఇంత నిర్దయగా మాట్లాడతావా? నాన్న గొప్ప నాన్నకి కావాలి. అమ్మ వేడుక అమ్మకి జరగాలి. నా మీద ఆ ఇద్దరికీ సర్వాధికారాలూ ఉన్నాయి. నే నేమీ చెయ్యలేకపోతున్నాను. మాస్టారు మరొక్క సారి అమ్మనయినా అడిగితే ఏమైనా ప్రయోజనం ఉంటుంది.''

''రఘూ! నీకు కోటి నమస్కారాలు! ఈ దౌర్భాగ్యురాలిపై ఇంతమాత్రమైనా జాలిపడు తున్నావు! చాలు! ఇక మన పెళ్ళి ప్రసక్తి తేకు! అది జరగని పని! నీకు పార్వతే కావలసి వస్తే, నీ తల్లిదండ్రులతో చెప్పలేవూ? 'పార్వతిని తప్ప ఎవ్వర్నీ చేసుకోను, నాకు పెళ్ళి సంబంధాలు చూడకండి' అనలేవూ? తల్లిదండ్రుల మాటకి జవదాటవా? సరే, నీ ఇష్టం! ఇక వెళ్ళు!''

నిర్జీవంగా నించుండి పోయాడు రఘుపతి ఎంతో సేపు! నెమ్మదిగా కదిలి వెళ్ళిపోయాడు.

★ ★ ★

కను చీకటిపడుతూంటే రెండు మూడు సార్లు రోడ్డు మీదకి వెళ్ళి, తనలో తనే ఏదో మాట్లాడుకుంటూ మళ్ళీ ఇంట్లోకి వచ్చారు మాస్టారు. ఆయన భుజం మీద తువ్వాలు వేసు కోకుండానే తిరగటంలో రోడ్డు మీదకే తప్ప ఎవరింటికీ వెళ్ళే ప్రయత్నం లేదని ఊరుకుంది పార్వతి.

అన్నం తిని లేస్తూనే మళ్ళీ వీధిలోకి తొంగి చూశారు మాస్టారు. ''మామయ్య ఇంకా వచ్చి నట్టు లేదమ్మా, షెడ్డులో కారు లేదు.''

పార్వతి అనుమానం నిజమే అయింది. కిందటి రాత్రి వాళ్ళిద్దరూ ఏం మాట్లాడుకున్నారో, చలపతిరావు ఏమన్నాడో, ఆ కబుర్లేం తండ్రి చెప్ప లేదు. తండ్రి మళ్ళీ ఎందుకు ఎదురు చూస్తు న్నాడో అర్థం కాలేదు. కాస్సేపు ఊరుకుని తండ్రే అన్నాడు ''మామయ్య ఒప్పుకుంటాడనే అను కుంటున్నానమ్మా! నిన్న చెప్పిందంతా వింటూ ఊరుకున్నాడు. మళ్ళీ ఒక సారి అడిగివస్తాను.

రేపు ఆ పొలానికి బేరం పెట్టెయ్యమని రైతుకి వ్రాస్తాను. అమ్మకపోతే ఎలా అవుతుంది?"

కంగారుగా మాట్లాడుతోన్న తండ్రిని చూస్తూంటే పార్వతి హృదయం ద్రవించినట్టయి పోయింది. నెమ్మదిగా అంది. "ఇక ఈ ప్రసక్తి వద్దు నాన్నా! మామయ్య ఎలాగూ ఒప్పుకోడు. వాళ్ళు ముష్టి వేసినంత లేని ఈ కట్నం పుచ్చుకో టానికి చిన్న బుచ్చుకుంటారు కూడా. వాళ్ళ అంతస్తూ, వాళ్ళ మర్యాదలూ వాళ్ళకి ఉంటాయి కదా నాన్నా?. ఆ మాటే రఘుతో కూడా చెప్పేశాను!"

"రఘుతోనా? ఎప్పుడొచ్చాడు? పెళ్ళి మాటే మైనా ఎత్తాడా? ఏం మాట్లాడాడు?" ఆత్రుతగా మాట మీద మాట అడుగుతూంటే పార్వతి నిదానంగానే చెప్పింది. "మొదటి నుంచీ రఘు తత్వం మనకు తెలుసుగా నాన్నా? ఇవ్వాళేం కొత్త కాదు. తన ఇష్టా ఇష్టాల ప్రకారం నడిచే సమర్థత లేదు. అతని ఉద్దేశ్యం తెలుసుకున్నాక నా భ్రమ పూర్తిగా పోయింది. ఇక అనవసరంగా నువ్వు ప్రయాసపడకు నాన్నా!"

"రఘుపతేమన్నా డసలు? అతనికి ... నువ్వంటే ... ఇష్టమేననుకుంటాను."

"ఇష్టం లేకపోలేదు. అంత మాత్రాన అతనేం చెయ్యలేడు. వాళ్ళని ఇబ్బంది పెట్టనూ వద్దు, మనం అవమానాలు పడనూ వద్దు! ఇక ఈ మాటే మరచి పోదాం నాన్నా! నే నేదైనా ఉద్యోగం చేద్దామను కుంటున్నాను."

అర్థం కానట్టు చూశారు మాష్టారు.

"నాన్నా! నేను ఏదన్నా పని చూసుకుని నీకు సాయంగా ఉంటాను. ఇవ్వాళంతా అదే ఆలో చించాను నాన్నా!"

"పార్వతీ! నీకేం పిచ్చిగాని పట్టిందా?"

"ఏం నాన్నా, నేనేం తప్పుగా అన్నానా? ఈ రోజుల్లో ఎంతో మంది ఆడ పిల్లలు ఉద్యోగాలు చెయ్యటం లేదూ?"

"వద్దమ్మా, వద్దు! నీకా ఖర్మే వద్దు! మామయ్య కాళ్ళా వేళ్ళాపడి మళ్ళీ అడుగు తాను."

"ఛీ, ఛీ!" పార్వతి మొహం కోపంతో ఎర్ర బడింది. "నాన్నా! నేను కావాలని పట్టుదలే లేని మనిషితో పెళ్ళేవిటి? ఎవరి దయా దాక్షిణ్యాలూ మనకి అక్కర్లేదు."

"మరి... నీ పెళ్ళి ఎలాగమ్మా?"

"ఆ రోజు వస్తే జరుగుతుంది, లేకపోతే లేదు. అర్థం లేని ఆశలు పెట్టుకుని ఇప్పటికే కాలయాపన చేశాం. ఇంకో రెండేళ్ళుపోతే నువ్వు రిటైరైపోతావు. ఆ వచ్చే పెన్షన్‌తో ఇల్లూ... పిల్లలూ ... ఎలాగడుస్తుంది? అందుకే నేనూ ఏదన్నా చెయ్యాలి."

"అమ్మా! అంతా అయోమయంగా ఉంది నాకు"

"అంత దిగులు పడాల్సిందేమీ లేదు నాన్నా! వాళ్ళ మాటలు నమ్మి అలా ఆశ పడ్డాం. ఇప్పుడు నిజం తెలిసింది కదా?"

తండ్రి మాట్లాడలేదు.

★ ★ ★

ఎదర మేడలో పెళ్ళి సందడితో, హడా విడిగా ఉంది! వచ్చే పోయే కార్లతో రోడ్డు మూసుకు పోయింది. మేడ ముందు కాంపౌండు లోనే కాక రోడ్డు వెడల్పునా వేసిన పెళ్ళి పందిరి ఎదురింటి చూరుకు తగిలి వెలుగు పడకుండా చీకటి చేసింది. బాండు వాళ్ళు వాయిస్తున్న సినిమా పాటలు గందరగోళంలా వినిపిస్తు న్నాయి. స్పీకర్ దగ్గర చేరిన పిల్లల అల్లరి వీధి నంతా ఆక్రమించు కొంటోంది.

కత్తి పీట వాల్చుకుని కూర తరుక్కుంటూన్న పార్వతికి కళ్ళ నిండా నీళ్ళు తిరిగాయి.

"పార్వతీ!"

ఉలిక్కిపడింది పార్వతి. చటుక్కున కళ్ళు తుడుచుకుని లేచింది.

అపర లక్ష్మీదేవిలా అన్నపూర్ణమ్మ నలుగు రైదుగురు పేరంటాళ్ళతో వచ్చింది. కంగారుగా లేచింది పార్వతి.

ఆవిడ ఏదో చెప్పింది. పార్వతికి ఒక్కమాట కూడా అర్థంకాలేదు.

ఆవిడ గబగబా పార్వతి నుదుటి మీద కుంకుం అంటించి వెనక్కు తిరిగింది. అంతా ఒక్క క్షణంలో జరిగింది. పెళ్ళికి రమ్మని పిలుపు కాబోలు అది!

స్థాణువులా నిలబడిపోయింది పార్వతి. ఆ రోజంతా ఎంత కాదనుకున్నా ఏమిటో వెర్రిగా అయింది మనస్సు. ఏ పనీ చెయ్య బుద్ధి కాలేదు. స్థిరంగా కూర్చోబుద్ధి కాలేదు. ఎవరితోనూ మాట్లాడబుద్ధి కాలేదు. తన మీద తనకే జాలివేసి పుట్టెడు దుఖం ముంచుకు వచ్చింది.

సాయంత్రం దీపాలు పెట్టే వేళకు ఎదర మేడ దాదాపు నిర్మానుష్యమైపోయింది. వీధిలో సందడంతా తగ్గిపోయింది. రోడ్డునిండా నిలబడ్డ కార్లన్నీ గాజు పూసల్లా దొర్లుకుపోయాయి. మగ పెళ్ళివారు లగ్నానికి తరలి వెళ్ళిపోయారు.

వెనక వాకిట్లో గడప దగ్గిర ఒక్కతీ కూర్చుని ఉంది పార్వతి. ఇల్లంతా చీకటిగా ఉంది. దీపం వెలిగించలేదు. పిల్లలు ఖాళీ పెళ్ళిపందిట్లో ఆడుకుంటున్నారు. తండ్రి స్కూలు నించి ఇంటికే రాలేదు. దిగులు దిగులుగా కూర్చుంది పార్వతి, ఎండిపోతున్న సన్నజాజి మొక్కకేసి చూస్తూ. ఎన్ని నీళ్ళుపోసినా, ఎంత ఆకు దూసినా, ఎండి చచ్చిపోతోంది సన్నజాజి.

"పారూ!"

ఆ పిలుపే వినిపించలేదు పార్వతికి మొదట.

"పారూ! అసలు ఉన్నావా ఇంట్లో?"

"ఎవరూ? పద్మజా!" అంత పరధ్యానంలోనూ స్నేహితురాలి కంఠాన్ని పోల్చగలిగింది పార్వతి. "పద్మా!" అంది మళ్ళీ.

"ఎక్కడున్నావ్ పారూ? అబ్బా! ఏమిటిలా ఇల్లంతా ఇంత చీకటిగా ఉంది!"

సంతోషంతో చటుక్కున లేచి రాబోతూ గడపని తన్నుకుని తూలింది పార్వతి. "పద్మా! ఉండు! దీపం వెలిగిస్తున్నాను." గూట్లోంచి అగ్గిపెట్టె తీసి, కిటికీ కింద ఉన్న దీపాన్ని అందుకుని వెలిగించి లేచింది పార్వతి.

"ఏమిటి సారూ! నువ్వొక్క దానివే ఉన్నావా?"

"నువ్వెప్పుడొచ్చావ్ పద్మా? ఉత్తరమైనా రాయలేదేం?" — పద్మ చేయిపట్టుకుని, బల్ల మీద కూర్చోబెట్టి తనూ దగ్గిరగా కూర్చుంది పార్వతి. ఒకర్ని చూస్తుంటే ఒకరికి ఆనందంగా ఉంది.

పద్మజ మరీ అందంగా ఉన్నట్టు కన్పించింది పార్వతికి. మెడ మీదకు జారుగా ముడీ, చేతికి తళుకులీనే రిస్టువాచీ, పల్చటి తెల్లటి వాయిల్ చీరా, గులాబీ రేకులా సున్నితంగా వుంది పద్మజ. పార్వతి చీటీ పరికిణీ, కిందటి రోజు దువ్విఅల్లుకున్న జడా, చేతుల నిండా నల్లటి మట్టి గాజులూ, తన రూపాన్ని పద్మజ పట్టించుకోదని తెలిసినా ఎందుకో సిగ్గువేసింది పార్వతికి.

"చాలా చిక్కిపోయావు. పారూ! ఒంట్లో బావుండటం లేదా?" అప్యాయంగా చేయి నిమురుతూ అడిగింది పద్మజ.

పార్వతి నిస్పృహగా నవ్వింది. "బాగుండకేం? నిక్షేపంలా ఉన్నాను. నీ చదువూ అదీ బాగా సాగుతోంది కదా? నువ్వు వస్తున్నట్టు ఇంటికి కూడా రాయలేదా?"

"లేదు పారూ! సుజా రాసిన విషయం నేనసలు నమ్మలేకపోయాను. అమ్మావాళ్ళు కూడా చెపితే నమ్మక తప్పలేదు. నిజంగా నా కెంత కోపం వచ్చిందనుకున్నావ్, పారూ! ఈ ఇంటికి తగిలేలా పెళ్ళిపందిరి కూడా వేశారు చూడు!"

"రఘు సంగతా నువ్వు మాట్లాడుతున్నది? మీ ఇంట్లో ఏమైనా జరిగిందేమో అనుకుంటున్నాను..."

"ఇది మరీ బాగుంది! నీ కసలు కోపం వచ్చినట్టు లేదే అతని మీద!"

"ఏం చెయ్యాలంటావు కోపం వచ్చి?"

"కోపం వచ్చిందా అసలు?"

"... ఏం చేస్తాం పద్మా కోపం వచ్చి?"

"చాల్లే, నీ గొప్పతనం నువ్వూనూ! పెళ్ళి మాటల సమయంలో నాకు రాయక పోయావా? రఘుకి బాగా గడ్డి పెట్టేదాన్ని!"

"ఎందుకూ, అతనికి తెలియాలి గానీ..."

"తెలియకపోతేనే గడ్డిపెట్టడం! కొన్ని మాటలు అడుగుతామనుకో, ఎలా ప్రవర్తిం చాలో తెలిసి తల్లిదండ్రుల దగ్గిర గట్టిగా నిల బడేవాడేమో!"

"నా మీద ఇష్టం వుంటే ఆ పని అతనే చేసే వాడు. ఒకరు చెప్పాలా? నువ్విలా మాట్లాడ్డం ఆశ్చర్యంగా ఉంది!"

"మీ పెళ్ళి మాట అతనెప్పుడూ నీతో అన లేదా?"

"అంత స్పష్టంగా ఎప్పుడూ మాట్లాడలేదు గానీ, అతనికి ఆ ఉద్దేశ్యం ఉన్నట్టే అనిపించేది. తల్లిదండ్రులే ఇష్టపడి చేస్తారని అనుకున్నట్టు న్నాడు. తీరా వాళ్ళ కబుర్లన్నీ, అబద్ధాలు కావ డంతో వాళ్ళని ఎదిరించడం అతనికి చేత కాలే దేమో! అతని తత్వం మనకి కొత్త కాదు కదా?"

"రఘు పిరికివాడని నే నెప్పుడో చెప్పాను!"

"పోనీలే పద్మా! అదంతా మరిచిపోదాం. జరిగిపోయిన సంగతులు తల్చుకుని ఇప్పుడేం ప్రయోజనం?... నువ్వు నాకో సాయం చెయ్యాలి పద్మా! ఏదన్నా ఉద్యోగం చేస్తే బాగుంటుం దనుకుంటున్నాను. నా చదువుకి ఏది వస్తుందో అది. మీ ఇంటికి వెళ్ళి మీ నాన్నగార్ని అడగా లనుకున్నాను గానీ వెళ్ళనే లేదు. నువ్వెలాగూ వచ్చావుగా? నాన్నగారికి చెప్పు! నా కేదన్న చిన్న పని దొరికే లాగ చూడు పద్మా!"

"నాన్నకి చెప్తే ఈ పాటికే ఏదన్నా చూసే వాడు కదా? నువ్వడిగావని చెప్తే నాన్న తప్ప కుండా ప్రయత్నిస్తాడు. ఏ ఆఫీసులోనయినా గుమాస్తాగా చేరవచ్చు."

"అదే! అదే నే ననుకుంటున్నాను పద్మా!" మా నాన్న ఆరోగ్యం బాగుండడం లేదు. ఈ గొడవతో బెంగ పెట్టుకున్నాడు."

చాలాసేపు మాట్లాడుకుంటూ కూర్చున్నారు స్నేహితురాళ్ళిద్దరూ. "నిన్ను చూస్తూనే నా మనసు తేలికయి నట్టుంది పద్మా! అంది కొంచెం నవ్వుతూ పార్వతి.

★ ★ ★

**పద్మజ** తల్లిదండ్రులిద్దరూ పార్వతి గురించి చాలా బాధపడ్డారు. చిన్నతనంలోనే తల్లిపోయింది. అనుకున్న పెళ్ళి జరగలేదు. మళ్ళీ మళ్ళీ సంబంధాలు చూసే తాహతూ లేదు. తండ్రి దిగుళ్ళతో కృశిస్తూ తిరుగు తున్నాడు. వెనక ఇంకా ఇద్దరు పిల్లలున్నారు. పార్వతి ఉద్యోగం చెయ్యాలంటే తప్పు లేదని పించింది కామేశ్వరమ్మకు కూడా. ఈశ్వర సోమయాజి పార్వతి విషయంలో శ్రద్ధ పట్టి స్వయంగా ఇద్దరు ముగ్గురు ఆఫీసర్లతో మాట్లా డాడు. మూడో నాటికల్లా పార్వతి గుమాస్తాగా చేరింది ఒక ఆఫీసులో!

★ ★ ★

రోజూ ఆఫీసుకు వెళ్ళివస్తోంది పార్వతి. ఉద్యోగం చెయ్యడం ఎంతో ధైర్యాన్నిస్తోంది పార్వతికి. పెళ్ళి చేసుకుని తండ్రినీ, పిల్లల్నీ వదిలిపోవాలని సిద్ధంగా కూర్చున్న అమ్మాయి, భుజాల మీద పెద్ద బాధ్యతే మోపుకుంది. తన దారి తను చూసుకోకుండా 'మీ కందరికీ నే నున్నా' నంటూ నిలబడింది. ఇంతకన్నా ఏం కావాలి? — అనుకుంది పార్వతి.

ఇంటికివచ్చి కుంపటి అంటించుకుం టూంటే, సరిగ్గా వారం రోజుల కిందటిలాగే పట్టు చీర కుచ్చెళ్ళు రెప రెప లాడించుకుంటూ, నలు గురు పేరంటాళ్ళతో బొట్టు పెట్టటానికి వచ్చింది అన్నపూర్ణమ్మ. "కోడల్ని తీసుకువచ్చా పార్వతీ? చూసి తాంబూలం తీసుకుని వెళ్దువుగాని, ఒక్క సారి రా అమ్మా!" అంది బొట్టుపెడుతూ. "వెళ్తానూ!" అని వెళ్ళిపోయింది.

విస్మయంగా చూస్తూ నించుంది పార్వతి.

తండ్రి వచ్చాక, "చూశావా నాన్నా! అన్న పూర్ణత్తయ్య వచ్చి బొట్టు పెట్టి పిల్చింది రమ్మని!" అంది.

తండ్రి విస్తుపోలేదు — "వియ్యానికి పనికి రానివాళ్ళం కయ్యానికి కూడా పనికి రావమ్మా! వాళ్ళకసలేమీ జరిగినట్టే లేదన్నమాట! మన గురించి ఆలోచించే తీరిక కూడా వాళ్ళకుండదు.

ఇప్పుడు మనం వాళ్ళకి ఇరుగు పొరుగులం, అంతే! ఇరుగుపొరుగుల్ని పేరంటానికి పిల్చి నట్టు పిల్చారు... సరే పోనియ్యి! మనకు మాత్రం ఆ పట్టింపులెందుకు? ఒక సారి వెళ్ళి పెళ్ళి కూతుర్ని చూసి వచ్చెయ్యి!''

''వెళ్ళనా!'' అని ఆశ్చర్యపోయింది పార్వతి.

''వాళ్ళతో మనకు పంతాలెందుకమ్మా?''

''పంతం అని కాదు నాన్నా! ఎందుకూ వెళ్ళడం?''

''ఏదో పిలిచారు కదా? ఆలోచించి నీ కిష్టమై నట్టు చెయ్యి!'' విరక్తిగా అనేసి ఊరు కున్నాడు తండ్రి.

పార్వతి ఆలోచించింది తనకి తోచినట్టు. వాళ్ళు హాస్యానికి అన్నారే గానీ ''మీ పిల్లని చేసు కుంటాం'' అని ఏ నాడన్నా గట్టిగా అన్నారా? వాళ్ళ మాటలు తన తల్లి నమ్మేది కాదు. మరి తనెం దుకు అలాంటి ఆశలు పెట్టుకోవాలి?... కానీ రఘు... అలాంటి అభిప్రాయంతోనే కనపడే వాడే!... అయితే ఏం? ఇప్పుడు తెలిసిందిగా అతనికి నిజంగా ఉన్న అభిప్రాయం!... అతను ఎలా ప్రవర్తించినా తనకు లక్ష్యంలేనట్టుగా ఉండాలి! వాళ్ళు ఇరుగు పొరుగులు, అంతే! పేరంటానికి పిల్చారు, అంతే! తను కూడా అలాగే ప్రవర్తిస్తే?... కానీ, రఘు అంత పట్టి నట్టుగా ప్రవర్తించాడే! ఇంక వాళ్ళింటికి వెళ్ళడమా!... ఏమో! — ఏం చెయ్యాలో తోచ నట్టయి పోయింది.

నాలుగైదు రోజులు గడిచాయి. పెళ్ళి వారింట్లో సందడి తగ్గిపోయింది. ఎక్కడి చుట్టా లక్కడ సర్దుకున్నారు. పెళ్ళికూతుర్ని తీసుకు వెళ్ళలేదన్న సంగతి రూఢిగా తెలుసుకుంటూనే ఉంది పార్వతి.

రుక్కుని వెంటబెట్టుకుని ఒక సాయంత్రం పూట ఎదర గేట్లో అడుగు పెట్టింది. గుండె లెందుకో కంగారుగా కొట్టుకుంటూంటే పైట కొంగు తీసి భుజంనిండా కప్పుకుంది.

నెమ్మదిగా చీడీ లెక్కుతూంటే హాల్లోనే కనిపించింది అన్నపూర్ణమ్మ. ''రా అమ్మాయ్, రా! సుశీల మేడ మీదుంది. ఫర్వాలేదులే వెళ్ళు. ఎవరూ లేరులే. తీసికెళ్ళవే రుక్మిణీ! నాకు కొంచెం పనుంది. తర్వాత వస్తాను. కాస్సేపు కూర్చుని మరీ వెళ్ళు!'' అంటూ, కంగారుగా మాట్లాడి, లోపలికి వెళ్ళిపోయింది. ''మొన్న పిలిస్తే రానే వచ్చావు కాదేం?'' అని అడుగుతుందేమో అను కుంది పార్వతి. పిలవటం పిలిచిందిగానీ తన కోసం ఎదురు చూసినట్టు కనిపించలేదు. ''ఫర్వా లేదులే, వెళ్ళు. ఎవరూ లేరులే'' అంటుం దేమిటి? ఎవరుంటే మాత్రం తనకీ ఇంట్లో కొత్తా? ఒకవేళ రఘు ఉంటే తను వెళ్ళకూడదని ఆవిడ ఉద్దేశ్యమా? — గిర్రున వెనక్కి తిరిగి వెళ్ళి పోవా లనిపించింది పార్వతికి. చెయ్యి పట్టుకుని రుక్మిణి లాగుతూంటే ముందుకు నడిచింది.

సుశీల చటుక్కున లేచి నిలుచుంది. ఒక్క సారి పార్వతిని చూసి తల దించుకుంది.

''మా అక్కయ్యేనండీ!'' అంది రుక్మిణి, ఇద్ద రికీ పరిచయం చేస్తూ.

''కూర్చోండి'' నెమ్మదిగా అంది సుశీల తివాచీ చూపిస్తూ. రుక్కుకు సుశీల దగ్గిర చాలా స్నేహం ఉన్నట్టుంది. కొత్తేమీ లేకుండా మాట్లాడే స్తూంది.

పార్వతి మాట్లాడకుండా తివాచీ మీద కూర్చుని సుశీలను పరకాయింపుగా చూసింది. పచ్చగా సన్నగా పొడుగ్గా నాజూగ్గా తమలపాకు ఈనె లాగ ఉంది సుశీల. భోగ భాగ్యాలతో పెరి గిన సున్నితత్వం ఆమె శరీర సోయగంలో లీనమై కనిపిస్తూంది. జరీ అంచున్న లేత గులాబీ రంగు చీర కట్టుకుంది. బొమ్మకు అద్దినట్టుగా చిన్నచిన్న పువ్వులున్న సిల్కుచోళీ వేసుకుంది. ఉంగరాల నుంచి ముత్యాల వడ్డాణం వరకూ అన్ని నగలూ ఆలంకరించుకుని ఉంది.

సుశీల సిగ్గుగా తల దించుకుని పార్వతి దగ్గిరే కూర్చుంది. ఎన్నో అడగాలనిపించింది. ఎంతో మాట్లాడాలనిపించింది. రఘు అదృష్ట వంతుడు!

''మీరే కదా, మా వారితో కలిసి చదువు కున్నారట?'' అని మృదువుగా మాట్లాడింది సుశీల.

కొంచెం కంగారు పడింది పార్వతి. ఎలా మాటాలు కలపాలో తెలీనిస్థితిలో సుశీల అలా అడగటంతో, "నేను...ఒక్కదాన్నే కాదుగా? ఈ వీధిలో చాలా మంది పిల్లలం కలిసి చదువుకున్నాం. పద్మజ అని మాతో చదువుకున్న స్నేహితురాలు ఇంకో అమ్మాయి కూడా ఉంది. ఇప్పుడు మద్రాసులో డాక్టర్ చదువు చదువుతోంది" అని అవసరమో కాదో ఆలోచించకుండానే అదంతా చెప్పింది.

"అవును, మా వారు చెప్పారు. మొన్న రుక్మిణి వస్తే కాబోలు మీ గురించి చెప్పారు" అంది నవ్వి సుశీల.

రఘు తనని గురించి ఏం చెప్పాడు? ఖరీదు చెల్లించి తనని కొనుక్కోలేక పోయిందని చెప్పాడా?

ఎంత సేపు కూర్చున్నా మాటలేమీ పెరగలేదు. సుశీల ముఖ కవళికలు పార్వతి అనుకున్నట్టుగా లేవు. భార్యాభర్తల కిద్దరికీ సరిపడక, సుశీల కన్నుల్లో నిరాశా నిస్పృహలు తొంగి చూస్తాయనీ... ఏవేవో అనుమానాలతోనే వచ్చింది పార్వతి. సుశీల బాధపడాలని పార్వతి కోరిక కాదు. అయినా ఆ బాధ తప్పదనుకుంది.

సుశీలను చూశాక పార్వతి హృదయం ఆర్ద్రతతో నిండిపోయింది ఎప్పుడూ సుశీల అటువంటి అశాంతికి గురి కాకూడ దనిపించింది.

అంత వరకూ చేతి రుమాలులో జాగ్రత్తగా చుట్టి పట్టుకున్న వెండి కుంకుమ బరిణె కొంచెం సంకోచంగానే సుశీలకు అందిస్తూ, "నా బహుమతిగా తీసుకుంటారా? ఇలాంటివి మీకు ఎన్నయినా ఉంటాయి. కాని, నేను ఇచ్చానన్న గుర్తుతో దీన్ని మీరు వాడుకుంటానంటే నాకు చాలా సంతోషంగా ఉంటుంది" అంది.

సుశీల వెంటనే దాన్ని అందుకుంది. ఒక్క క్షణం దీక్షగా చూసింది. "తప్పకుండా వాడుకుంటాను. నాకు చాలా నచ్చింది కూడాను" అంది నవ్వుతూ. పార్వతి "నే నిక వెళతాను" అని లేచి నిలబడుతూంటే,

"అప్పుడప్పుడూ వస్తూ ఉండండి అక్కయ్యగారూ!" అంది సుశీల.

సుశీల మొహంలో హేళన లేదు. ఆ అమాయకపు కన్నుల్లో కల్మషం లేదు. మనస్ఫూర్తిగానే అలా పిలిచినట్టు కనిపించింది.

"అలాగే, సుశీలా!" అనేసి గది బయటికి రాబోయింది. మెట్ల దగ్గర రఘు కంఠస్వరం వినిపించటంతో తిరిగి గదిలోకే అడుగు పెట్టింది.

"ఇప్పుడు రఘుబాబు పైకి వస్తారా?"

"రారనుకుంటాను. స్నానానికి వెళ్తారు?"

సుశీల చెప్పినట్టే రఘు బాత్ రూమ్‌లోకి వెళ్ళాడు. అన్నపూర్ణమ్మ నాలుగైదు ప్లేట్లతో ఏవేవో ఫలహారాలూ, పళ్ళూ పట్టించుకుని వచ్చింది. "అదేమిటి? అప్పుడే వెళ్ళిపోతున్నావు?" అంది.

"వెళ్ళాలత్తయ్యా! నాన్న కింకా భోజనం పెట్టలేదు."

"వెళ్దువులే. కొంచెం ఫలహారం తీసుకో."

"అబ్బే! ఇప్పుడేం వద్దు."

అన్నపూర్ణమ్మ రుక్మిణి చేతిలో నాలుగయిదు అరటి పళ్ళు పెట్టింది. పార్వతికి బొట్టు పెట్టి తాంబూలం అందించింది.

గబ గబా మెట్లు దిగి వేగంగా నడుస్తూ, గేటు దాటింది పార్వతి.

రామనాథం మాస్టారు కొన్ని నెలల కిందటే రిటైరై ఇంటి దగ్గిరే నాలుగయిదు ప్రైవేట్లు కుదుర్చుకున్నారు. "ఇంకా ఎందుకు నాన్నా ఈ తాపత్రయం? నీ ఆరోగ్యం బొత్తిగా బాగుండటం లేదు. కొన్నాళ్ళపాటు విశ్రాంతి తీసుకోకూడదూ?" అంటూ నచ్చచెప్పబోయింది పార్వతి.

అన్నిటికీ ఆయనో అర్థం గాని నవ్వు నవ్వటం నేర్చుకున్నాడు. "నా కింకా తాపత్రయం ఎందుకంటున్నావా? నా బరువు పూర్తిగా వదిలించుకుని నీ మీదే పడెయ్యమంటావా?" అంటారు.

తండ్రికి, తన దిగులే అధికంగా తినేస్తూందని తెలుసు. తను సంతోషంగానే ఉన్నానని చెప్పినా నమ్మడు.

నిజానికి పార్వతి కేమంత దిగులు లేదు. గతాన్ని గతంలోనే విస్మరించింది కొంత వరకూ. మిగిలిందేమైనా ఉంటే అది అలా జీవితాంతం ఉండవలసిందే! ప్రస్తుత పరిస్థితుల్ని చక్కదిద్దు కోవాలనే కోరిక తప్ప మరేమీ లేదు.

సూర్యం అల్లరి చిల్లరి పోకిళ్ళు పోకుండా శ్రద్ధగానే చదువుతున్నాడు. ఏ మాట చెప్పినా అక్ష రాలా పాటిస్తున్నాడు. ఖర్చుల విషయంలోకూడా కష్టం సుఖం ఆలోచించి మరీ ప్రవర్తిస్తున్నాడు. తమ్ముణ్ణి చూసుకుంటే చాలు కొండంత ధైర్యం వస్తూంది పార్వతికి.

రుక్మిణి కూడా పోర్తుఫారంలోకి వచ్చింది. ఇంటి దగ్గర సరదాకి చీరలు చుట్టబెట్టుకునేంత ఎదిగింది. ఎంత ఎదిగినా రుక్కుకి పసితనం పోదనిపిస్తోంది. ఎప్పుడూ కొత్త కొత్త పరికిణీలు కావాలని పేచీ పెట్టుక్కూర్చుంటుంది. రోజుకో సారి "ఇందిర కట్టుకుంది. శేషు కట్టుకుంది. ఛీ! వెధవది, నా కెప్పుడూ ఆ చుక్కల పరికిణీయే" అంటూ చంటి పిల్లలా పేచీలకు దిగుతుంది.

"మా అమ్మవి కదూ? నువ్వూ కట్టుకుం దువుగాని, పండక్కి నీకూ కుట్టిస్తాగా?" అంటూ బుజ్జగించిన కొద్దీ బిగుసుకుపోతుంది.

"అమ్మా పారూ! దాన్నలా నెత్తినెక్కించు కోకు. మాట్లాడకుండా ఊరుకో. పరికిణీ నచ్చక పోతే బడికి వెళ్ళకుండా మానేస్తుందిలే. దాన్నలా బతిమాలుతోంటే దానికి కష్టం సుఖం తెలీకుండా పోతోంది" అంటూ పెద్ద కూతుర్నే మందలిస్తారు మాష్టారు.

అక్కడితో రుక్మిణి అలక కొంత తీరు తుంది. మాట్లాడకుండా లేచి గబ గబా ఆ చుక్కల పరికిణీయే కట్టుకొని అక్కగారి కేసి ఓ సారి కోపంగా చూసి బడికి బయల్దేరుతుంది. ఎంత విసుగులో కూడా పార్వతి చెల్లెల్ని మంద లించదు. "అందరి కన్నా చిన్నది. అమ్మే ఉంటే దాన్ని ఇంకెంత ముద్దు చేసేదో!" అనుకుం టుంది.

★ ★ ★

పద్మజ నాలుగో సంవత్సరం చదువు తూంది, మద్రాసులోనే. సుజా స్కూలు ఫైనల్‌కు వచ్చింది.

విజయశాస్త్రికి పెళ్ళయి జానకి కాపరానికి వచ్చింది. కామేశ్వరమ్మకు తగని సందడి. కోడ లంటే చాలా ఇష్టం. జానకి ఆవిడికి చాలా నచ్చింది. ఆడపిల్లకు ఉండవలసిన లక్షణాలన్నీ తన కోడలికి ఉన్నాయని ఆవిడ అభిప్రాయం. అత్త గారన్నా, ఆడబిడ్డలన్నా వినయ విధేయతతో ప్రవర్తిస్తుంది జానకి. కోడలు ఎక్కువగా చదువు కోకపోవడమే అత్తగారికి బాగా నచ్చింది. తల్లి సంతృప్తిపడిన భార్య గనక జానకి అంటే శాస్త్రికి చాలా గారం.

★ ★ ★

రామనాథం మాష్టారు జ్వరపడి మంచం పట్టారు. వారం, పది రోజులకు కూడా ఆయనకు స్వస్థత చిక్కలేదు. "ఈ ఖాయిలా, అంతానికే కాదు కదా" అన్న అనుమానం ఆయన్ని పీడిం చింది. 'పిల్ల వాడింకా చదువుకుంటూనే ఉన్నాడు. చంటిది బొత్తిగా లోకజ్ఞానం తెలియ కుండా ఉంది. ఇంత భారాన్నీ పార్వతి మీద పెట్టి... అది మాత్రం జీవితంలో ఏం చూసింది? ఏం అనుభవించింది? తండ్రి కూడా లేని లోకంలో వీళ్ళెలా నెగ్గుకొస్తారు?' అన్న ఆవేదన, ఆయన్ని మరీ కుంగదీస్తోంది.

తండ్రికి బాగుండ లేదని పార్వతి ఆఫీసుకు సెలవు పెట్టింది. ఆ రోజు జావ కోసం వేపుడు నూకలు విసురుతూంటే వీధి లోంచి రెండు మూడు సార్లెవరో పిలవడం వినిపించింది — "మాష్టారూ! మాష్టారూ!" అని!

"పార్వతి" తిరగలి ఆపి లేచి వెళ్ళింది. గుమ్మం అవతల రఘు! ఒక్క క్షణం తటపటా యించి తడబడుతూ వచ్చేసింది వెనక్కి. తండ్రికి చెప్పింది. గడిచిన మూడేళ్ళలో పార్వతి రఘుపతితో మాట్లాడనూ లేదు, అంత దగ్గరగా చూడనూ లేదు.

"మాష్టారికి బాగాలేదంటే చూసివెళదా మని..." వీధి గుమ్మంలోనే నిలబడ్డాడు రఘుపతి.

"లోపలికి రండి! నాన్నగారు పిలుస్తున్నారు." ఎత్తు పీట తెచ్చి తండ్రి మంచం దగ్గరగా వేసి లోపలికి నడిచింది పార్వతి.

కూతురు చెప్పటంతో రఘుపతి రాక కోసం నీరసంగా కళ్ళు విప్పి ఎదురుచూస్తూ, చిక్కి శల్యంలా ఉన్న చేతితో పీట చూపిస్తూ సాదరంగా ఆహ్వానించారు మాస్టారు.

రఘుపతి పీట మీద కూర్చుని ఒక్క సారి గదంతా చూశాడు. " ఎన్నాళ్ళ నుంచి మాస్టారూ? మందేం తీసుకుంటున్నారు?"

"నెల్లాళ్ళ పైనే అవుతోంది నాయనా! మందు దారి మందులదే! నా దారి నాదే!..." లేచి కూర్చోవాలని ప్రయత్నిస్తూ అన్నారు మాస్టారు.

"లేవకండి మాస్టారూ! పడుకోండి. చాలా నీరసంగా ఉన్నారు. ఎలా కూర్చుంటారు?" వారించాడు రఘుపతి.

మాస్టారు తిరిగి పడుకుంటూ అన్నారు. "లేవలేను, ఇక లేచి తిరుగుతానని నమ్మకం లేదు." గుంటలు పడిన ఆయన కను కొలకుల్లో నీళ్ళు నిలిచాయి.

రఘుపతి గుండెలు బరువుగా కొట్టుకో సాగాయి. మాస్టారు ఇంత అనారోగ్యంగా ఉన్నారా? ఆయనను ఏదో విధంగా ఓదార్చితే బాగుండుననిపించింది. నిజంగా ఆయన్ని ఓదార్చగలిగే రోజు ఏమీ చెయ్యలేకపోయాడు. మాస్టారు మొహం లోకి చూడలేనట్టు కిటికీలోని మందు సీసాలకేసి చూస్తూ కూర్చున్నాడు.

వంట గదిలోంచి పార్వతి మెరుస్తూన్న ఇత్తడి గ్లాసు పట్టుకు వచ్చి బల్ల మీద పెడుతూ నెమ్మదిగా, "కొంచెం కాఫీ తీసుకోండి!" అంది.

రఘుపతి తల తిప్పి చూడలేకపోయాడు, వెంటనే చూసేసరికి పార్వతి అక్కడ లేదు.

"కాఫీ తెచ్చినట్టుంది, తీసుకో నాయనా!"

గ్లాసు అందుకున్నాడు రఘుపతి. వేళ్ళు కాలుతూన్నా చేతులు మార్చి మార్చి పట్టుకున్నాడేగానీ గ్లాసు కింద పెట్టలేదు. ఖాళీ గ్లాసు కూడా చేతుల్లోనే ఉంచుకుని కూర్చున్నాడు. మాస్టారితో ఇంకా ఏం మాట్లాడాలో తోచలేదు. చూడటానికి వచ్చాడు. రాగానే ఏదో అడిగాడు. అధైర్యపడవద్దని చెప్పాలనుకున్నాడు. చెప్పలేక పోయాడు.

"అధైర్యం గాక ఏముంది నాయనా?" అంటే?

నిశ్శబ్దంగా కూర్చున్న రఘుపతిని మాస్టారే పలకరించారు. "అమ్మా నాన్నా అంతా బాగున్నారా?"

"ఆఁ, బాగానే ఉన్నారండీ!"

"నువ్వేం చేస్తున్నావిప్పుడు?"

"అదే, ఆ వ్యాపారమే...?"

"పోనీ, నెమ్మదిగా ఏదైనా పరీక్షకి కట్టలేక పోయావా?"

"..................................."

"ఆ మధ్య కొన్నాళ్ళు ఊరిలో లేనట్టుంది నువ్వు?"

"లేనండీ! మా ఆవిడికి బాగా లేదంటేనూ అమ్మా, నేనూ ఒక నెల్లాళ్ళు అక్కడే ఉన్నాం."

"ఎవరికీ? సుశీలకా? ఏం బాగా లేదు?"

"ఏమో! నాకు సరిగ్గా తెలీదండీ! ఏమిటో జబ్బు చేసింది."

మందంగా మరో పావుగంట గడిచింది.

"వెళ్ళివస్తాను మాస్టారూ!" రఘుపతి లేచి నించున్నాడు.

"మంచిది నాయనా!" నీరసంతోనే కొంచెం గట్టిగా కేక వేశారు మాస్టారు. "అమ్మాయ్! రఘు వెళ్తున్నాడమ్మా!"

అప్రయత్నంగా వంటింటికేసి చూశాడు రఘుపతి.

"మంచిది నాన్నా!" పార్వతి బయటికి రాలేదు.

మరో క్షణం నించుని, కదిలాడు రఘుపతి. పార్వతితో రెండు మాటలు మాట్లాడాలనీ, ఏమీ బెంగపెట్టుకోవద్దని చెప్పాలనీ, అనిపించింది, పార్వతి నవ్వినా సరే! కానీ, పార్వతికి తనతో మాట్లాడడం ఇష్టమే లేదు! — నిరుత్సాహంగా వెళ్ళిపోయాడు.

పార్వతి బైటికి వచ్చి చూసే సరికి తండ్రికి

చిన్న కునుకు పట్టింది. మూడవ నాడా కునుకు ఆయనకు శాశ్వతంగా విశ్రాంతిని ప్రసాదించింది.

ఆ కష్టంలో పార్వతికి ఈశ్వర సోమయాజీ, కామేశ్వరమ్మా అండగా ఉన్నారు. మేనత్త వచ్చింది. అన్నపూర్ణమ్మా, చలపతిరావూ కూడా ఓదార్చి వెళ్ళారు. ఎందరెన్ని విధాల చెప్పినా పార్వతి హృదయం చల్లబడలేదు. కొండలా తండ్రి అండగా ఉంటే కాలం సునాయాసంగా గడిచేది. ఇక ఎదుగుతోన్న పిల్లల్ని పెట్టుకుని, ఉద్యోగం చేసుకుంటూ ఇలా ఎంత కాలం గడపాలి? ఎప్పటికీ బాధ్యతలు తీరతాయి?

"పారూ!"

తుళ్ళిపడి చూసింది పార్వతి.

తడబడ్డాడు రఘుపతి. "... మాస్టారు పోవటం..."

పార్వతికి దుఃఖం ముంచుకు రాబోయింది. బల వంతంగా ఆపుకుంది.

"ఆయన మనో వేదనతోనే పోయినట్టున్నారు పార్వతీ! నీ కెంతో కష్టం వచ్చింది. దీనికి... నేనే కారణమేమోననుకుంటున్నాను" తనను తనే నిందించుకుంటూన్నట్టు అన్నాడు.

చటుక్కున తల ఎత్తి చూసింది పార్వతి.

రఘుపతి సూటిగా చూడలేనట్టు చూపులు తిప్పుకున్నాడు. "మాస్టారు బెంగ పెట్టుకుని ఇంత తొందరగా పోయారంటే... నేనే కారణం!" మళ్ళీ అదే మాట!

పార్వతి దృఢంగానే అంది. "ఆయనకి ఆయుష్షు నిండి ఆయన పోయారు! దాని కెవరూ కారణం కాదు. నీ సంబంధం తప్పిపోయిందని మేము బెంగలుపెట్టుకోలేదు! అనవసరంగా నువ్వు బాధపడకు రఘుబాబూ!"

"కాదు పార్వతీ! నన్ను క్షమించలేవా? మా వల్లనే మీ కుటుంబం..."

"ఇంకెప్పుడూ అలా మాట్లాడకు! మా రాతలెలా ఉంటే అలా జరుగుతాయి. దానికి నువ్వు కర్తవి కాదు. లేని పోని నిందలు నీ మీద వేసే పాపం మా కక్కర్లేదు. ఇంత దయదలిచి పలకరించడానికి వచ్చావు. అదే పది వేలు!"

మరేమీ మాట్లాడలేకపోయాడు రఘుపతి. కాస్సేపు నిలబడి వెళ్ళిపోయాడు.

పార్వతి రెండు చేతులూ మొహానికి కప్పుకుని ఏడుస్తూ కూర్చుంది.

వాకిట్లో పని చూసుకుంటూన్న శాంతమ్మ లోపలికి వచ్చి పార్వతిని చూస్తూ—"అమ్మాయ్, పార్వతీ! ఎన్నాళ్ళిలా ఏడుస్తూ కూర్చుంటావు? చిన్నతనంలో తల్లి పోయినప్పుడయినా నువ్వింత బెంగపడలేదు. నువ్వే ఇలా దిగులు పడిపోతే ఇక చిన్నవాళ్ళ మాటేమిటి?" అంటూ మందలిస్తూన్న కొద్దీ పార్వతి బాధ ఎక్కువైంది. "అత్తా!" అంటూ బావురుమంది.

శాంతమ్మ పార్వతికి వరసకు మేనత్త. ఆవిడ వంటి సహృదయులు ఉండబట్టే ఇంకా బంధుత్వాలకు విలువ ఉంది. కష్టానికీ, సుఖానికీ, ఆవిడెన్నడూ తప్పుకోలేదు. పల్లెపట్టున సుఖ శాంతులతో బతుకుతూన్న ఆవిడికి, పట్నంలో అగచాట్లుపడే బీద అన్నగారి కుటుంబం మీద సానుభూతి ఎంతైనా ఉంది. ఉప్పులూ పప్పులూ మూటలు కట్టి పంపిస్తూనే ఉంటుంది.

"అత్తా, నేను నిన్నొకటి అడుగుతాను" అంది పార్వతి కన్నీళ్ళతో. "ఒక్కటి గాదు లక్ష అడుగుదువుగాని, ముందు లేచి మొహం కడుక్కో! కొంచెం కాఫీ తాగు!"

"ఊహుఁ! ముందు నేను అడిగింది చెప్పు!"

శాంతమ్మ అమాయకంగా నవ్వింది. "ఏమిటే అది, పిచ్చిదానా?"

"నాన్నే నీకు చెప్పాలనుకున్నాడు, ఆఖరి చూపు కూడా అందలేదు. ఆయన మీద ఏ మాత్రం గౌరవం ఉన్నా నా మాట కాదనలేవు. అడగమంటావా?"

"నా దగ్గర నీ కింత తటపటాయింపేమిటి?"

"రుక్కుని మీ రామానికి చేసుకుంటావా?" మాట అనేసి ఆత్రుతగా చూసింది పార్వతి.

శాంతమ్మ నోటి నిండా నవ్వుతూ, "ఓసి, నీ సందేహం కూలా! ఆఖరికి ఇదేనా? ఏమిటో

అనుకున్నాను. ఈ ముక్క నువ్వు అడగాలిటే? నా కామాత్రం ఇంగితం లేదూ? మీ అమ్మా నేనూ ఎన్నెన్ని హాస్యాలాడుకునే వాళ్ళం! ఎన్నెన్ని కబుర్లు చెప్పుకునే వాళ్ళం! మీ నాన్న మాత్రం నన్నెంత గారంగా చూసేవాడు! స్వంత చెల్లెలి కన్నా ఎక్కు వగా సారెలూ, చీరెలూ ఇచ్చి పంపి స్తూండే వాడు, అదంతా మరచి పోతానటే? ఒక్క రెండేళ్ళు చిన్న దానివైతే నువ్వే నా కోడలి వయ్యే దానివి. పోనీలే! రుక్మిణి మాత్రం పరాయిదా? నీ చెల్లెలే కదూ? దాన్ని నా కడుపులో పడేసు కుంటాను. సరేనా?'' అంది.

పార్వతి మంత్ర ముగ్ధలా కూర్చుండిపో యింది. ఇదంతా కల గాదు కదా? అత్తయ్య నిజంగానే మాట్లాడుతూందా? అడగ్గానే ఇంత తొందరగా ఒప్పేసుకుందా?

''ఏమిటే, అలా వెర్రిదానిలా చూస్తావ్?''

''అత్తా!'' సంతోషంతో కళ్ళు ఒత్తుకుంది పార్వతి.

''అమ్మా నాన్నా పోయారని నువ్వు మమ్మల్ని చులకన చేస్తావనుకున్నాను. నిజంగా నువ్వెంత మంచి దానవత్తా! దేవతవి!''

''చాల్లే! నీ మాటలూ నువ్వూనూ.''

''కాదత్తా! అమ్మ పేరనున్న ఎకరం పొలం రుక్కుకే రాయిస్తాను. మంచి చెడ్డలకేమీ లోటు రాకుండా శాయ శక్తులా చూసుకుంటాను.''

''ఏమిటే పార్వతీ, ఆ బేరాలన్నీ ఇప్పుడు నేనడిగానా? తండ్రి చచ్చి నువ్వేడుస్తూంటే... ఈ మాటలు వింటే ఎవరయినా ఏమనుకుంటారు? చాలు గాని ఊరుకో. పెద్ద పిల్లవేగాని నీకు బొత్తిగా జ్ఞానం లేనట్టుంది.''

శాంతమ్మ కసురుతూన్న కొద్దీ పార్వతి హృదయం తేలికైంది, వాన కురిసీ కురిసీ తేలికైన మేఘం లాగ! లేచి మొహం కడుక్కుని జడ అల్లుకుంది. వంటింటి గడప మీద కూర్చుని కాఫీ గ్లాసు అందుకుంటూ, ''అత్తా! కోపం తెచ్చు కోకు గానీ ఒక్క మాట అడుగుతాను'' అంది.

''ఇంకా ఏమిటి దిగడిందే?''

''రామానికి రుక్కుని చేసుకోవడం ఇష్టమే నంటావా?''

''వాడిష్ట మేమిటే మధ్య, పెళ్ళి నేను చేస్తోంటే?''

''అలా కాదులే అత్తా! పెళ్ళి చేసుకునే వాళ్ళే బాగా ఇష్టపడాలి. లేకపోతే మళ్ళీ గొడవలు...! సంతోషంగా ఉండలేరు!''

''అదా నీ భయం? అయితే మా వాణ్ణి చేసు కోవటం నీ చెల్లిలికి ఇష్టమో కాదో అడిగావా?''

నవ్వేసింది పార్వతి. ''బాగుంది. అదింకా చిన్న పిల్లే! రామాన్ని చూడనయినా లేదు. దానికేం తెలుస్తుంది?''

''ఆ ముక్కే నేనూ అనేది. నీ చెల్లెలు నీ మాట వింటుందిగానీ, నా కొడుకు నా మాట వినడా? పోనీ, నేడో రేపో ఆ పెళ్ళి చూపుల తతంగం కూడా ముగించేద్దాం! వచ్చే వైశాఖంలో మూడు ముళ్ళూ వేయించేద్దాం!''

పార్వతి కడుపు నిండిపోయింది. ఇంత మంచి అత్తయ్య సంరక్షణలో రుక్కుకి ఏ లోటూ ఉండదు. రామం కూడా తల్లి లాంటి వాడే కావచ్చు. చూడ్డానికా అందమైన వాడు, ఆరోగ్య మైనవాడు. స్కూల్ ఫైనలు చదివి కాబోలు మానేశాడు. తండ్రి పోవటంతో పొలం పుట్రా చూసుకోక తప్పలేదు. ఎన్ని చదువులు చదివినా కడుపు నింపుకోడానికే గదా? దానికేం లోటు లేదు. చదివినా చదవకపోయినా హృదయం ఉన్న వాళ్ళు మనుష్యుల్లాగే బతుకుతారు. రుక్కు అదృష్టవంతురాలే! దాని బాధ్యత ఇక తనకు లేదు.

బళ్ళోంచి వస్తూనే ''ఆకలేస్తోందే అక్కా'' అంటూ రాగం తీసింది రుక్కు.

''ఒసే పెళ్ళి కూతురా! కాళ్ళు కడుక్కుని రా! కాఫీ ఇస్తాను'' అంది శాంతమ్మ ఎసట్లో బియ్యం వేస్తూ.

పార్వతి నవ్వింది. నాన్న పోయిం తర్వాత ఎప్పుడూ నవ్వని అక్క అలా నవ్వటం ఆశ్చర్యంగా తోచి పెరట్లోకి పరుగెత్తింది రుక్మిణి.

★ ★ ★

"**బొమ్మల** పెళ్ళిళ్ళు చేస్తూ ఆడుకోండర్రా! చిన్నతనంలోనే పెళ్ళిళ్ళవుతాయి" అంటూండేది పద్మజా వాళ్ళమ్మ. అటువంటి ఆటలంటే పద్మజ చిరాకు పడేది. పార్వతి సరదా పడితే, "ఏం? నీకు పెళ్ళంటే ఇష్టమా? బొమ్మల పెళ్ళి చేస్తే నీకూ తొందరగా పెళ్ళయి పోతుందనా?" అని కసిరేది.

రుక్మిణి ఎన్ని బొమ్మల పెళ్ళిళ్ళు చేసిందని ఇంత చిన్నతనంలో పెళ్ళికూతురయింది! పదిహేనేళ్ళ వయస్సుకే చదువు ఆపుచేసి రుక్కుకి పెళ్ళి చెయ్యటం పార్వతికి ఒక రకంగా బాధ కలిగించినా, అయినా దాన్ని సరిపెట్టుకుంది. శాంతమ్మత్త పెద్దరికంలో, రామం లాంటి భర్త దగ్గిర బతకడంలోనే రుక్కు ఎక్కువ సుఖపడుతుంది. దాని భవిష్యత్తుకి రక్షణ ఉంటుంది. అత్తవారింటి కెళ్ళినా అది బాధపడక్కర్లేదు. సూర్యం చదువు సమస్య ఉండగా రుక్కుని కూడా చదివించటం అసాధ్యం. బిడ్డలకు పెళ్ళిళ్ళు చెయ్యాలని ఇందుకే కాబోలు తల్లి దండ్రులు అంతగా తాపత్రయ పడతారు!

రుక్మిణి, రామం సొత్తయిపోయింది! నిరాడంబరంగా దేవాలయంలో పెళ్ళి జరిగింది. పార్వతికి హృదయం ఎంత తేలికపడిందో అంత భారంగానూ తయారయింది.

రుక్మిణి అత్త వారింటికి వెళ్ళే రోజు, రైలెక్కేటప్పుడు ఏడిస్తే ఎలా ఓదార్చటమోనని కంగారు పడింది పార్వతి. రుక్కు కన్నీళ్ళు పెట్టుకునే లక్షణాలే కనిపించలేదు. సిగ్గు సిగ్గుగా నవ్వుతూనే కూర్చుంది మొగుడి పక్కన. "చిన్నతనం! కష్టం సుఖం ఏం తెలుస్తాయి?" అని నిట్టూర్చుతూ ఇంటికి వచ్చింది పార్వతి.

"ఇల్లు ఎంతో బోసిగా ఉంది గానీ నా మనసు నిండుగా ఉంది పద్మా! ఇక సూర్యం చదువు కూడా పూర్తి చేయించగలిగితే వాడూ ఒక దారి అవుతాడు. ఇవ్వాళే రుక్కు అత్తవారింటికి వెళ్ళిపోయింది. ఎంత ధైర్యంగా వెళ్ళిందనుకున్నావ్! నీ పరీక్షలు దగ్గర పడుతూన్నట్టున్నాయి. నాకు జవాబు రాయక్కర్లేదులే. శ్రద్ధగా నీ చదువు సంగతి చూసుకో. సుజా, పరీక్షలు బాగానే వ్రాశానని చెప్పింది" అంటూ కాలక్షేపంగా పద్మజ కో ఉత్తరం రాస్తూ కూర్చుంది పార్వతి.

ఒక్క నెల రోజులు మాత్రం బలవంతం మీద చెల్లెలి ధ్యాస మళ్ళించుకోగలిగింది. జీతాలు అందాయి. ప్రైవేటు పిల్లలు కూడా డబ్బుతెచ్చి ఇచ్చేశారు. "ఒక్క సారి రుక్కుని చూసి వస్తేనో?" అనిపించింది. సూర్యాన్ని పిలవాలని అటు వెళ్ళేసరికి "క్షమించు గోపి, నా పరిస్థితి నీకు తెలి యనిది కాదు" అంటూ స్నేహితుణ్ణి సాగనంపు తున్నాడు సూర్యం,

"ఏమిటీ సూరీ?" అంటే, "ఏం లేదక్కా! పరీ క్షలు కాగానే ఎక్స్‌కర్షన్‌కి వెళ్దామనుకున్నారు మా క్లాసు వాళ్ళంతా. నేను రాలేనని చెప్పాను" అన్నాడు.

పార్వతి అప్యాయంగా, "పోనీ వెళ్ళరాదూ?" అంది.

"ఎలా అక్కా? ఎంత లేదన్నా నలభై రూపాయలైనా అవుతాయి!"

"ఫర్వాలేదులే. వెళ్ళు! జీతాలన్నీ అందాయి."

"వద్దక్కా! డబ్బు ఖర్చుచేసి అనవసరంగా..."

"ఎక్స్‌కర్షన్‌కి వెళ్ళటం అనవసరం కాదులే! ఎన్ని పుస్తకాలు చదివితే ఆ జ్ఞానం వస్తుంది? నాలుగు ప్రదేశాలు తిరిగి తెలుసుకోగలిగేదే ఎక్కువ. వెళ్ళు సూరీ! నేను రుక్కు దగ్గిరికి వచ్చే నెల వెళ్తాను. యాభై రూపాయలున్నాయి. తీసుకెళ్ళు!"

సూర్యం చూపుల్లో అక్క మీద భక్తి తొణికిసలాడింది.

★ ★ ★

**ఎమ్.**బి.బి.ఎస్. రిజల్ట్సు వచ్చాయి. పద్మజ పరీక్ష పాసైంది. పేపరు ముఖంగా ఆ అనుమానం కాస్తా తీరిపోవటంతో పద్మజ కూడా తేలిగ్గా నిట్టూర్చింది.

కోర్టులోనే శుభవార్త విన్న ఈశ్వర సోమయాజి ఒక్క క్షణం కూడా అక్కడ ఉండలేక ఆ

పూటకు వ్యవహారాలు ముగించుకుని ఇంటికి వచ్చేశాడు. "అమ్మా! పద్మా" అంటూ సంతోషంగా కేకపెట్టాడు.

పద్మ నవ్వు మొహంతో ఎదురొచ్చింది.

కామేశ్వరమ్మ ఆనందం దాచుకోలేక కన్నీళ్ళు ఒత్తుకుంది. "ఏమిటో దీని జాతకం ఆది నుంచీ చిత్రంగానే జరుగుతోంది!" అంది నిట్టూరుస్తూ.

ఆ ఏడే సుజా కూడా స్కూలు ఫైనల్ పాసైంది. తల్లిదండ్రుల సంతోషానికి అవధులు లేకపోయాయి. "మీ కూతురే కాదు, నా కూతురూ పరీక్ష నెగ్గింది!" అంది కామేశ్వరమ్మ భర్తతో హాస్యమాడుతూ.

సోమయాజి ముసి ముసిగా నవ్వాడు. "పిచ్చిదానా! ఆ తేడాలు నీకే గానీ నాకు లేవే! ఉన్న రెండు కళ్ళలోనూ ఓ కన్ను నీదీ, ఓ కన్ను నాదీనా? సుజా బంగారు తల్లి! అక్కని చూసి బుద్ధిగా చదువుకుంటోంది." అన్నాడు.

"అదిగో, అదే మీ పక్షపాతం! దాన్ని చూసే ఇది నేర్చుకోవాలా? దీని తెలివి దీనికి లేదా?"

"పెద్ద వాళ్ళ అడుగుజాడల్లో చిన్న వాళ్ళు నడవచ్చుగా?"

"ఇక అక్కడికి దీని కేమీ చేతకానట్టు!" అంటూ కయ్యానికి సిద్ధమైంది కామేశ్వరమ్మ.

"అక్కయ్యా, ఈ పరీక్ష పాసైతే నాకు బహుమతి ఇస్తానన్నావుగా?" అంది సుజాత అక్కగారితో.

"అవునే. మరిచిపోయా ననుకుంటున్నావా? ఏం కావాలో అడుగు! పెన్ను కావాలా? ముత్యాల దుద్దులు కావాలా? శరత్ సాహిత్యం కావాలా? ఏం కావాలి?"

"అవేమి కావు. నీ రిస్టు వాచీ కావాలి!"

"నాదా? ఇదెందుకూ? అప్పుడే కొని ఏడు సంవత్సరాలైంది! నన్ను ఉద్యోగంలో చేరనీ! మొదటి జీతం అందుకుని కొత్తవే కొనిపెడతాను!"

"నాకేం కొత్తది వద్దక్కయ్యా! నీ వాచీయే కావాలి!"

"ఇదేం పిచ్చే నీకు?" అంటూ పద్మజ తన చేతి వాచీ విప్పి సుజా ఎడమచేతికి కట్టింది.

"నీలా నేనూ డాక్టర్ని కాలేకపోయినా నీ తెలివి నాకూ కొంచెం వస్తుంది." అని నవ్వింది సుజాత.

"పిచ్చి పిచ్చిగా మాట్లాడకు! నిన్ను నువ్వే ఎందుకలా చులకన చేసుకుంటావు? నీకూ డాక్టరు కావాలని ఉంటే, కాదనేదెవరు?"

"లేదక్కయ్యా! నాకు డాక్టర్ చదవాలని లేదు. కానీ ఏదైనా పెద్ద చదువులు చదవాలని ఉంది."

"అయితే ఆర్ట్సు చదువుకో, నీ అభిరుచులకు సరిపోతుంది."

ఎప్పుడు వచ్చిందో జానకి ఆడబిడ్డల కబుర్లు వింటూ నుంచుంది.

"ఏం వదినా, అంత మౌనంగా వినేస్తున్నావు?" అంటూ నవ్వింది పద్మజ.

"బాగుంది, వింటూ నించున్నాను. అంతకన్నా నాకేం తెలుస్తుంది?"

"ఎందుకు తెలీదూ? నోరు ఉందిగా, మాట్లాడటం తెలీదూ?"

"భగవంతుడు నోరు ఇచ్చాక తెలిసినా తెలీకపోయినా మాట్లాడాలి."

పద్మజ హాస్యాలకూ, జానకి ఉడుక్కోడానికీ సరిపోతుంది.

"ఏమిటే పద్మా. వదిన్నేదో అంటున్నావూ?" అంటూ వచ్చింది కామేశ్వరమ్మ.

"నీ కోడల్ని నేనేం కొరుక్కుతినటం లేదమ్మా! కావాలంటే నువ్వే అడుగు! ఏం వదినా? నిన్ను నేనెక్కడైనా కొరికానా?"

జానకి ముసి ముసిగా నవ్వింది.

పార్వతి రాకతో వాతావరణం మారింది.

"అబ్బో! బొత్తిగా నల్ల పూసవైపోయావు!" అంటూ ఎదురు వెళ్ళింది పద్మజ.

"నేను చింత పిక్కలాగే ఉన్నా నీ కంటికి నల్ల పూసలా కనిపిస్తున్నాను. నీ ఆస్పత్రి ఎప్పుడు తెరుస్తా వేమిటి? పేషంటుగా మొదట నేనే చేరిపోతాను."

"నేను మరచిపోయిన్నాడు కదా పేషం టుగా చేరతానన్నావు?"

"అబ్బబ్బా! ఏమి వాదాలర్రా? పార్వతీ! నువ్విలా వచ్చి కూర్చో అమ్మాయ్!" అని పిల్చింది కామేశ్వరమ్మ.

పార్వతి కామేశ్వరమ్మ దగ్గిరికి వచ్చి కూర్చుంది.

"మీ చెల్లాయి దగ్గర్నుంచేమైనా ఉత్తరాలు వస్తున్నాయా? మొన్న వొచ్చి అప్పుడే వెళ్ళి పోయింది కదూ? మొగుణ్ణి వదలదులా ఉంది!"

పద్మజ పార్వతి దగ్గరికి వచ్చి కూర్చుంటూ అంది. "నేను పుట్టాక మా అమ్మ తాతగారింటి కెళ్ళినట్టు గుర్తు లేదు."

"అఘోరించావ్‌లే మహా! అన్నీ నీకే తెలిసి నట్టు!" అంటూ నవ్వింది కామేశ్వరమ్మ.

ఈశ్వర సోమయాజి కూడా హాల్లోకి రావ టంతో జానకి లోపలికి తప్పుకుంది.

"నీ ఆఫీసు పని తేలిగ్గా ఉంటోందా అమ్మా?"అని పలకరించాడు పార్వతిని ఆయన.

"అంతా బాగానే ఉందిగానీ, ఈ సారి బదిలీ తప్పేలా లేదు బాబాయ్! అదే ఆలోచిస్తున్నాను" అంది పార్వతి.

"దానికంత ఆలోచనేముంది? ఆ మాత్రం తప్పించలేక పోతామా?"

"అదీ నాకిష్టం లేదు బాబాయ్! ఉద్యోగం అన్న తరవాత వాళ్ళ పద్ధతుల ప్రకారం నడవ టమే ధర్మం కదా? మేమిద్దరం ఏ ఊళ్ళో ఉంటే మాత్రం ఏం కష్టం? బదిలీ ఒప్పుకుని వెళదామనే ఉంది."

"నిజమే పారూ! నాలుగు ఊళ్ళూ చూడాలి!" పద్మజ కూడా పార్వతి బదిలీని ప్రోత్స హించింది.

"కొత్త ఊరు, కొత్త మనుషులూ, ఆడ పిల్లేం బాధపడుతుందర్రా?" అంటూ కామేశ్వరమ్మ గోలపెట్టింది.

"పోనీ, నాలుగయిదు నెలలు చూద్దాం, అంతగా సరిపడలేకపోతే తిరిగి ఇక్కడికే వస్తుంది. ఏమ్మా పార్వతీ!" సోమయాజి సలహాని అంగీకరిస్తూ, "అలాగే బాబాయ్! నాకు ఇష్టం గానే ఉంది" అంది పార్వతి.

అనుకున్నాట్టుగానే పార్వతికి బదిలీ వచ్చింది. వెళ్ళబోయేముందు రఘుపతి కనిపి స్తాడేమోనని రోడ్డు మీదికి చాలా సార్లు చూసింది. ఎంత చూసినా రఘుపతి జాడేమీ తెలీలేదు.

★ ★ ★

పార్వతి బదిలీ మీద వెళ్ళిన నెల్నాళ్ళకి, మద్రాస్ జనరల్ హాస్పిటల్‌లో హౌస్ సర్జన్‌గా ఆర్డర్సు అందుకోగానే బయలుదేరింది పద్మజ కూడా.

"డాక్టరు చదువు చదివిందని సంతోష పడ్డామేగాని జీవితమంతా ఉద్యోగాలు చేసు కుంటూ తిరుగుతుంటే ఏమిటో ఆ సుఖం!" అనుకుని నిట్టూర్చింది కామేశ్వరమ్మ.

కూతుర్ని మెయిల్ ఎక్కిస్తూ దిగులుగా చూశాడు ఈశ్వర సోమయాజి. "నిన్ను చదువుకి పంపిస్తున్నప్పుడెంతో గర్వంగా ఉండేదమ్మా! ఇప్పుడేమిటో మనం చాలా దూరమైపోయిన ట్టుంది" అన్నాడు.

"అదేమిటి నాన్నా? నువ్వు బాధపడుతు న్నావా!"

"లేదమ్మా! బాధపడటం ధర్మం కాదు. నువ్వు డాక్టర్‌వి! కష్టించి నేర్చుకున్న విద్యని సద్వినియోగం చెయ్యాల్సిన బాధ్యత నీ మీద ఉంది. నీ జీవిత లక్ష్యమే అది! ఇక నాకు బాధ దేనికి? వెళ్ళిరా అమ్మా! నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకుంటూ ఉండు. వారానికో ఉత్తరమైనా వ్రాస్తూ ఉండాలి సుమా!"

"తప్పకుండా వ్రాస్తాను, నువ్వు కూడా బద్ధకించకుండా జవాబులు వ్రాయాలి మరి!"

"వెళ్ళొస్తా!" అంటూ ఇంజను అరిచింది. తల్లి తండ్రుల కళ్ళ ముందు నుంచి కూతుర్ని తీసుకుపోయింది.

పద్మజ వెళ్ళిపోయిన రాత్రి నుంచే కామేశ్వ రమ్మ భర్తను సాధించటం మొదలు పెట్టింది. "పెద్ద దానికి పెళ్ళి చేస్తేనేగాని నాకు తృప్తి

లేదండీ! అది ఎన్ని విద్యలు నేర్వనివ్వండీ! ఎంత లేసి ఉద్యోగాలు చెయ్యనివ్వండి! ఆడ పుటక పుట్టాక పెళ్ళిలేకుండా కాకుండా ఉండి పోతుందా?'' అంటూ.

"పిచ్చిదానా! పద్మజకి వరుణ్ణి వెదకడం మాటలనుకున్నా వేమిటే? ఎంత విద్యాధికుడై ఉండాలీ! ఎంత అందగాడై ఉండాలీ!''

"దానికి నచ్చడం అలా ఉంచి... ముందు మీకే నచ్చేలాగ లేదు!''

"ఉన్నమాటన్నావ్! పద్మ తల్లికి అన్ని విధాలా తగిన వరుడు లభిస్తే గానీ పెళ్ళి మాటే తలపెట్టదు.''

"అందాలూ చదువులూ గుణాలూ ఆస్తులూ అన్నీ ఒక్కడికే ఉంటాయా? ఎలాగో సరిపెట్టుకోవాలి గానీ..''

"సరిపెట్టుకునే ఖర్మమేమిటే? మన తల్లి కేం తక్కువనీ?''

"కాకపోవచ్చు. అంత మాత్రాన అందరికీ వంకలు పెడితే బాగుంటుందా?''

"అంత బుద్ధి తక్కువ పని చేస్తానా?''

ఒక సంవత్సరం కాలం వరాన్వేషణలోనే గడిచింది. "ఇక బిడ్డల పెళ్ళిళ్ళు నా కళ్ళతో చూసే భాగ్యం లేదు'' అంటూ కన్నీళ్ళు పెట్టుకునే వరకూ వచ్చింది కామేశ్వరమ్మ. ఇంకా కొంత కాలం భార్య కన్నీటికి కరగకుండానే గడిపేశాడు సోమయాజి.

"పెద్ద దానికి ఈ యాడాదైనా పెళ్ళి చేస్తారా చెయ్యరా? ఏ మాటా తేల్చి చెపితేగాని పచ్చి మంచి నీళ్ళు కూడా ముట్టను'' అని శపథంచేసి హఠాత్తుగా ఉపవాసాలు ప్రారంభించింది కామేశ్వరమ్మ.

ఈశ్వర సోమయాజి నవ్వుకుంటూ భార్యను బుజ్జగించాడు. "ఇన్నాళ్ళూ నేను పట్టించుకోకుం డానే ఊరుకున్నా ననుకున్నావు కదూ? ఎంత వెర్రి బాగుల దానివే! రేపో మాపో ఈ కబురు నీ చెవిని వేద్దామంటే నువ్విలా హఠాయించుకు కూర్చున్నావు!''

అంత కోపంలోనూ రుస రుస లాడుతూ అడిగింది కామేశ్వరమ్మ. "ఏమిటా కబురు? అక్కర కొచ్చేదేనా?''

"విను మరీ! రామావధానులుగారి పెద్ద కొడుకు ఎమ్.ఎ; ఎల్.ఎల్.బి చదివాడు. పెద్ద లాయరు. రెండు చేతులా సంపాదిస్తున్నాడు. అతగాడు పట్టే కేసుకి తిరుగు లేదు. పోగా పోగా జడ్జీ అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి. మధ్యవర్తుల ద్వారా అంతా తెలుసుకున్నాను. సంబంధం మాట కూడా అడిగించాను.''

"అంత కంగారేమిటి? వంశం, వంగడం అన్నీ తేల్చుకున్నారా?''

"అక్షరాలా శ్రోత్రియ బ్రాహ్మణ వంశం. మన శాఖే. సరిగ్గా మీ అన్నదమ్ముల గోత్రం. సంప్రదాయకమైన కుటుంబం. తల్లీ తండ్రీ, అప్ప చెల్లెళ్ళూ అన్నదమ్ములూ — అంతా పుట్టెడు బలగం.''

"బావుంది, బావుంది! ఇంకేం కావాలి? ముహూర్తం పెట్టించెయ్య లేకపోయారూ? ఆలస్యం దేనికీ?''

"ఎంతైనా ఈ కాలంలో పెళ్ళిచూపులూ అవీ జరగాలా? ఇటు మన పిల్లా, ఆ పిల్ల వాడూ ఇద్దరూ బాగా చదువుకున్న వాళ్ళేనూ. ఒకళ్ళ నొకళ్ళు చూసుకుని ఏమనుకుంటారో యేమో! ఆలోచించాలిగా మరి?''

"మీ ఆలోచనలతోనే తెల్లవారేలా ఉంది నా బతుకు! దానికి ఉత్తరం రాసిపడేసి వాళ్ళని పెళ్ళి చూపులకి రమ్మనరాదూ? ఆలస్యం అమృతం విషం అంటారు. ఇంకా ఎందుకా నసుగుడూ?''

"మనం అంత కంగారు పడకూడదే! వియ్యాల వారికి చులకనైపోతాం. ఎలాగూ ఈ వేసంగుల్లో పెళ్ళి తప్పదు. నువ్విక బెంగ పెట్టు కోకు. ఉపవాసం చాలు గాని వెళ్ళి భోజనం చేసిరా!''

కామేశ్వరమ్మకు సంతోషంతోనే కడుపు నిండిపోయింది. అల్లుడూ కూతురూ ఇంట్లో తిరుగుతారనుకుంటే తిండీ నీళ్ళూ వద్దనిపిం చింది.

★ ★ ★

ఓ నెల్నాళ్ళకు మగ పెళ్ళి వారి నుంచి ఖాయంగా కబురు అందింది. పెళ్ళి చూపులు చూడటానికి సిద్ధంగా ఉన్నట్టూ, ఎప్పుడు రమ్మంటే అప్పుడు బయలుదేరి వచ్చేట్టూనూ.

వెంటనే ఈశ్వర సోమయాజి కూతురుపేర ఉత్తరం వ్రాశాడు — "నీతో అత్యవసరంగా మాట్లాడే పని ఉందమ్మా. ఒక వారం రోజులు సెలవు పెట్టి వస్తే బావుంటుంది" అంటూ.

ఉత్తరం అందుకున్న మర్నాడే బయల్దేరి వచ్చింది పద్మజ.

పద్మజను చూస్తూంటేనే కామేశ్వరమ్మకు కడుపు నిండిపోయింది. ఇంత అందాల రాశిని తనేనా కన్నది? — అన్న అనుమానం కలిగింది. డాక్టర్‌గా అనుభవం గడించుకుంటూన్న ఆమె కన్నులు విజ్ఞానంతో ప్రకాశిస్తున్నాయి.

ఇంటికి వచ్చిన కొన్ని గంటలలోనే తన రాకకు కారణం తెలుసుకోగలిగింది. పద్మజ, వదిన గారి హాస్యాలతో.

"ఇంకెన్నాళ్ళులే ఈ బడాయి? ఆ ముడి కాస్తా పడ్డాక అమ్మాయి దర్జా నేను చూడనూ?" అంటూ వచ్చింది జానకి, పద్మజ అద్దం ముందు నిలబడి జడ అల్లుకుంటూంటే.

ఒక్క క్షణం వదినగారి మొహంలోకి చూసి కింది పెదవి మునిపళ్ళ మధ్య నొక్కుకుంటూ తల అద్దం కేసి తిప్పుకుంది పద్మజ.

"డాక్టరమ్మకి కూడా పెళ్ళి మాట చెప్పేసరికి సిగ్గువేస్తోందే!" అంది జానకి రెట్టిస్తూ.

కోడలి మాటలు వింటూ ముసి ముసిగా నవ్వుకుంటూన్న కామేశ్వరమ్మ కలగజేసు కుంటూ అంది. "డాక్టరైతే మాత్రం అది ఆడది కాదా ఏమిటి? ఎన్ని చదువులు చదివినా ఆడ పిల్ల ఆడ పిల్లే. సిగ్గూ లజ్జా ఎక్కడికి పోతాయి?"

పద్మజ ఎవరి మాటలూ పట్టించుకోనట్టే పొడుగ్గా తిలకం దిద్దుకుంటూ కూర్చుంది అద్దం లోకి చూస్తూ.

"ఇక జవాబు చెప్పదత్తయ్యా! మీ అమ్మాయి ఇప్పుడే పెళ్ళి కూతురై పోయింది!" జానకి నవ్వింది.

"అక్కయ్యా! నిన్నొకసారి నాన్న రమ్మంటు న్నారు" మెట్లు దిగివస్తూ అంది సుజా.

చటుక్కున చెల్లెలికేసి చూస్తూ, "పైనే ఉన్నారా? అన్నయ్య కూడా?" అని అడిగింది పద్మజ.

"అన్నయ్య పొద్దుటే బయటికి వెళ్ళాడుగా? నాన్న ఒక్కరే ఉన్నారు."

భుజం మీదుగా వేళ్ళాడుతూన్న వాలు జడను వెనక్కి విసురుకుని స్టూలు జరుపుకుని అద్దం ముందు నుంచి లేచి మెట్ల వేపుకి నడిచింది పద్మజ. చివరి మెట్టు వరకూ వెళ్ళి ఒక్క నిమిషం నిలబడిపోయింది. అప్రయత్నంగా కిటికీ లోంచి బయటికి చూస్తే సుదూరంగా పరిగెడుతూన్న రైలు పట్టాలు కంటపడ్డాయి. చూపులు మరల్చుకుని జోళ్ళు గది ముందు విడిచి ఎప్పటి చిరు నవ్వుతో లోపలికి అడుగు పెట్టింది.

కూతురి రాక కోసమే నిరీక్షిస్తున్న సోమ యాజి కాలక్షేపానికి తిరగవేస్తూన్న పేపరు టేబిల్ మీద పడేస్తూ, "రా అమ్మా! కూర్చో!" అంటూ దూరంగా వున్న పేము కుర్చీ తన దగ్గరకి జరుపు కున్నాడు. "అమ్మ ఏం చేస్తోంది కింద?"

"వంట చేస్తోందనుకుంటాను నాన్నా" పద్మజ టేబిల్‌కి ఆనుకుని నిలబడింది.

"వదిన చూసుకోగలదుగా? ఒక్క సారి అమ్మని..."

నవ్వుతూనే అంది పద్మజ! "వదిన మడిలో లేదుగా?"

"ఊఁ, బాగానే ఉంది... పోనీలే అయితే."

తండ్రి ముఖకవళికలు నిశితంగా పరిశీ లిస్తూ అంది పద్మజ "అయినా ఇప్పుడు అమ్మతో ఏం పని?"

"అబ్బే! పెద్ద పనేమీ లేదు. అయితే నీకు .. అదే ... ఏదేనా కబురు చెప్పిందా అమ్మ?"

"కబురా? నాకా? ఊహూఁ! లేదే!"

"నేనే చెప్తానని ఊరుకుందేమోలే. అబ్బే, ఇంతకీ ఏమీ లేదమ్మా! నీ ఉద్దేశ్యం కూడా కనుక్కుని నిర్ణయం చేసుకుందామని. మగ

పెళ్ళి వాళ్ళు నిన్ను చూడటానికి వస్తామంటున్నారు...''

పద్మజ మౌనంతో, సోమయాజి నిస్సంకోచంగా విషయమంతా చెప్పసాగాడు. ''అబ్బాయి పేరు సీతారామశర్మ అనుకుంటాను. సరిగ్గా గుర్తు లేదులే. ఎమ్.ఎ.ఎల్.ఎల్.బి. చదివాడు. మంచి ప్రాక్టీసు ఉంది! నేను స్వయంగా చూశాను. అందంగా ఉంటాడు... నీకూ ఇష్టమైతే ... మిగిలిన విషయాలన్నీ నేను చూసుకుంటాననుకో.''

పద్మజ మౌనంగానే నిలబడింది.

అంతలో కూతురు మాట్లాడే అవసరం లేదనీ, తను చెప్పవలసింది చాలా ఉందనీ, మౌనంగా వింటే చాలనీ, అనుకున్న సోమయాజి మళ్ళీ చెప్పసాగాడు — ''మీ అమ్మ రెండు మూడేళ్ళ నుంచీ నా ప్రాణాలు తీసేస్తోంది, నీకు పెళ్ళి చెయ్యమని! మీ అమ్మ ఎంత తొందరపడ్డా నేను నిదానంగానే ఆలోచించానమ్మా! ఈ కాలంలో సంబంధాలు కుదర్చటం అంటే అంత తేలికా? అందులోనూ నీకు! అందుకే ఇన్నాళ్ళూ ఓపిగ్గా సంబంధాలు చూస్తునే ఉన్నాను... అబ్బాయిని చూసి నువ్వు కూడా ఇష్టపడిన తర్వాతే అనుకో. అదీ సంగతి. మానవ జన్మ ఎత్తాక కళ్యాణం తప్పదు కదమ్మా? స్త్రీకి పురుషుడూ, పురుషుడికి స్త్రీ, అండ దండలుగా ఉండి తీరాలిగా? నీకు తెలియనిదేముంది? వాళ్ళని రమ్మని ఇవాళే వైర్ ఇద్దామనుకుంటున్నాను. అలా చెయ్యమంటావా అమ్మా?''

కూతురి మొహంలోకి చూడబోయిన సోమయాజికి కించిత్తు విస్మయం కలిగింది. పద్మజ ఎన్నడూ లేని విధంగా తల దించుకుని నిలబడింది. ఏదో చెప్పాలనుకుని చెప్పలేని నిస్సహాయత ఆ ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది. మౌనంగానే ఉండిపోయింది.

''అమ్మా పద్మా!'' అప్రయత్నంగా పిలిచాడు తండ్రి.

పద్మ తల ఎత్తి చూసింది. ఎప్పటి ధైర్యంతోనే ఏదో అధైర్యం కూడా మిళితమైనట్టు కనిపించింది. ఒక్క క్షణం తండ్రి కళ్ళలోకి చూసింది.

''నీకేమైనా చెప్పాలని ఉందా, అమ్మా?'' కుర్చీలోంచి లేచాడు సోమయాజి. ''నా దగ్గర సంశయిస్తున్నావా తల్లీ? ఈ ఇంట్లో నీకు అయిష్టంగా ఏదైనా జరిగిందా? నీకేం కావలసినా అడిగావు. ఏం చెప్పాలన్నా చెప్పావు. ఎప్పుడైనా కాదన్నానా? చెప్పమ్మా! మనసులో బాధపెట్టుకోవద్దు! చెప్పకపోతే నే నేమీ చెయ్యలేను కదా? చెప్పమ్మా!''

''నాన్నా!''

''చెప్పమ్మా పద్మా! నీకు ఇష్టంలేకపోతే ఈ సంబంధం మానేద్దాం. వివాహం అనేది సామాన్యమైన విషయం కాదు గదా? నీ విషయంలో నేను మూర్ఖంగా ఎన్నడూ ప్రవర్తించను. కానీ అమ్మా, నా మీద నీకు నమ్మకం ఉంటే కొంచెం ఆలోచించు! అన్ని యోగ్యతలూ చూసే ఈ సంబంధం నిర్ణయించాను.''

''క్షమించు నాన్నా! నిన్ను ఎన్నడూ శంకించలేదు.''

''అవునమ్మా! ఆ నమ్మకం నాకుంది. అందుకే ఈ మాత్రం సాహసించి వరుణ్ణి వెదకటానికి ప్రయత్నించాను.''

పద్మజ తండ్రి మొహంలోకి చూస్తూ అంది. ''వాళ్ళతో సంప్రదించటానికి ముందే మాట మాత్రమైనా నాకు రాయవలసింది నాన్నా!''

సోమయాజి చిన్నగా నవ్వుతూనే అన్నాడు. ''నువ్వు తప్పే అంటే తప్పే! ఒప్పుకుంటాను తల్లీ! కాని, కన్నతండ్రిగా ఆ బాధ్యత నాకు ఉందనే అనుకున్నానమ్మా! ఇప్పటికైనా నువ్వేమీ అనుమానించ నక్కరలేదు. అబ్బాయి అన్ని విధాలా యోగ్యుడు. మన సంప్రదాయానికి సరిపోయిన కుటుంబం, పువ్వులాంటి నా తల్లిని పరాయి వాళ్ళకు అప్పగించే ముందు ఇంత ముఖ్యమైన సంగతులు చూసుకోనా అమ్మా?''

పద్మజ నిశ్చలంగా చూసింది. ''నాన్నా! నా ఇష్టానికి నువ్వు ఏ నాడూ అడ్డు చెప్పలేదు. నీ మాట కూడా నేను ఎన్నడూ తిరస్కరించ లేదు. కానీ...''

"చెప్పమ్మా! ఏమిటి? నా దగ్గర భయపడుతున్నావా? నీ ఉద్దేశ్యం ఖచ్చితంగా చెప్పమ్మా!"

"నేనీ పెళ్ళి చేసుకోలేను నాన్నా!"

పద్మజ వైఖరిని బట్టి అదే ఊహించిన సోమయాజి ఏమంత విస్తుపోలేదు. ఒక్క నిమిషం మౌనంగా ఉండి కూతురి మొహంలోకి చూస్తూ, "అబ్బాయిని నువ్వు చూడనైనా లేదే!" అన్నాడు.

"అవసరం లేదు నాన్నా! ఈ సంబంధమే కాదు. ఇంకే సంబంధమూ నేను చేసుకోలేను!"

"అంటే పెళ్ళి చేసుకోవటమే ఇష్టం లేదా అమ్మా?"

పద్మజ క్షణంసేపు మౌనం వహించింది. "కాదు నాన్నా!..."

"మరి? మరి?"

ఆత్రత పడుతున్న తండ్రి మొహంలోకి నిస్సంకోచంగా చూసింది పద్మజ. "చెప్పేస్తాను నాన్నా. నీ దగ్గర నాకు భయం వద్దన్నావుగా? నా మనస్సులో మాట చెప్పేస్తాను! నీకు చెప్పి నా పెళ్ళి తొందరలోనే నిర్ణయించుకుందామనుకున్నాను!"

"... అంటే, వరుణ్ణి నువ్వే నిర్ణయించుకున్నావా అమ్మా?" సోమయాజి కన్నుల్లో తొట్రుపాటు తొణికిసలాడింది.

"అవును నాన్నా! అతను నాతోపాటు చదివాడు. నా తోనే డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. అతన్నే."

తండ్రి మొహంలో ఆరాటమేమీ కనిపించలేదు. "అలాగా?... సరే! నీకు నచ్చితే నాకు అభ్యంతరం ఎందుకుంటుంది? అతడెవరో చెప్పమ్మా! అతడి తలిదండ్రులూ, శాఖా, గోత్రం..."

పద్మజ మాట్లాడలేదు.

"ఆ వివరాలేమీ నీ కంతగా తెలీవా?"

"తెలుసు నాన్నా! అన్నీ తెలుసు!" పద్మజ తొణకకుండానే అంది. "అతని పేరు జార్జి విలియమ్స్!..."

"అంటే...అంటే..." వెర్రి పట్టినట్టు చూశాడు సోమయాజి.

"ఆంగ్లో ఇండియన్ నాన్నా! మన మతమే కాదు!"

"పద్మా!" ఆవేశంగా కేకపెట్టాడు సోమయాజి. తీక్షణంగా చూశాడు కూతురుకేసి. ఎంత తమాయించుకోవాలన్నా ఆ తండ్రి వశంకాలేదు. "నీకేమైన మతిపోయిందా పద్మా? సాటి కులం కాదు, గోత్రం కాదు, జాతి కాదు, నీతి కాదు. మతాన్నే ధర్మాన్నే మార్చేసుకుంటావా?

తెల్లవాణ్ణి కట్టుకుంటావా? హిందూ మతం గొడ్డుపోయిందనుకున్నావా? ... బ్రాహ్మణ కులం అంతరించిం దనుకున్నావా? ఏమిటమ్మా ఈ ఘోరం? ఇంతటి పాపానికి నీ అంతరాత్మ ఎలా అంగీకరించిందమ్మా?" — ఆవేదనతో తల్లడిల్లిపోయాడు సోమయాజి.

పద్మజ నిశ్చలంగా నిలబడింది. "నాన్నా! నన్ను క్షమిస్తావన్న ధైర్యంతోనే మాట్లాడుతున్నాను. అన్నీ తెలిసిన నీకు నేను చెప్పవలసిందే ముంటుంది? మనిషికీ మనిషికీ తేడా ఏమిటి? మానవత్వానికి మతం ప్రసక్తి ఎందుకు నాన్నా?"

సోమయాజి ఉగ్రుడై చూశాడు. "ఎందుకా? పశువుని కూడా ప్రాణప్రదంగా పూజించుకునే మతం మనది. గోమాతని చంపి కడుపులు నింపుకునే మతం వాళ్ళది! మానవత్వానికి మతం ప్రసక్తి ఎందుకంటున్నావా?"

"మతాల నియమాలు దేశ కాల పరిస్థితుల్ని బట్టి ఉంటాయి కదా నాన్నా? మనం పశువుని పూజించినా, వాళ్ళు భుజించినా, అది జాతి మనుగడ కోసమే కావచ్చు! అన్ని మతాల ధ్యేయమూ బతకడమే కదా?"

"ఎప్పుడూ కాదు. పవిత్ర బ్రాహ్మణ మతానికి ప్రపంచ చరిత్రలోనే ఒక ఉత్కృష్టత ఉంది!"

ఆశ్చర్యపోతూ చూసింది పద్మజ. తండ్రి నోటి నుంచి అటువంటి మాటలు ఎన్నడూ విన్న గుర్తు లేదు. బ్రాహ్మణ్యాన్ని తిరస్కరించక పోయినా అలా గొప్పచేసి ఎప్పుడూ మాట్లాడలేదు! ఆశ్చర్యాన్ని అణచుకుంటూనే నెమ్మదిగా అంది.

"క్షమించు నాన్నా! నీతో వాదించాలని నాకు లేదు. నువ్వు కోపం తెచ్చుకోకుండా ఉంటే నా ఉద్దేశ్యాలు చెప్తాను. నువ్వు చెప్పే మతాలు ఏ నాడో అంతరించిపోయాయి! 'బ్రాహ్మణుల పవిత్రత' అనేది ఇవ్వాళ ఎక్కడ ఉంది? శ్రోత్రీయ కుటుంబాల్లో పుట్టి పెరిగిన బ్రాహ్మణులే మద్య మాంసాలకూ, అనాచారాలకూ దాసులైపోతున్నారు. ఇంకా బ్రాహ్మణ కులంలో మాత్రమే ఏదో పవిత్రత ఉందనుకుంటే అది మన ఆత్మ వంచన కాదా నాన్నా?"

"అందుకని, నాశనమయిపోయే పవిత్రతని పునరుద్ధరించటానికి పూనుకోకపోగా, ఇంకా నాశనం కావటానికి నీ శాయశక్తులా దోహదం చేస్తానంటావా?"

"నాన్నా! ఈ నాడు కుల మతాల్ని పసి బిడ్డల్లా కాపాడుకోవలసిన అవసరం లేదని పిస్తుంది నాకు. మతం ప్రసక్తీ, విగ్రహారాధనా, అనాగరిక మానవుల్ని అమానుషత్వం నుంచి విముక్తుల్ని చెయ్యడానికి ఒకప్పుడు పెట్టారేమో! ఈ రోజుల్లో అవన్నీ ఎందుకు? ఈ నాటి మానవుల్ని ఏ మతమూ మభ్య పెట్టలేదు. ఏ ఆరాధనా లొంగ దీయలేదు."

"ఈ నాటి మనిషి సర్వజ్ఞుడా? తనకు తనే భగవంతుడా?"

"కాకపోవచ్చు నాన్నా! నిజమైన మానవత్వం ఒక్కటే ప్రతి వ్యక్తికీ ఆరాధనీయమైన మతమని తెలుసుకోగలిగేంత వివేకవంతుడయ్యాడు ఈ నాటి మనిషి! మనిషి మనిషిలా బ్రతకాలని తెలుసుకున్నప్పుడు, ఏ మతానికీ ఆస్కారం ఉండదు. మతమే అక్కర లేదు."

"ఈ జాతుల్నీ మతాల్నీ నువ్వు లెక్కచెయ్యనంటావు, అంతేగా?" తీక్షణంగా చూశాడు సోమయాజి — "పద్మా! నువ్వు నాకు నీతులు చెప్పకమ్మా! నీ అభ్యుదయం, నీ సాహసం, నాకు లేవు. నిన్ను ఆజ్ఞాపించే హక్కు కూడా లేదు. వెళ్ళమ్మా, వెళ్ళిపో! నీ ఇష్టప్రకారం నడుచుకో!"

"నాన్నా!"

"ఇంకెక్కడి నాన్న? జాతి మతాలు లేని నీకు రక్త బంధాలు కూడా లేవు. నిన్ను కని పెంచీ ముద్దాడీ, ఎప్పుడూ నీ క్షేమం కోసం, నీ కోసం పరితపించే నీ తల్లి పోయింది! నీ తండ్రి పోయాడు! తోడ బుట్టిన వాళ్ళు పోయారు! మంచి చెడ్డలు పోయాయి! ఇక నువ్వు ఎవర్నీ తల్చుకో నవసరం లేదు. ఎవ్వరూ నీకు లేరు. వెళ్ళిపో తల్లీ!'

"నాన్నా!" గాద్గదికంగా పిల్చింది పద్మజ. "నన్ను అర్థం చేసుకుని ఆశీర్వదిస్తావనుకున్నాను గానీ ఇంత బాధపడతావనుకోలేదు నాన్నా! నా మనస్సువిప్పి నీకు చెప్పాను. నేను సంతోషంగా బతకాలని నీకనిపిస్తే, నన్ను హృదయ పూర్వకంగా దీవించు! లేదా, కన్న తండ్రిగా నన్ను ఆజ్ఞాపించు! నీ ఆజ్ఞ మీరను నాన్నా!"

"లేదమ్మా లేదు! ఈ బాధేదో నన్నే భరించనీ! నిన్ను బాధ పెట్టలేను. నీ ఆశలు నాశనం చెయ్యలేను!"

పద్మజ ఆశగా చూసింది. "నన్ను క్షమించి నా కోరికని అంగీకరించలేవా నాన్నా?"

"నా వశం కాదమ్మా! నీ కోరికని అంగీకరించనూ లేను, అలా అని నిన్ను బాధపెట్టనూలేను. నువ్వు సుఖంగా, సంతోషంగా బతకాలి. మా దగ్గిర అవిలేవనుకుంటే, మమ్మల్ని విడిచి వెళ్ళిపో! అవి నీకు ఎక్కడ దొరికితే అక్కడ అందుకో! నీ దృష్టిలో అర్థం లేని ఈ పిచ్చి ఆచారాల కోసం, నీ నిండు జీవితాన్ని నాశనం చేసుకోవద్దు! నీ కోరిక కున్న విలువ, మా ఆశలకు లేదు. జీవితం విలువ నీకు తెలుసు! నీ కష్ట సుఖాలు నువ్వు నిర్ణయించుకోగలవు!—" ధోరణిగా మాట్లాడుతూ పోతున్న తండ్రిని చూస్తుంటే పద్మజ హృదయం ఆర్ద్రమై పోయింది. కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

"నాన్నా! ఎన్నో విషయాలు తెలిసిన నువ్వు, ఈ పట్టింపులు మార్చుకోలేవా?"

"సాధ్యం కాదమ్మా! ఈ బ్రతుకిలా తెల్లవారి పోనీ! నా హైందవ జీవితం కలుషితం కాలేదన్న తృప్తి మిగలనీ!"

"నాన్నా! ఒక్కసారి జార్జిని చూస్తే నువ్వెంత

యినా ఇష్టపడతావు. తీసుకొస్తా నాన్నా!"

"ఎంత ఇష్టపడినా అల్లుణ్ణి చేసుకోలేను. ఈ గుండెకి అంతటి ధైర్యం లేదమ్మా! ప్రయోజనం లేని మమతలు పెంచకు!"

మౌనంగా నిలబడింది పద్మజ.

కాలం స్తంభించిపోయింది, ఎంతోసేపు!

"పద్మా!"

"నాన్నా!"

"నీ సంగతి ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా వెళ్ళు!"

"నాన్నా!" పద్మజ కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. "నన్ను క్షమించు నాన్నా!"

"నువ్వేం తప్పు చేశావని అలా అడుగుతున్నావు?"

"నిన్ను బాధపెట్టడం నా తప్పే నాన్నా!"

"బాధపెట్టేది నువ్వు కాదమ్మా! కులమతాల్ని వదలలేని నా అజ్ఞానమే నన్ను బాధపెడుతోంది. నా బాధకు నేనే కారణం. నా బలహీనత నీకు తెలుసు!"

పద్మజ ఏమీ మాట్లాడలేదు. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి.

"సాయంత్రం మెయిల్‌కే నేను వెళ్తాను నాన్నా!"

అయోమయంగా చూశాడు తండ్రి.

"నీ ఇష్టం అమ్మా! నీ ఇష్టం..."

"నే నెప్పుడైనా ఇక్కడికి జార్జితో రావచ్చునా నాన్నా?"

అసహనంగా నిట్టూర్చాడు సోమయాజి. "అది కూడా నీ ఇష్టమే నమ్మా! కాని ఈ ఇంటి ఆడబిడ్డ హోదాని ఆశించి మాత్రం రాకు!"

"సంతోషం నాన్నా! ఇదే ఆఖరి చూపు కావచ్చు! జన్మ జన్మలకూ నీ కడుపునే ఆడ పిల్లనై పుట్టాలని కోరుకుంటున్నాను. కన్న బిడ్డగా తల్లిదండ్రుల పట్ల నా బాధ్యతలు నేను నెరవేర్చుకోవటం లేదు. ఆ పాప ఫలితాన్ని కూడా సంతోషంగానే భరిస్తాను. నిన్ను సంతోషపెట్టలేని కూతురు ఉండేదన్న సంగతి మరచిపోకు నాన్నా!"

"అమ్మా!" సోమయాజి కూతుర్ని గాఢంగా గుండెలకు హత్తుకున్నాడు. తండ్రి కన్నీరు కూతురి శిరస్సు మీద అక్షింతలుగా రాలింది.

పద్మజ చక చకా మెట్లు దిగి కిందికి వచ్చింది. ఇంట్లో భోజన వ్యవహారాలన్నీ మామూలుగానే జరిగాయి.

భోజనాల దగ్గరే సోమయాజి భార్యతో చెప్పాడు, "పద్మకి ఇంతలో సెలవు పెట్టడానికి వీలు కాదట. వీలు చూచుకుని ఉత్తరం వ్రాస్తానంటోంది. సాయంత్రం మెయిల్‌కి వెళ్తోంది."

కామేశ్వరమ్మ ఆశ్చర్యపడింది. "అదేమిటి, రేపో మాపో పెళ్ళివారొస్తూంటే..."

"ఒక నెల్లాళ్ళు ఆగమంటే వాళ్ళే ఆగుతారులే కాముడూ! ఏం చేస్తాం? ఉద్యోగం అన్నాక మన ఇష్టాల ప్రకారం జరగదు."

"ఇదేం వేదాంతమండీ? వెధవ ఉద్యోగం లేకపోతే మానే! నిక్షేపంలా అది పెళ్ళాడి కాపరం చేసుకుంటే చాలదూ?"

"కంగారుపడకూ. ఎప్పుడు జరగాలో అప్పుడు జరుగుతుంది. ఏదీ మన చేతుల్లో ఉండదు."

కామేశ్వరమ్మ కళ్ళ నీళ్ళు ఒత్తుకుంటూ అంది — "తండ్రీ కూతుళ్ళిద్దరూ ఇంతే! ఎప్పటి కప్పుడు నన్నిలా ఏడిపిస్తున్నారు!"

సోమయాజి మరేమీ మాట్లాడకుండా లేచాడు.

పద్మజ వీధిలో జట్కా ఎక్కే ముందు ఒక నిముషం నిలబడి తల్లి కేసి చూసింది. తల పైకెత్తి మేడ కేసి చూసింది.

"తొందరగా వస్తావు కదుటే?"

"వస్తానమ్మా, నీకు బాగా కోపం వస్తే రానిస్తావో లేదో!"

"చాల్లే! వెర్రి వాగుడూ నువ్వూనూ! వెళ్ళి రా! రైలు దాటిపోయేను."

జట్కా దూరంగా దూరంగా సాగిపోయింది.

రైలు వేగంలాగా పద్మజకి దుఃఖం పొంగి వచ్చింది.

తండ్రి తనని అర్థం చేసుకుంటాడనీ, తప్ప

కుండా ఒప్పుకుంటాడనీ, అనుకుంది. కానీ అలా జరగలేదు! జార్జి పేరు చెప్పగానే నిర్ఘాంత పోయాడు! బాధతో తల్ల డిల్లిపోయాడు! కానీ, ఎప్పుడూ సహృదయంతో ఆలోచించే మనిషి కుల మతాల వంటి అల్ప విషయాల్ని జయించ లేడా? 'భర్త తిన్న తర్వాతే భార్య తినాలి' అనే అభిప్రాయాలతో ఉండే మనిషి, ఒకసారి తను ప్రశ్నించగానే తప్పు గ్రహించాడే! 'ఆడ పిల్లలకు పెద్ద చదువు లెందుకు' అనుకునే మనిషి తను అడగగానే తన అభిప్రాయం మార్చుకున్నాడే! తను ఏ విషయం మీద వాదించినా ఆయన కూడా ఆలోచించి పాత అభిప్రాయాలు మార్చు కుంటూనే ఉన్నాడు. అంత వివేకం గల మనిషి కుల మతాల క్షుద్రత్వాన్ని ఎందుకు అర్థం చేసు కోలేకపోతున్నాడు?

ఒక సారి జార్జిని చూసి మాట్లాడవచ్చు కదా? ఇంట్లో అందరికీ ఆయనే నచ్చచెప్పవచ్చు కదా? ఆయన మారితే అందరూ మారతారు. అంత అసాధ్యమైన మార్పా అది? ఆయన అంత మూర్ఖుడు కాడు, అజ్ఞానీ కాడు, అలాంటి వ్యక్తి మారడానికి కూడా ఇంకా కాలం తీసుకుం టుందా?

తనని కోపంగా నిర్లక్ష్యంగా వదిలేసి, ఆయన బాధపడకుండా ఉంటే బాగుండేది. తనని అల్లారు ముద్దుగా పెంచిన తండ్రికి ఆనందం కలిగించాలంటే జార్జిని మర్చిపోవాలి! అతను వేరే మతం వాడు కాబట్టి అతన్ని తిరస్క రించాలి! ఎంత అర్థం లేని పని! ఎంత నీచత్వం! అది మానవత్వమా?

తల్లిదండ్రులే కావచ్చు. వాళ్ళు తనని ముద్దుగా పెంచిన వాళ్ళే కావచ్చు. కానీ, వాళ్ళు, బ్రాహ్మణ కులమే, హిందూ మతమే, గొప్పవని విర్రవీగుతోంటే, దానికే తను వంత పాడాలా? దానికే లొంగిపోవాలా? హిందువులు తప్ప, అందులో బ్రాహ్మణులు తప్ప, మిగిలిన కోట్ల కోట్ల మానవులు అల్పులా? అయోగ్యులా? వాళ్ళు మానవులే కారా? జంతువులా? — తను కూడా ఆ ఉన్మాదం లోనే కూరుకు పోవాలా?

వెనక్కి పరిగెత్తుతోన్న చెట్లని చూస్తూ కిటికీ దగ్గిరే కూర్చుంది పద్మజ. పరిగెడుతూంది మనస్సు గతం లోకి. జార్జి స్నేహం లోకి, గతం లోకి!

★ ★ ★

ఆ రోజు, అసిస్టెంట్ జనార్ధన్, సర్జికల్ ఒ.పి.కి వచ్చిన కేసుల్లో సత్యవతి కేసును డయా గ్నైజ్ చేసే నిమిత్తం పద్మజకు అప్పగించాడు. సీనియర్ అబ్బాయి జార్జి విలియమ్స్‌కి పద్మజని అటాచ్ చేశాడు.

పద్మజ హాస్పిటల్‌కు వచ్చేసరికి కొంచెం ఆలస్యమైంది. గత రాత్రి శరత్ నవలేదో చదువు కుంటూ తెల్లవార్లూ కూర్చుండిపోవటంతో ఉదయం తొమ్మిది వరకూ నిద్రపోతూనే ఉంది. రూమ్ మేట్ బలవంతంగా లేవదీసి కూర్చోబెడితే నిద్ర మత్తులోనే బాత్ రూంకి పరిగెత్తింది. స్నానం కాఫీలు ముగించి హడావిడిగా వచ్చి తన కేసు నోట్ చేసుకుని రూమ్‌లోకి వెళ్ళింది.

రోగిని ఏవో ప్రశ్నలడుగుతూన్న జార్జి, పద్మ కేసి చూసి తిరిగి కార్యక్రమం నిర్వర్తించాడు — "ఎన్నాళ్ళ నుంచీ ఇలా ఉంటున్నదన్నారూ?" అడిగిన ప్రశ్నే తిరిగి అడిగాడు మరో సారి.

ఆ రోగి — సత్యవతి — బెదురుగా అతని కేసి చూసింది. ఆ పిల్ల బొత్తిగా అమాయకంగా కన్పిస్తూంది. చదువుకున్న దానిలా లేదు. నున్నగా దువ్వి గట్టిగా అల్లుకున్న జడ చివర ఎర్రటి ఊలు ముక్క కట్టుకుంది. చీర కుచ్చెళ్ళన్నీ చిందర వందరగా దోపుకుని పమిట భుజం కూడా దిగనంత పొట్టిగా వేసుకుంది. కాళ్ళకు పట్టాలూ ముక్కుకి బేసరీ చేతుల నిండా గాజులూ ఉన్నాయి. మొహం బాగా దిగాలు పడ్డట్టు కన్పిస్తూంది.

జార్జి, సత్యవతిని జబ్బు లక్షణాలు అడుగు తూంటే, నోట్స్ టేబిల్ మీద పెట్టి వింటూ కూర్చుంది పద్మజ.

"మూడు నాలుగు నెలల నుంచీ ఇలాగే ఉందన్నమాట. జ్వరం ఏమైనా వస్తున్నదా?"

"ఆఁ, ఒళ్ళు ఎచ్చుగా ఉంటానే ఉంది."

"భోజనం... శుభ్రంగా జీర్ణమవుతున్నాదా?"

"ఊహూఁ! సరిగ్గా అరగటం లేదు. ఒక్కో సారి కక్కులు కూడా..."

"ఓ! వాంతులు కూడా ఉంటున్నాయన్న మాట! భయపడకుండా అడిగినవన్నీ చెప్పాలమ్మా! కడుపులో నొప్పి గానీ, బాధ గానీ ఉండునా?" జార్జి ఎంత తడబడకుండా తెలుగు మాట్లాడినా ఒక రకమైన యాస లేకపోలేదు. నవ్వే కళ్ళతో చూస్తూ కూర్చుని ఉంది పద్మజ.

"కాసంత నెప్పి అప్పుడప్పుడూ..." తను చెప్పేది నిజమో కాదో తనకే సరిగ్గా తెలియనట్టు అనుమానంగా అంది సత్యవతి.

"ఒక్కసారి లేచి అలా బెంచీ మీద పడుకొమ్మా, కడుపు చూస్తాను."

దూరంగా కూర్చున్న పద్మజ కేసి నిస్సహాయంగా చూసి బెదురుతూ బల్ల ఎక్కి పక్కకు తిరిగి పడుకుందా పిల్ల.

"కడుపు మీద కొంచెం బట్ట వదులు చేసుకుంటే ..."

అలాగే చీర కట్టు వదులు చేసుకుంది సత్యవతి. జార్జి పద్మజకేసి చూస్తూనే సత్యవతి దగ్గిరికి నడిచాడు, చేతి వేళ్ళతో మృదువుగా పొట్ట అక్కడక్కడా నొక్కుతూ కళ్ళెత్తి పైకి చూస్తూ ఆలోచించాడు. మరి కాస్సేపు అమాయకంగా కన్పిస్తూన్న సత్యవతి మొహంలోకి చూశాడు దీర్ఘంగా. గబగబా కాగితం మీద నోట్ చేసుకున్నాడు.

సత్యవతి లేచి కూర్చుంది.

జార్జి పద్మజ వైపు చూస్తూ, "మిస్ పద్మజా! నేను ఫినిష్ చేశాను. మీరు టేకప్ చేస్తారా?" అన్నాడు.

"ఎస్, థాంక్స్!" అంటూ లేచింది పద్మజ.

జార్జి మౌనంగా వరండాలోకి నడిచాడు.

సత్యవతి తల దించుకుని బల్ల మీదే కూర్చుని ఉంది.

పేరు తనకు తెలిసినా ఆ పిల్లతో సంభాషణకు ఉపక్రమించటానికి అడిగింది పద్మజ, దగ్గిరికి వెళుతూ — "నీ పేరేంటమ్మా?"

తలెత్తి పద్మజ కేసి చూస్తూ వినయంగా అంది సత్యవతి. "సత్తేవతంటారండీ!"

"బావుంది. నువ్వేమైనా చదువుకున్నావా?"

సిగ్గుపడింది సత్యవతి, "మూడో తరగతి చదివానండీ"

"సరే" పద్మజ నెమ్మదిగా కార్యక్రమంలోకి దిగింది. "అసలు నీ వొంట్లో జబ్బేమిటి?" సత్యవతి మొహంలోకి నిశితంగా చేసింది.

ఆ పిల్ల కళ్ళల్లో విపరీతమైన భయమూ, ఆందోళనా, తారట్లాడుతున్నాయి. మధ్య మధ్య కళ్ళల్లో నీటి పొర కూడా. పద్మజకేసి సూటిగా చూడకుండానే చెప్పింది. "ఒంట్లో బాగుండటం లేదు. తలపోటు ఇకారం చంపేస్తున్నాయి. నిస్సత్తువగా ఉంది. అస్తమానం నిద్ర ముంచుకొస్తుంది" అంటూ ఏకరువు పెట్టింది.

"జ్వరం కూడా వస్తోందన్నావు కదూ?"

"ఊఁ"

"తిన్నది అరక్కుండా వాంతులవుతున్నాయి కదూ?"

"ఊఁ"

"ఊఁ కాదు, సరిగ్గా చెప్పాలి. అసలు తిండి తినబుద్ధి వేస్తోందా?"

"తింటానే ఉన్నాగా కాసింత?"

పద్మజ మృదువుగా చూస్తూ అంది. "నే నడిగిన దానికి నువ్వు నిజమైన జవాబులు చెప్పాలి సుమా!"

అలాగే అన్నట్టు తల తాటించిందా పిల్ల.

"చూడు, నువ్వు ప్రతి నెలా బహిష్ఠవుతున్నావా?"

అదిరిపడింది సత్యవతి. అదో రకంగా పద్మకేసి చూస్తూ కోపంగా, "అది కూడా అడగాల్నా?" అంది.

"అడక్కపోతే జబ్బెలా తెలుస్తుంది?"

"కడుపు నెప్పి పోటానికి కాసింత మందేదో ఇయ్యమ్మా! సాలు!"

"అలా ఇవ్వకూడదు. జబ్బేమిటో తెలిశాక ఇవ్వాలి."

"ఇందాక ఆ బాబు అడగనేలేదుగా ఈ

ముక్క?''

''అయితే నీ జబ్బు దాచిపెట్టుకోవాలనే ఇంత దూరం వచ్చావా? ఈ ముక్క అడగటం ఆ బాబు మరచిపోయి ఉంటారులే. ఇప్పుడు నాతో చెప్పు! బహిష్టు అవ్వటం లేదు కదూ?''

''నాకు ముట్లెప్పుడూ సరిగ్గా రావు. రెండు నెల్లకో మూడు నెల్లకో అవుతావుంటాను.''

''ఇదీ అలాగే అంటావా? పోనీ, ఇదివర కెప్పుడూ ఇలా వాంతులూ నీరసం ఉండేవి కావుగా? కడుపులో నొప్పి వచ్చేది కాదుగా?''

మాట్లాడలేదు సత్యవతి. ఆమె కళ్ళలో నీళ్ళు తిరగటం పద్మజ కనిపెట్టింది. చటుక్కున ఒత్తివేసుకుందా పిల్ల.

''ఒక సారి పడుకో. కడుపు చూస్తాను.''

పొత్తి కడుపు బాగా నొక్కిచూస్తూ శరీరం మీద అస్పష్టంగా కనిస్తూన్న తెల్లటి గీతల్ని గుర్తిం చింది పద్మజ.

''కడుపు మీద దురదగా ఉంటుందా?''

''ఊహూ.''

''అప్పుడప్పుడూ గోకుతూ ఉంటావు కదూ?''

''ఊహూఁ''

సత్యవతి అబద్ధమాడుతోందన్న అను మానం మరీ బలపడింది పద్మజలో.

బెదురుతూ లేచి కూర్చుంది సత్యవతి.

జార్జి ఫైండింగ్సూ, పద్మజ ఫైండిగ్సూ, పూర్తిగా వేరయ్యాయి. సత్యవతికి ''ఫైబ్రాయిడ్ ట్యూమరు''గా డయాగనైజ్ చేశాడు జార్జి.

ఆ పిల్ల 'గర్భం ధరించినట్టు' అనుమాని స్తూంది పద్మజ.

అసిస్టెంట్ జనార్ధన్ పద్మజ అనుమానాన్ని కొంత వరకూ సమర్థించాడు.

''ఇది గైనిక్‌కి పోవలసిన కేసు. తనని తను మోసం చేసుకుంటూ మనల్ని కూడా మోసం చెయ్యగలననుకుని ఇక్కడి కొచ్చిందా పిల్ల. పి.వి. చేస్తే నిజం తెలియవచ్చు. జస్ట్ ఇది నా సస్పిషన్!'' అంది పద్మజ.

''సత్యవతికి ప్రెగ్నెన్సీ! ఎలా? ఆమె అన్ మేరీడ్ కదా?'' ఆశ్చర్యపడ్డాడు జార్జి. అతనా క్షణంలో వైద్య శాస్త్రం చదువుకున్నానన్న సంగతే మరచిపోయినంత అమాయకంగా కనిపిం చాడు.

పద్మజ నవ్వి ''పెళ్ళికాని వాళ్ళకి గర్భం రాదన్న సైన్సేమన్నా చదివారా మీరు?'' అంది.

''ఆమె ఇండియన్ లేడీ! ఎంతో బుద్ధి మంతురాలుగా, అమాయకంగా కనిపిస్తోంటే!'' జార్జి ఆశ్చర్యం నుంచి చాలాసేపు తేరుకోలేదు.

పద్మజ చాలా తెలివైందని విన్నాడు. అను కోకుండా పద్మజని అసిస్టెంటు తనకు అటాచ్ చేస్తే చాలా సంతోషపడ్డాడు... ఇప్పుడు పద్మజ ఊహే కరెక్టా? సత్యవతి అమాయకత్వం... పసితనం... మాంగల్యం లేని బోసి మెడ — మరో అనుమానమేమీ రానివ్వలేదు జార్జికి!

జనార్ధన్ జార్జితో ''సత్యవతిని గైనిక్‌కి పంపి, పి.వి.చేయించు! ఫైడింగ్స్ చూద్దాం!'' అన్నాడు.

పురుళ్ళవార్డులో సత్యవతిని మరో డాక్టర్ పరీక్షచేసింది. నాలుగో నెల గర్భంతో ఉన్నట్టు నిర్ధారణ చేసింది. భయం భయంగా ఏడుస్తూన్న సత్యవతి బాధ ఎవ్వరికీ అర్థం కాలేదు.

''నీకు నాలుగో నెల కడుపు. మంచి ఆహారం తీసుకుంటూ ఉండాలి. విశ్రాంతి తీసు కోవాలి. చాలా నీరసంగా ఉన్నావు. ఇలా ఉంటే తల్లికీ బిడ్డకీ చాలా ప్రమాదం!'' అని హెచ్చరించి సాగనంపారు.

అసిస్టెంట్ సన్న సన్నగా వేసిన చివాట్లు తిని, తల దించుకుని వెళ్తోన్న జార్జి వెనకే నడి చింది పద్మ.

''జార్జ్! జస్ట్ ఏ మినిట్!''

జార్జి వెనక్కు తిరిగి నీలి రంగు కళ్ళతో విస్మయంగా చూశాడు.

''పద్మజా, పిలిచారా?''

''కొంచెం మాట్లాడాలి. పేషెంట్ విష యంలో మీ డయాగ్నసిస్ తప్పటం ఏమిటి?''

''నో,నో! దానికి నేనేం మైండ్ చేయటం లేదు.''

''చెయ్యకూడదు కూడా. పొరపాట్లు సహ జమే కదా?''

"ఆమె స్థితి చాలా పేథటిక్‌గా ఉంది కదూ, పద్మజా? అసలు సంగతి తనకేం తెలీనట్టు కనిపించింది. ఎంత అడిగినా చెప్పకుండా దాచింది. అయితే హాస్పిటల్ కెందుకు వచ్చినట్టు?"

"తప్పు జవాబులిస్తే మరేదో జబ్బుగా భావించి అది పోయేందుకు మందులు ఇస్తాం కదా? వాటితో కడుపు పోతుందని ఆశపడింది!"

"పద్మజా! ఆమె ఏం కావాలి? గ్రామాల్లో కస్టమ్స్ చాలా స్ట్రిక్టు కదా?"

"చెయ్యగలిగితే రహస్యంగా ఎబార్షన్ చేయించుకోడానికి ప్రయత్నిస్తుంది. అవమానానికి తట్టుకునే ధైర్యం లేకపోతే ఆత్మహత్యకు పూనుకుంటుంది. సాధారణంగా జరిగేది అదే!"

"అయ్యయ్యో! ఇక్కడే ఎబార్షన్ చెయ్యవచ్చు కదా?"

"ఆమె అలా అడగ లేదు కదా?"

"ఎన్నో నిబంధనల మధ్య మసిలే ఇండియన్ స్త్రీకి అసలీ పరిస్థితి ఎలా సంభవిస్తుంది?... అయ్యో! ఆమె చాలా భయపడుతోంది. ఇంటికి వెళ్తే ఏం జరుగుతుందో!"

జార్జికీ పద్మజకీ ఎక్కువ సంభాషణే జరిగిందా రోజు. జార్జి కన్నుల్లో తొణకిసలాడే దయా ఆర్ధ్రతా అమితంగా ఆకర్షించింది పద్మజని.

★ ★ ★

"నువ్వు డాక్టర్‌వి కదా జార్జ్? ఎందుకలా పేషెంట్స్‌ని చూసి చలించిపోతావు?" అంటూ ఉంటుంది పద్మజ. జార్జిలో పద్మజకి నచ్చిన గుణం అదే. అయినా అతన్ని అలా అడుగుతుంది.

"డాక్టరు కూడా మనిషే కదా? పేషెంటు బాధకి డాక్టర్‌కి కూడా బాధకలగాలి. డాక్టర్ పని మందులివ్వడం ఒక్కటే కాదు పద్మా!"

అతనలా మాట్లాడితే పద్మజకి ఎంతో నచ్చుతుంది. నవ్వుతుంది.

ఒకసారి పద్మజ జార్జీ వాళ్ళింటికి వెళ్ళింది. జరీ అంచు తెల్ల చీర కట్టుకుని ఎర్రటి బ్లౌజు వేసుకుంది. వాలు జడ అల్లుకుంది. తిలకం చిన్నగా గుండ్రంగా దిద్దుకుంది. జడలో చిన్న గులాబీ పువ్వు పెట్టుకుంది.

జార్జి ఇంట్లో అందరూ సంతోషంగా ఆహ్వానించారు పద్మజని. జార్జి తల్లి మేరీ విలియమ్స్ కాన్వెంట్‌లో హెడ్‌గా పనిచేస్తోంది. తండ్రి జీవించిలేడు. తమ్ముడు అగస్టీన్, చెల్లెలు ఎలిజా చదువుకుంటున్నారు స్కూల్స్‌లో.

జార్జి తల్లి పద్మజతో చాలా ఆప్యాయంగా మాట్లాడింది. పద్మజలా పెద్ద చదువులు చదివే ఆడ పిల్ల లంటే ఆమెకు చాలా ఇష్టం. "మా అబ్బాయి నీ గురించి ఎప్పుడూ చెపుతూ ఉంటాడమ్మా! నువ్వు చాలా తెలివైన దానివని చెపుతాడు" అంది.

పద్మజ నవ్వింది. "అదంతా నిజం కాదు లెండి!" అంది.

"మా అబ్బాయి అబద్ధాలు చెప్పడు" అంది తల్లి.

"హాస్యానికి చెప్పివుంటాడు!"

"మా అబ్బాయి ఉత్త పుణ్యానికి హాస్యాలాడడు!" అంది తల్లి మళ్ళీ.

పద్మజ నవ్వి ఊరుకుంది.

వాళ్ళింటి నించి తిరిగి వెళ్ళేటప్పుడు ఆ ఇంట్లో అందరూ ఆప్తులే అనిపించింది పద్మజకి.

ఆ తర్వాత కూడా ఆ ఇంటికి అప్పుడప్పుడూ వెళ్తూనే ఉంది.

జార్జి మీద ఇష్టం... విడవ లేని బంధంగా మారిపోయింది.

తెలుగు జానపద చిత్రాలు జార్జి చాలా ఇష్టపడతాడు. అష్టకష్టాలూపడి రాక్షసులందర్నీ చంపి, మాయ తివాసీలూ, మంత్ర దండాలూ వశం చేసుకుని గగన కుసుమాలు దక్కించుకునే కథలు అతని కెంతో సరదా. "జీవితం ఎప్పుడూ సుఖంగా ఉండాలి. అలా ఉంచుకునే వాళ్ళంటే నాకు చాలా ఇష్టం!" అంటాడు.

"జీవితాన్ని సుఖంగా ఉంచుకోవటం, ఉంచుకోకపోవటం మన చేతుల్లోనే ఉందా?" విస్మయంగా అడిగింది పద్మజ.

"ఉందనుకుని ప్రయత్నిస్తే తప్పకుండా ఉంటుంది."

ఎగిరెగిరిపడే కెరటాలు చూస్తూ, సముద్రపు హోరువింటూ ఇసకలోనడిచారు చాలా దూరం. ఉన్నట్టుండి నవ్వుతూ అన్నాడు జార్జి — "నాకు నువ్వు తెలుగు నేర్పాలి పద్మజా! రాయనూ, చదవనూ నేర్చుకోవాలనుకుంటున్నాను."

"ఊఁ! నేర్చుకొని?"

"నేర్చుకుని మరెవరికైనా నేర్పుతాను."

"వద్దులే, ఎందుకా ప్రయాస నీకు?" నవ్వింది పద్మజ.

కోపం నటించాడు జార్జి. "అయితే నేర్పవా నాకు?"

"నేను కోరినంత జీతం ఇచ్చుకోగలవా?"

"ఇవ్వలేకపోతే రుణపడి ఉంటాను!"

"నాకేం ప్రయోజనం?" జార్జి కన్నుల్లోకి చూస్తూ నవ్వింది పద్మజ. ఆ నీలి రంగూ, ఆ రంగులోని మృదుత్వం పద్మజకు కావాలనిపించింది. ఆ పసుపు రంగు చెంపల్ని తాకుతూ, తేనె రంగు జుట్టు నిమురుతూ అలా కనుపాపల్లోకి చూస్తూ కాలం గడిపెయ్యాలనిపించింది.

"పద్మజా! ఏమిటలా చూస్తావ్?" నవ్వుతూ అడిగాడు జార్జి.

మృదువుగా నవ్వింది పద్మజ. "నీ అందం."

"హాస్యమాడుతున్నావు."

"అవును. నీతో కాకపోతే మరెవరితో?"

పద్మజ ఏం మాట్లాడుతోందో కూడా అర్థం కాలేదు జార్జికి.

అక్కడితో ఆ ప్రసక్తి తప్పిస్తూ, "చూడు జార్జ్! అటు చూడు! సముద్రం ఎంత ఉల్లాసంగా ఉందో. పట్టరాని సంతోషంతో కేరింతలు కొడుతోంది కదూ?" అంది.

"ఇవ్వాళ పౌర్ణమి. గుర్తు లేదా?"

"మనస్సు ఆలోచనలతో వేగిపోతూంటే ఎన్నని గుర్తు ఉంటాయి?"

"నీ మనస్సు బాగా లేదా, పద్మా?"

"ఊహూఁ, బాగా లేదు, ఏం? నీ మనస్సు హాయిగా ఉందా?"

"నా మనస్సు ఎప్పుడూ హాయిగానే ఉంటుంది."

"కొంచెం కూడా దిగులు లేదా?"

"ఎందుకూ? దిగులెందుకూ?"

"నీ కేమీ కావాలనిపించటం లేదా జార్జ్?"

జార్జి పద్మజ మొహంలోకి చూశాడు. "నిజమే పద్మా! ఇలా నీ కేసి చూస్తోంటే ఏదో కావాలనిపిస్తోంది, కానీ అదేమిటో తెలీటం లేదు."

"తెలుసుకోటానికి ప్రయత్నించరాదూ?"

మౌనంగా కూర్చున్నాడు జార్జి.

వెన్నెల కాంతి సముద్రపు నీటి మీద పడి చెదిరిపోతోంది.

"వెళదాం జార్జీ! చాలాసేపైంది" లేచింది పద్మజ.

★ ★ ★

గదిలో కూర్చుని పుస్తకం తెరిచిందేకానీ చదువు మీద మనస్సు లగ్నం కాలేదు. ప్రయత్నించి చదవలేక విఫలురాలై లేచి లైటార్పి వరండాలోకి వెళ్ళి నించుంది.

చందమామ గుండ్రంగా ఉంది. అంతులేనంత వెన్నెల కాస్తూంది. అంత చల్లదనంలోనూ పద్మజ వెచ్చగా నిట్టూర్చింది.

జార్జిలో ఏం చూసి తనింత మతి పోగొట్టుకుంటూంది? కళ్ళ నీలి రంగూ, చెంపల పసుపు రంగూ ... ఆ రంగుల కోసమా తన ఇష్టం? జార్జి నీ కెందుకంత ఇష్టమని ఎవరైనా అడిగితే ఏం జవాబు చెప్తుంది? అన్నింటికీ కారణాలు ఉంటాయా? ప్రతి ప్రశ్నకూ జవాబు వస్తుందా?

ఒక సారి — బీచ్‌లో నడుస్తూ అడిగాడు జార్జి — "పద్మా! మీలో వర్ణాంతర వివాహాలూ, మతాంతర వివాహాలూ జరుగుతూ ఉంటాయా?"

"ఏం, ఎందుకలా అడిగావు?"

"తెలుసుకుందామని."

"తెలుసుకుని?"

"తెలుసుకుని, వేరే మతం అమ్మాయిని వివాహం చేసుకుందామని" చిలిపిగా నవ్వాడు జార్జి.

"ఇష్టమైన అమ్మాయా? వేరే మతం అమ్మాయా?"

"ఇష్టమైన అమ్మాయే వేరే మతం అమ్మాయి అయితే?"

"ఇష్టం కలిగిన తర్వాత మతం అడ్డుపడు తుందా? అలా అయితే అదేం ఇష్టం? నీ ప్రేమ అమెకు దొరికితే, ఆమె ప్రేమ నీకూ దొరుకు తుంది. స్త్రీలైనా పురుషులైనా, ఏ దేశం వారైనా, ఏ మతం వారైనా, మనస్తత్వాలు ఒకటే!"

"నే నడిగిన దానికి నువ్వు జవాబు చెప్పనే లేదు పద్మజా! మీ మతం అమ్మాయి, మతాంతర వివాహానికి సాహసిస్తుందా?"

"నా కెలా తెలుస్తుంది?"

"నీకు ఆ సాహసం లేదా?"

జార్జి సంభాషణా ధోరణి చివరికి అదే ప్రశ్న మీద నిలుస్తుందని ఊహించగలిగిన పద్మజ చిరునవ్వు నవ్వింది. "సాహసం ఉన్నా, నాకా కోరిక ఉండాలి కదా జార్జ్?"

జార్జి చటుక్కున పద్మజ చెయ్యి పట్టు కున్నాడు. "ఇప్పుడు చెప్పు! నీకా కోరిక లేదూ? లేదని చెప్పు!"

"లేదు. నిజంగా లేదు. నిన్నే పెళ్ళి చేసుకో వాలని నేను కలలు కంటున్నాననుకుంటు న్నావా?" చిరు కోపం నటిస్తూ అడిగింది.

"నీ కలలు తెలియవుగానీ నీ మనసు నాకు తెలుసు పద్మా!"

పద్మజ హృదయం పులకరించింది, సము ద్రంతో పోటీ పడుతూ ఉప్పొంగింది.

"పద్మా!"

"................"

"పద్మా!"

"ఊఁ..."

"ఎందుకంత మౌనంగా కూర్చున్నావు? నేను నిన్ను చూస్తూ కూర్చుంటే నువ్వు ఎటో చూస్తున్నావు!"

"అనంతమైన జల రాశికేసి చూస్తున్నాను. సముద్రం అంటే నాకు చాలా ఇష్టం."

"ఎందుకని?"

"అన్నింటికీ కారణాలుండవు."

"ఎందుకుండవు? ఏదో చిన్న కారణం లేకుండా అనురాగం పుట్టదు."

"అయితే, నే నంటే నీ కెందుకంత ఇష్టం పుట్టింది?" కళ్ళెత్తి జార్జి కళ్ళల్లోకి చూసింది పద్మజ.

జార్జి తదేకంగా చూస్తూ అన్నాడు.

"ఎందుకా? నువ్వు మంచి హృదయంగల అమ్మాయివి! విశాల భావాలు గల అమ్మా యివి! ... పద్మా! నువ్వు నిజంగా నా కోసం సాహసం చెయ్యగలవా?" జార్జి కంఠ స్వరంలో చిత్రమైన ఆవేశం ధ్వనించింది.

పద్మజ చిలిపిగా నవ్వింది. "నీ కోసం నే నెందుకంత సాహసం చెయ్యాలి?"

"చెయ్యాలి పద్మా! నువ్వు లేకుండా నేను బతకనేను."

"మరి, నా తల్లిదండ్రుల ఇష్టాలూ, మా కులాచారాలూ, హిందూ మత నియమాలూ, అవన్నీ ఏం కావాలి?"

"దానికి నేనేం చెప్పగలను? అందుకే కదా సాహసం చెయ్యగలవా అని అడిగాను?"

"మరి నువ్వు నా కోసం ఏంచేస్తావు?"

"చెప్పు! ఏం చెయ్యమంటావు?"

నిండుగా నవ్వింది పద్మజ.

లేచి నడుస్తూ పద్మ చేయి గుప్పిట్లోకి తీసు కున్నాడు జార్జి. "నాకు మాటివ్వాలి పద్మా! నా మనసుకెంతో సంతోషంగా ఉంటుంది!"

"వాగ్దానాల ద్వారా మనుషుల్ని బంధిం చటం వివేకం అనిపించుకోదు! వాళ్ళ అను రాగమే వాళ్ళని బంధించాలి!"

"అవుననుకో!"

"నా మనసు నీకు తెలుసునన్నావుగా?"

"తెలుసు పద్మా! ... కానీ..."

"సందేహమెందుకు? నేను నీ కెప్పుడో బందీనై పోయాను!"

ఎన్నడూ ఎరగని సిగ్గుతో చూపులు దించేసు కుంది పద్మజ.

తను జార్జికి మాట ఇచ్చేసింది!

తను అతనికి బందీ అయిపోయాననీ, తన మనస్సంతా అతని రూపంతో నిండిపోయిందనీ, మనస్ఫూర్తిగా అతనితో చెప్పింది. అతన్నే వివాహం చేసుకుని అతనితో జీవిస్తానని నమ్మ బలికింది.

తన జీవిత భాగస్వామిని నిర్ణయించుకోవ డానికి తనకు సర్వ స్వతంత్రాలూ ఉన్నాయనే విశ్వసించింది!

★ ★ ★

ట్రెయిన్ దిగి వస్తూనే జార్జికి ఫోన్ చేసింది. ఓ అర గంటలో అతను రావచ్చు. తండ్రి ఒక్కడైనా తనని అర్థం చేసుకుంటాడనుకుంది. భర్తను నిర్ణయించుకోగలిగే ధైర్యం, వివేకం, తనకు ఉన్నాయని ఆయన స్వయంగానే అన్నాడు. తను ఇష్టపడే వ్యక్తితోనే వివాహం జరిపిస్తానని సంతోషంగా చెప్పాడు. తీరా తన కోరిక వినేసరికి తట్టుకోలేకపోయాడు. ఆ కొద్ది నిమిషాలలోనే తండ్రి క్షోభ పద్మజను రంపపు కోత కోస్తూంది.

మతానికీ మతానికీ తేడా వుంది.

జాతికీ జాతికీ తేడా వుంది.

అందుకే, మనిషికీ, మనిషికీ కూడా తేడా ఉంది — తండ్రి దృష్టిలో! జార్జికీ, తనకూ ఎంత మాత్రం సంబంధం పనికిరాదని ఆయన ఉద్దేశ్యం! తను మాత్రం దాన్ని అంగీకరించదు.

జాతి మత ప్రభావాలు మనిషి మీద ఉండ వచ్చు కొంతవరకూ. కానీ, ఆ భేదాలే అనవసరం అని గ్రహిస్తే వాటికి బానిసలైపోరు.

ఏ ఇద్దరు మనుషుల మానవత్వానికీ తేడా లేదనే తన ఉద్దేశ్యం.

తనేమీ పొరపాటుగా ప్రవర్తించలేదు.

పసితనం నుంచి అల్లారుముద్దుగా పెంచి తన ముద్దు ముచ్చట్లన్నీ తీర్చిన తండ్రి హృద యానికి పెద్ద విఘాతమే కలిగించింది! అయినా తాను చేసింది పొరపాటు కాదు! ఆలోచనల ఉధృతం తగ్గితే మనస్సు కొంత తేలికైంది.

జార్జి కారు, చప్పుడు లేకుండా వచ్చి ఆగింది. జార్జి పైకి వచ్చాడు. పద్మజ ఎప్పటిలాగే ఉంది. అదే చిరునవ్వు! అదే గాంభీర్యం!

"వచ్చేశావా పద్మా?"

"కూర్చో!"

జార్జి పద్మజ పక్కనే కూర్చున్నాడు.

"చాలా తొందరగా వచ్చేశావ్!"

"వచ్చేశాను!"

"వారం రోజులైనా అవుతుందనుకున్నావు కదూ?"

"అనుకున్నాను, అవసరం లేకపోయింది."

"ఈ మూడు రోజుల నుంచీ క్షణం యుగం లాగ, పిచ్చివాడిలాగే గడిపాను. నీ ఫోన్ వస్తే నమ్మలేకపోయాననుకో! వెంటనే డ్యూటీకి లీవ్ పెట్టి వచ్చేశాను! ... అందరూ బాగున్నారా మీ ఇంట్లో?"

పద్మ సుదీర్ఘంగా నిట్టూర్చింది. "నువ్వు నా జీవితంలో ప్రవేశించకుండా ఉంటేనే బావుండేది జార్జ్!"

"పద్మా!"

"నీ కోసం నేను అందర్నీ వదులుకొని వచ్చేశాను!"

అర్థం కాని ఆందోళనతో చూశాడు జార్జి.

"నువ్వు తప్పితే నా కిప్పుడెవరూ లేరు!"

పద్మజ గడ్డం పట్టుకొని కళ్ళలోకి చూశాడు జార్జి. "నిజం చెప్పు పద్మా! నా కోసం అంత త్యాగం చేశావా?"

"నీ కోసం కాదు. నా కోసమే చేసుకున్నాను. నా సంతోషం కోసం, నా శాంతి కోసం, అంతా నా కోసమే చేసుకున్నాను!"

జార్జి పద్మజ భుజం మీద చెయ్యివేశాడు. "బాధపడుతున్నావా పద్మా? అసలేం జరిగిందో చెప్పవా?"

"అంతా నే నన్నట్టే జరిగింది. నాన్న చెప్పిన సంబంధం నా కిష్టంలేదని చెప్పేశాను. పోనీ నా కిష్టమైన వివాహమే చేస్తానంటే నీ గురించి చెప్పాను..."

"ఊఁ, ఏమైందప్పుడు? వారికి చాలా కోపం వచ్చిందా?"

“కోపాన్ని దాచుకోగలిగారు కానీ బాధని అణచుకోలేకపోయారు. కొంత వరకూ చెప్పి చూశాను. నా నిర్ణయం మారదని తెలుసుకుని నా దారిని నన్ను పంపించి వేశారు!”

“ఎంత సంస్కారం! చివరికి వారు నిన్ను క్షమించినట్లేనా?”

“కాదు, అది క్షమించడం కాదు. నా అభి ప్రాయం గట్టిగా చెప్పాను కాబట్టి, ఆయన ఏమీ చెయ్యలేకపోయారు. మా అమ్మకి ఇంకా తెలీదు. తెలిస్తే ఏమైపోతుందో ఊహించలేను.”

“అయ్యో! ఆవిడకి కూడా చెప్పి రావల సింది పద్మా! తల్లితో ఆ మాత్రం వాదించి ఒప్పించలేవా?”

“అన్నీ తెలిసిన మా నాన్నే ఒప్పుకోలేదు కదా?”

“అయినా సరే, తల్లి వేరు. నువ్వు అడిగితే ఆవిడ ఎందుకు వినదు? ఆవిడి దగ్గిరికివెళ్ళి నేను బతిమాలుకుంటాను పద్మా! పద్మజ లేకపోతే నేను బతకలేనని చెపుతాను. నన్ను తీసుకువెళ్ళు!”

పద్మజ విచారంగా నవ్వింది. “నీ మంచి తనం వల్ల నీకు అలా అనిపిస్తోంది. మత పిచ్చిలో మునిగి ఉన్న వాళ్ళ హృదయాలు మూసుకు పోయి ఉంటాయి! వాళ్ళని మార్చాలని ఆరాట పడడం దండగ... శాశ్వతంగా... అందర్నీ వదులు కుని వచ్చేశాను జార్జ్!”

“పద్మా” గాఢంగా హృదయానికి హత్తుకు న్నాడు జార్జి. అపూర్వమైన పెన్నిధి లభించినంత ఆనందంగా పద్మజ శరీరం చుట్టూ చేతులు చుట్టి పదిలపరచుకున్నాడు.

“మనం సాధ్యమైనంత తొందరగా పెళ్ళి చేసుకుందాం పద్మా! నీ తల్లిదండ్రుల్ని వదిలి వచ్చేశావు. నువ్విక ఒక్క ఘడియ కూడా ఒంటరితనంతో బాధపడ కూడదు!”

“నువ్వుండగా నే నెప్పుడూ ఒంటరిని కాను జార్జ్!”

★ ★ ★



వారం రోజుల లోపునే డాక్టర్ పద్మజ, డాక్టర్ జార్జి విలియమ్స్‌ల పెళ్ళి ఫోటోలు పత్రి కల్లో అచ్చయ్యాయి.

లోకం ఎప్పుడూ బహు ముఖాలుగానే ప్రవ ర్తిస్తుంది. పద్మజా విలియమ్స్‌ల వివాహాన్ని గురించి పరిచితులూ, అపరిచితులూ కూడా తమకు తోచిన విధంగా విమర్శించుకున్నారు. కొందరు సంతోషించారు. కొందరు వ్యతిరేకిం చారు.

“ఎంతైనా పద్మజ స్వార్థంగా ప్రవర్తించింది” అనుకున్న పార్వతి, ఒకటి రెండు రోజుల్లో తన అభిప్రాయం చాల వరకు మార్చుకుంది.

“పద్మని అపార్థం చేసుకుంటున్నానేమో!” అనుకుంది. పద్మజ తనకు చిన్నతనం నించీ తెలిసిఉన్నా, ఆ సాహసం తనకు అర్థం కాదేమో అనుకుంది.

ఆఫీసు నుంచి వచ్చి తాళం తీసుకుని గదిలో అడుగుపెట్టేసరికి కళ్ళ పడిందో కవరు. స్నేహితురాలి ధ్యాసలోనే ఉన్న పార్వతి అది పద్మజ రాసిందే కావచ్చునని ఆత్రుతగా వంగి తీసుకుంది.

**“పార్వతి అక్కయ్యా!**

నీకు ఉత్తరం వ్రాయాలని వారం రోజుల నుంచీ ప్రయత్నం. నేను వ్రాయబోయే విశేష మేమిటో నీకూ తెలిసే ఉంటుంది. అక్కయ్య ఇంత కర్కశంగా తెంచుకుని వెళ్ళిపోయిందంటే ఎంత ఆశ్చర్యంగా ఉందో అంత సహజంగానూ ఉంది!

డాక్టర్ పద్మజా దేవీ, డాక్టర్ జార్జి విలి యమ్స్‌ల పెళ్ళి ఫోటో పడ్డ పేపరు ఇక్కడికి, ఇంట్లోకి వచ్చినప్పుడు ఇక్కడి పరిస్థితి ఎంత అల్లకల్లోలమై పోయిందో నేను వ్రాయకుండానే నువ్వు ఊహించుకోగలవు.

ఈ సంగతి అమ్మ మొదట నమ్మలేదు. అమ్మే కాదు, అక్కయ్య ఇంత పని చేసిందంటే ఇప్పటికీ నేను నమ్మలేకపోతున్నాను. ఈ ఇంటి ఆచార వ్యవహారాలలో ఏ చిన్న సంఘటనని

గుర్తు పెట్టుకున్నా, అక్కయ్య ఇంత సాహసం చెయ్యగలిగేది కాదు.

ఆ నాటి నుంచీ ఇంట్లో ఎవ్వరికీ నిద్రాహారాలు లేవంటే అతిశయోక్తి కాదు. అన్నయ్య కోర్టుకు వెళ్ళటం లేదు. నాన్నగారు పక్క విడిచి లేవటం లేదు. ఆయనకి బ్లడ్‌ప్రెషర్ అధికమయింది. అమ్మ మాట సరే! ఆ మూల గది విడిచి రావటం లేదు. వదినా, నేనూ మాత్రం వంట గదిలో కూర్చుని బిక్కు బిక్కుమంటూ రోజులు దొర్లిస్తున్నాము.

ఏ పరిస్థితినీ మనస్సుకు పట్టించుకోకుండా, కష్టానికీ సుఖానికీ ఒక్కలాగే చిరునవ్వు నవ్వగలిగే నాన్నగారు ఎంత మారిపోయారో! ఆయన గాంభీర్యమంతా ఏమైపోయిందో నువ్వు చూస్తేగానీ నమ్మవు. ఈ అప్రతిష్ఠతో ఇక ఆయన లోకం మొహం చూడరనుకుంటున్నాను.

అమ్మ గురించి వ్రాయాలంటే ఏం వ్రాయగలను? కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూందని వ్రాయనా? తనలో తను కుమలిపోతోందని వ్రాయనా? ఈ వారం రోజులకే పోలిక దొరకనంత చిక్కిశల్యమైందని వ్రాయనా? రాత్రింబవళ్ళూ అమ్మ నోటి మీదుగా వచ్చేది ఒక్కటే మాట. 'ఆ పాపిష్టి దానికి ఆకస్మాత్తుగా ఏదో రోగం వచ్చి చచ్చిందని తెలిస్తే ఒక్క ఏడుపు ఏడచి ఊరుకునే దాన్ని. లోకంలో అందరికీ వచ్చే కష్టం నాకూ వచ్చిందని సరిపెట్టుకునే దాన్ని. కావలసిన వాళ్ళంతా దగ్గిర చేరి ఓదార్చుతుంటే కొండంత ధైర్యం తెచ్చుకునే దాన్ని. ఇదేం ప్రారబ్దంరా భగవంతుడా! ఆ ఏడుపుకి కూడా దూరం చేసింది నన్ను. ఇంటా వంటా లేని అప్రాచ్యపు పని చేసింది. అగ్నిహోత్రంలా వెలిగే కుటుంబానికి మాయని మచ్చ తెచ్చింది. నీతి నియమాలతో బ్రతుకుతూన్న వాళ్ళని అప్రతిష్టల పాలు చేసింది. ఒక్క సారి తండ్రి మొహం... కన్న తండ్రి మొహమైనా గుర్తు తెచ్చుకోలేకపోయింది!' అంటూ తనలో తను ఏడ్చుకుంటూ పడి ఉంటోంది అమ్మ. అమ్మని చూస్తుంటే పిచ్చిదైపోతుందేమో ననిపిస్తూంది ప్రతి క్షణం.

"పద్మజ ఇలా చేసిందని తెలిసింది. నిజమేనా? ఈ సంగతి మీకు ముందే తేలీకుండా ఉంటుందా? ఆడ పిల్లల్ని బొత్తిగా అలా వదిలేస్తే బ్రాహ్మణ్యం మంటకలవక ఏమౌతుంది?" అంటూ దగ్గిర బంధువు ఒకాయన చాలా కోపంగా వ్రాసిన ఉత్తరం మొన్న అందింది. నాన్నగారు చదువుకున్నారుగానీ అమ్మకు చూపించ లేదు.

నిన్నొక తెలిసినావిడ పనిగట్టుకుని వచ్చింది అమ్మని ఓదార్చటానికి. "అయ్యో, ఇంత పని జరిగిందా? అయిందేదో అయిందిలే. నువ్వేం బాధపడకు వదినా! పాడు ప్రపంచంలో ఎన్ని వింతలు జరగటం లేదు గనకా? ఇదీ అందులో ఒకటీ. మరేం చేస్తాం?" అంటూ ఒక గంటసేపు కూర్చుని అమ్మని మరీ ఏడిపించి వెళ్ళింది.

మమ్మల్నందర్నీ ఇంత అప్రతిష్టకూ, ఇన్ని అవమానాలకూ, ఇందరి సానుభూతికీ గురి చేసిన అక్కయ్యను ఏంచేస్తే పాపం ఉంది? ఈ స్థితిలో అక్కయ్యను కలుసుకో గలిగితే ఎన్ని మాటలైనా అడుగుతాను. చదువు చదివి డాక్టర్ కాగానే సర్వ స్వతంత్రురాలినై పోయాననుకుందా? ఆ చదువు ఎవరు చెప్పించారో, అంత స్వతంత్రం ఎవరు ప్రసాదించారో, తన ఔన్నత్యానికి అసలెవరు కారణమయ్యారో ఒక్క సారైనా ఆలోచించిందా? రెక్కలు మొలిచీ మొలవగానే ఎగిరెగిరిపడే పక్షి పిల్లలా మంచి చెడ్డలు విస్మరించి ఇంత అవివేకంగా ప్రవర్తించటం తగుననుకుందా?

అక్కయ్యని ఇంతగా విమర్శించి అసహ్యించుకునే రోజు వస్తుందని ఏ నాడయినా అనుకున్నానా నేను? ఊహ తెలియని క్షణం నుంచీ అక్కయ్య నెంతగా ఆరాధించానో, అక్కయ్య ఔన్నత్యం చూస్తూ ఎంత మురిసిపోయానో, ఎలా చెప్పను? అక్కయ్యలా పెద్ద చదువు చదివి పేరు తెచ్చుకుని, అక్కయ్య అడుగు జాడల్లో నడవాలని ఆశా సౌధాలు నిర్మించుకున్నాను. ఇప్పుడు నా ఆశల్ని తల్చు

కోవడానికి కూడా సాహసం చాలడం లేదు.

మొన్న ఏం జరిగిందో వ్రాస్తాను. ఒక టెక్స్టు బుక్ కొనాలని అన్నయ్య దగ్గిరికి వెళ్ళి డబ్బు అడిగాను. అన్నయ్య నన్ను ఆశ్చర్యంగా చూస్తూంటే అర్థంగాక తికమకపడుతూ నించున్నాను. ఎందుకో అపరాధిలా తలదించు కున్నాను.

"ఇంకా కాలేజీకి వెళ్ళాలనేనా సుజా?" అని అన్నయ్య అంత నెమ్మదిలోనూ ఎంతో కర్క శంగా అడిగాడు. మొట్టమొదట అర్థంకాక అర్థం కానట్టే చూశాను.

"ఇక ఏ పుస్తకాలూ కొనక్కర్లేదు, కాలేజీకి వెళ్ళనూ అక్కర్లేదు. ఇప్పటికి జరిగిన పరాభవం చాలు. లోపలికి వెళ్ళు!" అన్నాడు.

నేను నిర్ఘాంతపోయి, "చదువు మానె య్యనా!" అన్నాను.

"వెళ్ళు సుజా! ఇక మాట్లాడకు. లోకం మరొక సారి నవ్విపోకముందే మన జాగ్రత్తలో మనం ఉండటం మంచిది!" అన్నాడు మళ్ళీ.

పార్వతీ! నేను కూడా అక్కయ్యలాగే చేస్తా ననే కదూ అన్నయ్య భయం? కానీ... నన్ను అర్థం చేసుకోటానికి అన్నయ్య ప్రయత్నించలేదు. నేను బాధపడతాననైనా ఆలోచించలేదు! స్వార్థ పరురాలయిన అక్కయ్యతోనే నన్నూ జమ కట్టాడు. కానీ, అక్కయ్య చేసిన పనికి, అందరి కన్నా ఎక్కువగా నేనే బాధపడుతున్నాను. నన్ను చూసి లోకం నవ్వేలాగ ఎన్నడూ చెయ్యను. నేను సుజాని! పద్మని కాదు. తల్లిదండ్రుల సంతోషం కోసం ప్రాణాలనైనా అర్పించగల బిడ్డనే గానీ ఆ పవిత్ర హృదయాల్ని చీల్చి చెండాడే కఠిను రాల్ని కాను!

"అన్నయ్యా! నన్ను అర్థం చేసుకోవూ?" అని ఏడవాలనిపించినా ఏమీ చెయ్యలేకపో యాను. నోరు తెరిచి జవాబే చెప్పలేక తలదించు కుని నిలబడ్డాను.

"ఇలా రా, సుజా!" అంటూ అన్నయ్య అమ్మ పడుకున్న గది గుమ్మం ఎదుటి కెళ్ళి "అమ్మా" అని పిలిచాడు. "సుజా, కొత్త పుస్తకం ఏదో కొంటానంటోంది. పది పదిహేను రోజుల్లో కాలేజీ తెరుస్తారుగా?" అన్నాడు.

"అన్నయ్యా!" కోపం ఆపుకోలేక అరిచాను. "నువ్వు చెపితే విననని అమ్మతో ఫిర్యాదు చేస్తు న్నావా? నన్నిక చదివించటం మీ కిష్టంలేదంటే రాద్ధాంతం చేస్తాననుకున్నావా? మన పరువు మర్యాదల కన్నా నా కాలేజీ చదువు ఎక్కువేం కాదన్నయ్యా! నేను కాలేజీ మానుకోవటంతోనే మన పరువు నిలుస్తుందంటే సంతోషంగా మానేసుకుంటాను" అన్నాను గబ గబా.

ఎన్నడూ నే నలా పెద్దవాళ్ళతో ధైర్యంగా మాట్లాడలేదు. నేనంటే ప్రాణాలు పెట్టే అమ్మ, విషయం అర్థంచేసుకుని దీనంగా చూసింది. "పోనీ దీన్ని చదువుకోనియ్యి శాస్త్రీ! సుజా ఎప్పుడూ అలా చెయ్యదు!" అంది.

"వద్దమ్మా. నే నిక చదువుకోను" అన్నాను. నేను చదువు మానేస్తేనే అమ్మ సంతోషిస్తుంది. అమ్మ సంతోషం కోసం ఏమైనా చేస్తాను— అనుకున్నాను.

"నా బిడ్డవి నువ్వే తల్లీ! నేను కన్న వాళ్ళు ఇద్దరే! ఆ ఇద్దరూ నా కళ్ళకెదురుగా ఉన్నారు" అని, వెర్రి పట్టినట్టు అన్నయ్యనీ, నన్నూ చూసింది అమ్మ.

బాగా చదువుకుని ఏదో ఐపోదామన్న ఆశ గాలిలో కలిసి పోతూంటే ఒక్క నిట్టూర్పు మాత్రం విడిచాను. హృదయం తేలికయ్యింది. అమ్మ కోసం, అమ్మ సంతోషం కోసం, ఇంకా ఏమైనా చెయ్యగలిగితే ఎంత బావుండును! అక్కయ్య చేసిన అఘాయిత్యాన్ని నేను పూడ్చగలిగితే! అమ్మ అంతా మరిచిపోయి నవ్వుతూ తిరగడా నికి నేనేమైనా చెయ్యవలసివస్తే తప్పకుండా చేస్తాను పార్వతీ! చేసి చూపిస్తాను!

ఇంత దుఃఖంలో కూడా అమ్మ నిన్ను మరిచిపోలేదు. నీతో స్నేహం చేసిన అక్కయ్యకు నీ గుణం ఒక్కటీ రాలేదేమా అని బాధపడు తూంది. ఒక్కసారి నువ్వు వచ్చి ఓదార్చితే అమ్మ కొంతైనా తేరుకుంటుంది. అమ్మని ఊరడించ

వలసిన ధర్మాన్ని అక్కయ్యలాగ నువ్వూ వదిలేసుకోవుగా?

నీ రాక కోసం నిరీక్షిస్తూ — సుజా"

తెలీకుండానే పార్వతి చెంపల మీదుగా కన్నీటి బొట్లు జారిపడ్డాయి. దీర్ఘంగా నిట్టూర్చింది. తనకు రుక్కుతో కూడా లేని అనుబంధమేదో ఈ సుజాతతో ఉందనిపిస్తుంది. తోడబుట్టిన పద్మకు దూర దూరంగా ఉండే సుజా, తన దగ్గిర మాత్రం దూరా భారాలు మరిచి మనస్సు విప్పి వెళ్ళబోసుకుంటుంది.

సుజా చదువు ఆగిపోయిందంటే పార్వతికెంతో బాధ కలిగింది. పద్మజ మీద కోపంతో సుజాని బలిచెయ్యడం ఏం న్యాయం? సుజా రాసిన ఉత్తరం పద్మజకు పంపితే ఏం చేస్తుంది? నిర్లక్ష్యంగా చించేస్తుందా? మౌనంగా నవ్వుకుంటుందా? పద్మజ అంత కర్కశంగా మారిపోయి ఉంటుందా? పార్వతి అంతరాత్మ ఆ ఆలోచనలతో ఏకీభవించలేదు.

★ ★ ★

"సుజా!"

నిశ్శబ్దం నలు మూలలా ఆవరించుకున్న ఆ ఇంట్లో అంత చిన్న పిలుపే కంఠం ఎత్తి అరిచినట్టు ప్రతిధ్వనించింది. ఇంకోసారి పిలవకుండానే, "ఎవరూ?" అంటూ వచ్చింది సుజాత.

"...పార్వతా!" సంభ్రమంగా అంది.

"నేనే!" చేతిలో సంచి బల్ల మీద పెట్టి లోపలికి నడిచింది పార్వతి.

మంచి నీళ్ళ గ్లాసు అందిస్తూ, "నా ఉత్తరం అందిందా?" అంది సుజాత.

"అందింది. నే నెలాగూ రావాలనుకుంటూనే ఉన్నాను. అమ్మకి ఒంట్లో ఎలా ఉంది? నిద్రపోతోందా?"

"లేదు. ఊరికే పడుకుంది. రా, వెళదాం!" అంటూ అమ్మ పడుకుని ఉన్న గది గుమ్మం ముందుకు నడిచింది సుజాత.

"అమ్మా! పార్వతి వచ్చిందమ్మా!"

కామేశ్వరమ్మ లేచి కూర్చుంది. "పార్వతా? మన పార్వతే!" అంటూ.

"అవును, పిన్నిగారూ! ఒక సారి అందర్నీ చూసి వెళదామని" అంటూ మంచం దగ్గరగా బల్లమీద కూర్చుంది పార్వతి.

కామేశ్వరమ్మ బొత్తిగా నీరసించిపోయింది. మనోవ్యాధితో బాధపడుతూన్నట్టు స్పష్టంగానే తెలుస్తోంది.

"రుక్మిణీ, సూర్యం వాళ్ళూ బావున్నారా?"

"బాగానే ఉన్నారు పిన్నిగారూ! రుక్మిణికి మూడో మాసం అనుకుంటున్నారు. డాక్టరు కూడా చెప్పింది. వేవిళ్ళతో కొంచెం నీరసంగా ఉంది. ఫర్వాలేదు. మందులూ అవీ వాడుతోంది. సూర్యం రిజల్ట్సు తెలిశాయి. మొన్ననే బి.ఏ. పాసయ్యాడు. ఇక ఎక్కడైనా ఉద్యోగం చూసుకోవాలి" — అన్నీ చెప్పేసింది పార్వతి.

"ఉద్యోగం ఏదైనా దొరికేలా ఉందా వాడికి?"

"ప్రయత్నిస్తూనే ఉన్నాను. ఈ మధ్యనే మాకు కొత్త ఆఫీసరు వచ్చాడు. ఆయన చాలా మంచి వాడని విన్నాను. ఒక సారి వెళ్ళి అడిగితే ఏమౌతుందోమరి. ఇటు నుంచి వెళ్ళాక వెళదామనుకుంటున్నాను. ఈ రోజుల్లో ఉద్యోగాలంటే మాటలా పిన్నిగారూ! ఎంతో కష్టపడితేగాని దొరకవు."

"అయితే మీ చెల్లాయి పురుడు వాళ్ళింటి దగ్గరే పోసుకుంటుందా?"

"అలాగే అంటోంది మా అత్తయ్య, నాకిష్టం లేదు. నేనంటూ ఉంటే దానికి పుట్టిల్లు ఉన్నట్టే లెక్క! మొట్టమొదటి పురుడు కదా? తీసుకొచ్చి నా దగ్గిరే ఉంచుకుందామని ఉంది. రుక్కుతో పాటు అత్తయ్యని కూడా రమ్మన్నాను. ఆస్పత్రిలో చేర్చేస్తే అంతా వాళ్ళే చూసుకుంటారు. ఆ పల్లెటూళ్ళో ఎందుకు బాధపడాలి చెప్పండి?"

"నిజమే. నీ ఆలోచనే బావుంది."

కామేశ్వరమ్మ ఇంకా ఏమైనా అడుగుతూ ఉంటే బావుండుననిపించింది పార్వతికి. గడిచిన పదిహేను రోజుల్లోనూ తల్లి అంత ఎక్కువగా మాట్లాడటం చూడని సుజాత ఆశ్చర్యంగా

వింటూ కూర్చుంది.

"అఁ సుజా! పార్వతి ఎప్పుడు భోం చేసిందో ఏమో! స్నానం చేస్తుందేమో చూడు. వెళ్ళమ్మా పార్వతీ! స్నానం చేసి అన్నం తిను!"

మాట్లాడకుండా లేచింది సుజాత. వెంట వెళ్ళింది పార్వతి.

సుజా ఉత్తరంలో రాసినట్టు ఇల్లంతా వెల వెలబోతూ ఉంది. తండ్రి మేడ మీద గదిలో ఉన్నాడు. అన్నయ్య బైటికి వెళ్ళాడు. వదిన తన పడగ్గదిలో పడుకుని వుంది. తల్లి ఇంకో గదిలో పడుకొని ఉంది. ఎక్కడివాళ్ళక్కడ ఎవరి మన సుల్లో వాళ్ళు దుఃఖపడిపోతూ ఉన్నారు. సుజా కూడా ఎంతో చిన్నబోయి ఉంది. ఇంట్లో ఎవ్వరూ లేనట్టుగా వుంది. కొంచెం గట్టిగా మాట్లాడడానికి కూడా మనసు ఒప్పడం లేదు.

పార్వతికి అన్నం వడ్డించి దగ్గిర కూర్చుంది సుజాత. జరిగిందంతా మళ్ళీ చెప్పుకొచ్చింది. పద్మజ కబుర్లు చెప్తోంటే సుజా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి:

"అక్కయ్య ఇలా చేస్తుందని మనం ఎవ్వరం అనుకోలేదు కదూ పార్వతీ?" అంటూ పార్వతి మొహంలోకి చూసింది.

పార్వతి వెంటనే ఏమీ మాట్లాడలేకపో యింది. పద్మజ ఏం ఘోర నేరం చేసిందని వీళ్ళందరూ ఇలా బాధపడిపోతున్నారు? కోరు కున్న వాణ్ణి పెళ్ళి చేసుకుంది, అంతేగా? — సుజాతని చూస్తూ చాలా నెమ్మదిగా అంది పార్వతి — "పాపం పద్మని మనం అపార్థం చేసు కుంటున్నామేమో అనిపిస్తోంది సుజా! తను ఏం తప్పు చేసిందని?" అంది చిన్నకంఠంతో.

విస్మయంగా చూసింది సుజాత — "అక్కయ్య గురించేనా నువ్వు మాట్లాడుతు న్నదీ? తప్పు చెయ్యలేదూ? అదేమిటి, అక్క య్యని సమర్థిస్తున్నావా పార్వతీ?"

"తప్పుచేస్తే సమర్థించకూడదు, నిజమే. కానీ అసలు పద్మజ చేసింది తప్పంటావా? తనకు ఇష్టమైన మనిషిని పెళ్ళిచేసుకుంది. అతను పద్మజకు ఉద్యోగాల దగ్గిర పరిచయం. తర్వాత స్నేహం. అది పెళ్ళి దాకా వెళ్ళింది. మరి పెళ్ళంటే ప్రేమ కలిగిన వాళ్ళనే చేసుకోవాలి కదా? రఘు నా విషయములో చేసిన దానికి అమ్మా నాన్న ఏమన్నారు? అతను పిరికిగా ప్రవర్తించాడని అన్నారా లేదా?"

"అది వేరు, కులం ఒక్కటే అయినా అతను ధైర్యం చెయ్యలేక పోయాడు. అక్కయ్య విషయం అలా కాదుగా? అతను మన కులం కాదు, మతం కాదు. అలాంటి వాడి మీద ప్రేమ ఏమిటి?"

"మనం అయితే కుల మతాల్ని పాటిస్తాం. పద్మజ పాటించదుగా? మనుషులందరూ ఒకటే అంటుంది. అలాంటి మనిషికి కులాలూ మతాలూ అడ్డం వస్తాయా? అడ్డం వస్తే అదేం ప్రేమ?"

"అమ్మ దగ్గిర ఇలా మాట్లాడతావా ఏమిటి పార్వతీ? అమ్మ చాలా బాధపడిపోతుంది సుమా!"

"అయ్యో! అసలు నీ దగ్గిర మాట్లాడానికే భయంగా ఉంది నాకు. అమ్మ దగ్గిర మాట్లాడ తానా?"

"నువ్వు ఎన్ని చెప్పు పార్వతీ! తల్లిదండ్రులు ఎంతో ప్రేమతో పెంచుతారు కదా? మనం కూడా వాళ్ళకి బాధ కలగకుండా ప్రవర్తించాలా వద్దా?"

"అసలు బాధ ఎందుకుపడాలి తల్లిదం డ్రులు? చక్కగా వాళ్ళిద్దరికీ తల్లిదండ్రులే పెళ్ళి చెయ్యొచ్చు! పోనీ ఇప్పుడైనా వాళ్ళని పిల్చి నాలుగు రోజులు ఉంచుకుని పంపొచ్చు! పద్మజ చేసిన తప్పేమిటి? పెళ్ళి చేసుకుంది. అంతే కదా? పిల్లలు సంతోషంగా బతకడం కన్నా తల్లిదండ్రులకేం కావాలి?"

"ఇలాంటి పెళ్ళి వాళ్ళకి నచ్చదు కదా? వాళ్ళెలా సంతోషిస్తారు? అమ్మని ఒప్పించి చేసు కోకపోయిందా?"

"ఒప్పుకోదు కదా అమ్మ? ఇంకేం చేస్తుంది? తన దారిన తన వెళ్ళిపోయి చేసుకుంది!"

"మన బతుకులు నాశనం చెయ్యాలని

పెద్ద వాళ్ళు ప్రయత్నిస్తారా? మన సాంప్రదాయాలూ రీతి రివాజులూ — అన్నీ ఉగ్గుపాలతో నేర్చుకుని కూడా అలాంటి అర్థం లేని ఇష్టాలెందుకు పెంచుకోవాలి?''

''అమాయకంగా మాట్లాడుతున్నావు! ఈ నిబంధనలన్నీ మన లాంటి వాళ్ళకి గానీ పద్మజకు కాదు. అక్కయ్య తత్వం మొదటి నుంచీ తెలిసి కూడా ఇంత పిచ్చిగా బాధపడతావెందుకు? ఈ కాలంలో ఇంకా ఆచారాలూ కులాలూ గోత్రాలూ అని ఆలోచిస్తే అంతా సంకుచితంగానే కనిపిస్తుంది. పద్మజ లాంటి వాళ్ళే పుట్టకపోతే, సంఘం, ఎన్ని తరాలు వెనకబడి ఉండేదో అనిపిస్తోంది. ఎవరూ సాహసించకపోతే, సంఘ సంస్కారం ఎలా జరుగుతుంది? ఇవన్నీ మారనే మారవు!''

ఒక రకమైన చిరాకుతో చూసింది సుజాత. ''ఇప్పుడు సంఘానికి వచ్చిపడ్డ లోటేమిటంటావు?''

''కుల మతాలుండడమే పెద్ద లోటు కదా? మనుషులు మారకపోవటం లోటెందుకు కాదు? ఈ ఇంట్లో పరిస్థితే చూడు. నీ తల్లికి అక్షర జ్ఞానమైనా లేదు. ఆమె కడుపున పుట్టిన బిడ్డ డాక్టరైంది! స్త్రీ పురుషులు చదువులకనో, ఉద్యోగాలకనో కలసి మసలుతున్నారు. వాళ్ళ మధ్య స్నేహాలూ అనురాగాలూ సహజం కదా? ఇలాంటి పెళ్ళిళ్ళు జరుగుతాయి. పద్మని తప్పు పట్టడం అనవసరం సుజా!''

''నువ్వెన్నైనా చెప్పు పార్వతీ! ఆ సంఘ సంస్కారమేదో మా ఇంట్లో నుంచే బయల్దేరింది. అక్కయ్య మూలాన్న మా కుటుంబం అల్లరి పడింది. మేమంతా అవమానాల పాలయ్యాం. సంఘ సంస్కారం జరుగుతోందని సంతోషించేంత విశాల హృదయాలు లేవు మాకు!''

''నీకు చాలా కోపం వచ్చింది. ఇలా అనుకుంటే నా మనసులో మాట చెప్పేదాన్ని కాదు.''

''నాకేం కోపం లేదు పార్వతీ! ఒక్కటి చెప్పు! నువ్వే అయితే అక్కయ్యలా చేస్తావా, చెప్పు!''

''అలాంటి ధైర్య సాహసాలు నాకా? నేను పద్మని ఎన్నటికీ కాలేను.''

తిరస్కారంగా అంది సుజాత — ''ఆవిణ్ణి నువ్వింతగా మెచ్చుకోవలసిన ఘనతేమీ నాకు కనిపించటం లేదు. కనిపెంచిన తల్లిదండ్రుల్ని సంతోషపెట్టలేని వాళ్ళు ఎక్కడో సంఘాన్ని ఉద్ధరిస్తారనుకోవటంలో అర్థం లేదు. తన వాళ్ళంతా అవమానాలతో కృశించిపోతోంటే తను మాత్రం ఆనందంగా ఉంటే సరిపోతుందా?''

పార్వతి ఇంకేమీ అనలేదు.

మర్నాడు బయల్దేరే ముందు పార్వతి, కామేశ్వరమ్మ దగ్గిరికి వెళ్ళి కూర్చుంది. ''వెళ్ళి వస్తాను పిన్ని గారూ! వెళ్ళగానే ఉత్తరం రాస్తాను. మీరు మరీ చిక్కిపోయారు. ఇలాగైతే ఎలా చెప్పండి?'' అంది.

''వెళ్తున్నావా అమ్మా?'' అంది బేలగా కామేశ్వరమ్మ. అప్పటి దాకా పద్మజ గురించి ఒక్క మాట కూడా ఆ ఇద్దరి మధ్యా రాలేదు. తీరా పార్వతి వెళ్ళిపోతూంటే కామేశ్వరమ్మ మనసు దాచుకోలేకపోయింది. ఏదో అడగాలన్నట్టు తటపటాయించింది.

''ఏమిటి పిన్నిగారూ! ఏమైనా చెప్పాలనుకుంటున్నారా?''

''నీకూ తెలీదామ్మా నిజంగా? అది చూశావా ఎంత పని చేసిందో!''

అప్పటికి కూడా ఆ ప్రసక్తి ఎత్తే సాహసంలేని పార్వతి మాట్లాడకుండానే కూర్చుంది తల వాలేసి.

''ఆ పెళ్ళి చేసుకునే ముందు నీ కైనా ఓ ఉత్తరం ముక్క రాసిందా? నువ్వు వెంటనే మాకు రాస్తే బాగుండేది!''

కంగారుగా అంది పార్వతి ''లేదు పిన్ని గారూ! నా కేమీ తెలీదు నిజంగా. నేనూ మీ లాగే పత్రికలో పెళ్ళి ఫోటో చూసి తెలుసుకున్నాను. తర్వాతైనా రాస్తుందేమో నని ఎదురు చూస్తున్నాను. పోనీ నేనే రాద్దామనుకుంటున్నాను.''

''వద్దొద్దు! ఆ పాపిష్టి దానికి ఉత్తరాలు కూడానా? నువ్వు రాయకూ, అది రాస్తే చదవనూ చదవకు. ఆ వెధవ కాయితాలన్నీ చించి పోగులు పెట్టు!''

"పోనీ మీకు చెప్పి, మీఅనుమతి తీసుకుని చేసినా బాగుండేది పిన్నిగారూ!"

"నే నిస్తానా దానికి అనుమతి?" రౌద్రంగా అంది కామేశ్వరమ్మ.

చాలాసేపు అలాగే కూర్చుంది పార్వతి. "వస్తాను పిన్నిగారూ! నాకు బండి వేళవుతోంది!" అంటూలేచింది.

"ఆఁ వెళ్ళు తల్లీ! వెళ్ళు! రుక్మిణికి పురుడు రాగానే ఉత్తరం రాయి, జాగ్రత్త! ఒంటరి దానివి, నీకు మాత్రం మంచి చెడ్డలేం తెలుసు? మీ అత్తయ్యని దగ్గర పెట్టుకో!" భుజం మీదుగా కొంగు లాక్కుని గది గుమ్మం దాటి వరండా మీదకి వచ్చి నించుని మరీ సాగనంపింది పార్వతిని కామేశ్వరమ్మ.

జట్కా ఎక్కి కూర్చున్న పార్వతి దగ్గర సెలవు తీసుకుని కళ్ళు తుడుచుకుంటూ లోపలికి వచ్చింది సుజాత.

★ ★ ★

ఒక గంట నుంచీ అలా వరండా మీదే కూర్చుని ఉంది పార్వతి. నౌకరు కుర్రా డొకడు బయటికి వస్తే, "ఎవరో వచ్చారని ఒక సారి అయ్యగారికి చెప్తావా?" అంటూ ప్రాధేయ పూర్వకంగా అడిగింది. అలాగేనని తల ఆడించి పోయినవాడు, అర గంటయినా అయిపు లేడు. వరండా దగ్గిర నుంచి గేటు వరకూ పాకిన లాన్ దుబ్బులీ, క్రోటన్స్ మొక్కలీ మార్చి మార్చి చూస్తూ కూర్చుంది నిశ్శబ్దంగా.

తను వచ్చిన పని అవుతుందో లేదో!

ఒక వేళ ఇలా అడగడానికి రావడం తప్పేమో! తీరా చెపితే ఆయనేమంటారో! ఆందోళనతో అన్యమనస్కంగా కూర్చున్న పార్వతి కెవ్వుమని కేకపెడుతూ వరండా కిందకి పరిగెత్తింది. ఒక్క ఉరుకులోనే మెట్లన్ని దూకి అమాంతంగా మీద పడి చీర కొంగుపట్టి నిలేసిన సింహంలాంటి అల్సేషియన్ కుక్కని చూస్తూ భయంతో విల విల్లాడి పోయింది పార్వతి.

"రాజా!" కటువుగా పిలిచిందో మగ కంఠం. "ఫో లోపలికి!" అంత కటువుగానూ శాసించింది. సగం నమిలిన చీరకొంగు వదిలిపెట్టి తోకా డించుకుంటూ వరండా ఎక్కింది రాజా!

ఆఫీసర్ని చూస్తూ సిగ్గుతో చితికిపోయింది పార్వతి. "ఎవరూ? పార్వతా? ఏమమ్మా ఇలా వచ్చావు?" ఆశ్చర్యంగా చూశాడు ఆఫీసరు.

అంత వరకూ నమస్కారమయినా పెట్ట కుండా నించున్న పార్వతి వినయంగా చేతులు జోడించింది.

"రా అమ్మా లోపలికి! అయ్యో! ఎంత సేపైంది వచ్చి?" సాదరంగా ఆహ్వానిస్తున్న ఆయన్ని చూస్తూ తేరుకోగలిగిన పార్వతి గతం తవ్వుకోవట మెందుకన్నట్టు "ఇప్పుడేనండీ!" అంది పొడిగా.

దగ్గరి కొచ్చి పాదాల దగ్గర పడుకోబోయిన రాజా — "ఫో లోపలికి!" అంటూ మరోసారి యజమాని హెచ్చరించటంతో తల వాల్చుకుని పిల్లి పిల్లలా గుమ్మం దాటి వెళ్ళిపోయింది.

ధైర్యంగా కూర్చుంది పార్వతి. ఎలా ప్రారంభించాలో తెలీక నేల చూపులు చూస్తూ కూర్చుంది.

"సెలవేమైనా కావాలా అమ్మాయ్?"

"అబ్బే! కాదండీ!..."

"చెప్పమ్మా! ఏం ఫర్వాలేదు!"

ఒక్క క్షణం ఊరుకుంది. "మా తమ్ముడు బి.ఏ.పాసై ఖాళీగా ఉన్నాడండీ! కొంచెం వాడి సంగతి తమతో మాట్లాడుదామని..."

"ఎన్నేళ్ళుంటాయమ్మా కుర్రాడికి?"

"ఇరవై రెండో సంవత్సరమండీ. పేరు సూర్యనారాయణ. మొన్న మార్చిలోనే బి.ఏ. పాసయ్యాడు. క్లాసు కూడా వచ్చిందండీ!" ఆశగా చూసింది. పార్వతి.

"మరి చదివిస్తే బావుండేదిగా అమ్మా!" తీరా అన్నాడేగానీ, ఎందుకన్నానా అన్నట్టు కని పించాడాయన. అక్కగారు ఉద్యోగం చేసు కుంటూ తమ్ముణ్ణి అంత దాకా చదివించింది. ఏదో పనిలో వేయిద్దామని తన దగ్గిరికి వచ్చిం దంటే, తమ్ముడికి ఇంకా చదువుకునే అవకాశం

ఉండకపోవచ్చుకదా?

మౌనంగా ఊరుకుంది పార్వతి.

మళ్ళీ ఆయనే అన్నారు — "మన ఆఫీసులో ఖాళీలేం ఉన్నాయమ్మా?

నసుగుతూనే అంది పార్వతి, "సుందర్రావు గారి సీటేదో ఖాళీ అవుతుందని..."

"ఓ! అదా! సరే, చూద్దాం. ఓ సారి అబ్బాయిని నా దగ్గిరికి పంపించమ్మా!"

"అలాగేనండీ! సాయంత్రం కలుసుకోటానికి తమరికి వీలుంటుందంటారా?" అంటూ లేచింది.

"సాయంత్రం? సరే, ఎనిమిది దాటాక వస్తే చూస్తాను."

"నమస్కారమండీ!" మళ్ళీ చేతులు జోడించి కుక్క చొంగతో తడిసి పిడచకట్టుకు పోయిన కొంగుని భుజం మీదుగా చేతిలోకి తీసుకుని గేటు కేసి నడిచింది.

"నేను వెళ్ళివచ్చిన పని అవుతుందనే నమ్మకంగా ఉందిరా!" అంది సూర్యంతో, ఇంటికి వస్తూనే సంతోషంగా.

సాయంత్రం ఏడు గంటల వేళ తమ్ముణ్ణి ముస్తాబుచేసి పంపుతూ, "అక్కడ భూతం లాంటి కుక్క వుంది, చూసుకుంటూ వెళ్ళు!" అని మరీ మరీ చెప్పింది.

"ఏడ్చింది, వెధవ కుక్క! పిచ్చి పిచ్చి వేషాలేసిందో మన తడాఖా చూపిస్తాం, ఒక్క గుద్దుతో భూమట్టం!"

"అఘోరించావ్‌లే. దాన్ని చూస్తే పై ప్రాణాలు పైనే పోతాయి. బడాయి చెయ్యకు. జాగ్రత్తగా వెళ్ళిరా!"

తమ్ముడి కోసం ఎదురుచూస్తూ తిరిగి వచ్చిన తమ్ముణ్ణి చూడగానే, 'ఫర్వాలేదు, సంతోషంగానే ఉన్నాడు' అనుకుంది. "ఏం? ఇంత ఆలస్యమైంది? కుక్క నిన్నేం చెయ్యలేదు కదా?" అని ఆతృతగా అడిగింది.

"అది కాస్తా నేను వస్తున్నానని తెలిసి జడిసి ఏ మూలో నక్కి ఉంటుంది! నా కసలు కనిపించనేలేదు!"

"మంచిదేలే. అసలు పనేమైంది?"

"ఇంకేమౌతుంది? కాకపోవటానికీ దానికెన్ని గుండెలు?"

"అబ్బ! చెప్పరా చంపక, నీ ఫోజులూ నువ్వూనూ! ఆఫీసరు గారు కనిపించారా?"

"ఎవడి కోసం కనిపిస్తాడక్కా?"

"వెధవ ప్రగల్భాలు పలక్కు! దయదలచి ఆయనేదో సాయం చేస్తానంటే ఏమిటా పిచ్చి వాగుడు?"

నవ్వేశాడు సూర్యం. "ఊరికే అన్నానులేవే! నాకు మాత్రం తెలీదేమిటి? ఇదుగో, ఓ ఉత్తరం ఇచ్చారు. రేపు మరో ఆఫీసర్‌కి చూపించమన్నారు. ఇందాక క్లబ్బులో కనిపిస్తే స్వయంగా కూడా చెప్పారట నన్ను వెళ్ళి కలుసుకోమన్నారు!"

"సుందర్రావుగారి సీటు విషయమేం చెప్పలేదూ?"

"సుందర్రావూ, వంకాయ పులుసూనూ. అదేం నాకు తెలీదు. కుక్కను కట్టేసినట్టు తెలుసుకుని ధీమాగా లోనకి వెళ్ళాను. నేను ఫలానా అని చెప్పగానే కూర్చోబెట్టి ఈ ఉత్తరం రాసి ఇచ్చారు. కాస్సేపు ఏవేవో కబుర్లడిగారు. మహాబుద్ధిగా జవాబు చెప్పి ఓ నమస్కార బాణం వదిలేసి లేచి చక్కావచ్చాను."

"పోనీలే, ఆయన దయ! ఇద్దరం ఒకే ఆఫీసులో అయితే అన్నిటికీ వీలుగా ఉంటుందనుకున్నాను. మరేం చేస్తాం? ఇదైనా దొరికితే అంతే చాలు!"

మర్నాడు కూడా అలాగే సూర్యం కోసం తహ తహలాడుతూ ఎదురు చూస్తూ కూర్చున్న పార్వతి, సూర్యం నవ్వు మొహంతో రావడం చూసి తేలిగ్గా నిట్టూర్చింది.

"ఉద్యోగం ఇస్తామన్నారక్కా!" అన్న కబురు వింటూ సంతోషంతో మాట్లాడ లేకపోయింది చాలా సేపు.

"అదేమిటక్కా? నీకు సంతోషంగా లేదూ?"

"...సంతోషంతో మాటలే రావటం లేదు. సూరీ! నా కేదైనా దిగులంటూ ఉంటే అది కూడా

ఈ నాటితో తీరిపోయింది! నా కెంతో గర్వంగా ఉంది''

''అక్కాయ్యా! నువ్వు కష్టపడి చదివించక పోతే?... నీ రుణం ఏ నాటికీ తీర్చుకోలేనక్కా!''

పార్వతి తొందరపడి మాట అనేశానేమోనని నొచ్చుకుంది. తను చేసినదాన్ని తనే మెచ్చు కోవటం, తననుచూసి తనే గర్వపడటం ఏమిటి? ఆ మాట తన నోటి నుంచి వస్తే నిజానికి తమ్ముడు బాధపడడూ?

''లేదు సూరి! నేనేదో పిచ్చిగా అనేశానుగానీ ఇందులో గర్వపడవలసిందేమీ లేదు. నువ్వు నాకు రుణపడి ఉన్నావని ఎప్పుడూ అనుకోవద్దు! అలా అంటే నేను సహించలేను!''

''నువ్వు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా నిజం నిజమే అక్కయ్యా!''

మాటలు పెంచకుండా లోపలికి వెళ్ళి పోయింది పార్వతి.

★ ★ ★

**త**మ్ముడు ఆఫీసుకి బైల్దేరుతోంటే పార్వ తికి బాధేసింది. ఇంకా చదివిస్తే ఎంతైనా చదివే వాడు, సూరి! కాని, అదెలా సాధ్యం? అందరి లాగే గుమాస్తాగా తన తమ్ముడూ ఓ గానుగెద్దు జీవితం గడుపుతాడు! తన బాధ వెల్లడి కానివ్వ కుండా అత్తవారింటికి పంపే ఆడపిల్లకు నీతులు బోధించినట్టు తమ్ముణ్ణి అనునయంగానే హెచ్చ రించింది. ''జాగ్రత్త సుమా! కొత్తలో కాస్త కష్టం గానే ఉంటుంది. చిరాకు పడకు. తొందరపడి జవాబు లివ్వకు. రాగా రాగా అన్నీ నీకే తెలు స్తాయి. జాగ్రత్త!'' అంటూ.

సూర్యం మాత్రం చాలా హుషారుగా ఉన్నాడు. పెళ్ళికొడుకులా సరికొత్త బట్టలు వేసు కుని ముస్తాబయ్యాడు. అక్కగారి మాటలేవీ విన్నట్టే లేడు. మొహానికి పౌడర్ పట్టిస్తూ — ''మొట్ట మొదటి జీతంతో నీ కెంత మంచి బహుమతి తెస్తానో చూడవే అక్కా!'' అన్నాడు.

పార్వతి నవ్వింది. ''అంత మాటన్నావు అదే చాలు!'' అంది.

''అంటే నీ ఉద్దేశ్యం?'' కయ్యానికి కాలు దువ్వుతూ లేచాడు. ''నేనో కృతఘ్నుణ్ణని అను మానిస్తున్నావా?''

''బాగుంది దెబ్బలాట! బహుమతి అంత విలువచేసే మాటన్నావు. అదే చాలన్నాను. తప్ప యితే మరెప్పుడూ అననులే.''

''తప్పా, తప్పన్నరా? ఈ సారికి క్షమిం చాను ఫో!''

ఆఫీసుకి బయలుదేరుతున్న తమ్ముణ్ణి చూస్తూ నించుంది పార్వతి. ఏడెనిమిది సంవత్స రాల గతం మనసులో తిరిగింది. తోడబుట్టిన వాళ్ళ బతుకుల్ని ఒక దారిలో పెట్టగలిగింది.

సాయంత్రం ఇంటికి వస్తూనే చేరబడిపోయి అలసటగా నిట్టూర్పులు విడవడం మొద లెట్టాడు సూర్యం. ''అక్కాయ్! ఓ గ్లాసుడు కాఫీ చుక్కలు తీసుకురావే! జల్దీ!''

''అబ్బో! చాలా అలసిపోయినట్టున్నావే! ఒక్క నిమిషం ఆగు నాయనా! ఇదిగో వచ్చే!'' అంటూ చక చకా కాఫీ తెచ్చింది పార్వతి.

పొడిపొడిగా ఉన్న నుదుటి మీద చెమట ఒత్తుకున్నాడు సూర్యం. కాఫీ నీళ్ళు గొంతులో ఒంపుకుని మరోసారి సుదీర్ఘంగా నిట్టూర్చాడు.

''ఎంత కష్టం వచ్చి పడిందిరా తండ్రీ! ఏం పని చేశావేమిటి ఇవ్వాళ?''

ఖయ్యిమన్నాడు సూర్యం. ''రోజంతా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే మాత్రం సుఖ మనుకున్నావేమిటి?''

''అయితే ఇవ్వాళ ఊరికే కూర్చున్నావన్న మాట!''

''ఇవాల్టికేం పనీ చెయ్యొద్దన్నాడే హెడ్ క్లర్కు. మనలో మన మాట. చాలా మంచి వాడిలా ఉన్నాడు. నెమ్మదిగా అతగాణ్ణి మంచి చేసుకుంటే రోజూ పని చెప్పకుండా ఉంటా డేమో!''

''హాస్యాలకేం గానీ అలాంటి పని చెయ్యకు! ఎవర్నీ ఏ విధంగానూ ప్రాధేయపడకు! ఆరోగ్యం ఉంది. తెలివి తేటలున్నాయి. నీకేం లోటు? పని ఎంత బాగా నేర్చుకుంటే అంత మంచిది!''

"అబ్బబ్బ! ఊరికే అన్నానే అక్కయ్యా!"

"నాకు తెలుసులే! నేనూ ఊరికే అన్నాను. మా సూరి ఎప్పుడూ నిజాయితీగానే బతుకు తాడు. లే మరి. స్నానంచేసి రుక్కుకి ఉత్తరం రాయి! నేను వంట పని చూసు కుంటాను."

సూర్యం గొంతు తగ్గించి అడిగాడు. "మనలో మన మాట, కూరగాయ లేమిటీ?"

"మనలో మన మాట, కాకర కాయల పచ్చడిలే."

మొహం చేదు చేదుగా చిట్లించుకుంటూ లేచాడు.

★ ★ ★

మొదటి జీతం తెచ్చాడు సూర్యం. "నీకే మైనా కొందామనుకున్నానే అక్కయ్యా! ఏం కొనాలో బొత్తిగా తోచలేదు. ఎంతటెంతట డబ్బు నీ కిచ్చేద్దామా అని వచ్చేశాను!" అంటూ నోట్లన్నీ పార్వతి చేతిలో పెట్టి బుద్ధిగా నించున్నాడు.

పార్వతి నవ్వింది. "నాకేమయినా కావా లంటే నేనే నీతో చెప్తాలే. నీ ఖర్చుల కిది దగ్గిర ఉంచుకో!" అంటూ పది రూపాయల నోటు అందించింది.

"పది రూపాయలే! నాకే? అమ్మో" మహా ప్రసాదంలా దోసిలిపట్టి అందుకున్నాడు నోటుని. "అచ్చంగా ఇచ్చేశావు కదూ? మళ్ళా అడగవు కదూ? కొంపదీసి అప్పుగా ఇచ్చావా?"

"చాల్లేరా! నీ నాటకాలూ నువ్వూనూ."

"అయితే మూడు రోజులకో రూపాయి నాకిష్టం వచ్చినట్టూ చెడా మడా ఖర్చుపెట్టేసుకో వచ్చన్నమాట!"

"చిన్న సవరణ! సిగరెట్లకీ, కిళ్ళీలకీ..."

"నిషిద్ధమా?"

"అన్నమాటే!"

"పోనీ, సినిమాలకీ?"

"ఓ రెండు సినిమాలకి నేనిస్తూ ఉంటాను నెలకి."

"అన్యాయం! అమానుషం! దురంతం! రెండు రోజులకొక పిక్చరు రిలీజౌతోన్న ఈ రోజు ల్లో రెండు వారాల కొకటి చూడమంటావా?"

"ఎంత అరిచి గీ పెట్టినా ప్రయోజనం లేదురా తమ్ముడూ! ఇక మాట్లాడకు!"

"దారుణం! నేను చెమటోడ్చి, కష్టించి సంపాదించుకుంటున్నానే!"

"అందుకే తగిన ఖర్చులే చెయ్యాలంటు న్నాను. కావాలంటే ఇంకో సినిమాకి నీ ఖర్చులో పెట్టుకో!"

"అంతేనా?"

"అంతేరా!"

" ఆశే లేదా?"

"లేనే లేదు!"

"అ...క్క...య్యా!"

"త...మ్ము...డూ —!"

కుదురుగా కుర్చీ చూసుకుని కూలబడి పోయాడు సూర్యం.

రెండోనెల పది రూపాయల నోటు అందు కోలేదు. "నీకేం తెలుసక్కయ్యా? 'ఉద్యోగం కూడా చేస్తున్నావు, టీ నీళ్ళయినా ఇప్పించ లేవట్రా?' అంటూ నన్నెన్ని రాబందులు పీక్కు తింటున్నాయో నీకు తెలీదు. హోటళ్ళకే ఏడెని మిది రూపాయలు పోతూంటే ఇక నే నెలా బతక నేమిటి?" అంటూ రాగం తీశాడు.

పార్వతి మరో ఐదు రూపాయల నోటు అందించింది. "సూర్యం! బాధ్యతలు తెలుసు కుంటూ ప్రవర్తిస్తే ఎంత డబ్బు ఖర్చు చేసుకున్నా నా కభ్యంతరం లేదు. ఆఫీసులో పనిచేస్తూ మగ వాళ్ళ మధ్య మసులుతోన్న నాకు ఇవన్నీ తెలీవనుకోకు! రుక్కుని పురిటికి తీసుకురా వాలా? మనకు కలిగిందేదో ఇచ్చి పంపించాలా? అందుకే మరీ జాగ్రత్తపడుతున్నాను."

"నా కసలేమీ ఇవ్వొద్దులే. ఎందుకా పాఠా లన్నీ చెప్తావ్?" అంటూ చేతిలో నోట్లు బల్ల మీద పెట్టేసి బిగదీసుక్కూర్చున్నాడు సూర్యం.

"అయితే నీ కక్కర్లేదన్నమాట! సరే, ఏం చేస్తాను? నేనో చీరన్నా కొనుక్కుంటాను!" అంటూ పార్వతి వాటిని తీసుకునే లోపునే సూర్యం వాటిని అందుకుని జేబులో పడేసు కున్నాడు.

★ ★ ★

"రఘూ!"

అప్రయత్నంగా పిలిచేసిందే గానీ అవునో కాదో అన్నట్టు అనుమానంగా చూస్తూ నిలబడి పోయింది పార్వతి. వెళ్తూన్నవాడల్లా అగి వెనక్కి చూశాడు. రఘుపతే! తన కళ్ళని తనే నమ్మలేక పోయాడు. ఎవరూ? పార్వతి! పార్వతి కూడా అంతగానూ విస్తుపోయింది. చేతిలో కారియర్ చెట్టు కింద పెట్టి రఘుపతికేసి రెండడుగులు వేసింది. రఘుపతి కూడా నాలుగడుగులు వెనక్కు వచ్చాడు.

"పిలిచానే గానీ, మళ్ళీ ఎవరోనని తటపటా యిస్తున్నాను!" అంది పార్వతి రఘు మొహం కేసి చూస్తూ.

రఘుపతి అప్పటికి కాస్త తేరుకోగలిగాడు. "బాగున్నావా పార్వతీ?" అనగలిగాడు ప్రయత్నం మీద.

"బాగానే ఉన్నాను. మా రుక్మిణి నాలుగు రోజుల కిందట ప్రసవించింది. ఆఫీసుకి సెలవు పెట్టి ఆస్పత్రికి కారియర్ తీసుకొచ్చాను."

"రుక్మిణి అప్పుడే తల్లి అయిందా?"

"చెప్పనేలేదుకదూ? మగపిల్లాడు పుట్టాడు. చూసివెళ్దువుగాని రాకూడదూ?"

"తర్వాత చూస్తాలే పార్వతీ!"

"అన్నట్టు నువ్వేం పని మీద వచ్చావిక్క డికి?" పార్వతి రఘు కళ్ళల్లోకి చూసింది. అవి బొత్తిగా కాంతి హీనంగా కనిపించాయి.

"సుశీల ఇక్కడే ఉంది. చూసి వెళుతు న్నాను" పొడి పొడిగా అన్నాడు.

ముందు కాస్త తెల్లబోయింది పార్వతి. "ఎవరూ? సుశీలా? అంటే నీ భార్య కదూ?" ఆదుర్దాగా అడిగింది. "ఈ ఆస్పత్రిలోనే ఉందా? ఏం, ఏం జబ్బుచేసింది?"

"నాకంత బాగా తెలీదు. ఏదో కొంచెం సుస్తీ చేసింది."

ఆశ్చర్యంగా చూసింది పార్వతి. భార్యకు వచ్చిన జబ్బేమిటో భర్తకు తెలీదా? రఘు మాటలు చూస్తే అతను దేన్నీ పట్టించుకోనట్టు కనిపిస్తోంది. మనిషి బాగా మారినట్టున్నాడు. పచ్చని శరీరంతో, సిల్కు బట్టలతో, నాజూగ్గా ధన వంతుల బిడ్డలాగే కనిపించే రఘు, సామాన్య మైన గుడ్డలతో, కాంతి లేని చూపులతో ఏదో అర్థం కాని ఉదాసీనతతో విరాగిలాగ ఉన్నాడు! ఏం జరిగింది?

"కాస్సేపలా చెట్టు కింద నిలబడదాం వస్తావా?" అంది.

మౌనంగా అనుసరించాడు రఘుపతి.

"అయితే, మీ అత్త గారి ఊరు ఇదేనన్న మాట! నాకు తెలీనే తెలీదే! ఎప్పుడైనా సుశీలని చూడటానికి వెళ్ళేదాన్ని!"

"నీకు బదిలీ అయిందని విన్నానుగానీ, ఇక్కడ ఉంటున్నట్టు నాకూ తెలీదు. అప్పు డప్పుడూ ఈ ఊరు వస్తూనే ఉన్నాను."

"పోనీ, ఇప్పటికిలా అనుకోకుండా కలిశాం!" కాస్సేపు ఊరుకుని అడిగింది పార్వతి. "నీ కేమైనా పిల్లలా, రఘూ?"

"ఊహుఁ!" రఘు తల అడ్డంగా తిప్పాడు.

"సూర్యం ఏం చేస్తున్నాడు?" అన్నాడు.

"బి.ఏ. పాసయ్యాడుగా? ఐదారు నెలల నుంచీ క్లర్కుగా పనిచేస్తున్నాడు ఈ ఊళ్లోనే."

"బావుంది. మీ ఇద్దరికీ ఒక్క ఊళ్ళోనే..."

మళ్ళా ఇద్దరి మధ్యా మాటలు లేవు కొంత సేపు! రఘుపతి తనకై తను కల్పించుకుని మాట్లా డటం లేదు. అడిగిన దాని కేదో చెప్పేసి ముభా వంగా ఊరుకుంటున్నాడు. ఉన్నట్టుండి అంది పార్వతి. "పద్మజ సంగతి నీకు తెలిసిందా? ఓ ఆంగ్లో — ఇండియన్ డాక్టర్ని పెళ్ళి చేసుకుంది. వాళ్ళింట్లో ఎవరికీ ఇష్టం లేదు. అయినా ఇల్లు విడిచి వెళ్ళిపోయి చేసుకుంది!"

"చాలా మంచి పని చేసింది! అదృష్ట వంతురాలు!"

విస్మయంగా చూసింది పార్వతి. "అసలు నీ కెప్పుడు తెలిసింది?"

"పెళ్ళప్పుడు పేపర్లో ఫోటో నేనూ చూశాను. సంతోషించాను!"

"పద్మజ చేసిన పని నీకు చాలా నచ్చి నట్టుందే!"

"ఎంతో నచ్చింది పార్వతీ! జీవితం విలువ పద్మజ బాగా తెలుసుకుంది. మనిషికి కావలసిందేమిటో అక్కడే జాగ్రత్త పడింది! మొదటి నుంచీ పద్మజ తెలివైందే!"

రఘు తన జీవితంలో జరిగిందానికి బాధ పడుతున్నాడా? తనను తను విమర్శించుకుంటున్నాడా?

రఘు మొహం కేసి చూసింది పార్వతి. తన కేసే చూస్తున్న రఘు నెమ్మదిగా చూపులు తిప్పుకుని కదిలాడు. "వెళతాను పార్వతీ! నాకు బస్సు వేళవుతూంది."

"ఊరు వెళ్ళిపోతావా? సుశీలకి సుస్తీ తగ్గే దాకా ఉండవూ?"

"నే నెందుకూ? వాళ్ళ పుట్టింటి వాళ్ళు చాలా మంది ఉన్నారు."

"అయితే మాత్రం? నువ్వు ఉంటే..."

"ఫర్వాలేదు. మళ్ళీ వచ్చి చూస్తాను. వస్తూనే ఉంటానుగా?"

"సాయంత్రం నేను వెళ్ళి చూస్తాను. ఏ వార్డులో ఉంది?"

"స్పెషల్ వార్డులో నాలుగో నెంబరు గది. మరి నేను వెళ్తాను."

చూస్తూండగానే రఘుపతి వెళ్ళిపోయాడు. రఘు కనిపించి మాట్లాడి వెళ్ళిపోవడం అప్పుడే అయిపోయిందా! అనుకోకుండా రఘు కనిపిస్తే మాట్లాడటానికి మాటలే దొరకలేదు. తన గురించి చెప్పనూ లేదు. సుశీల విషయాలు అడగనూ లేదు. ఎవరో దారే పోయే వాళ్ళు పలకరించుకున్నట్టు జరిగింది సంభాషణ. "అయ్యో! ఒక్కసారి ఇంటికైనా రమ్మన్నాను కాను. ఏదీ తోచి చస్తేనా? అంతలో వెళ్ళే వెళ్ళిపోయాడు!"

కారియర్ అందుకుని గేటు దాటింది పార్వతి ఆలోచిస్తూ, రఘు ఎందుకంత దిగులుగా ఉన్నాడో — అనుకుంటూ!

★ ★ ★

తెల్లటి దుప్పట్లో బల్లిలా అంటుకుని పడుకున్న సుశీల అసలు మంచం మీద ఉన్నట్టే కనిపించలేదు పార్వతికి. బాగా దగ్గిరకి వెళ్ళి మీదికి వంగి నెమ్మదిగా పలకరించింది "సుశీలా!"

రెండు మూడు పిలుపులకు కళ్ళు తెరిచి చూసింది, సుశీల అతి నీరసంగా. ఆ కళ్ళల్లో కాంతి ఎలా హరించిపోయిందో అర్థంకాలేదు. అసలే సన్నగా తమలపాకు ఈనెలా ఉండే మనిషి పూర్తిగా శల్యమైపోయింది. ఆ స్థితిలో సుశీలని చూస్తే, పార్వతి హృదయం ద్రవించి పోయినట్టయింది. నెమ్మదిగా చెయ్యి పట్టుకుని మళ్ళీ పిలిచింది. "సుశీలా, నేను... పార్వతిని!"

"మీరు... పార్వ...తా?"

"అవును, నేనే సుశీలా! పార్వతిని! పెళ్ళిలో నువ్వు అత్తవారింటి కొచ్చినప్పుడు..."

"వెండి కుంకం బరిణె నా చేతిలో పెట్టారు! ... పార్వతి అక్కయ్య..." సంతోషంగా చూసింది సుశీల.

పార్వతి జాలిగా నవ్వుతూ, "ఎంత జ్ఞాపకం నీకు! అక్కయ్యని మరచిపోలేదు నువ్వు!" అంది.

"లేదక్కయ్యా! మరచిపోలేదు" సుశీల మొహం నిండా విషాదం అలుముకుంది, "మళ్ళీ ఇన్నాళ్ళకి చూశాను. మీరు ఆ ఊరు నుంచి వెళ్ళిపోయారు కదూ?" అంది.

"ఎక్కడికో పోలేదు, సుశీలా! ఇక్కడే పని చేస్తున్నాను. మీ పుట్టింటివారిక్కడ ఉన్నారని నాకు తెలీనే తెలీదు. నిన్న రఘుపతి కనిపిస్తే... అసలు నీ కేమిటి అనారోగ్యం?" ముందు ఆరోగ్యం సంగతి అడక్కుండా మిగతా విషయాలన్నీ మాట్లాడటం తనకే ఎబ్బెట్టుగా తోచి ప్రసక్తి మార్చింది పార్వతి.

సుశీల ఏమీ జవాబు చెప్పలేదు. వాళ్ళ తాలూకు మామ్మగారొకావిడ బల్ల మీద కూర్చుని అంతా వింటూనే ఉంది. పార్వతి అడిగిందానికి తనే కలగజేసుకుని, "అయ్యో! ఏం జబ్బని చెప్పమంటావు తల్లీ? రెండు మూడేళ్ళ నుంచీ సుస్తీతో బాధపడుతోనే ఉంది. ఎన్నడూ లేనిది మాయదారి పెళ్ళయ్యాకే ఇస్టీరియా తెగులు పట్టు

కుంది. అది అలా ఉండగా ఒక సారి కడుపు పోయింది. మొన్న పిల్లాడు పుట్టి ఓ నెల్లాళ్ళు బతికి పోయాడు. వాడు పోయాక ఇది బొత్తిగా తెగుళ్ళపాలైపోయింది. ఎంత డబ్బు విరజిమ్ము తోన్నా మందుల దారి మందులదీ, తెగుళ్ళ దారి తెగుళ్ళదీ అవుతోంది! తిండీ తిప్పలూ లేవు. అసలు తెగులే లేదంటున్నారు డాక్టర్లు'' అంటూ కళ్ళు ఒత్తుకుంది.

పార్వతి విస్మయంగా సుశీలకేసి చూసింది. నీరసంగా చూస్తూ అలాగే పడుకుని ఉంది సుశీల. సుశీలకు పిల్లాడు కూడా పుట్టిపో యాడా? రఘు ఆ ముక్కే చెప్పలేదే! అసలు రఘు ఏం చెప్పాడు గనకా? పెళ్ళానికి జబ్బేమిటో తెలీదన్నాడు. కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకుని బతుకుతున్నదాన్ని వదలిపోయాడు. ఇద్దరికీ సామరస్యం లేదా ఏమిటి? ఉలిక్కిపడింది పార్వతి. మళ్ళీ సుశీలకేసి చూసింది, ఆ కళ్ళల్లో ఏ భావమూ వ్యక్తం కావటంలేదు. జబ్బుపడ్డ మనిషి ఎలా ఉంటుందో అలాగే ఉంది. ఏం మాట్లా డాలో, ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు. చిన్న కంఠంతో, మామ్మగార్ని సంగతులన్నీ అడిగి తెలుసుకుంటూ కూర్చుంది చాలాసేపు. చీకటి పడుతూంటే, ''వెళ్ళొస్తాను సుశీలా! నువ్వేం బాధ పడకు. అదే తగ్గిపోతుంది!'' అంటూ లేచింది.

''మళ్ళీ వస్తావా అక్కయ్యా?'' ఆశగా చూసింది సుశీల.

''తప్పకుండా వస్తానమ్మా! మా రుక్కు ఈ ఆసుపత్రిలోనే ఉందిగా?'' అంతలోనే తన పొర పాటు తెలుసుకుని, ''రుక్కులేకపోతే ఏం? నిన్ను చూడటానికి తప్పకుండా వస్తూ ఉంటాను. మరి వెళ్ళిరానా?'' అంటూ మరోసారి ధైర్యం చెప్పి బయటికి వచ్చింది. సుశీల విషయంలో ఏదో అర్థం కాని అనుమానం... రఘు అంటే సుశీలకు ఇష్టం లేదా? లేకపోతే, సుశీలంటే రఘుకి ఇష్టం లేదా?

రుక్కుని ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకు పోయినా పార్వతి తరచూ వెళ్ళి సుశీలను చూసి వస్తూనే ఉంది. సుశీల ఏదో దిగులుతో తీసు కొంటూన్న దన్న విషయం కనిపెట్టటానికి అట్టే కాలం పట్టలేదు. నిజంగానే రఘు అంటే సుశీ లకు ఇష్టం లేదేమో!

★ ★ ★

''సుశీలా! నిన్నొక మాట అడగనా?'' ఎంతో కాలం తనలో తపన భరించలేకపోయింది పార్వతి. మనస్సులో మాట అడగాలని నిరీక్షి స్తున్న పార్వతికి మంచి అవకాశమే చిక్కింది. సుశీల ఆరోగ్యం కాస్త కుదుటపడింది. రోజంతా పడుకుని ఉండకుండా కాసేపు లేచి తిరగాడు తూంది. ఆస్పత్రి నుంచి విడుదల అయ్యి ఇంటి కొచ్చింది.

విశాలమైన మేడలో ప్రత్యేకమయిన సదు పాయాలూ, అపురూపంగా చూసుకునే తల్లీ తండ్రీ, కనుసన్నల వెంట పరుగులెత్తే పని మను షులూ, అంతులేని భోగభాగ్యాలతో తులతూగే సుశీల, దిగుళ్ళతో కృశిస్తోందంటే అది దాంపత్య విషయం కాకపోతే మరేమై ఉంటుంది?

సాయంత్రం వేళ నీరెండలో మల్లె పందిరి కింద కుర్చీలో కూర్చుని పుస్తకాలు తిరగేస్తోంది సుశీల. కోలుకుంటున్న ఆరోగ్యంతో, ఆమె చిరునవ్వులో కాస్త జీవం తొణికిసలాడుతోంది. ''రా అక్కయ్యా!'' అంటూ ఎదురువచ్చి ఆహ్వా నించింది పార్వతిని.

పార్వతి కూడా మరో కుర్చీలో కూర్చుంటూ కాసేపు కాలక్షేపంగా మాట్లాడి చివరికి మనసులో మాట కాస్తా అడిగింది — ''సుశీలా! నిన్నొక మాట అడగనా?'' అంటూ.

కళ్ళు తిప్పి చూసింది సుశీల. అదో మాది రిగా నవ్వుతూ ''ఏం మాట అడుగుతావు?'' అంది.

''నువ్వేమీ అనుకోనంటే ఎన్ని మాటల యినా అడుగుతాను. ఏమీ దాచుకోకుండా మనస్ఫూర్తిగా జవాబులు చెప్పాలి. అడగనా మరి?''

మాట్లాడలేదు సుశీల చాలాసేపు. ''నాతో ఇంత ప్రేమగా మాట్లాడేది నువ్వొక్కదానివే

అక్కయ్యా! నువ్వేదడిగినా నా హృదయ పూర్వకంగా చెప్పగలననుకుంటాను."

"మీ దాంపత్య రహస్యాలు కూడానా?"

విస్మయంగా చూసింది సుశీల. "అంటే?"

"మరేమీ అనుకోకు సుశీ! నా అనుమానాలు నివృత్తి చేసుకుంటే గానీ ఈ బాధ తగ్గదనిపిస్తోంది. నువ్వెందుకో సంతోషంగా లేవు! ఎప్పుడూ ఏదో దిగులుతో బాధపడుతున్నట్టు కన్పిస్తున్నావు. అవునంటావా?"

సుశీల సంశయిస్తూనే ఒప్పుకుంది. "నీ కలా కనిపిస్తే నే నెలా కాదనగలను?"

"అంటే, నీకు రఘుబాబంటే ఇష్టంలేదా? మరి ఈ పెళ్ళి చేసుకోవటం మానేయక పోయావా?"

"అక్కయ్యా! నాకు... ఆయనంటే ఇష్టం లేదా? ఎవరు చెప్పారీ మాట? ఎలా తెలిసింది నీకు?" కాస్త చురుగ్గా చూసింది సుశీల.

కంగారుపడింది పార్వతి. "అబ్బే, నాకెవరూ చెప్పలేదు సుశీ! నేనే అలా అనుకున్నాను. నువ్వేదో బెంగతో బాధపడుతున్నావని, మీ ఇద్దరికీ కలియటం లేదేమోనని ఊహించాను. రఘుపతి నాకు తెలుసు. అతను ఇష్టపడే నిన్ను పెళ్ళి చేసుకున్నాడు కదా? మరి నువ్వు..."

"నా మాట అలా ఉంచు! ఆయన ఇష్టపడే నన్ను పెళ్ళి చేసుకున్నారా?"

"ఎందుక్కాదు? తల్లీ తండ్రీ కుదిర్చిన సంబంధం. సంతోషంగానే చేసుకున్నాడు."

"లేదక్కయ్యా, లేదు. ఆయన గురించి నీ కేమీ తెలీదు. ఆయనకి నేనంటే బొత్తిగా ఇష్టం లేదు! ఆ నాటికీ ఈ నాటికీ నేను ఆయనకి ఇష్టం కాలేకపోతున్నాను!"

ఆశ్చర్యపోతూ చూసింది పార్వతి.

"నిజం అక్కయ్యా! ఇంతవరకూ వచ్చాక నీతో అంతా చెప్పేసుకోవాలనిపిస్తోంది. నా మనసయినా తేలిక పడుతుంది. నా మాట నమ్మవా?"

నమ్మలేనట్టే చూసింది పార్వతి "రఘుకి నువ్వంటే ఇష్టం లేదని ఎలా తెలుసు నీకు?"

"ఎంత అమాయకంగా అడుగుతున్నావక్కయ్యా? నా భర్త నన్ను ప్రేమిస్తున్నాడో లేదో నేను తెలుసుకోలేనా? నాకు అర్థం కాదా? నన్ను ఆయన కోరి పెళ్ళి చేసుకోలేదనీ, నేను ఆయన్ని సంతోష పెట్టలేననీ, తెలుసుకోటానికి ఒక్క నెల రోజులయినా పట్టలేదు. ఆ నాటి నుంచీ నా దురదృష్టానికి కుమిలిపోతూ ఉన్నా నక్కయ్యా?" సుశీల గొంతు భారమై కళ్ళల్లోనీళ్ళు తిరిగాయి.

పార్వతి మృదువుగా సుశీల చెయ్యి పట్టుకుంది. "ఇలా బాధపడకు సుశీ! అసలు సంగతేమిటో నాకు సరిగా చెప్పవూ?"

"ఇంకా ఎలా చెప్పను? ఆయన మనసు నా కేనాడో తెలిసి పోయింది!"

"అదే అడుగుతున్నాను. ఎలా తెలిసింది? రఘు నిన్ను బాధ పెట్టాడా? నువ్వంటే ఇష్టం లేదని అన్నాడా?"

"నోటితో చెప్పాలా? కొట్టీ తిట్టీ బాధ పెట్టాలా? అంతకన్న ఘోరంగానే ప్రవర్తించారు. నే నంటూ ఒక మనిషిని ఆయన జీవితంలోకి వచ్చానన్న సంగతి ఆయన పట్టించుకోలేదు. మా ఇద్దరికీ పెళ్ళి ఎందుకైందో ఇప్పటికీ నాకు అర్థంకాదు!"

"ఉఁ..."

"గడిచిన కాలంలో ఒక్క గంటసేపు కూడా మేమిద్దరం ఆప్యాయంగా మాట్లాడుకోలేదంటే నమ్ముతావా? ఉదయం లేచింది మొదలూ ఆయన ధోరణి ఆయనదీ, నా కాలక్షేపం నాదీ! నా కష్ట సుఖాలెన్నడూ అడిగితెలుసుకోనూ లేదు. ఆయన మంచి చెడ్డలు నాతో చెప్పనూ లేదు. మా ఇద్దరికీ మానసికంగా ఏ విధమైన బంధమూ లేదక్కా!" నిట్టూర్పు విడిచి మళ్ళీ చెప్పటం మొదలు పెట్టింది సుశీల. "ఆయన ఎప్పుడూ ఎందుకంత ఉదాసీనంగా ఉంటారో అర్థంకాదు, ఏదో పోగొట్టుకున్నట్టు వెర్రిగా ఎటో చూస్తూ బాధ పడుతూ ఉంటారు! ఎందరున్నా తన కెవ్వరూ అక్కర్లేనట్టు ఉంటారు! ఆయన్నెలా కనిపెట్టుకు ఉండాలో ఎవ్వరికీ అర్థంకాదు!"

"అందుకని, నీ దారిన నువ్వు కూడా

వదిలేసి ఊరుకుంటావా సుశీలా?''

"లేదక్కా! నీకు సిగ్గువిడిచి చెపుతున్నాను. ఆయనకి ఎంతో సన్నిహితం కావాలని ప్రయత్నిస్తాను. ప్రయోజనం ఉండదు. నాకై నేను దగ్గరికి వెళితే తప్పకుండా ఆదరిస్తారు. కానీ అందులో నాకు సంతోషం ఉండదు. నా మీద ఇష్టంలేని ఆయనని విసిగిస్తున్నానేమో అని పిస్తుంది. ఎన్నోసార్లు దుఃఖం ఆపుకోలేక ఆయన గుండెల మీద తల ఆన్చుకుని ఏడ్చాను. అప్పటికి నన్ను బుజ్జగించినా తర్వాత ఏమీ మార్పు కని పించదు. 'ఎందుకు నన్నింత అసహ్యించుకుంటారు? నేనంటే మీకు ఇష్టం లేదా? నిజం చెప్పండి!' అని అడిగితే అమాయకంగా చూస్తారు! 'నిన్ను అసహ్యించుకుంటున్నానా? అదేం మాట సుశీలా? నువ్వేం తప్పు చేశావనీ? నువ్వంటే నాకు ఇష్టం లేకపోవడం ఏమిటి? భార్యంటే భర్తకి ఇష్టం ఉండదూ?' అంటారు. నేను తప్పుచెయ్యను కాబట్టి అసహ్యించుకోరు! భార్యని కాబట్టి ఇష్టపెట్టుకుంటారు! అంతే! అనారోగ్యాలతో ఎన్నాళ్ళు తీసుకున్నా ఒక్క ఉత్తరం ముక్క కూడా వ్రాయరు. వ్రాసినా 'నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో' అంటూ పొడి పొడిగా రాస్తారు. 'నా ఆరోగ్యం కాపాడవలసింది మీరు గానీ, నేను కాదు' అని ఏడవాలనిపిస్తుంది నాకు. బాబు పుట్టినప్పుడు చూడటానికివస్తే. 'బాబు చాలా ముద్దుగా ఉన్నాడు కదూ?' అన్నాను.

'అవును, పిల్లలు ముద్దుగా ఉండరూ?' అన్నారు తనకేమీ పట్టనట్టు! 'నా భార్య! నా కొడుకు!' అన్న సంతోషమే కనిపించదాయనలో, తామరాకు మీద నీటి బొట్టు తొణికిసలాడినట్టు ఈ సంసార బంధాన్ని అంటీ అంటకుండా కాలం గడుపుతున్నారు'' ఆగింది సుశీల.

పార్వతి నిట్టూర్చింది. "ఏం చెప్పటానికీ తోచకుండా ఉంది సుశీలా!''

"ఇదంతా నా దురదృష్టం! నా బాబునైనా చూసుకుని కాలం గడుపుదామనుకుంటే ఆ అదృష్టం కూడా లేకుండా చేశాడు భగవంతుడు. ఆయన దారి ఆయనదీ, నా దారి నాదీ. ఈ అనారోగ్యాలతో నెలల తరబడి పుట్టింట్లోనే ఉండి పోవలసి వస్తోంది నాకు. నా కోసం ఒక్క వారం రోజులు ఉండమన్నా ఆయన ఇక్కడ ఉండలేరు. నేను ఉన్నా లేకపోయినా ఆయన ఒంటరే! ఆ ఒంటరితనమే కావాలి ఆయనకి!''

"..................................''

"కానీ, అక్కయ్యా, నాకు ఒక్కటే అనుమానం. ఇంత ఇష్టం లేకుండా నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు? ఇష్టమైన మరో అమ్మాయి నెవరినైనా చేసుకుంటే ఇద్దరూ సుఖంగా ఉండేవారు కదా?''

"ఇష్టాయిష్టాలు ఆలోచించుకోవలసింది వివాహానికి ముందేగానీ తర్వాత కాదు! ఇష్టాయిష్టాల్ని నిర్ణయించుకోగలిగే శక్తి ఉన్న వాళ్ళసలు ఇలాంటి అన్యాయాలకి తలపడరు!''

విస్మయంగా చూసింది సుశీల. తన గాథ వింటే పార్వతి అక్కయ్యకు జాలివేస్తూందా? దీనంగా చూస్తూ అంది. "ఇన్నాళ్ళూ నా బాధని నా గుండెల్లోనే దాచుకున్నాను. నీలా ఇంత చల్లగా అడిగి అర్థం చేసుకున్న వాళ్ళు కనిపించలేదు చెప్పుకుని ఏడవటానికి కూడా!''

"రఘుబాబు బొత్తిగా అమాయకుడు! నువ్వు గాకపోతే అతన్ని ఎవరు ఆదరిస్తారు చెప్పు?''

"అక్కయ్యా! నన్నేం చెయ్యమంటావు?''

"నీ బాధ అర్థం చేసుకోలేదనుకోకు సుశీ! నిన్ను ఓదార్చడానికి చెప్పడం లేదు. నీకు ఎంత బాధగా ఉన్నా సహనంగా ఉండు! ధైర్యం పోగొట్టుకోకు!...'' కళ్ళు చెమర్చుతోంటే చటుక్కున తుడుచుకుంది పార్వతి.

సుశీలకు కొంత భారం తీరినట్టయింది.

"వస్తాను సుశీ! చాలా పొద్దుపోయింది. ఇంటి దగ్గర చంటి పిల్ల వాడు కదా? వస్తానమ్మా!'' అంటూ లేచింది పార్వతి.

సుశీల రఘుపతిని గురించి చెప్తూంటే పార్వతి అంతరంగం భరించలేని క్షోభతో ఎంత అల్లకల్లోలమైందో సుశీలకేం తెలుసు?

★ ★ ★

"కూతురు పుడితే పార్వతి పేరు పెడతానన్నావ్. మరి కొడుకుని కన్నావేం?" అంటూ చెల్లెలితో హాస్యమాడాడు సూర్యం.

"బాగుంది. పుడితే పెట్టుకుందా మనుకున్నాను. నేనేం దేవుణ్ణా ఏమిటీ?" మూతి మూడు వంకర్లు తిప్పింది రుక్మిణి.

"అబ్బా! ఊరుకోండర్రా, మీ వాదాలూ మీరూనూ" అంటూ విసుక్కుంది పార్వతి.

మూడు నెలల బాబిగాడు ఊఁ ఊఁలు కొడుతూ, దీపాల వెలుగు చూసి కేరుతూ, పండులా ఆడుకుంటున్నాడు. వాడికి తగ్గ పేరే కుదరలేదు. పృథ్వీలో ఉన్న పేర్లేవీ పనికి రావంటుంది వాళ్ళమ్మ.

"అక్కయ్యా! దీని మాటలు నిజమనుకున్నాం గానీ దీనికి కూతురు పుట్టినా నీ పేరు పెట్టదే! తీరా ఇంత వరకూ రానిచ్చి 'పార్వతి పేరేమిటి? చెత్త' — అనేదే!"

"ఒరేయ్! నన్నెందుకలా ఆడిపోసుకుంటావు? నా కిష్టమైతే పెట్టుకుంటాను, లేకపోతే లేదు. అదేం రూలా ఏమిటి? ఈ కాలంలో అంత పాత పేర్లెవరు పెట్టుకుంటున్నా రసలు?"

పార్వతి మనస్సు చివుక్కుమంది. ప్రశాంతంగానే అంది. "మీరు పెడతానన్నా నా పేరు పెట్టనివ్వను! ఇంతటి అదృష్టవంతురాలి పేరు ఆ పసివాళ్ళకి కూడా అంటగట్టాలా? నా ఆన వాయితీ వస్తే వాళ్ళు మాత్రం ఏం సుఖపడ తారు?"

పార్వతి ఎంత సౌమ్యంగా మాట్లాడినా ఆ మాటలో ఉన్న నిష్ఠూరం ఇద్దరికీ అర్థమైంది. రుక్మిణి పిల్లాణ్ణి చూసుకునే నెపం మీద లేచి పోయింది. సూర్యం ఏదో పుస్తకం తెరుచుకుని దీక్షగా చదవటంలో మునిగిపోయాడు.

వాతావరణం అలా మారడం నచ్చలేదు పార్వతికి. చిన్నవాళ్ళేదో హాస్యాలాడుకున్నదానికి తను పట్టించుకుని బాధపడటం అవివేకం అనిపించింది. "నేనేం సుఖపడ్డాను?" అని తను దెప్పేసరికి పాపం వాళ్ళిద్దరూ చిన్నబుచ్చుకున్నారు. పెద్ద దానికి తనకే లేని వివేకం వాళ్ళకెక్కడి నించి వస్తుంది? తోడబుట్టిన వాళ్ళిద్దరి మీదా అభిమానం పొంగుకొచ్చింది.

"రుక్కూ! వాణ్ణి కాస్సేపిలా ఇవ్వవే, ఎత్తుకుంటాను" అంది ఉల్లాసంగా గొంతు మార్చుకుని.

"పాలు తాగుతున్నాడక్కయ్యా!"

రుక్మిణి పిల్లాడికి పాలిస్తూంటే పార్వతి కేమిటో సిగ్గువేస్తుంది. ఏదో పనిలో మునిగిపోయినట్టు ఆ పరిసరాలకయినా వెళ్ళకుండా దూర దూరంగా తచ్చాడుతుంది. రుక్కుకి మాత్రం అలాంటి సిగ్గేమీ ఉన్నట్టు ఉండదు. మాట్లాడుతూనే కొంగు అడ్డం పెట్టుకుని పాలిస్తూ కూర్చుంటుంది. ఎంతైనా రుక్కు పెద్ద దానిలా మారిపోయింది!

"తాగేశాడే రుక్కూ?" మళ్ళీ అడిగింది పార్వతి.

"నిద్రపోతున్నాడక్కయ్యా! పడుకో బెట్టాను!"

"నా కిమ్మన్నాను కదే?" నిష్ఠూరం తెలిసే లాగే అంది.

"పాలు తాగేసరికి కళ్ళు మూతలు పడి పోయాయి వాడికి. అయినా ఇప్పుడే ఎత్తుకు తిప్పితే పాలన్నీ కక్కేసుకుంటాడక్కయ్యా?"

పిల్లాణ్ణి లేవదీయ్యాలని ఉయ్యాల దగ్గరికి వెళ్ళబోయిన పార్వతి "నిజమేనే" అనుకుంటూ ఆగిపోయింది. "సరేలే! పడుకోనియ్యి" అంటూ మళ్ళీ కుంపటి దగ్గిర కూర్చుంది.

ఉయ్యాల్లో నిశ్చింతగా నిద్రపోతున్న వాణ్ణి ఘడియ ఘడియాకూ వెళ్ళి చూస్తూ వాడెప్పుడు లేస్తాడా అన్నట్టు కాసుక్కూర్చుంది పార్వతి. వాడు నిద్రలోనే నవ్వుతూ కమ్మటి కలలు కంటూ గంటకు పైగానే పడుకున్నాడు. ఉన్నట్టుండి ఉలిక్కిపడి లేచి కెవ్వుమని గుక్కపట్టాడు.

నుదురు తలుపుకి కొట్టుకున్నా లెక్క చెయ్యకుండా పరిగెత్తింది పార్వతి. పిల్ల వాణ్ణి అందుకుంది. రుక్మిణి కూడా కంగారుగా పరిగెత్తుకు వచ్చింది. " ఇలా ఇవ్వక్కయ్యా!" అంది.

"ఫర్వాలేదే! నే నూరుకోబెడతాలే" అంటూ వాణ్ణి పొత్తిళ్ళలో వేసుకుని. "ఊరుకోరా బాబూ!

ఊరుకోరా! ఏం, ఎందుకలా గుక్కపట్టావు? నిన్నె వరేమన్నారు?" అంటూ సముదాయించటం ప్రారంభించింది. వాడి రాగం తగ్గలేదు సరికదా శ్రుతుల వారీగా హెచ్చుసాగింది.

రుక్మిణి ఉండబట్టలేక, "వాడలా ఊరుకో డక్కయ్యా? ఇందాక కడుపు నిండకుండానే నిద్రలో పడ్డాడు. ఆకలివేస్తోన్నట్టుంది. ఇలా ఇచ్చేయ్, ఒక సారి అడ్డంవేసుకుంటాను" అంటూనే కొడుకుని అందుకుని కొంగు అడ్డం పెట్టుకుని పాలిస్తూ కూర్చుంది. వాడి ఏడుపంతా ఏమైందో కిమ్మనకుండా తల్లి గుండెల్లో దూరాడు.

పార్వతి నవ్వుకుంది. వాణ్ణి ఊరడించటానికి తన దగ్గిర ఏముంది? ఉత్తమాటలతోనే కడుపు మంట చల్లారుతుందా?

అందరి భోజనాలూ ముగిశాక వంటిల్లు సర్దుకుని బయటికి వచ్చింది పార్వతి. కిలారుమని నవ్వుతూ, కాళ్ళూ చేతులూ ఆడిస్తూ దీపం కేసి చూస్తూ కేరింతుల కొడుతున్నాడు పసివాడు.

"రుక్కూ! ఈ రాత్రి కాసేపు వీణ్ణి నా పక్కలో పడుకోబెట్టుకుంటానే."

"వాడేడిస్తే నీకు మెలుకువొస్తుందా?"

"ఎందుకు రాదు? నే నంత మొద్దు నిద్ర పోతానా?"

"నీకు అలవాటు లేక ఏ కాలో చెయ్యోవాడి మీద పడేస్తే?" నవ్వుతూనే అంది రుక్మిణి.

"అమ్మో! వొద్దులే బాబూ!" పార్వతికే భయం వేసింది.

★ ★ ★

రామం వచ్చాడు భార్యని తీసికెళ్ళటానికి, పసి వాడికి ఒక తులం గొలుసూ, తులం ఒత్తులూ, వేళ్ళకు రెండు ఉంగరాలూ చేయించే ఉంచింది పార్వతి.

రుక్మిణికి నాలుగయిదు చీరలు కొంది. రెండు బిందెల చలిమిడీ, ఒక మణుగు మిఠాయీ, ఓ కుంచెడు సున్నిపిండీ, పసుపూ కుంకం అన్నీ తయారు చేయించింది. అయినా రుక్మిణికి ఏమంత సంతోషం కలిగినట్టు కనిపించలేదు. ప్రయాణం అన్న దగ్గిర్నించీ మాటా పలుకూ లేకుండా ముభావంగానే తిరుగుతూంది.

పార్వతి చటుక్కున జ్ఞాపకం వచ్చి పెట్టి తెరిచి ఒక ఐదు రూపాయల నోటు తీసింది. గదిలోకి వెళ్ళబోయిందల్లా ఆగిపోయింది.

"చాల్లే! ఊరుకుందూ!" విసుక్కుంటున్నాడు రామం.

"ఊరుకోవటం ఏమిటి? మా అమ్మ ఉంటే ఇలాగే చేసేదా? ఇద్దరూ కలిసి రెండు వందలకి పైగా సంపాదించుకుంటున్నారు. లింగు లింగుమంటూ నూలు దారంలా గొలుసూ, చీపురు పుల్లల్లా ఒత్తులూ పామించింది. ఎవరిక్కావాలి? అక్కర్లేదనే చెప్పేస్తాను."

"ఛీ! నువ్వు మనిషివి కాదూ? వదిన వింటే ఎంత బాధపడుతుంది!"

"బాధ ఎందుకుపడుతుందీ? సిగ్గు తెచ్చుకుంటుంది. చిన్నదాన్నని నా ముద్దు ముచ్చట్లేమైనా తీరి చస్తున్నాయా? నే నెంత బాధపడుతున్నానో ఎవడికి తెలుసు?" ఏడుస్తున్న స్వరం!

పార్వతి తల గిర్రున తిరిగింది. ఒక్కక్షణం కూడా నిలబడలేక పోయింది. తూలుకుంటూ తూలుకుంటూ పెరట్లోకి పోయి చీడీల మీద కూలబడి, "అమ్మా!" అంటూ బావురుమంది.

ఏడ్చి ఏడ్చి చటుక్కున చెంపలు తుడుచుకుంటూ లేచింది. "సూర్యం! ఒకసారి ఇలారా?" అంటూ కేక పెట్టింది.

అప్పుడే ఇంట్లోకి వస్తూన్న సూర్యం, "ఎందుకక్కయ్యా" అంటూ దగ్గరికి వచ్చాడు.

"సీతమ్మ మామ్మ నడిగి నేనిమ్మన్నానని ఒక పాతిక రూపాయలుంటే తీసుకురా! తొందరగా వెళ్ళిరా. ఇంకా భోజనాలూ అవీ అవ్వాలి, బండికి వేళైపోతోంది."

"ఎందుకక్కయ్యా? ఇప్పుడు డబ్బెందుకు? వాళ్ళకి చార్జీలకి మన దగ్గర ఉందిగా?"

"ఎదురు ప్రశ్నలు వెయ్యక వెళ్ళిరా!"

సూర్యానికి చిన్నతన మనిపించింది. కోపం

కనిపించనీయకుండా, "ఆ మామ్మ రూపాయికి బేడ చొప్పున వడ్డీ తీసుకుంటుంది తెలుసా?" అన్నాడు.

"తెలుసు, తెలుసు. అన్నీ తెలిసే చెప్పాను" తీక్షణంగా చూసింది పార్వతి.

సూర్యం మాట్లాడకుండా బయటికి వెళ్ళి పోయాడు.

భోజనాలు ముగిశాయి. ఎవరిమట్టుకు వాళ్ళు ముభావంగా ఉన్నారు. రామం గదిలో కూర్చుని తమలపాకులు నములుతూంటే గుమ్మం దగ్గరికి వెళ్ళి "రామం!" అని పిలిచింది పార్వతి

"ఏం, వదినా! పిలిచావా?" గుమ్మంలోకి వచ్చాడు రామం.

గంట కిందటే కొంగున కట్టుకున్న ఐదు రూపాయలనోటు విప్పి అందిస్తూ, "మీ ఊళ్ళో ఓ రెండు వందల అరటిపళ్ళు కొనమన్నా నని అత్తయ్యతో చెప్పు. ఇక్కడి నుంచి తీసికెళితే చితికి పాడైపోతాయి. తీసికెళ్ళటం ప్రయాస కూడానూ. ఇదిగో, ఈ డబ్బు ఉంచు!" అంది.

"అదేంటి వదినా? అమ్మ తప్పకుండా కొంటుంది. అరటి పళ్ళ భాగ్యానికి డబ్బు ఇవ్వాలా నువ్వు?"

"కాదులే, ఉంచు. ఈ సారెలో మీ డబ్బేమీ పడకూడదు."

రుక్మిణి సిల్కు చీర రెపరెప లాడించు కొంటూ వచ్చింది. " ఆఁ, వాళ్ళ డబ్బు పడకుం డానే అవుతుందా ఏమిటి? తీసికెళ్ళేవి ఏ మూలకి సరిపోతాయి? అత్తయ్య మళ్ళీ ఎలాగూ చేయి స్తుంది" అంది విసురుగా.

పార్వతికి చాలా కోపం వచ్చింది. రుక్మిణి అహంకారానికి తనే కారకురాలేమో ననిపిం చింది. అయినా రామాన్ని చూచి కోపం కనిపించ నీయకుండా చేసుకుంది. "అత్తయ్య భాగ్య శాలి. సిరి సంపదలతో పెట్టి పుట్టింది. నా వంటి వాళ్ళ నెందర్నయినా పోషిస్తుంది. ఇక మనవడి బార సాలకీ పెద్దపెట్టున సారె పంచిపెట్టుకుంటే విశేష మేముంది?" అంటూ రామం కేసి చూసింది. "చూడు రామం! రుక్కు అన్నట్టు నే నేమీ గొప్పగా చెయ్యలేకపోయాను. పిల్లాడికి కూడా ఏమీ పెట్ట లేకపోయాను. పురిటికీ, వాటికీ కాస్త ఖర్చయింది. కలిగినంతలో ఏదో చేశాను. ఏమీ అనుకోవద్దని అత్తయ్యతో చెప్పు! మాకు మాత్రం రుక్కు కాక పోతే, ఇంకెవరున్నారు? ఈ సారి మీ వూరికి నే నొచ్చినప్పుడేమైనా తీసుకొస్తాను" అంది.

రామం సిగ్గుపడ్డవాడిలా తలదించుకు న్నాడు. "నువ్వు ఎంత చేస్తే అంతే సంతోషం వదినా! అమ్మకీ నాకూ కూడా అలాంటి పట్టిం పులు లేవు. ఇక నీ చెల్లెలు పరాయిది కాదు. నువ్వెందుకంత బాధపడుతూ చెప్తున్నావు?"

"అహఁ! మాటవరసకి అన్నాలే."

బండి ఎక్కేముందు చెల్లెలికి బొట్టుపెట్టి చేతిలో పాతిక రూపాయలు పెట్టింది పార్వతి "నీ చేతిఖర్చులకి ఉంచుకో! ఎప్పుడైనా ఏమైనా అవ సరమైతే వ్రాస్తూ ఉండు! నన్నడిగి తీసికెళ్ళటానికి నీకు బిడియం దేనికి? బాబు జాగ్రత్త! రైల్లో జాగ్రత్తగా పట్టుకో! కిటికీ దగ్గర కూర్చోకు సుమా! వెళ్ళగానే దిష్టితీయించు! అత్తయ్య ఎలాగూ తీస్తుందిలే. మరి జాగ్రత్తగా వెళ్ళిరా!"

రుక్మిణి ఏదో అపరాధం చేసినదానిలాగా తల ఎత్తలేకపోయింది. నెమ్మదిగా "వెళ్తాను" అనేసి బండి ఎక్కింది.

బండిని చూస్తూ నించుంది పార్వతి. ఇంట్లోకి వెళ్తే మేదర ఉయ్యాల ఖాళీగా ఊగుతూ బోసిగా కనిపించింది. ఉయ్యాల తాళ్ళు పట్టుకుని నిట్టూర్చింది పార్వతి.

★ ★ ★

పరధ్యానంగా నడుస్తూన్న పార్వతి, కారు హారన్ వింటూ ఉలిక్కి పడి పక్కకు తప్పుకుంది. నిగ నిగలాడే నల్ల కారొకటి దూసుకువచ్చి ఠక్కున ఆగిపోయింది పార్వతికి రెండడుగుల దూరం లో. కారులోంచి దిగినించున్న వ్యక్తిని చూస్తూ విభ్రాంతితో నిలబడిపోయింది పార్వతి.

పద్మజ నవ్వి పార్వతి చెయ్యి అందుకుంది. "నిన్ను వెనక నుంచే చూసి పోల్చాను.

అనుమానం తీర్చుకోటానికి మరో రెండడుగులు పైకి పోనిచ్చాను. పారూ, నేను గుర్తులేనా ఏమిటే?''

"పద్మా!'' ఆశ్చర్యంగా అంది పార్వతి. అంత కన్నా మాట్లాడలేక పోయింది.

"ఎందుకంత విస్తుపోతున్నావు? పద కారు ఎక్కు. మాట్లాడుకుందాం.''

పార్వతి అయోమయంగా చూసింది. ఇంత హఠాత్తుగా పద్మజ కనిపించటం, కారులో ఎక్క మనటం, నమ్మశక్యంగా లేవు. "నువ్వు... ఈ ఊరెప్పుడొచ్చావు?''

"ఇలా నడి రోడ్డు మీదెందుకు నిల బడటం? అన్నీ చెప్పుకుందాం రా!

"ఇప్పుడెక్కడికి మనం వెళ్ళేది?''

"మా బంగళాకి. ఏం?''

"ఆహా! నే నిప్పుడే ఆఫీసునుంచి వస్తు న్నాను. ఇంటి దగ్గర ఇంకా వంటా అదీ ... సూర్యానికి చెప్పాలిగా?''

"అయితే పద, మీ ఇంటికే వెళ్ళి సూర్యాన్ని కూడా తీసికెళదాం!

"అబ్బే! వద్దు. ఎందుకూ? పొద్దుటి అన్నం కొంచెం ఉంది, తినమంటాను వాణ్ణి!''

"సరే. ఏదో ఒకటి చేద్దాంలే, ముందు కారెక్కు!''

పార్వతి ఇంటిమీదుగా పరుగెత్తింది కారు. సూర్యాన్ని కూడా రమ్మంటే తనేదో పిక్చర్‌కి వెళ్తు న్నానన్నాడు. పార్వతి ఆ రాత్రికి రాదని చెప్పి మళ్ళీ స్టీరింగ్ ముందు కూర్చుంది పద్మజ.

"పారూ! నీకు చాలా ఆశ్చర్యంగా ఉందా?''

"ఏం, నీకు లేదా?''

"నాకేం లేదు. నీ కోసమే వెతుకుతున్నాను. మీ ఆఫీసుకి వెళ్ళాను.''

"నువ్విక్కడకొచ్చి ఎన్నాళ్ళయింది?''

"మూడు రోజులయింది. ఈ గవర్నమెంటు హాస్పిటల్‌లో ఒక డాక్టరు రెండు నెలలు లీవు మీదున్నాడు! ఆ ప్లేస్‌లో జాయిని వెళ్ళ మంటే ఒప్పుకున్నాడు! సరే నాకు నిన్ను కలుసుకోవాలని ఎప్పటి నుంచో ఉంది. నేనూ లీవ్ పెట్టాను. నా ఆరోగ్యం కూడా అంత బాగాలేదు. కాస్త వెదర్ మార్పు కూడా పనికి వస్తుందని అనిపించిం దిలే.''

"ఏం, నీకేం బాగాలేదు?''

పద్మజ అందంగా నవ్వింది. "ఏం బాగా లేదని చెప్పను?''

"ఏం బాగాలేదో అదే చెప్పు'' అమాయ కంగా అడిగింది పార్వతి, పద్మజ మొహంలోకి చూస్తూ.

పద్మజ కళ్ళల్లో సిగ్గు దొంతరలు కనిపించి నట్టయ్యాయి. అలాగే నవ్వుతూ జవాబు చెప్ప కుండా కూర్చున్న పద్మజను చూస్తూంటే పార్వ తికి ఆశ్చర్యం వేసింది. "అదేమిటి పద్మా? ఎందు కలా సిగ్గు పడుతున్నావు?'' — అలా అన్నదేగానీ పార్వతి ఏదో అనుమానంతో పద్మజ కళ్ళల్లోకి చూసింది. "నిజం చెప్పు. తల్లి వికాబోతున్నావు కదూ? అవునా?''

అవునన్నట్టే నవ్వింది పద్మజ.

పార్వతి మొహం సంతోషంతో మెరిసింది!

"నిన్ను కలుసుకోగలిగినందుకు నా కెంత సంతోషంగా ఉందో చెప్పలేను పారూ!''

"అందుకే కాబోలు ఉత్తరాలే మానేశావు!''

"నువ్విలా నిష్ఠూరాలువేస్తే నే నేమీ చెప్ప లేను.''

"పోనీ, పెళ్ళికి ముందైనా మాట మాత్రం చెప్పావా? నే నసలు నీకు గుర్తే రాలేదు కదూ?''

"రాలేదు. ఎలా వస్తావు? పెళ్ళి కూతురికి పెళ్ళి కొడుకు ధ్యాస తప్ప మరేమైనా ఉంటుందా?'' హాస్యంగా చూసింది పద్మజ.

ఇద్దరూ నవ్వుకున్నారు.

కారు కాంపౌండ్‌లో వదిలి లోపలికి నడుస్తూ పార్వతిని వెంట తీసికెళ్ళింది పద్మజ. ఫ్లాస్క్‌లో కాఫీ కప్పులోకి వంచి పంచదార కలు పుతూ ఫేన్ ఆన్ చేసి వచ్చి కూర్చుంది — "ఇక ఇప్పుడు అడుగు పారూ! నీకు తిట్టాలని ఉంటే తిట్టేయ్!''

"తిట్టడం కాదు గానీ నీ ప్రేమ గురించీ, పెళ్ళి గురించీ, నాతో ఒక్కమాటైనా చెప్పావా?

సడెన్‌గా నీ మేరేజ్ ఫోటో పేపర్‌లో చూస్తే నమ్మలేకపోయాను తెలుసా? ఒక వారం కిందటే నీ కెవరో పెళ్ళి చూపుల వాళ్ళొస్తున్నారన్నట్టు రాసింది సుజాత. అంతలోనే ఈ వార్త! ఆశ్చ ర్యంతో తలమున్కలయ్యాననుకో!"

"క్షమించు, పారూ! నా పెళ్ళి విషయం ఒక్క నాన్నకే చెప్పాను!"

"అన్నట్టు, బాబాయ్..." చటుక్కున ఆగి పద్మజ మొహం పరిశీలనగా చూసింది పార్వతి.

పద్మజ మొహంనిండా విషాదం ఆవరించు కొంది. "నాన్న పోయిన సంగతి నాకూ తెలుసు పారూ!"

"నీకు తెలుసా? ఎలా తెలిసింది?"

"మన ఊరు నుంచేదో స్పెషల్ కేసు వచ్చింది, మద్రాసులో నేను పనిచేస్తోన్న హాస్పి టల్‌కి. ఆ పేషెంటో నలభై ఏళ్ళావిడ, అస్తమానూ వసపిట్టలా వాగుతూండేది విన్నా వినకపోయినా. ఊరూ పేరూ అన్నీ తనకు తనే చెప్పుకునేది. మన ఊరు నుంచి వచ్చారని వినగానే ఉండబట్టలేక అడిగాను — "ఫలానా తాసిల్దారుగారు బాగు న్నారా?" అని. ఆవిడ రక రకాలుగా చేతులు తిప్పుతూ, "ఇంకెక్కడి బాగమ్మా? పెద్ద కూతురు ఇంట్లోంచిపోయి, ఎవణ్ణో పెళ్ళి చేసుకుందిగా? ఆ బెంగతో ఆ మారాజు వీధి మొహం చూడలేదు. ఏడాది తిరిగే సరికే కన్ను మూశాడు" అంటూ సంగతంతా చెప్పింది పారూ! నాన్నని తలుచు కుంటే ఇప్పటికీ నాకెంతో ఆవేదనగా ఉంటుంది. అందరిలాగే ఆయన వృద్ధాప్యంలో ఏవో శారీరక అనారోగ్యాలతో బాధపడిపోతే, అది వేరు కానీ, నాన్న మాత్రం పూర్తిగా నా బెంగతోనే కృశించి పోయారు. అసలే బ్లడ్ ప్రెషర్ ఉందేమో — దానికితోడు మనసుకి ఆందోళన! తట్టుకోలేక పోయారు! చివరికి ఆయన మరణానికీ నేనే కారణమయ్యాను పారూ! ఆయన నాకు విద్యా బుద్ధులు చెప్పించినందుకు ఇలా రుణం తీర్చు కున్నాను" పద్మజ కళ్ళలో నీటి పొరకమ్మింది. కన్నీళ్ళు జల జలా రాలాయి.

పార్వతికేం మాట్లాడడానికీ తోచలేదు.

"నాన్న నా కోరిక అర్థం చేసుకున్నారు. ఒక రకంగా అంగీకరించారు కూడాను. కానీ ఆయన సంఘం వేరు. దాన్ని కాదని ధిక్కరించలేక పోయారు. నలుగురి లోనూ నవ్వులపాలై పోయామే అన్న దిగులే ఆయన్ని కుంగదీసింది! కానీ, నేను, చేసిన దాన్ని గురించి ఎప్పుడూ పశ్చాత్తాప పడలేదు. ఇక ముందు కూడా అలా జరగదు!"

"బాబాయి పోయిన కబురు తెలిసినప్పు డైనా ఒక్క సారి రాకపోయావా పద్మా?"

"రావాలనే అనుకున్నాను. కానీ నాన్న లేనప్పుడు అక్కడ నన్ను ఎవరూ ఇష్టపడరు! అక్కడ కర్మకాండలేవో జరుగుతూ ఉంటాయి. నేను ఇంట్లో ఉంటే అదంతా అపవిత్రం అయి పోయిందనుకుంటారు. నన్ను ఇంట్లోకి రావద్దం టారు కూడా!"

"పోనీ తర్వాతైనా రావద్దా పద్మా? అతన్ని తీసుకుని రావచ్చు కదా? 'ఫో ఫో' అంటారా? ఇప్పటి దాకా నువ్వు అమ్మ దగ్గిరికి వెళ్ళకపోవడం చాలా తప్పు!"

"వెళ్తే అమ్మ మాట్లాడేదా?" అంది పద్మ ఆశ్చర్యంగా.

"మాట్లాడకపోయినా సరే, నువ్వు వెళ్ళాలి, అమ్మ తప్ప కుండా మనసులో సంతోషిస్తుంది."

"అలాగా?" అన్నట్టు పద్మ ఆశ్చర్యపడింది.

తిరిగి క్రమంగా సంభాషణ మామూలు ధోరణిలో పడింది.

"... ఇంతకీ నీ జీవితం ఎలా సాగుతోంది?" అప్యాయంగా అడిగింది పద్మజ, పార్వతిని చూస్తూ.

"చెప్పటానికేముంది? నా జీవితంలో విశేషా లేమున్నాయి?"

"మరి ఇంకా ఎన్నాళ్ళిలా ఒంటరిగా ఉందా మను కుంటున్నావు? నువ్వు నెత్తి మీద వేసుకున్న బాధ్యతలన్నీ తీరిపోయాయిగా?"

"నన్నేం చెయ్యమంటావు?" సగం నిరా శగా, సగం హాస్యంగా అడిగింది పార్వతి.

"అసలు నీకు పెళ్ళి చేసుకోవాలని ఉందో,

లేదో నాకు చెప్పు! లేకపోవటం ఏమిటి? నువ్వేం మానవాతీతంగా ఊడిపడ్డావా?" మందలింపుగానే అంది పద్మజ.

చిన్న పిల్లలా సిగ్గుపడింది పార్వతి. "నాకో సంబంధం చూడరాదు?" అంది నవ్వుతూ.

"అందుకే అడుగుతున్నానోయ్! పెళ్ళికొడుకు రఘుబాబులాగ నోట్లో నాలిక లేకుండా ఉంటాడనుకున్నావా? కత్తి లాంటి వాణ్ణి చూసి నిర్ణయిస్తాను. ఇంతకీ వర్ణాంతరమైనా అభ్యంతరం లేదా, లేకపోతే ఒక్కకులం వాడూ, ఒక్క శాఖ వాడూ తప్ప పనికిరాడా? ఎర్రగా ఉండాలా, తెల్లగా ఉండాలా, పచ్చగా ఉండాలా?"

"నల్లగా ఉండాలి" అని నవ్వింది పార్వతి. "నాకు పెళ్ళీ వద్దు, ఏమీ వద్దుగానీ నీ కంత అభిమానం ఉంటే..."

"ఊఁ, అభిమానం ఉంటే?"

"నీకు కొడుకు పుడితే నా కిచ్చేయ్!"

"కూతురైతేనో?"

"ఉహుఁ! వద్దు. కష్టపడి పెంచి పెద్దచేస్తే నీ లాగే అదీ నన్ను ధిక్కరించిపోతుంది. కొడుకైతే వాడి చేతుల్లో నా తనువు వెళ్ళిపోతుంది."

"హాస్యం కాదు పారూ! నిజం చెప్పు, నువ్వు పెళ్ళిచేసుకోరాదూ?"

"ఛీ ఛీ! నాకేం పెళ్ళి? ఇంకే మైనా కబుర్లు చెప్పు!"

కబుర్ల సందట్లో టాక్సీ హార్న్ వినిపించనే లేదు, జార్జి వచ్చాడు. పద్మజ, జార్జిని పార్వతికి పరిచయం చేసింది. పార్వతి సిగ్గుపడుతూ కూర్చుంది ఇబ్బందిగా. "పద్మా! నే నింక వెళ్ళిపోతానులే, మళ్ళీ రేపు వస్తాను" అంటూ లేచింది.

విసుక్కుంది పద్మజ. "చాల్లే ఊరుకో, నీ కంగారూ నువ్వూనూ."

జార్జి నవ్వుతూ, "ఉండిపోండి సిస్టర్! నాకు నైట్ డ్యూటీ కూడా ఉంది. చాలా కాలానికి కలుసుకున్న ఫ్రెండ్స్ కదా? ఆ మాత్రం కబుర్లు చెప్పుకోకపోతే ఎలా?" అన్నాడు.

"థాంక్స్" అంటూ నవ్వింది పద్మజ, "తమరు అనుకోకుండా ఇల్లు విడిచి పోతున్నందుకు మెనీ మెనీ థాంక్స్!"

పార్వతి ఆ ఇద్దరినీ చూస్తూ మనసారా సంతోషించింది.

పద్మజ ఉన్న రెండు నెలలూ రెండురోజుల్లా గడిచిపోయాయి. దాదాపు నెల్లాళ్ళకుపైగా రాత్రులన్నీ పద్మజతోనే గడిపింది పార్వతి.

పద్మజ వెళ్ళిపోయేటప్పుడు,

"బద్ధకించకుండా ఉత్తరాలు రాస్తూండు పద్మా" అంది పార్వతి రుద్ధ కంఠంతో.

"తప్పకుండా. కొడుకు పుడితే వైర్ ఇప్పిస్తాను. వెంటనే వచ్చి తీసికెళ్ళు!" అంటూ నవ్వింది పద్మజ.

★ ★ ★

పదే పదే పద్మజ గుర్తువస్తూంటే పరధ్యానంతో ఆఫీసులో నిలకడగా కూర్చుని పని చెయ్యలేకపోయింది పార్వతి.

రాజ్యలక్ష్మి నవ్వుతూ వచ్చి పలకరించింది. 'బాటసారి' బాగుంటుందట! క్రిందటిసారి వస్తే చూడలేకపోయాను. వెళ్దాం వస్తారా పార్వతీ?" అంది.

పార్వతి వెంటనే ఒప్పేసుకుంది.

ఇంటర్‌వెల్‌లో హాలంతా గోలగా తయారైంది. పిక్చర్ అంత వరకూ బాగానే నచ్చింది పార్వతికి. రాజ్యలక్ష్మితో మాట్లాడుతూ కూర్చున్నదల్లా అనుకోకుండా వెనక కుర్చీల కేసి చూసింది. సూర్యం పక్క ఎవరో అమ్మాయి! ఇద్దరికీ సంబంధం లేదేమో అనుకుంది మొదట. కూల్ డ్రింక్సు కుర్రవాణ్ణి పిలిచి ఓ గ్లాసు తీసుకుని ఆ అమ్మాయికి అందించి తన పర్సు లోంచి డబ్బులు తీసి ఇచ్చాడు సూర్యం. మళ్ళీ ఆ ఖాళీ గ్లాసు అందుకొని కుర్రాడికి అందించి ఏవో కబుర్లు చెపుతూ నవ్వుతూ కూర్చున్నాడు.

"ఏమిటలా చూస్తున్నారు?" అంది రాజ్యలక్ష్మి.

"ఆహాఁ! ఏం లేదు, ఊరికినే" లేని ఉత్సాహం తెచ్చు కుని మాట్లాడుతూ కూర్చుంది

పార్వతి. మళ్ళీ పిక్చర్ ప్రారంభమైనా ఆసక్తిగా చూడలేకపో యింది. "ఇందుకేనా సూర్యం చాలా మారి పోతున్నాడు!" అనిపించింది.

సూర్యం రాత్రిళ్ళు ఆలస్యంగావస్తున్నా, తన కిచ్చిన డబ్బుగాక, ఐదూ పదీ అడిగి తీసుకుం టూన్నా, ఎప్పటిలాగా చనువుగా మాట్లాడకుండా ముభావంగా ఉంటున్నా... ఇంత కాలం తనేమీ గ్రహించలేకపోయింది.

ఇంటికి వచ్చి అన్నం తినకుండా తమ్ముడి కోసం ఎదురు చూస్తూ కూర్చుంది. సూర్యం రానే వచ్చాడు. బట్టలు మార్చుకుని పడుకోటానికి సిద్ధమౌతూంటే, "అదేమిటి? అన్నం తినవూ?" అంది.

"ఆకలి లేదక్కా! ఓ ఫ్రెండ్ బలవంతంచేసి హోటల్‌కి లాక్కెళ్ళాడు. కడుపు నిండుగానే ఉంది."

"పోనీ, కొంచెం మజ్జిగన్నం తిందువుగాని రా! వేడి చేస్తుంది."

మరేమీ అనకుండా లేచాడు సూర్యం.

"బాటసారి బావుందిరా! నువ్వు చూశావా?" తమ్ముడి మొహంలోకి చూస్తూ అడిగింది పార్వతి.

"క్రిందటి సారి వచ్చినప్పుడు చూశాను. బాగానే ఉంటుంది."

నోట పెట్టుకోబోతూన్న ముద్ద అలాగే పట్టుకుని విస్మయంగా చూసింది పార్వతి. సూర్యం అదేం గమనించలేదు. గబ గబా చెయ్యి కడుక్కుని లేచిపోయాడు. పార్వతికి అన్నం సహించలేదు. బలవంతంగా కంచంలో ముద్దలు రెండూ మింగి లేచింది.

సూర్యం ఏదో డిటెక్టివ్ నవల చదువు కొంటూ కూర్చున్నాడు.

"పదకొండు దాటిందిగా, పడుకోరాదూ?"

"ఫర్వాలేదక్కా! రేపు ఇచ్చెయ్యాలీ పుస్తకం."

"ఎవరి దగ్గర తెచ్చావేమిటి?"

"ఫ్రెండు దగ్గర."

"ఫ్రెండు! ఫ్రెండు! ఎవరా ఫ్రెండు?" అని అడిగెయ్యాలన్నంత కోపం వచ్చింది. మాట్లాడ కుండా పడుకొంది. చాలా సేపటి వరకూ నిద్రపట్టలేదు.

సూర్యం ఇంకా చదువుకుంటూనే ఉన్నాడు.

పోనీ. మనస్సులో ఎందుకీ మథన? వాణ్ణి అడిగేస్తే? ఎందుకిలా చేస్తున్నావని చివాట్లు పెడితే? సిగ్గుపడి పోతాడేమో! చిన్న పిల్లాణ్ణి కేకలేసినట్టు కేకలేస్తే బాధపడతాడేమో!

అయినా తన చాదస్తంగానీ ఈ రోజుల్లో ఒక ఆడ పిల్లతో కలిసి సినిమా చూసినంత మాత్రాన తనిలా శంకించటం ఏమిటి? కలిసి చదువు కున్నదో, కలిసి పనిచేసే మనిషో కావచ్చు. కలిసి వెళ్ళారో, అనుకోకుండా సినిమా హాల్లోనే కన పడిందో! ఏం చెప్పగలం?

చటుక్కున గుర్తు వచ్చింది. మరి అబద్ధం ఎందుకు చెప్పాలి వాడు? ఏ భయమూ లేకపోతే జరిగింది జరిగినట్టే చెప్పవచ్చుగా?

బావుంది. తనిప్పుడు అపార్థం చేసుకో లేదూ? అలాగే సరిగా ఆలోచించకుండా కేక లేస్తుందని జంకాడో ఏమిటో! వాడు మాత్రం పాలు తాగే పసివాడా ఏమిటి? వాడి మంచి చెడ్డలు వాడు ఆలోచించుకోలేడూ? బి.ఏ. పాసై ఉద్యోగం చేసుకుంటున్న వాడికి అంత మాత్రం వివేకం ఉండదూ?

ఎప్పుడు నిద్రపట్టేసిందో పార్వతికి, మర్నా టికి మనస్సు తేలిగ్గానే ఉంది. సూర్యం మొహం కేసి చూస్తే నిష్కల్మషంగానే కనిపిం చింది.

ఆ నెల జీతం ఎప్పటిలాగే పార్వతి చేతిలో పెట్టాడు సూర్యం. ఇరవై రూపాయలు తీసి ఇవ్వ బోయింది పార్వతి.

"నేను తీసుకున్నానులే" అన్నాడు.

మొదట పార్వతికి నమ్మకం కలగలేదు. తమ్ముడు హాస్యమాడుతున్నాడేమో అను కుంటూ డబ్బు లెక్కపెట్టింది. కొంచెం ఆశ్చ ర్యంగా సూర్యంకేసి చూస్తూ, "ముప్పై రూపా యలు తీసుకొన్నావా?" అంది.

మొహం అటు తిప్పుకుని ముభావంగా, "ఊఁ" అని ఊరుకున్నాడు.

తమ్ముడు ఎప్పుడూ అలా చేయలేదు. తన దగ్గర పేచీపెట్టి దెబ్బలాడి ఎంత తీసుకున్నా సంతోషంగానే ఉండేది. అయినా ముప్పై రూపాయలెందుకూ నెలకి? రోజుకో రూపాయి ఏం చేస్తాడు? వద్దనుకుంటూనే అడిగింది. "ముప్పై రూపాయలూ కావాలా సూర్యం?"

సూర్యం అదో రకంగా, నిర్లక్ష్యంగా చూశాడు. "అంతైనా లేకపోతే నాకు ఇబ్బందిగా ఉంది."

"పోనీలే. నువ్వలా కావాలంటే నేనెందుకు కాదంటాను? నెల నెలా బ్యాంకులో వేస్తున్నాం కాదా? ఈ మధ్య ఇన్సూరెన్సు ఒకటి మొదలు పెట్టాం. కాస్త జాగ్రత్తగా ఉంటే..."

సూర్యం ఎన్నాళ్ళనుంచో అడగాలనుకుంటూన్న ముక్క కాస్తా అడిగేశాడు. "ఇంకా రుక్మిణికి డబ్బు పంపిస్తూ ఉంటావెందుకూ? పంపిన కొద్దీ రాస్తూనే ఉంటుంది."

పార్వతి తెల్ల బోయింది. రుక్కుకి డబ్బు పంపిచటం సూర్యానికి ఇష్టం లేదా? అది కావాలని రాస్తే తనెలా కాదంటుంది? నాలుగైదు రోజుల కిందటే రుక్కు దగ్గిర నుంచి డబ్బు కావాలని ఉత్తరం వచ్చింది. ఏవో కొత్త ఫ్యాషన్ల చీరలు వస్తున్నాయట. అందరూ కొనుక్కుంటున్నారట. తనూ కొనుక్కుంటానని రాసింది.

రుక్కుకు చీరలంతగా లేకపోలేదు. మంచి మంచివి వచ్చినప్పుడల్లా పార్వతే కొంటూ ఉంటుంది. అయినా అస్తమానూ వీధిలోకి మూటల వాళ్ళు తీసుకొచ్చే గుడ్డలు కొనటం మానదు రుక్మిణి. అప్పులుచేసి కొనేసి డబ్బు కోసం రాస్తూ ఉంటుంది.

ప్రస్తుతానికి అడిగిన డబ్బు పంపిస్తూ కాస్త మందలిస్తూ ఉత్తరం రాయాలనుకుంటూనే వుంది పార్వతి. అయినా తన ఉద్దేశ్యం తమ్ముడికి తెలీనివ్వకుండా కాస్సేపు ఊరుకుని నెమ్మదిగా అంది — "అది కాదురా, సూర్యం! అత్తింట్లో కాపరం చేసుకుంటోంది. చంటి వాడొకడు. ఏదో దాని ఖర్చులు దానికీ ఉంటాయి. మనని కాకపోతే ఎవర్ని అడుగుతుంది?"

"ఏం? దాని మొగుడేమయ్యాడు? పెళ్ళి చేసి పంపించేశాక ఎన్నాళ్ళు ఖర్చులకి పంపాలేమిటి?"

పార్వతేం మాట్లాడలేకపోయింది. సూర్యం అన్నదీ నిజమే గానీ, అయినా సూర్యం ధోరణి చూస్తే కొత్తగా ఉంది. కయ్యానికి కాలు దువ్వే వాడిలాగ మాట్లాడుతున్నాడు. మాటకు మాట పెంచటం మంచిది కాదని నెమ్మదిగా ఆ ప్రసక్తి ఆపింది.

★ ★ ★

గబ గబా నడవసాగింది పార్వతి. మామ్మగారి కోడలికి బాగా లేదని తెలిసి చూసి రావాలని వెళ్తే కబుర్లతో ఏడు గంటల దగ్గిరైపోయింది. వీధుల నిండా లైట్లు వెలిగాయి. "సూర్యం గాని వస్తాడేమో? పక్కింటి వాళ్ళకు తాళం కూడా ఇచ్చి రాలేదు" అనుకుంటూ మామ్మగారి దగ్గిర సెలవు తీసుకుని రోడ్డు మీదికొచ్చి గబ గబా నడవసాగింది. దగ్గిర సందులో ఎదురు వస్తూన్న రిక్షా తగిలి పడ్డంత పనైంది. తుళ్ళిపడి పక్కకు తప్పుకుంటూ రిక్షాకేసి చూసింది. నిర్ఘాంత పడ్డదానిలా నిలబడిపోయింది. టాపు తీసేసిన రిక్షాలో ఎవరో అమ్మాయితో కలిసి కూర్చున్న వ్యక్తి సూర్యం లాగే కనిపించాడు. కనిపించటమేమిటి? సూర్యమే! కాలరూ చేతులూ ముదురు నీలం రంగు గుడ్డ వేయించుకుని అదేదో ఫ్యాషన్‌గా తెల్లబుష్ షర్టు కుట్టించుకున్నాడు కొత్తగా. ఉదయమే దాన్ని మడత విప్పి తొడుక్కున్నాడు కూడాను. సరిగ్గా అదే చొక్కా కనిపించింది. పక్కన కూర్చున్న అమ్మాయి మెడ మీదుగా భుజం మీదికి చెయ్యివేశాడు. బహుశా తనను చూసి ఉంటాడేమో కూడాను. చటుక్కున తల తిప్పేసుకున్నట్టు అనిపించింది.

ఎప్పుడో వెళ్ళిపోయింది రిక్షా. భారంగా అడుగులు వేసుకుంటూ కదిలింది పార్వతి.

ఆ రిక్షాలో వాడు సూర్యమేనా, కాదా? కాకపోవటం ఏమిటి? అచ్చు అలాగే ఉన్నాడుగా? తెగీ తెగని ఆలోచనలతో కొట్టుకుంటూ ఇల్లు

చేరి, తాళం తీసుకుని చీకటిలోనే వాల్చి ఉన్న మంచం మీద కూర్చొంది. ఎందుకో దుఃఖం ముంచుకొచ్చింది. తను చెప్పినంత మాత్రాన ఎవరు వింటారు?

తలుపుల మీద చప్పుడయ్యే వరకూ అలా రెండు చేతుల మధ్యా తలపట్టుకుని కూర్చునే ఉంది.

"అక్కయ్యా" వీధి గుమ్మంలోంచి నెమ్మదిగా వినిపించింది సూర్యం పిలుపు.

గమ్మున లేని లైటు వేసి తలుపులు తీసింది. తల దించుకుని లోపలికి జారపడిన సూర్యం చొక్కా కాలరూ చేతులూ — అచ్చం అవే! అవే! అనుమానం లేదు. సూర్యం క్షణాల మీద బట్టలు మార్చుకుని పెరట్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కున్నాడు.

అన్నం వడ్డించి, కూర వేస్తూ, పచ్చడి ముక్క ఓ వారన పెడుతూ, ఎన్నో సార్లు తమ్ముడి మొహంలోకి చూడబోయింది. తల బాగా దించేసుకుని అన్నం కలుపుకుంటూన్న వాణ్ణి పరిశీలించి చూడటం వీలుకానే లేదు. అన్నం తిని లేచాక కూడా తనని చూసి జంకుతూన్న వాడి లాగా, ఏదో దాచేసుకోవాలని తాపత్రయ పడుతూన్న వాడి లాగా, నిలకడగా నిలవకుండా కనిపించాయి వాడి చూపులు. వాడంత తెగించి తిరగటానికి కారణం తనే. కొత్తలోనే మందలిస్తే జాగ్రత్తగానే మెలిగేవాడు. తన కళ్ళపడకపోయినా ప్రతి రోజూ వాడి షికార్లన్నీ ఎంత మంది చూస్తూ ఉన్నారో! ఇంకా ఈ తిరుగుళ్ళు ముదరనిస్తే ప్రమాదమే! చేజేతులా వాణ్ణి పాడుచేసుకున్నట్టే. అడిగిచూస్తే తప్పేం లేదుగా?

తన పక్క సర్దుకొంటూ తమ్ముడి కేసి చూసింది. సూర్యం అలా చాలా సేపట్నుంచి కళ్ళుమూసుకుని పడుకునే ఉన్నాడు.

"నిద్రపోతున్నావేమిట్రా సూరీ?"

వాడేం మాట్లాళ్ళేదు. నిద్రపోయేవాడు మాట్లాడకూడదు కాబట్టో ఏమిటో!

"సూర్యం!" కాస్త గట్టిగానే పిలిచింది "నిజంగా నిద్రే?"

"ఊఁ" విసుగ్గా మరో వేపుకు దొర్లిపడుకున్నాడు.

"నీతో కొంచెం మాట్లాడాలిరా! తెల్లారితే మళ్ళీ నీ దారి నీదీ, నా దారి నాదీ. ఇంకా తొమ్మిదయినా కాలేదుగా? కాస్సేపు లేచి కూర్చుందూ!"

సూర్యం కళ్ళు విప్పి చూశాడు.

"ఏం? ఇవ్వాళ తొందరగా పడుకున్నావు?"

మాట్లాడకుండా లేచి కూర్చున్నాడు మంచం మీద.

"ఏం మాట్లాడాలి?"

"మాట్లాడాలి. నే నడిగింది చెప్తావా?"

"నాకు తెలిస్తే ఎందుకు చెప్పనూ?"

"ఇందాక రిక్షాలో... ఎవరా అమ్మాయి?"

దుప్పటి దారాలు తెంచుతూన్న సూర్యం వేళ్ళు ముడుచుకున్నాయి. గట్టిగా గుప్పిళ్ళు బిగించుకున్నాడు. తను దబాయించి ప్రయోజనం లేదన్న నిర్ణయానికి వచ్చేశాడు. అసలు తన వ్యవహారం కప్పిపుచ్చుకోవలసిన అగత్యం కూడా లేదన్నట్టు కనిపించాడు.

"సూర్యం! నీ మనసులో ఏ మాట ఉన్నా నాతో కాకపోతే ఇంకెవరితో చెప్పుకుంటావు?"

సూర్యం తలెత్తి పార్వతి మొహం కేసి మామూలుగానే చూశాడు. "చెప్పటానికేముందక్కయ్యా? ఆ అమ్మాయి సోషల్‌గా ఉంటుంది. నువ్వేమైనా అపార్థం చేసుకున్నావేమో! ఒక లాయరు గారి కూతురు. పేరు రాణి. బి.ఎస్సీ. చదువుతోంది. నాకు ఫ్రెండ్, అంతే!"

పార్వతి ఆశ్చర్యపడుతూ చూసింది తమ్ముడికేసి. శరీరాలుతాకుతూ భుజాల మీదకి చేతులు వేసుకుని, ఒక్క రిక్షాలో కూర్చుని, పబ్లిక్‌గా రోడ్ల మీద షికార్లు తిరగటం. సినిమాలు చూడటం, కేవలం ఫ్రెండ్స్ లాగ మసలటమా? కాని అంత గుచ్చి గుచ్చి అడగలేకపోయింది. "అసలు నీ కెలా పరిచయమైంది?" అందామనుకుంది.

"ఫ్రెండే అనుకో! నేనూ అంతకన్నా మరేమీ అనుకోలేదు. అయినా సూరీ, ఆడపిల్లతో అంత రాసుకుంటూ పూసుకుంటూ తిరగటం తప్పు

కాదూ? ఎటు తిరిగి ఎటొచ్చినా ఆ పిల్ల బతుకు అల్లరిపడుతుంది. ఇలాంటి విషయాల్లో చాలా జాగ్రత్తగా ఉండాలి. లోకులు కాకులు!'' తమ్ము డికి బోధన చెయ్యాలన్న ఉద్దేశ్యంతో కాస్సేపు సంఘాన్ని కూడా తిట్టిపోసింది పార్వతి. సూర్యం ఏమీ మాట్లాడలేదు. పార్వతి ఎంతసేపు మాట్లా డినా కంఠశోషే మిగిలింది.

``సరేలే పడుకో! అనవసరంగా నిద్రపాడు చేశాను!'' లేనిపోని నిష్ఠూరం తన మీద వేసు కుంటూ పక్క మీదకి ఒరిగింది.

★ ★ ★

ఓ వారం గడిచి ఉంటుంది. ఆదివారం పూట పార్వతి తీరిగ్గా పాత చీరెలు కుట్టుకుంటూ కూర్చుంది.

సూర్యం హడావిడిగా వస్తూ. ``అక్కయ్యా! రాణి నిన్ను చూస్తానంటే తీసుకొచ్చాను'' అన్నాడు. వెనకాలేవస్తూ కనిపించిన ఆ అమ్మా యిని చూస్తూ కంగారుపడింది పార్వతి. ``రండీ! రండీ!'' అంటూ ఆహ్వానించింది కంగారుగా. ఆ అమ్మాయి అదోలా నవ్వుతూ వచ్చి కుర్చీలో కూర్చుంది.

రాణీ తనను చూస్తాననటం ఎందుకూ?— అని ఆశ్చర్యపడింది పార్వతి. రెండు సార్లు దూర దూరంగా చూస్తే రాణి సింగారం పార్వతికి అంతగా తెలిసింది కాదు. శరీరంలో దాదాపు అన్ని భాగాలూ కనిపిస్తూన్నట్టుగా ఉంది గుడ్డలు కట్టుకోటం. లేసు బాడీ, లేసు లంగా స్పష్టంగా తెలిసిపోతున్నాయి. జాకెట్టు మెడ గుండెల దగ్గరికి దిగి ఉంది. వీపు కూడా చాలా భాగం నగ్నంగానే కనిపిస్తూంది. ఒంటి పొర చీరే అయినా ఆ సింగారం బొత్తిగా ఎబ్బెట్టుగా వుంది. చెంపలు ఎగదువ్వి నెత్తి చుట్టూ చక్రంలా పిన్నులు గుచ్చింది. ఉన్న బారెడు జడలోనూ పైనా కిందా ఖాళీగా వదిలేసి మధ్య మాత్రం రెండు మూడు పాయలు అల్లింది. జడలో పెట్టు కున్న కనకాంబరాల దండ నడివీపు మీద వేళ్ళాడుతూంది. చెవుల వరకూ సాగదీసిన కాటుక గీతలూ, అమ్మ వార్ని సింగారించినట్టు రూపాయి బిళ్ళంత బొట్టూ, కొట్టవచ్చినట్టు కనిపిస్తూన్న పెదిమల రంగూ, ఏమిటో ఆ పిల్లను చూస్తూన్న కొద్దీ పార్వతికి అర్థం కాని అయిష్టం ఏర్పడి పోయింది.

కాళ్ళూ ఊపుతూ, కుర్చీ కోడు మీద వేళ్ళతో చిటికెలు వేస్తూ గది నలుమూలలా కుతూహ లంగా చూస్తూ కూర్చుంది రాణి.

``అక్కయ్యా!'' సూర్యం వంటింట్లోకి వెళ్ళి నెమ్మదిగా పిలిచాడు. పార్వతి గబ గబా తమ్ముడి దగ్గిరికి వెళ్ళింది.

``పాలున్నాయి కదూ? కొంచెం కాఫీ పెట్టు!''

``ఎందుకు పెట్టనూ? నువ్వు చెప్పాలా? ఊరికే ఆలోచిస్తూ నిల్చున్నాను. సరే నువ్వెళ్ళి కూర్చో! తొందరగా కుంపటి అంటిస్తాను'' అంటూనే కుంపట్లో బొగ్గులు వేసి కాగితం ముక్క అంటించి తన పనిలో నిమగ్నమై పోయింది పార్వతి. కిందటి రాత్రి తెచ్చిన అరటి పళ్ళు నాలుగుంటే ఓ ప్లేటులో పెట్టి తీసికెళ్ళి ఇచ్చివచ్చింది. తర్వాత రెండు గ్లాసులతో కాఫీ పట్టుకెళ్ళి బల్ల మీద పెట్టింది.

``తీసుకో రాణీ!'' అంటూ ఓ గ్లాసు అందిం చబోయాడు. సూర్యం.

``ముందు నువ్వు తీసుకో!'' అంటూ నవ్వింది రాణి.

పార్వతి కేం మాట్లాడాలో, మాట్లాడకుండా ఊరుకోవాలో కూడా తెలీలేదు. ``మీ ఇల్లు ఎక్క డమ్మా?'' ఏదో మాట్లాడాలి కాబట్టి నోటికొచ్చిన ప్రశ్న ఒకటి వేసింది. ఆవిడ గారిల్లు ఎక్కడైతే తన కెందుకూ? తనేం వెళ్ళాలా, రావాలా?

``మా ఇల్లు మెయిన్ రోడ్‌లో ఉంటుం దండీ! ఆకుపచ్చ మేడ. మీరు చూసే ఉంటారు.''

``ఆ, చూసే ఉంటానేమో! ఆకు పచ్చ మేడలు చాలా చూశాను'' మామూలుగానే అన్నా, ఏదో వ్యంగ్యంగా అన్నట్టే అనిపించింది, పార్వతికి కూడా.

రాణీ అదోలా చూస్తూ, ''మా మేడ చాలా కొత్తది! ఐదారు నెలలు కూడా కాలేదు కట్టి!'' అంది అతిశయంగా.

''అంత బాగా గుర్తు లేదమ్మా! మీ నాన్న గారేం చేస్తారు?''

''లాయరండీ!''

''అలాగా?''

కాస్సేపటికి ''ఇక వెళ్దామా సూర్యం?'' అంటూ లేచింది రాణి.

''అయితే పద!'' అంటూ లేచాడు సూర్యం.

మౌనంగానే సాగనంపింది పార్వతి.

ఒక్క ఊపులో జడ ముందుకు పడేసుకుని తల ఒక ప్రక్కకు వంచుకుని నవ్వుతూ సూర్యా నికి దగ్గిరదగ్గిరగా నడవసాగింది రాణి.

పార్వతి లోపలికి వెళ్ళిపోయింది. మళ్ళీ చీరలు కుట్టుకుంటూ కూర్చుంది. ... తమ్ముడి మీద కోపం ముంచుకు వచ్చింది. ఆలోచనలతో సతమతమౌతూ, తమ్ముణ్ణి గట్టిగా చీవాట్లు పెట్టా లని నిర్ణయించుకుంది.

★ ★ ★

మధ్యాన్నం ఒంటి గంట ప్రాంతంలో వచ్చాడు సూర్యం.

''అన్నం వడ్డించేస్తాను, కాళ్ళు కడుక్కురా!''

''రాణీ వాళ్ళింట్లో భోంచేశాను.''

''అదేమిటీ? వాళ్ళింట్లో భోం చెయ్యటం ఏమిటి?''

''వాళ్ళమ్మగారు నిన్నేచెప్పారు ఇవ్వాళ భోజ నానికి రమ్మని!''

''అయితే ఈ పూట ఇంట్లో తిననని చెప్పక పోయావా? అనవసరంగావండాను.''

''ఇప్పుడేం పోయింది? పని మనిషికి ఇచ్చెయ్యరాదూ?'' విసుగ్గా అంటూ మంచం మీద కూర్చున్నాడు. ''వెధవ అన్నం గురించి రాద్ధాంతం ఏమిటి?'' అన్నాడు మళ్ళీ!

మాట్లాడలేదు పార్వతి. తను అడగాలను కున్న మాటలు అడగనూ లేదు, పెట్టాలనుకున్నా చీవాట్లు పెట్టనూ లేదు.

మధ్యాన్నం నిద్రపోయి లేచిన తమ్ముడికి కాఫీ అందిస్తూ మొహంకేసి చూసింది. మామూ లుగానే ఉన్నట్టున్నాడు. వ్యవహారం కదిలించా లనుకుంది.

''అయితే సూరీ, ఆ పిల్లకి... అదే, ఆ రాణికి, నన్ను చూద్దామని ఎందుకు బుద్ధిపుట్టిందీ?'' అంది నవ్వుతూనే.

''ఆ మాట ఆ పిల్లనే అడగలేకపోయావా మరి?'' నవ్వుతూనే చూశాడు.

''నన్ను చూడ్డానికి వచ్చిందన్నావ్, నాతో ఏం మాట్లాడిందనీ?''

''అంతకన్నా ఏం మాట్లాడుతుంది? చూడా లని వచ్చింది. చూసింది. పోనీ, నువ్వు మాత్రం ఏం పలకరించావ్?''

''నాకేం మాటాడాలో తోచనేలేదు.''

సూర్యం బద్ధకంగా మంచం మీద ఒత్తి గిల్లుతూ అన్నాడు. ''వాళ్ళమ్మగారు నిన్నొకసారి తీసుకురమ్మన్నారు.''

''నన్నా? నన్నెందుకూ?''

''ఎందుకేమిటి? చూడ్డానికి.''

''ఇది మరీ బాగుంది. వాళ్ళంతా నన్ను చూడ్డం ఏమిటి?''

''ఉత్త చూడ్డం కాదులే. ఏదో మాట్లాడతా రేమో!''

పార్వతి కేదో అనుమానం తోచింది. సూర్యం మొహంలోకి గుచ్చి గుచ్చి చూసింది.

''అసలు నీ మనసులో మాటేమిటో సరిగా చెప్పవేం?''

ఆ మాట అడగదేమా అనుకొంటూన్న సూర్యం నవ్వి అన్నాడు. ''రాణిని చూశావు కదా? నీ ఉద్దేశ్యం ఏమిటి?''

''ఆ పిల్ల గురించి నా ఉద్దేశ్యం ఏమిటైతే ఎందుగ్గానీ నువ్వా అమ్మాయితో అంత తిరగడం నాకేం నచ్చలేదు.''

''ఏం, ఎందుకు?'' నుదురు చిట్లిస్తూ అడిగాడు.

''ఎందుకేమిటి? ఆ అమ్మాయి పద్ధతులు నాకేం బాగోలేదు.''

సూర్యం మాట్లాడలేదు చాలాసేపు. తర్వాత అన్నాడు. "రాణి పెళ్ళి విషయం నీతో మాట్లాడా లనుకుంటున్నారు వాళ్ళింట్లో వాళ్ళు!"

పార్వతి ఆశ్చర్యంగా చూసింది. తన అను మానం నిజమేనా ఏమిటి? "వాళ్ళ పిల్ల పెళ్ళి మాట నాతో మాట్లాడ్డం ఏమిటి?" అంది సగం అర్థం కానట్టూ, సగం అర్థం కాకుండానూ.

"పెళ్ళి పెద్దవి, నీతో గాక ఇంకెవరితో మాట్లా డతారు? నన్నడిగితే నిన్నడగమని చెప్పాను!"

"ఆ పిల్లని నువ్వు పెళ్ళి చేసుకుంటావా? నిజంగానే!"

సూర్యం జవాబు చెప్పలేదు.

"ఆ పిల్ల నీకు నిజంగానే నచ్చిందా?"

"ఏం? నచ్చడానికేం? చదువుకుంటోంది. వాళ్ళ నాన్నగారూవాళ్ళు కూడా ఇష్టపడి అడి గారు. ఏం లోటని కాదనటం?"

తనేం చెపుతుంది? ఏం లోటని చెపు తుంది? ఆ పిల్లే తనకు మరదలౌతుందంటే తమ్ముణ్ణి వారించకుండా ఎలా ఉంటుంది?

"చూడు సూర్యం! ఏది చెప్పినా నీ మేలు కోరే చెప్తాను. వివాహం నూరేళ్ళ పంట అంటారు. ఆ అమ్మాయి కుదురైన పిల్లలా లేదు. నీకు నువ్వు బాగా ఆలోచించుకో సూర్యం!"

సూర్యం ఆలోచించకపోలేదు. అయినా అంతగా ఆలోచించటానికేముంది? అందాల బొమ్మలా మెరిసిపోయే రాణిని పెళ్ళి చేసుకోటా నికి అసలు ఆలోచన దేనికి? అదీగాక వాళ్ళ నాన్నగారు...

"ఏం సూరీ, కోపం వచ్చిందా?"

"అబ్బే, అది కాదక్కయ్యా!... నీకు నేను చెప్పనేలేదు గానీ, వాళ్ళ నాన్నగారు నన్ను బి.ఎల్. చదివిస్తామంటున్నారు. జీవితమంతా ఇలా గుమస్తాగా నేనా? రెండు మూడేళ్ళు చదివి లాయరైతే..."

సూర్యం చెప్పే ప్రతి మాటా విచిత్రంగానే ఉంది పార్వతికి. "వాళ్ళ నాన్నగారు నిన్ను లా చదివిస్తారా! మరి నీ ఉద్యోగం?"

"ఇంకా ఉద్యోగం ఏమిటి? వదిలేసుకునే కాలేజీలో చేరాలి."

ఆశ్చర్యపోతూ చూసింది పార్వతి. "ఉద్యోగం వదిలేసుకుంటావా?"

"మరి ఎలా? అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే ఎలా?"

"వాళ్ళ దయా ధర్మాల మీద ఆధారపడి చదువుకుంటావా? అంతేనా?"

"దయా ధర్మాలకేముంది? వాళ్ళ పిల్లని పెళ్ళిచేసుకున్నందుకెలాగూ నాలుగయిదు వేలు కట్నం ఇస్తారు. అది కాదంటే నా చదువు రూపేణా ఖర్చు పెడతారు. అంతేగా?"

"సూర్యం!" పార్వతి తల గిర్రున తిరిగింది. కట్నం నాలుగైదు వేల రూపాయలు కావాలను కుంటున్నాడా సూర్యం! తమ్ముడి గురించి తను ఒక్క సారైనా 'కట్నం' మాట, అంత డబ్బు మాట, ఆలోచించగలిగిందా? అసలు తనకా పాపిష్టి కోరిక పుట్టిందా?

"ఏం అక్కయ్యా! నీ కిష్టం లేదా?"

అక్క గారి ఇష్టం కోసం అడిగినట్టు అని పించలేదు.

"అది కాదు సూర్యం! నిన్ను కట్నాలకి అమ్ముకోవాలని నేనెన్నడూ అనుకోలేదు. కట్నం అన్నమాట వింటే నా హృదయం ఎలా మండి పోతుందో నీకు అర్థం గాదు. ఈ పాపిష్టి కట్నాల దురాశ లేకపోతే ఈ అక్కయ్య అందరు ఆడ వాళ్ళలాగే ఓ ఇంటి ఇల్లాలై కాపరం చేసుకుంటూ ఉండేది సూర్యం!"

"నీ పెళ్ళి మాటకీ దీనికీ సంబంధం ఏంట క్కయ్యా! అప్పుడు మనకు తాహతులేక ఇవ్వలేక పోయాం. ఇప్పుడు వాళ్ళకు ఇవ్వటానికి లోటేమీ లేదుగా? వాళ్ళకై వాళ్ళే సంతోషంగా ఒప్పుకుంటు న్నారు."

"ఒక్కటి చెప్పు. వాళ్ళు నిన్ను చదివించ టానికి ఒప్పుకోరనుకో! కట్నం ఇవ్వలేరనుకో! అప్పుడు కూడా రాణిని మనస్ఫూర్తిగా ఇష్టపడి పెళ్ళి చేసుకోగలవా? నిజం చెప్పు! నీ అంతరాత్మ సాక్షిగా చెప్పు!"

సూర్యం నుదురు చిట్లించాడు. "అర్థం లేని

విషయాలన్నీ ఆలోచిస్తావు. ఏమో! అప్పటి పరిస్థితి ఎలా ఉండేదో! అది చెప్పమంటే నేనేం చెప్పగలను?''

''ఇస్తే కట్నం ఇస్తారనీ, లేకపోతే చదివిస్తారనీ, ఆశతో కదా నువ్వు రాణిని పెళ్ళి చేసుకోటానికి అంగీకరిస్తున్నావు?''

''అయితే కావచ్చు. ఏం, తప్పేముంది? లోకమంతా ఒక దారిని పోతోంటే మనం మరో దారిన పోవటం వివేకం అంటావా? నువ్వూ నేనూ నీతిగా ఉండి ఈ సంఘాన్ని ఉద్ధరించేస్తామా? మన కోరికలు మనవి! మన అవసరాలు మనవి! మన స్వార్థమే మనకు లేనప్పుడు ఇక బతకటంలో అర్థమేమిటసలు? నాకు నిజంగానే ఈ గుమస్తా జీవితమంటే విసుగేస్తోంది. అటు వాళ్ళ పిల్లకి పెళ్ళి కావాలి, ఇటు నాకు జీవితంలో ఉన్నతీ కావాలి! ఇదంతా ఆలోచించే నేను నిశ్చయించుకున్నాను.''

సూర్యం తన స్వార్థం కోసమే ఈ పెళ్ళికి ఒప్పుకోవటం అవినీతిపాలు గావటమే అనిపించింది పార్వతికి.

''పోనీ సూర్యం! నీకంతగా చదువుకుని జీవితంలో పైకి రావాలని ఉంటే నాకూ సంతోషమే. కాదని ఎలా అంటాను? దాని కోసం చేతిలో ఉన్న ఉద్యోగం పోగొట్టుకుంటావా? ఉద్యోగం మానకుండా నైట్ కాలేజీలో చేరి చదువుకోకూడదూ?''

''అబ్బ! నాకంత ఓపిక లేదక్కయ్యా! పగలు పనీ, రాత్రి చదువూ, ఎన్నాళ్ళకి తెల్ల వారుతుంది?'' — విసుక్కున్నాడు సూర్యం.

''సుఖ పడాలంటే, ఆ మాత్రం కష్టపడక పోతే ఎలా సూరీ?''

''నీ ఆలోచనలన్నీ గొప్పవే గానీ, నేను అదంతా పడలే నక్కయ్యా!'' తేల్చేసినట్టు అనేశాడు సూర్యం.

పార్వతి ఇంకో మాట మాట్లాడలేక పోయింది. తన ఉద్దేశాలు తన వరకే గానీ ఎవర్ని పాటించమంటే ఎవరు వింటారు? ఎందుకు వింటారు? పోనీ, కనీసం తమ్ముడు ఆ రాణిని కాకుండా ఇంకో పిల్లని నిర్ణయించుకున్నా బాగుంటుంది!

పార్వతి బాధ పార్వతికే మిగిలిపోయింది. పార్వతి ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే జరగవలసిన వ్యవహారమంతా జరిగిపోయింది. రాణి తల్లి, మరో చుట్టపావిణ్ణి తీసుకొని పార్వతితో మాట్లాడటానికంటూ వచ్చింది. కానీ, పార్వతి మాట్లాడటానికి ఒక్క నిమిషం అవకాశం కూడా ఇవ్వలేదు. ''అమ్మాయీ! నువ్వా చిన్న దానివే! నీకేం తెలుస్తుంది? మా పిల్ల మీ తమ్ముడంటే ఇష్టపడుతోందని దాని మాట కాదన లేక ..... అయినా, కుర్రవాడిని చూస్తే మాకూ ముచ్చటగానే ఉందనుకో!... నీకు తెలుసో తెలీదో గానీ, వాళ్ళిద్దరూ ఎన్నెన్ని ఉత్తరాలు రాసుకుంటున్నా రనుకున్నావు! మీ తమ్ముడు రాసే ఉత్తరాలన్నీ మా పిల్ల అపురూపంగా దాచుకుంటూ ఉంటుంది. వాళ్ళ నాన్నగారు నవ్వుతూ అంటారు 'మన తల్లికి కట్నాలూ కానుకలు ఇవ్వనక్కర్లేదే! దాని దగ్గరున్న ఉత్తరాలన్నీ కోర్టులో పెడితే కుర్రాడు పిల్లి పిల్లలా పుస్తె ముడి వెయ్యాల్సిందే' అంటారు. 'చాల్లెండి. మీరు మహా గొప్ప ప్లీడరు చేస్తున్నారని పిల్ల పెళ్ళికి అల్లరి పడతామా? మనకేం లేదా, కలిగినంతలో కట్నాలూ, కానుకలూ పడేసే కన్యాదానం చేద్దాం' అంటాను నేను...''

ధోరణిలా సాగిపోతూన్న ఆవిడ మాటల ప్రవాహానికి ధైర్యంచేసి అడ్డుకట్ట వేసింది పార్వతి. ''చూడండి అత్తయ్యగారూ! ఇంత వరకూ వచ్చాక ఇక నేనేదో అంటానని అనుమానించకండి. మీ అందరి ఇష్టమే నా ఇష్టం. వాడేం పాలుతాగే పసివాడు కాదు. ఆ మంచి చెడ్డలేవో వాడే నిర్ణయించుకోగలడు. నాదేముంది? అందరితో పాటే తథాస్తు అంటాను. మంచి రోజు చూసి ముహూర్తం అదీ పెట్టించెయ్యండి'' అంది.

పార్వతి అంత సూటిగా ఖచ్చితంగా మాట్లాడేసరికి మొహమొహాలు చూసుకున్నారు పెళ్ళి పెద్దలిద్దరూ. ''సరేనమ్మా! వెళ్తాం'' అంటూ లేచిన వాళ్ళకు బొట్టుపెట్టి తాంబూలాలిచ్చి సాగ

నంపింది పార్వతి.

వీధి తలుపు వేసుకుని వెనుదిరిగేసరికి అప్రయత్నంగా పుట్టెడు దుఃఖం ముంచుకొచ్చింది. అర్థంగాని ఆవేదనతో హృదయం బద్దలైనట్టయింది. సూర్యం అసలు తనతో మాట్లాడ్డమే తగ్గించేశాడు. అత్తగారింట్లో వుండి, వాళ్ళ డబ్బుతో చదువుతాడా? - ఎవరితోనైనా చెప్పుకోవాలని తహ తహ కలిగింది. ఎవరున్నారు? తన కెవరున్నారు? ఎవ్వరూ లేరు. అమ్మ లేదు. "అమ్మా! నువ్వే ఉంటే నన్నింత దిక్కు లేని దాన్నిగా వదిలేస్తావా అమ్మా?" అంటూ ఏడ్చింది. అమ్మ ఉంటే తన పెళ్ళి కోసం ఎంత కొట్టుకు లాడిపోయేదో! ఆ నాటి పరిస్థితుల్ని బట్టి తను పెళ్ళిచేసుకోనని మొరాయించింది గానీ ... ఆ మాత్రం సూర్యానికి తెలీదూ? పాతిక సంవత్సరాల వాడు. బి.ఏ. చదివిన వాడు. ఆ మాత్రం అర్థం చేసుకోలేడా?

'ఈ అక్క జీవితం ఏమిటి? అని ఆలోచించాడా? అతని స్వార్థం అతనిదేనా? తన స్వార్థం తను చూసుకుని ఉంటే వీళ్ళ పని ఏ మయ్యేది? ఇదే మిటి? జరిగినదానికి తను బాధపడుతోందా? తోడబుట్టిన వాళ్ళ కోసం చేసినదానికి పశ్చాత్తాప పడుతోందా?

ఎప్పుడూ అలా జరగదు. తన మనస్సు, అంత చంచలం కాదు. వాళ్ళు తనని ప్రేమించాలని ఆశపడుతోందిగానీ... తల్లి లేకపోయినా తన కష్ట సుఖాలు ఆలోచించే నేస్తం ఉంది. మనస్సు విప్పి పద్మకు ఒక్క మాట వ్రాస్తే చాలు తనను ఆదుకొంటుంది. తన జీవితంలో దీపం వెలిగిస్తుంది. తన కన్నీళ్ళు తుడిచేస్తుంది. నిజంగా తనకు జీవితంలో తోడు కావాలా? - పార్వతికి తన మీద తనకే అపనమ్మకం కలిగింది. ఎందుకింత చిత్రంగా ఆలోచిస్తూంది తను? ఎన్నడూ లేనిది, మనస్సెందు కిన్ని విధాల పరుగులెడుతూంది?

తను భద్రంగా దాచుకున్న రఘు జ్ఞాపకాలు అప్పుడే చెదిరిపోయాయా? ఎన్నడూ ఎవ్వరికీ చోటు లేదనుకున్న తన హృదయంలో మరో వ్యక్తికి, మరో పురుషుడికి, స్థానం ఉందా? మరెవ్వరైనా తనకు రఘుబాబు కాగలరా? తనతో మాత్రమే మనసిచ్చి మసలే రఘుబాబు, తన కోసమే పిచ్చివాడై తిరిగే రఘుబాబు!

దీర్ఘంగా నిట్టూర్చింది పార్వతి. కొంగుతో కళ్ళు ఒత్తుకుంది. వర్షించిన మేఘంలా మనస్సెంతో తేలికైంది.

★ ★ ★

మంచి రోజు చూసి సూర్యం పెళ్ళికి తాంబూలాలు పుచ్చుకోవటం, జరగవలసిన పెళ్ళి పనులేవో జరగటం... అన్నీ ఒక దాని వెంట ఒకటి వాటికవే జరిగిపోయాయి. ప్లీడరు గారింట్లో పెళ్ళి ఘనంగానే జరిగింది. ఎక్కడికక్కడ నవ్వుతూ, తుళ్ళుతూ ఆడబిడ్డ హోదాతో రాసుకు పూసుకు తిరిగింది రుక్మిణి. ఆడబిడ్డల కిచ్చే కట్నాలూ, కానుకలూ అన్నీ తన పెట్టెలోనే సర్దుకొంది.

"ఈ చీర నేను తీసుకుంటానే అక్కయ్యా!"

"ఈ వెండి గ్లాసు బాబిగాడికి ఉంటుంది లేవే!"

"ఈ రవికెల గుడ్డలు నాకు బాగున్నాయే అక్కయ్యా!"

"ఈ నూట పదహార్లలో నీకు వాటా ఎందుకు లెద్దూ? నెల నెలా అంతకు రెండు రెట్లు వస్తూనే ఉందిగా నీకు?"

నవ్వుతూ నవ్వుతూ, మాటలన్నీ హాస్య ధోరణిలో పెట్టేసి, మొత్తంగా లాంఛనాలన్నీ తను దక్కించుకుంది రుక్మిణీ.

అంతా చూస్తున్న శాంతమ్మ ఉండబట్టలేక పెద్దల తరహాగా నచ్చచెప్పబోయింది. "అదేమిటి రుక్కూ? ఆ చీరలైనా దానికి పనికిరావూ? పది మంది మధ్యకీ వెళ్ళి పనిచేసుకు రావాలి కదా? బొత్తిగా దానికి మంచి గుడ్డలే ఉన్నట్టు లేవు. ఎప్పుడూ వెల వెలపోయిన చీరలే కట్టుకొంటూ ఉంటుంది. పోనీ ఆ ఎర్ర సిల్కు చీర దానికి ఉండనీ!"

రుక్మిణి మిర్రుమంటూ చూసి విస విసా

వెళ్ళి పెట్టి మూత ఎత్తి చీరలు రెండూతీసి బయట పడేసింది, "అది నిజంగా ఇచ్చేస్తుందని తీసుకున్నానుగానీ, నీతో అడిగిస్తుందనుకో లేదు" అంటూ.

పార్వతి కలగజేసుకోక తప్పలేదు. "నేను అత్తయ్యతో అడిగించానా? ఆ చీరలు మాట్లాడ కుండా తీసి పెట్లో పెట్టుకో. పెళ్ళింట్లో మనం రాద్ధాంతాలు చేసుకుంటే బాగుండదు!" అనేసి పెరట్లోకి వెళ్ళిపోయింది.

కిక్కురు మనకుండా కిందికి విసరికొట్టిన చీరలు రెండూ ముసి ముసి నవ్వులతో పెట్లో కుక్కుకుంది రుక్మిణి.

★ ★ ★

**ప్రియమైన పార్వతి అక్కయ్యకు,**

ఈ మధ్య నువ్వు బొత్తిగా ఉత్తరాలు వ్రాయడం లేదేం? నా మీద కోపం రాలేదు కదా? అప్పుడెప్పుడో అక్కయ్య కనిపించిందని వ్రాసావు. తర్వాత మళ్ళీ అంత వివరంగా వ్రాయనే లేదు. దానికి జవాబు కూడా వ్రాశాను కదా?

"అమ్మా, అక్కయ్య కనిపించిందని పార్వతి వ్రాసిందే. ఇప్పుడు అక్కయ్యాకీ" అని చెప్పబోతే.

"ఛీ! నోర్ముయ్యి! దాని మాట నా దగ్గి రెందుకు తెస్తావు బుద్ధిలేని దానా" అని కసిరేసిన అమ్మ, కాస్సేపటికే అడిగేసింది — "ఊఁ, ఏమైంది అక్కయ్యకి? చెప్పేదేదో పూర్తిగా చెప్పి తగలడరాదూ?" అంది.

"మూడో నెల కడుపని..."

"శివ శివా!" అంటూ చెవులు మూసుకుంది అమ్మ. కానీ, అమ్మ ఎన్నో సార్లు తనలో తను రహస్యంగా మాట్లాడుకోవటం విన్నాను పార్వతీ. "అది ఎలా తిరుగుతోందో యేమో? నెలలు నిండి ఉంటాయి. తొలి చూలు. ప్రసవించి ఉంటుంది. అబ్బే, అప్పుడే కాదు. ఇంకో మాసం పోతేగానీ తొమ్మిది నిండవు. దానికేం? మహా రాణీ! డాక్టరమ్మ చదువు వెలగబెట్టిందిగా? నెప్పులు పడకుండానే కంటుంది. ఊఁ, ఖర్మ కాకపోతే ఏమిటి?"— అలా మాట్లాడుకుంటూ ఉంటుంది. నిజంగా ఆ పరిస్థితిలో అమ్మని చూస్తుంటే ఎంత జాలేస్తుందను కున్నావు పారూ! కళ్ళ వెంట నీళ్ళు తిరుగుతాయి. ఏది ఏమైనా అమ్మ మనస్సు కొంచెం మారిందేమో అనిపిస్తోంది నాకు.

"అమ్మా సుజా? పార్వతేమైనా ఉత్తరాలు వ్రాస్తోందా?" అంటూ ఉంటుంది అకస్మాత్తుగా గుర్తు వచ్చినట్టు. నువ్వు ఉత్తరం వ్రాస్తే అక్కయ్య కబుర్లేవో ఉంటాయన్న ఆశ అమ్మకి!

"ఇవ్వాళ నేనే వ్రాస్తున్నానమ్మా!" అంటూ ప్రారంభించా ఈ ఉత్తరం నీకు.

అక్కయ్యా! నీ కెన్నో విషయాలు వ్రాయా లని ఉంది. ఎన్నో కబుర్లు అడగాలని ఉంది. ఏమిటిలా పిచ్చి పిచ్చిగా వ్రాస్తుందనుకోకు, ఇప్పుడు అక్కయ్య గురించి ఆలోచిస్తుంటే, పాపం అక్కయ్య ఏమంత ఘోరమైన తప్పు చెయ్యలేదేమో అనిపిస్తోంది. అక్కయ్యని సరిగా అర్థం చేసుకోలేక పోయాననీ, నీతో కూడా వితండంగా వాదించాననీ, అనిపిస్తోంది, అప్పు డప్పుడూ.

అక్కయ్య నెంతో మెచ్చుకోవాలని పిస్తుంది. ఇదంతా ఏమిటో నాకే అర్థం కావటం లేదు.

"ఏమైనా పెళ్ళి సంబంధాలు వస్తు న్నాయా" అని వ్రాశావు. ఎందుకు రావటం లేదూ? రాక పోయినా తీసుకొస్తున్నారు. వచ్చినవి వచ్చినట్టే వెళ్ళనూ వెళ్తున్నాయి. తన పెళ్ళయింది మొదలూ ఈ గుమ్మం తొక్కని అక్కయ్య ఈ ఇంటి నెలా అనాచారం చేసిందో అర్థం కావటం లేదు. అన్నయ్యకిదో సమస్యే అయింది. పెద్ద పిల్ల అప్రతిష్టపాలు చేసిన ఈ కుటుంబంలో చిన్న పిల్లకు పెళ్ళిలా చెయ్యగలడు తను? అమ్మ కిదో ఆవేదనగా అయిపోయింది. 'చిన్న దానికైనా లక్షణంగా పెళ్ళి చెయ్యలేకపోతామా' అన్న ఆలోచనే అమ్మకి.

ఏదో వ్రాయాలని ప్రారంభించి మరేదో వ్రాశాను. చదివి మరచిపో! నీకు వీలుంటే ఒక సారి వచ్చి వెళ్ళు. నీ కోసం ఎదురు చూస్తాను.

నీ సుజా."

ఆ ఉత్తరానికి అర్థం ఉంటే, అదేమిటో మాత్రం అర్థంకాలేదు పార్వతికి. సుజా ఎప్పుడూ ఇంత చిత్రంగా రాయలేదు. అక్కగారిని తీవ్రంగా విమర్శించిన సుజాత ఇంత మారిందంటే కారణం ఏమై ఉంటుంది? తల్లి మారుతోం దంటే, బిడ్డ మీద ప్రేమ వల్ల కావచ్చు. కాని, సుజా... సుజాకి... అక్క మీద ప్రేమా?

తర్వాత వారంలో రామం దగ్గిర నుంచి కూడా ఉత్తరం వచ్చింది. "బాబుకి జ్వరం వస్తూంది. మా అమ్మ ఒంట్లో కూడా కులాసాగా లేదు. రుక్కు ఒక్కతీ ఇబ్బంది పడుతూంది. ఒక్క సారి నువ్వు వచ్చి చూసి వెళ్తే బాగ ఉంటుంది వదినా!" అని.

పార్వతికి వెంటనే వెళ్ళాలని బుద్ధిపుట్టింది.

★ ★ ★

"ఇదేమిటి మాటా మంతీ లేకుండా వచ్చావు?" అంటూ విస్తుపోయింది రుక్మిణి అక్క గారిని చూస్తూ.

వీధి గుమ్మం లోంచి లోపలికి వచ్చి చేతి సంచి గోడ వారని పెడుతూ, "కాసిన్ని మంచి నీళ్ళియ్యి రుక్కూ" అంది పార్వతి అలుపుగా. రుక్మిణి గబ గబా లోపలికి వెళ్ళి మంచి నీళ్ళు ముంచుకు వచ్చింది.

రుక్కు హడావిడికి గదిలో పడుకున్న రామం లేచి వచ్చాడు. "అరే! వదిన వచ్చేసిందే!" అంటూ సంభ్రమంగా చూశాడు. "ఇంత తొంద రగా వస్తావనుకోలేదు... కంగారేం లేదులే అని మళ్ళీ రాద్దామనుకుంటున్నాను ఇవ్వాళ." అన్నాడు.

"సెలవుకేం బాధ లేదులే. మా ఆఫీసరు చాలా మంచివాడు. కష్ట సుఖాలు చెప్పుకుంటే అర్థం చేసుకుంటాడు. బాబుకి బాగా లేదని రాస్తే, ఒక్క క్షణంకూడా ఉండబుద్ధి కాలేదు. బయల్దేరి వచ్చేశాను!"

"మీరు అక్కయ్యకి ఉత్తరం రాశారా? నాతో చెప్పనే లేదేం?" నిలదీసి అడిగినట్టే అడిగింది మొగుణ్ణి రుక్మిణి.

"అప్పుడలా బుద్ధిపుడితే పోస్టాఫీసులో రాసి పడేశాను. తర్వాత మరిచేపోయాను" అన్నాడు రామం ఏమంత పట్టించుకోనట్టు.

"బాబు కెలా ఉంది రుక్కూ?" ఆత్రుతగా అడిగింది పార్వతి.

"ఏం? బాబు కేం? వాడికేమయింది?" అంది రుక్మిణి ఆశ్చర్యంగా?

"అదేమిటి? బాగా లేదని రాశావుగా రామం?" మరిది కేసి చూసింది పార్వతి.

"రాత్రి నుంచీ బాగానే ఉన్నాడుగానీ నిన్నటి వరకూ జ్వరంతోనే బాధపడ్డాడు. నేను ఉత్తరం రాసిన పూటయితే జ్వరం బాగా ఉంది. కంగారు పడి రాశానంతే" అన్నాడు రామం.

"పిల్లాడికి జ్వరంవస్తే అక్కయ్యేం చెయ్య గలదు? ఆవిడేం డాక్టరనుకున్నారేమిటీ?" వెట కారంగా అంది రుక్మిణి. "పోనీ ఇలా ఉత్తరం ముక్క రాస్తానని నాతో అనుంటే, ఓ డజను తల పిన్నులు తెప్పించుకునేదాన్నిగా?" అంది మళ్ళీ.

రామం చిరాగ్గా చూశాడు. "తల పిన్నులు ఈ ఊళ్ళో దొరకవా? - నాలుగైదు నెలల తర్వాత గుమ్మంలోకి వచ్చినందుకు సంతోషించక ఏమిటా సాధింపు?" అంటూ కసిరాడు.

"బాగుంది... నా తోడబుట్టింది వచ్చినం దుకు నాకు కాకపోతే మీకా సంతోషం? పదవే అక్కయ్యా లోపలికి, కొంచెం కాఫీ పెడతాను."

"బాబు కనిపించడేం? అత్తయ్యేదీ?" అంటూ లోపలికి నడిచింది పార్వతి.

"బొత్తిగా ఏడిపించుకు తింటూంటే కాస్సే పలా తీసికెళ్ళమని ఇచ్చాను. చంకన వేసుకుని వెళ్ళారు."

పార్వతి స్నానంచేసి కాఫీ తాగి కూర్చుంది.

"కొంచెం ఏరిపెట్టవే" అంటూ బియ్యం చేట ముందు పడేసింది రుక్కు.

బియ్యం ఏరుతూంటే శాంతమ్మ మనవ ణ్ణెత్తుకునివచ్చింది. "ఏవమ్మా, పారూ! బొత్తిగా నల్ల పూసవైపోయావు. నెల్లాళ్ళ కోసారి వచ్చి చూసిపోకూడదూ?" అంటూ నిష్ఠూరమాడింది. "సూరి బావున్నాడా? మీ మరదలు కులాసాగా

ఉందా? ఏమిటి కబుర్లు?'' అంటూ కుశల ప్రశ్నలు వేసింది.

బాబిగాణ్ణి, ఒళ్ళోకి తీసుకుని ముద్దులు పెట్టుకుంటూ అత్తయ్య అడిగే ప్రశ్నలకు జవాబులు చెప్తూ కూర్చుంది పార్వతి.

''పిల్లాడు బాగా చిక్కిపోయాడత్తయ్యా? ఎన్ని రోజులు జ్వరం కాసిందేమిటి?'' అంది వాడి మొహంలోకి పరిశీలనగా చూస్తూ.

''ఏదో అయిందిలే. ఇప్పటికేనా కులాసా చిక్కింది'' ప్రసంగం మారుస్తూ అంది శాంతమ్మ, ''ఓ వారం రోజులైనా సెలవుపెట్టి వచ్చావా? లేక పోతే చెప్పుల్లో కాళ్ళు పెట్టుకుని కూర్చున్నావా?''

''అక్కయ్యా! బియ్యం కాస్త కడిగి తెచ్చి పెడతావూ?'' కూరకు తాళింపు పెడుతూ అంది రుక్మిణి.

''అయ్యో! నేను సరిగ్గా ఏరనే లేదే! బాబి గాణ్ణి చూస్తూ మరిచేపోయాను'' అంటూ చేట దగ్గిరికి లాక్కోబోయింది పార్వతి.

''నే నేరతాను, ఇలా ఇవ్వమ్మా!'' అంటూ కూర్చున్న చోట నుంచి లేవలేక చెయ్యి జాపింది శాంతమ్మ.

బియ్యం చేట అందించబోయింది పార్వతి.

విసురుగా లాక్కుంది రుక్మిణి. ''ఆవిడ ఏరితే ఇక తిండి తిన్నట్టే. ఏ రాయో పంటి కింద పడితే నా తల వాచేలా చీవాట్లు పెడతారు. ఎసరు పడేసి నేనే ఏరుకుంటాలే'' అంటూ పొయ్యి దగ్గిరికి వెళ్ళి కూర్చుంది.

చెల్లెలి రుస రుసలు కనిపెట్టనట్టు ఊరు కుంది పార్వతి. తనేమి పట్టించుకోనట్టు మళ్ళీ కబుర్లు సాగించింది శాంతమ్మ. పిల్లవాడు ఒళ్ళో నిద్రపోతూంటే పడుకోబెట్టటానికి లేచింది పార్వతి. రామం పొలం కేసి వెళ్ళినట్టున్నాడు. గదిలో లేడు. పిల్లవాణ్ణి పక్కలో వేసుకుని పడు కుంది పార్వతి. గోడల నిండా రక రకాల సినిమా తారల క్యాలెండర్లూ, ఫోటోలూ వెళ్ళాడుతూంటే ఆశ్చర్యంగా ఆ బొమ్మలన్నీ చూస్తూ పడుకుంది. శాంతమ్మ నెమ్మదిగా గదిలోకి వచ్చింది. ''పడు కున్నావేమిటమ్మా పారూ?''

''లేదత్తా, లేదు. రా కూర్చుందువుగాని'' అంటూ పిల్లాడి పక్కలోంచి నెమ్మదిగా లేచింది పార్వతి.

దగ్గిరికి వచ్చి కూర్చుంటూ శాంతమ్మ కంఠం తగ్గించి మాటి మాటికీ తలుపులకేసి చూస్తూ చెప్పింది. ''దాని ఎదుటే చెప్పటం ఎందుకని ఊరుకున్నాను కానీ పిల్లాడి కెంత జబ్బుచేసిం దనుకున్నావ్? ఏడెనిమిది రోజులౌతుందేమో! ప్లాస్కులో పోసి ఉంచిన పాలు కాస్త విరిగాయి. మళ్ళీ నీళ్ళు పెట్టి పాలు కలపటానికి బద్ధకించి ఆ సన్న విరుగుడు పాలే పట్టించేసిందట వాడికి. పోనీ నన్ను లేపితే నేనైనా కాసిన్ని నీళ్ళు వెచ్చబెట్టి ఇచ్చేదాన్ని. తెల్లరినప్పటి నుంచే పట్టుకున్నాయి డోకులూ, విరోచనాలూను. కాస్త కంగారుపడి అప్పుడు చెప్పింది అసలు ముక్క! చెప్పద్దూ, నాకు ఒళ్ళు మండి తల వాచేలా చివాట్లు పెట్టాను. సిగ్గుపడి నోరుమూసుకోక, 'నా ఇష్టం, నా పిల్లాణ్ణి చంపేసుకుంటాను, నాకు లేని బాధ మీ కెందుకు?' అంటూ ఎదురు తిరిగి దెబ్బ లాడటం మొదటెట్టింది. అప్పుడే బయటి నుంచి వచ్చిన నీ మరిది కళ్ళెర్రచేస్తూ పెళ్ళాన్నో లెంప కాయ వేశాడు. 'ఇదెక్కడ సంతరా భగవంతుడా నా మూలంగా వీళ్ళిద్దరూ కీచులాడుకు ఛస్తారే మోనని ఏడుస్తూ పెరట్లోకిపోయి కూర్చున్నాను. ఏవేవో మందులూ మాకులూ కాస్త శ్రద్ధపెట్టి వేశాననుకో. పిల్లాడు దక్కాడు, అదే పది వేలు. అప్పట్నుంచీ నాతో మాటా మంతీ మానేసింది. ఏం చెయ్యను? చంటి వాణ్ణి ఆడించుకుంటూ నా మానాన నేను ఏ మూలో కూర్చుంటాను.''

అంతా వింది పార్వతి. ఏమీ మాట్లాడలేదు. ఏం మాట్లాడుతుంది? రుక్కు గురించి ఏ కబురు విన్నా విడ్డూరంగానే ఉంటుంది.

''నీ తోడబుట్టిన దాని మీద ఉన్నవీ లేనివీ చెపుతున్నానని కష్టపెట్టుకోకమ్మా పార్వతీ! నాకు కోడలైనా అదే, కూతురైనా అదే అనుకుంటాను. నా కడుపున పుట్టిన ఆడ పిల్లకన్నా దీన్నే ప్రాణంలా చూచుకుంటాను... ఎందుకూ? అంతా నా రాత!''

"అత్తా! నీ గురించి నే నెప్పుడూ అలా అనుకోను, నీ గుణం నాకు తెలీదా? చిన్న వాళ్ళమని తేలిక చెయ్యకుండా దయదలిచి చేరదీశావు. నీ రుణం ఎలా మరచిపోతానత్తా? రుక్కు సంగతి వింటోంటే నాకు బాధగానే ఉంది. అయినా నువ్వు పెద్ద దానివి. దాని తప్పొప్పులన్నీ నీ కడుపులో దాచుకోక తప్పదత్తా! నా మొహం చూసైనా..."

"ఊరుకోవే పిచ్చిదానా! ఏదో మాటవరసకి అన్నాలే, అదేం నాకు పరాయిదా? మీ అమ్మనీ, నాన్ననీ కంఠంలో ప్రాణం ఉంటే మరిచిపోతానా? ఏమిటో, ఇలాగే పోతుంది కాలం! సరే గాని, లేచి వేడి వేడిగా ఓ ముద్ద తిని, కాస్సేపు నడుం వాల్చు!" అంటూ నెమ్మదిగా లేచింది శాంతమ్మ.

పార్వతి వచ్చి రెండు రోజులయింది.

రుక్కు ధోరణి బొత్తిగా కంటగింపుగా తయారైంది. అత్తగారి మాటంటేనే ఒంటి కాలు మీద లేస్తూంది. మొగుడు మాట్లాడబోతే వెటకారాలూ వ్యంగ్యాలూ విసురుతూంది. ఉత్త పుణ్యానికి పసి వాణ్ణి చావబాదుకొంటుంది. అక్క గారేమైనా బాధపడుతుందేమో అన్న ఇంగితమే లేకుండా సూటీ పోటీగా మాటలు విసురు తుంది.

అన్నీ చూస్తూనే ఉంది పార్వతి. కాకపోతే చూడనట్టు నటిస్తూందంతే. రామం పార్వతితో మాట్లాడే అవకాశం కోసం ఆ రెండు రోజులుగా ఎదురుచూస్తూనే ఉన్నాడు. రుక్కు దడి దొడ్లో తల స్నానం చేస్తూంటే, పార్వతి చంటివాడితో కబుర్లు చెపుతూ వసారాలో కూర్చుంది. శాంతమ్మ ఎవరో కబురంపితే పొరుగింటికి వెళ్ళింది.

రామం నెమ్మదిగా వచ్చి దగ్గర కూర్చున్నాడు. "వదినా!"

"ఏం రామం?"

"నువ్వేమీ అనుకోనంటే నీతో ఒక విషయం చెప్తాను!"

"బాగుంది. నువ్వంత కాని మాటేం చెప్తావు?"

"కాని మాటా, లేని మాటా కాదు. అసలు నీకు ఉత్తరం రాశానంటే, బాబుని చూడడానికి వస్తావనే కాదు, ఇక్కడో వారం రోజులుంటే, ఎవరూ చెప్పక్కర్లేకుండా అన్నీ నీకే తెలుస్తాయనీ"

"ఏమిటి రామం, నువ్వు మాట్లాడేది? అసలెవరి సంగతి?"

"ఇంకెవరి సంగతి వదినా? రుక్కు మాటే! వయస్సు వస్తోన్నకొద్దీ వివేకం పోతోంది. రోజూ ఇల్లు నరకమై పోతోందంటే నమ్ము. అమ్మ గుణం నీకు తెలియంది కాదు గదా? ఏ నాడూ, ఎవర్నీ ఓ మాట అనదు కదా? అలాంటి మనిషిని చూసి కళ్ళల్లో నిప్పులు పోసుకుంటుంది. ఒక్క క్షణం కూడా సామరస్యంగా మసలదు. పెద్ద దాని మాట ఎప్పుడూ వినదు. ఆఖరికి కూరలు వండుకునే దగ్గిర కూడా ఏదో రాద్ధాంతమే. 'ఎండి పోయిన కూరలు వేయించితే బాగుండవు, పులుసు పెట్టవే' అంటే, ససేమిరా వేపుడే చేస్తుంది. ఏదో సామెత చెప్పినట్టే ఉంటుందనుకో దాని వ్యవహారం. ఇంటికి వచ్చేసరికి ఏదో ఒక ఫిర్యాదు. అక్కడితో ఒళ్ళు మండి నేను తిట్టటం. తను రోజుల కొద్దీ తిండి మాని పస్తుండటం. అబ్బ! ఎన్నని చెప్పమంటావు? వదినా! ఈ ఇల్లు ఎలా బాగుపడుతుందో అర్థం కావటంలేదు. ఎటైనా పోదామా అనిపిస్తుంది అప్పుడప్పుడూ!" రామం పార్వతి కేసి చూశాడు.

పార్వతి మౌనంగా వింటోంది.

"మొన్న పండక్కి శకుంతల వచ్చింది. ఇంటికి ఒక్క ఆడపిల్ల! మనకే లోటూ లేదు. ఎంత సంతోషంగాచూసి పంపాలో ఆలోచించు. అమ్మా నేనూ ఎంత జాగ్రత్తగా ఉన్నా, ఎక్కడి కక్కడ వదినగారి సూటీ పోటీ మాటలతో అది కాస్తా ఏడ్చుకుని ఓ రవికల గుడ్డయినా తీసుకోకుండా వెళ్ళిపోయింది. 'నీ కేం ఖర్మే? ఇంటికి ఆడబిడ్డవి. తిరిగి నాలుగూ అనరాదటే! అంటే, దాని కలాంటి కీచులాటలు నచ్చవు. ' పెళ్ళిచేసి

పంపేసిన్నాడే నేను పరాయి దాన్నయ్యాను. మీ పెట్టుపోతలు నా కేమీ అక్కర్లేదు' అంటూ వెళ్ళి పోయింది. తర్వాత ఈవిడ గార్ని ఎన్ని కేకలేస్తే ఏం లాభం? నాలుగు రోజులు నోరు మెదప కుండా కూర్చుంటుంది. ఐదో నాటికి అంతా సరి. నయాన చెప్పినా, భయాన చెప్పినా, దాని గుణం మార్చ లేకపోతున్నా ననుకో! నువ్వయినా మంద లిస్తే కాస్త వినకపోదని ఊహ వస్తే వెంటనే నీకు రాశాను. ఇక నువ్వు దాని కెలా నచ్చ చెప్తావో, ఎలా చివాట్లు పెడతావో, నాకేం తెలీదు. నీకు చెప్పాలనుకున్న మాటలు చెప్పేశాను. రోజూ ఇంట్లో ఇలాంటి రాద్ధాంతాలైతే ఎన్నాళ్ళో ఈ సంసారం చెయ్యలేను.''

పార్వతి రామం మొహంలోకి చూస్తూ, ''అలా బాధపడకు రామం'' అంది.

''ఇంట్లో సుఖ శాంతులు లేకపోతే బతికి ఏం ప్రయోజనం చెప్పు? అమ్మదారిన అమ్మ కుమిలి పోతోంది. నా దారిన నేను బాధపడు తున్నాను. ఉన్న ఒక్క ఆడ పిల్లా కష్టపెట్టుకుని వెళ్ళింది. ఇలా అందర్నీ ఏడిపించి తనేం బాముకొంటుంది? ఆఖరికి పసి బిడ్డని కూడా నా కళ్ళ ముందే చావబాదుతుంది. చూస్తూ నేను ఊరుకోగలనా? కోపం వచ్చి ఏదో అంటే నేనే మూర్ఖుణ్ణంటారు కదా?''

పార్వతి మౌనంగా ఉండలేకపోయింది. ''అంత బాధపడకు రామం! అన్నీ నేను కను క్కుంటాను. మందలిస్తాను. మిమ్మల్నిందర్నీ ఏడి పించి అదేం సుఖపడుతుంది? దాని వ్యవహారం చక్కజేసే నేను వెళ్తాను, సరేనా?''

''ఆ నమ్మకం తోనే కదూ వదినా, నీకు రాశాను? అసలు ఈ గొడవలన్నీ నీకు చెప్పి నీ మనస్సు బాధపెట్టటం నాకిష్టమే లేదు. అయినా తప్పలేదు.''

''సరే, నువ్వేమీ మనస్సులో పెట్టుకోకు! దాన్ని నేను మందలిస్తాను.''

రామం లేచి వీధిలోకి వెళ్తూంటే రుక్కు స్నానం ముగించి చాలీచాలనీ తుండు గుడ్డ అడ్డ దిడ్డంగా చుట్టుకొని జుట్టు వెంట నీళ్ళు కారు తూండగా గబ గబా వచ్చింది. ''ఎవరో నీతో మాట్లాడుతున్నట్టున్నారు. గుడ గుడా మాటలు వినిపించాయి దొడ్లోకి'' అంటూ నాలుగు వేపులా పరికిస్తూ అడిగింది.

''ఇప్పటి వరకూ మరిదే కూర్చుని వెళ్ళాడు. అదేమిటి రుక్కూ, చీర తెమ్మని నాతో చెప్పలేక పోయావా? ఆ తుండు గుడ్డ తలకి చుట్టుకునే దానివిగా? పోనీలే. తొందరగా తల తుడుచుకో. జలుబు చేస్తుంది. అయినా ఇంత చీకటి పడ్డాక తలంటేమిటి?''

''చాకిరీ తెమిలేసరికి ఈ వేళైంది... మరేం చెయ్యను? తలపోటు కూడా వస్తోంది. కంగారు కంగారుగా నీళ్ళు పడేసుకుని చీర సంగతే మరచి పోయాను. చీర మాట అలా ఉంచి వీపు మీద ఓ చెయ్యి వేస్తావేమో నిన్ను పిలుద్దామా అంటే మీ కబుర్లలో నా అరుపేం వినిపిస్తుందిలే అని ఊరు కున్నాను. సందె వేళ వదిన గారితో మంతనా లాడుతూ కూర్చోటానికి ఆయన గారి కంత తీరికెలా అయిందేమిటి?''

శుద్ధీ బుద్ధీ లేని రుక్మిణి మాటలు వింటూంటే పార్వతి శరీరం జలదరించింది! మరిది తనతో మంతనాలాడటం ఏమిటి? ఛీ! నోటి కెంత మాట వస్తే అంత మాటా అనె య్యటమేనా?

రుక్కు అప్పటికే కడుపులో బాధ కాస్తా తీర్చేసుకుని గదిలోకి పోయి తల తుడుచుకుని చీర కట్టుకుని వచ్చింది. ''అక్కయ్యా! కాస్త దీపం వెలిగించవే! చీకటిపడింది.''

పార్వతి లేచి దీపం వెలిగించింది. రుక్కు తడి తల చిక్కులు తీసుకుంటూ కూర్చుంది. అడిగేమాట ఎప్పుడో ఓ సారి అడగాలి కదా అన్నట్టు పార్వతి రుక్కు చేతిలో దువ్వెన అందు కుని నెమ్మదిగా చిక్కుతీస్తూ ప్రారంభించింది. ''రుక్కూ! నిన్నోమాట అడగాలనుకుంటున్నానే! నువ్వు అత్తయ్యతో మాటాడుతూన్నట్టు లేదే!''

''ఏం మాట్లాడకపోతే? ఆవిడకేం నష్టమా? కొడుకు కొండలా వెనకేసుకు వస్తోంటే కోడల్ది మాట్టాడితే ఎంతా, మానుకుంటే ఎంతా?''

ఇరవై ఏళ్ళయినా నిండని చెల్లెలు అంత ఆరిందాలాగా చేతులు తిప్పకొంటూ మాట్లాడు తూంటే, ఎబ్బెట్టుగా తోచింది పార్వతికి. "అది కాదమ్మా రుక్కూ! నష్టాలూ లాభాలూ గుణించు కుని మాట్టాడు కుంటామా? ఒక్క ఇంట్లో ఉండవలసిన వాళ్ళు అభిమానాలతో కలిసీ మెలిసీ ఉండాలి గానీ..."

"నా మొహం అభిమానంలే. కట్టుకున్న మొగుడికే లేదు. ఇక ఆరళ్ళుపెట్టే అత్త కెక్క డొస్తుందీ?"

"రుక్కూ! అత్తయ్య నిన్ను ఆరళ్ళు పెడు తోందని నన్ను నమ్మమంటావా?"

"నీ కెలా నమ్మకం ఉంటుందిలే! నా కన్నా వాళ్ళే నీకు ఎక్కువ! అయిన వాడికి ఆకు లోనూ, కాని వాడికి కంచం లోనూ!"

"అసలు సంగతేమిటో చెప్పు పోనీ! అత్తయ్య నిన్నేమైనా కేకలేస్తూ ఉంటుందా?"

"కేకలేస్తే నేనేం పడి ఉండను! అంతకు పది రెట్లు అప్పగిస్తాను. నా దగ్గిరా పప్పులేం ఉడకవ్!"

నిట్టూర్చింది పార్వతి నిశ్శబ్దంగా. ఓపిక కూడగట్టుకుంటూ తిరిగి ప్రారంభించింది — "రుక్కూ! పెద్దా చిన్నా లేదా? అత్తయ్య ఎందు కైనా మందలిస్తుందనుకో, పెద్దది. మన మేలు కోరే చెప్తుంది. తను అనా వచ్చు, మనం పడా వచ్చు... అంత మాత్రాన ఏం పోతుంది? మాటకు పది మాటలు అప్పగిస్తే గొప్ప వస్తుందా? అత్తా కోడళ్ళంటే తల్లీ బిడ్డల్లాగే మెలగాలి గానీ, రాద్ధాం తాలు పడుతోంటే బాగుంటుందా? ఇంట్లో ఇలాంటి గొడవలు చూస్తోంటే తిరిగి తిరిగి ఇంటికి చేరే మగ వాడికి ఎంత విసుగ్గా ఉంటుందో ఆలోచించావా?"

రుక్కు వెనక్కు మొహం తిప్పి తన తల చిక్కులు తీస్తోన్న పార్వతి కేసి చూసింది. తనకేదో బోధించటానికి అక్కగారు పూనుకున్నట్టు పసి గట్టేసింది. "ఎవరు చెప్పారేమిటి ఈ కబుర్లన్నీ నీకు?"

కంగారుపడింది పార్వతి. "ఎవరు చెప్పటం ఏమిటి? నేను చూస్తూనే ఉన్నాగా? అత్తయ్యా నువ్వు మాట్లాడుకోటం లేదు."

"కాదులే. నీ కా పెద్ద మనిషే నూరిపోసి ఉంటుంది! అన్నీ కుక్క బుద్ధులే!"

"రుక్కూ!" కోపంగా చూసింది పార్వతి. రుక్కు ధోరణికి అసహ్యం వేసింది. తీక్షణంగానే అంది. "పోనీ ఎవరు చెప్తే నీకేం? ఉన్న మాటే గానీ లేని దెప్పుడూ కల్పించి చెప్పలేరు. చిన్న తనంలోనే తల్లి పోయి, తండ్రి పోయి, కష్టా లనుభవించాం. అత్తయ్య కాబట్టే, కానీ కట్నం అడగకుండా కడుపులో పడేసుకుంది. చేసిన మేలు మరచిపోతే, మనుషులకీ పశువులకీ భేదం ఉండదు. శకుంతల వస్తే నానా గొడవలు పెట్టావట. ఏం, ఎవరి పుట్టింటి ఆశ వాళ్ళకి ఉండదూ? దాన్నంత ఏడిపించి పంపడం నీకేం ధర్మమనిపించింది?... మీ ఇంటి విషయాలన్నీ నాకు తెలిశాయి. ఇప్పు డిక దాపరికం ఎందుకూ? నువ్విలా కయ్యాలు పెట్టుకుని కూర్చుంటే, రామం మనస్సు విరక్తి పెట్టుకుని ఎటో పోయేలా ఉన్నాడు. తర్వాత నెత్తి నోరూ బాదుకుని ఏడుద్దాం ఇద్దరం కలిసి."

రుక్మిణికి కోపం అవధులు దాటిపోయింది. వదిన గారితో చెప్పి తననిలా చివాట్లు పెట్టిం చటం, తగుదునమ్మా అంటూ ఈవిడిలా నీతులు చెప్పరావటం — ఇదంతా అందరూ కలిసి చేసిన గూడు పుఠాణీ అన్నమాట!

పార్వతి ఇంకా అంది - "పది మందిలోనూ మంచి అనిపించుకొని బతకటం గొప్పతనం గానీ, చెడ్డపేరు తెచ్చుకోటాని కెంత కావాలి? ఇంట్లో వాళ్ళంతా ఉసూరు మని ఏడుస్తూంటే నోరు పెట్టుకుని బతకటం నీకు మాత్రం ఏం సుఖం?"

"అక్కయ్యా, నువ్వేదో నన్ను తల్లి తర్వాత తల్లి లాగా నిర్వాకం చేస్తావనుకున్నాను గానీ, నా మీద లేనిపోని కబుర్లు విని చివాట్లు వెయ్య టానికే బయల్దేరి వస్తావనుకోలేదు!"

చాలా సేపు మాట్లాడలేకపోయింది పార్వతి. "నీ మంచి చెడ్డలు ఆలోచించటానికి నేను

తగనా రుక్కూ?''

''నువ్వంత కష్టపడి నా మంచి చెడ్డలేం ఆలోచించక్కర్లేదులే. నేనేం పాలు తాగే చంటి పిల్లని కాదు. నేనేం కాని పనులు చేస్తున్నానని అడగ వచ్చావు?''

పార్వతి సిగ్గుతో దించిన తల ఎత్తుకోలేక పోయింది. రుక్కు ఇంత మొండి రకంగా మాట్లాడుతుందనుకుంటే రుక్కిని పలకరించేదే కాదు. ఎంత చెల్లెలైతే మాత్రం విమర్శిస్తే ఊరు కుంటుందని తనెందుకనుకోవాలి?

నిశ్చేష్టురాలై కూర్చుండిపోయిన పార్వతి కొంతసేపటికి తమాయించుకుని లేచింది. ''నేను సాయంత్రం బండికి వెళ్తాను రామం'' అంది ఎదురుగా కనపడ్డ మరిదితో.

రామం మాట్లాడలేదు. ఆ మౌనంతోనే బయటికి వెళ్ళిపోయాడు. పార్వతి గబ గబా సంచి సర్దుకుంది. జుట్టు దువ్వుకుని కాస్త మొహం కడు క్కుంది. సంచి చేతిలోకి తీసుకుని వంటింటికేసి వెళ్ళింది.

''రుక్కూ! నేను వెళుతున్నానే.''

''ఎక్కడికీ? ఇంటికే!'' ఆశ్చర్యంగా అడు గుతూ లేచి వచ్చింది రుక్కు ''ఏం అంత కంగా రుగా బయల్దేరావు?''

''కంగారేముంది? వెళ్ళాలిగా?'' అంత కన్నా మాట్లాడలేదు పార్వతి — ''అత్తా! వెళ్ళొస్తా నత్తా!''

శాంతమ్మ పార్వతి వెనకే రోడ్డు వరకూ వచ్చింది. పార్వతి చటుక్కున శాంతమ్మ చెయ్యి పట్టుకుంది. ''అత్తా! నీ కేం చెప్పాలో నాకు తెలి యటం లేదు. ఇలా అందర్నీ దూరం చేసుకుని అది ఎలా బతుకుతుందో అర్థం కావటం లేదు. తల్లివైనా అత్తవైనా నువ్వే! ఇంత కన్నా ఏం చెప్పను?''

''వెళ్ళిరా అమ్మా! వెళ్ళగానే ఉత్తరం రాయి! బెంగ పెట్టుకోకు!''

''నా సంగతి కేంలే, అత్తా! వాళ్ళిద్దరూ గొడ వలు పడకుండా చూడు! నువ్వున్నావనే ధైర్యం నాకు! పిల్ల వాడు జాగ్రత్త! వెళ్ళొస్తాను!''

భుజం మీదుగా కొంగు లాక్కొని తల దించుకుని గబ గబా నడిచింది పార్వతి.

★ ★ ★

సుజా అదో మాదిరిగా నవ్వింది.

''పొద్దున్న జామ చెట్టు మీద కాకి అరు స్తోంటే 'ఎవరో వస్తారే' అంది అమ్మ. అలాగే నువ్వు రావటం గమ్మత్తుగా ఉంది'' అంది భోజనాలన్నీ ముగిశాక తీరిగ్గా కూర్చుంటూ. పార్వతి రైలు దిగేసరికి రాత్రి తొమ్మిది దగ్గరైంది. పడకలకు సిద్ధపడుతూన్న వాళ్ళంతా సంతో షంగా పార్వతి చుట్టూ కబుర్లడుగుతూ కూర్చు న్నారు. కామేశ్వరమ్మ చాలా మారింది. ఎప్పటిలా తిరుగుతూ ఇంటి వ్యవహారాలు చూసుకుం టూంది. కానీ, తెలిసిన వాళ్ళకు ఆవిడ కళ్ళల్లో ఏదో ఆవేదన కనిపించకపోదు.

''నేను వెళ్ళి పడుకుంటానండీ!'' అని సెలవు తీసుకుని తన గదిలోకి వెళ్ళిపోయింది జానకి. చంటి బిడ్డ తల్లి.

''పిన్నిగారూ, మీరు కూడా పడుకోకూ డదూ? పొద్దుపోయింది'' అంది పార్వతి కామే శ్వరమ్మతో.

''అమ్మకి మాత్ర లిచ్చి వస్తానుండు పార్వతీ!'' అంటూ సుజా అలమారలోంచి రెండు నిద్ర మాత్రలూ, గ్లాసుతో నీళ్ళూ తెచ్చి తల్లి కిచ్చింది. కామేశ్వరమ్మ మాత్రలు మింగి లేచి ''కబుర్లు వేసుకు కూర్చోక మీరు కూడా తొంద రగా పడుకోండి'' అంటూ హెచ్చరించి వెళ్ళింది.

''నాన్న పోయిన దగ్గర్నుంచీ అమ్మకి నిద్ర మాత్రలు వేసుకోడం బాగా అలవాటై పోయింది. అవి వేసుకుంటేగానీ నిద్రపోదు! అంది సుజా పార్వతి దగ్గిర కూర్చుంటూ.

''పోనీలే, ఇలాగైనా కాస్త శాంతిగా నిద్రపోతే అదే చాలు'' అంది పార్వతి.

కాస్సేపు మాటలేమీ జరగలేదు. సుజా లేచి పక్కలు సర్దింది. ''నీకు నిద్రవస్తోందా పార్వతీ? పడుకుంటావా?''

''పడుకోటానికేంలే. కాస్సేపు కూర్చో,

మాట్లాడుకుందాం. నువ్వు మొన్న పెద్ద ఉత్తరం రాశావు కదా? ఎందుకిలా రాసిందా అని చాలా ఆలోచించాను. నాకేం తోచలేదు'' అంది పార్వతి ఉపోద్ఘాతంలా.

సుజా మాట్లాడలేదు.

''చెప్పు సుజా! ఏమిటి విశేషాలు?''

సుజా ఏదో నిరాశతో నవ్వినట్టు నవ్వింది. ''ఏం విశేషాలున్నాయి పార్వతీ?''

''అలాక్కాదు, నీ ఉత్తరం చూసి ఏమో అనుకున్నానుగానీ నిన్ను చూస్తే ఏదో విశేషం ఉందనే అనిపిస్తోంది. అవునా?''

సుజా మౌనంగానే ఉండిపోయింది.

''నీ పెళ్ళి సంబంధాల మాటేమైంది?''

''ఏం చెప్పమంటావు పార్వతీ? నీ కెన్నో చెప్పుకోవాలనే ఉంది గానీ, చెప్పుకుని మాత్రం ప్రయోజనం ఏమిటి అనిపిస్తోంది! కాని, నీతోగాక ఇంకెవరితో చెప్పుకుంటాను?'' సుజా కంఠ స్వరం భారమై మాటలు గాద్గదికమయ్యాయి.

ఆశ్చర్యంగా చూసింది పార్వతి, సుజా మొహంలోకి. ''ఏమిటి సుజా? ఎందుకంత బాధ పడుతున్నావు? నీ మాటలేమిటో కొత్తగా ఉన్నాయి, ఏమైందసలు?''

సుజా కాస్సేపు ఊరుకుని అంది. ''ఎలా చెప్పాలో తోచటం లేదు! నాలా అక్కయ్య ఇంత కొట్టుకులాడి ఉండదు. ఇన్ని విధాల వెనక ముందులాలోచించ గలిగితే అంత సాహసంచేసి ఉండదు!''

''సుజా!'' విస్మయంగా చూస్తూ సుజా చెయ్యి పట్టుకుంది పార్వతి ''ఏమిటి నువ్వంటు న్నది?'' అంది నిర్ఘాంతపోతూ.

సుజాత మాట్లాడలేకపోయింది.

''నిజం చెప్పు సుజా! నా దగ్గర జంకుతు న్నావా? నిజంగా నువ్వేదయినా గొడవలో చిక్కు కున్నావా?''

''పార్వతీ!'' నిస్పృహగా అంది సుజా. ''తప్పంతా నాదే! మొట్టమొదట్లోనే నన్ను నేను అదుపులో పెట్టుకోవలసింది! మనస్సుని మంద లించుకోవలసింది. ఎందుకంత పిచ్చిదాన్నై పోయానో ఇప్పటికీ అర్థం కావటంలేదు!''

పార్వతి సుజా కళ్ళల్లోకి చూస్తూ, అను నయంగా అడిగింది. ''నాకు చెప్పవూ సుజా?''

నీటి యావిరితో నిండిన కారు మబ్బులకు చల్లటి గాలి సోకి వర్షించినట్టు నెలల తరబడీ భరించలేని వేదనతో భారమైపోయిన సుజా హృదయాన్ని ఆ లాలన ద్రవింపజేసింది. కళ్ళలో తిరుగుతూన్న నీళ్ళు తుడుచుకుంటూ పార్వతికి సమీపంగా జరిగి కూర్చుంది.

★ ★ ★

సుజా జీవితంలో చంద్రశేఖరం అడుగు పెడతాడని పార్వతి ఎలా అనుకుంటుంది? అసలు అది సంభవమే అని సుజా ఎలా అను కుంటుంది?

జానకి స్నేహితురాలు వసుంధర. ఆమెకి పెళ్ళి నిర్ణయమైందని, పెళ్ళికి నెల్లాళ్ళకిందటే ఉత్తరం వచ్చింది. ముహూర్తం నిర్ణయించాక కామేశ్వరమ్మ పేర కూడా శుభ లేఖ పంపింది వసుంధర. వసుంధరకూ, జానకికీ ఉన్న స్నేహం చిన్ననాటిది. కాలేజీలో చేరి, బి.ఏ. పాసైన వసుం ధర, ధర్డుఫారంతోనే చదువు చాలించుకున్న జానకిని మరచిపోలేదు. జానకి పెళ్ళిలో అంతా తనే అయి తిరిగింది. ఆ రోజుల్లోనే కామేశ్వరమ్మ ప్రేమాభిమానాలు పొందగలిగింది.

అలాంటి వసుంధర తన పెళ్ళికి కామేశ్వ రమ్మను కూడా రమ్మంటూ మరీ మరీ ప్రాధేయ పడుతూ రాసింది.

స్నేహితురాలి పెళ్ళికి తను బయల్దేరటమే కాకుండా ఆడబిడ్డను కూడా బయల్దేరదీస్తున్న కోడల్ని వారించలేకపోయింది కామేశ్వరమ్మ. విజయశాస్త్రిని కూడా రమ్మని జానకి అడిగితే కేసులూ, ఏవేవో వ్యవహారాలూ అని పాఠం అప్ప జెప్పాడు. చివరికి, వసుంధర పెళ్ళికి వదినా ఆడ బిడ్డల ప్రయాణం ఖాయమైంది.

సుజా కాలేజీ మానేశాక, బయటికి వెళ్ళ టమే అరుదు. బంధువులిళ్ళకు రాక పోకలేనాడో బందయ్యాయి. చాలా కాలం తర్వాత ఆ

ప్రయాణం సుజాకేదో భయం భయంగా తోచింది.

మండు వేసవిలో పెళ్ళిళ్ళ రోజుల్లో రైలు ప్రయాణాలు ఎలా ఉంటాయో అలాగే జరిగింది ప్రయాణం.

పెళ్ళిపెద్దల్ని ఆహ్వానించి తీసుకెళ్ళటానికి స్టేషన్‌కి వచ్చాడు చంద్రశేఖరం. వసుంధర అన్న! జానకి కూడా చంద్రశేఖరాన్ని 'అన్నయ్యా' అని పిలుస్తుంది, చిన్నతనం నుంచీ. "ఈవిడ మా ఆడబిడ్డ, పేరు సుజాత. పేరు లాగే తను కూడా అందంగా ఉంటానని చాలా గర్వంలే!" అంటూ జానకి, ఆడబిడ్డని చిలిపిగా పరిచయం చేసింది పెళ్ళి వారికి.

సుజా వదిన గారికేసి కోపంగా చూస్తూంటే, నవ్వుతూ అన్నాడు చంద్రశేఖరం — "అందంగా ఉండే వాళ్ళు గర్వపడటం సహజమే జానకీ!"

సుజాకు నిజంగానే కోపం వచ్చింది. సామానంతా జట్కాలో వేయిస్తూంటే మొహం తిప్పుకుని నుంచుంది.

"ప్రయాణం సుఖంగా జరిగిందా జానకీ?" బండి వెనకనడుస్తూ అడిగాడు చంద్రశేఖరం, జానకిని.

"ఆఁ అంతా బాగానే అయింది. ఈవిడగారి నసుగుడు మాత్రం భరించలేకచచ్చాను. చూడన్నయ్యా! అసలే పెళ్ళిళ్ళ రోజులు! రైళ్ళు రద్దీగా ఉంటాయికదా? ఏదో కాస్త చోటు చూసి ఈవిణ్ణి మట్టుకు కూర్చోబెట్టాను. నేనలా నిలువు కాళ్ళ మీద నిలబడే ఉన్నాను. తనకి పడుకోటానికి కూడా చోటు కావాలంటుందీ పెద్దమనిషి! ఏం చెయ్యాలంటావ్?"

జానకి, ఆడబిడ్డను ఏడిపిస్తూందన్న విషయం గ్రహించి చంద్రశేఖరం నవ్వుతూ అన్నాడు. "సుకుమారంగా ఉండే వాళ్ళని జాగ్రత్తగా తీసుకురావాలని తెలీదా నీకు? నీ పీనాసితనం కాకపోతే థర్డు క్లాసు ప్రయాణం ఎందుకు చెప్పు?"

సుజా చురుగ్గా చూసింది. "చెప్పేవాళ్ళకు చాదస్తమైతే వినే వాళ్ళకు వివేకం ఉండాలంటారు" అంది కోపంగా.

"ఊరుకో జానకీ! కబుర్లన్నీ ఇంటి దగ్గరే" అన్నాడు చంద్రశేఖర్ జానకిని మందలిస్తున్నట్టు.

"నిజమేలే. మనం నోరు మూసుకోకపోతే ఈవిడ బండి దిగిపోయేలా ఉంది!"

జన సమ్మర్దం తగ్గగానే జట్కా వేగం అందుకుంది.

వసుంధర, సుజాత వచ్చినందుకు చాలా సంతోషపడింది. "నిన్ను పంపించినందుకు అత్తగారికి ఎన్ని కృతజ్ఞతలైనా చెప్పుకోవాలి" అంది సుజా చెయ్యి అప్యాయంగా పట్టుకుని.

స్నానాలూ కాఫీలూ అయ్యాయి. జానకి ఆడబిడ్డ సంగతికాస్తా మరచిపోయి స్నేహితురాలితో ముచ్చట్లలో మునిగిపోయింది.

వాళ్ళ కబుర్లకు అంతరాయం కలిగించకుండా దూరంగా కిటికీ దగ్గిరకి వెళ్ళి నించుంది సుజాత.

అటుగా వచ్చిన చంద్రశేఖరం సుజాను చూసి "ఎందుకిక్కడ ఒంటరిగా నించున్నారు?... వాళ్ళిద్దరూ కబుర్లలో మునిగి మిమ్మల్ని వదిలేసినట్టున్నారే!" అన్నాడు.

సుజా తలైనా తిప్పి చూడకుండా కిటికీ అవతలకి చూస్తూ "ఫర్వాలేదులెండి" అంది.

చంద్రశేఖరానికి నవ్వు రాబోయింది. ఈవిడికి నిజంగానే కోపం వచ్చింది కాబోలు! "వసుంధరని పిలుస్తానుండండి" అన్నాడు.

"వద్దొద్దు! వాళ్ళిద్దరూ చాలా కాలానికి కలుసుకున్నారు. మాట్లాడుకుంటున్నారు. నాకేం భయం? మొక్కల్ని చూస్తూ నించున్నాను."

చంద్ర శేఖరం కదిలి వెళ్ళలేదు. "మీకు పువ్వులంటే చాలా ఇష్టమా?"

చిత్రంగా చూసింది సుజా. "ఏం? మీకు పువ్వులంటే చాలా ఇష్టం లేదా?"

నవ్వాడు శేఖరం. "నే నంత సున్నితమైన వాణ్ణి కాదండీ!"

అదంతా అనవసర ప్రసంగమేమో ననిపించింది సుజాతకి. తిరిగి జవాబు చెప్పకుండా కిటికీకేసి తల తిప్పుకుంది.

"వాళ్ళేలాగూ మాట్లాడుకుంటున్నారు. కాస్సేపు మీకు మొక్కలన్నీ చూపిస్తాను, రాకూడదూ?"

"అబ్బే! వద్దులెండి. ఇక్కడ నుంచి అంతా కనపడుతోందిగా?"

ఇల్లంతా పెళ్ళి సందడిలో మునిగి ఉన్నా సుజాకు కాలక్షేపం కావటం కష్టంగానే ఉంది. వసుంధర చూపించిన పుస్తకాల బీరువా దగ్గిర కూర్చుని అరలన్నీ చూసింది. అన్ని పుస్తకాలు ఒక్కసారిగా కళ్ళపడితే పెన్నిదేదో లభించినంత సంతోషం వేసింది. అన్నిటినీ వరసగా వీణ మెట్లు మీటినట్టు వేళ్ళతో తాకి చూసింది. తను వెళ్ళే సరికి అన్నీ చదివేస్తే! అన్నీ!

లోపలికి రాబోయిన చంద్రశేఖరం గుమ్మం లోనే నిలబడిపోయాడు. కంగారుగా లేచి నించుంది సుజాత.

"ఆ డెస్కులో నా పెన్ను ఉంది. కొంచెం ఇస్తారా?" అన్నాడు.

టేబుల్ దగ్గరికి నడవబోయి ఆగింది, "మీరే వచ్చి తీసుకోండి. నేను బయటికి వెళ్తాను" అంది.

"వద్దు, మీకిక్కడే బాగుంటుంది. కూర్చుని చదువుకోండి. నా కింకేమీ పని లేదు. పెన్ను తీసుకుని వెళ్ళిపోతాను. బజారు నుంచి సామాన్లు వచ్చాయి. కాస్త లిస్టు రాయాలి" అంటూ గదిలోకి వచ్చి డస్కులాగి పెన్ను తీసుకొంటూంటే "ఇది మీ గదా?" అంది సుజాత.

నవ్వాడు చంద్రశేఖరం. "తెలిస్తే ఇక్కడ కూర్చునే వారు కాదా? ఇక్కడి కెవ్వరూ రారు, ప్రశాంతంగా ఉంటుంది. చదువుకోండి" అంటూ వెళ్ళిపోయాడు హడావిడిగా. వెళ్తూ వెళ్తూ గది తలుపులు దగ్గిరికి వేసి మరీ వెళ్ళాడు.

సుజాత నెమ్మదిగా వెళ్ళి బీరువా ఎదుట నించుంది. ఓ పావుగంట వెదికి నాలుగైదు పుస్తకాలు తెచ్చి దగ్గర పెట్టుకుని కుర్చీలో కూర్చుంది.

"పందిట్లో పెళ్ళవుతున్నాదీ" అంటూ బ్యాండు వాళ్ళు ట్యూను వాయిస్తున్నారు. వినాలనిపించి పుస్తకం గుండెల మీద పెట్టుకుని వెనక్కి వాలింది.

జానకి విసురుగా గది తలుపులు తోసుకుని వస్తూ, "ఆహా, ఏం దర్జాగా పవ్వళించావమ్మా? నిన్నీ మూల దాక్కుని కూర్చోమన్నానా నేను? నీ అతీ గతీ చూడటం లేదని అన్నయ్య మమ్మల్నందర్నీ చివాట్లు పెట్టి వెళ్ళాడు. బయటికి వచ్చి అందరి దగ్గిరా కూర్చోరాదూ?" అంది గబ గబా.

సుజా నవ్వుతూ, "ఒక్క దాన్నీ కూర్చోవటమే నా కిష్టమని మీ అన్న గారితో చెప్పు! ఇక్కడ కూర్చుని హాయిగా చదువుకోమని నాకు చెప్పి గాలిదుమారంలా వచ్చి లాక్కు వెళ్ళమని నీకు చెప్పారేమిటాయన?"

"ఆ తగూ ఏదో తర్వాత వేసుకుందువులే గానీ లేచిరా తల్లీ! లేత పసుపు రంగు జరీ చీర తీసి పెట్టాను పెట్టి మీద. పెళ్ళి వారు వచ్చే వేళైందట. విడిదికి వెళదాం. లే మరి!"

సుజా కుర్చీకి మరీ అంటుకుపోయింది. "నేను చదువుకుంటాను వదినా! విడిదికీ, అక్కడికీ తిరగటం నాకు సిగ్గు బాబూ!"

"సిగ్గు చిన్నప్పుడే పోవాలిగానీ ఇంకా ఎంత కాలం? పెళ్ళికి వచ్చి పుస్తకాలు చదువుకుంటూ కూర్చుంటావా? ఇదెక్కడి చోద్యం? ముందు లేచి వస్తావా రావా?"

లేవక తప్పలేదు. పుస్తకం మూసి టేబిల్ మీద పెట్టి వదినగారి వెనకే వెళ్ళింది సుజా.

హాల్లోకి వెళ్ళేసరికి చంద్రశేఖరం ఎవరితోనో మాట్లాడుతూన్నవాడు వెనక్కి తిరిగి చూస్తూ అన్నాడు. "బస్సు వస్తోంది జానకీ! మీ రంతా తయారేనా?"

"ఇదిగో, ఈవిడ గారిదే ఆలస్యం! అక్కడెక్కడో అంతఃపురంలో దూరి కూర్చుంది. వెళ్ళి లాక్కువచ్చాను. ఇక సింగారం చూడు, ఎంత సేపు చేస్తుందో!"

పెళ్ళి పెద్దరికమంతా తన ఒక్క దానిదే నన్నట్టు తిరుగుతూన్న జానకి, సుజాని కూడా తన వెనక వెనకే తిరగమంది.

"ఊహూ! నే నిలా తిరగలేను బాబూ! పోయి గదిలో కూర్చుంటాను. ముహుర్తం వేళకి

పిలు. తప్పకుండా వచ్చి చూస్తాను'' అంటూ ప్రాధేయపడింది సుజాత.

"చాల్లే, నీ అపురూపం నువ్వూనూ'' అంటూ విసుక్కుంది జానకి.

"పోనీ సుజాని చదువుకోనిద్దూ! తనకంతా కొత్త! ఎలా తిరుగుతుంది?'' అంది వసుంధర నెమ్మదిగా. "వెళ్ళు సుజా! వెళ్ళి చదువుకో!''

"ఇదిగో, ఆ ముహూర్తం వేళకి నేనేం పిల వను. దాన్నే పిల్చుకోమని చెప్పి వెళ్ళు'' అంది కోపంగా జానకి.

సుజా నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

విడిదిలో దిగిన మగ పెళ్ళివారి టిఫినులూ, కాఫీలూ అయ్యాయి. ఐదారుగురు ఆడ వాళ్ళు పెళ్ళికూతుర్ని చూస్తామంటూ బయల్దేరి వచ్చారు. జానికి గబగబా వెళ్ళి ఆడబిడ్డని మళ్ళీ లాక్కు వచ్చింది. ఓ పావు గంట అలాగే ఇబ్బందిగా కూర్చుని జానకి ఎటో వెళ్ళగానే లేచి చక్కా పోయింది సుజాత. గది తలుపులు బిడాయిం చుకుని మళ్ళీ కుర్చీలో జేరబడింది. పుస్తకంలో పది పేజీలు తిప్పేసరికి కళ్ళు కూరుకు పోయాయి. తనకు తెలీకుండానే నిద్రలోకి జారి పోయింది.

తలుపుల మీద చప్పుళ్ళతో తుళ్ళిపడి లేచి చీకటి ఆవరించుకున్న గదిలో కంగారుపడుతూ తిరిగిందో క్షణం. కళ్ళు నులుముకుని ఎలాగో గుమ్మం పోల్చుకుని తడబడుతూ వెళ్ళి తలు పులు తీసింది.

"ఇదేమిటింత చీకట్లో కూర్చున్నారు?'' చంద్రశేఖరం ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"..... చదువుతూ ఉండగా నిద్రపట్టేసింది.''

"అయ్యో! డిస్టర్బ్ చేసినట్టున్నాను. జానికీ వాళ్ళు పందిట్లో ఉన్నారు. మిమ్మల్ని ఒక్కసారి పిలవమని జానకి చెప్పింది.''

"అప్పుడే తొమ్మిదయిందా?'' అంటూ ఆశ్చర్యపోయింది సుజా.

"ఆఁ, అవుతోంది. ముహూర్తం అయిపోతే, వడ్డనలు ప్రారంభించాలి. మీ రసలు మధ్యా హ్నం టిఫినైనా తీసుకున్నారా?''

సుజాత కెందుకో తలనొప్పి చాలా ఎక్కు వగా ఉంది. నిద్రపోయిలేచినా తగ్గినట్టు లేదు. చేసేదిలేక చంద్రశేఖరంతోనే అంది. "మీ దగ్గర తల నొప్పి మాత్రలేమైనా ఉన్నాయా?''

"ఏం? మీకు తలనొప్పిగా ఉందా? ఎప్ప ట్నుంచి?''

"ఇప్పుడేలెండి! కాస్త నొప్పిగా ఉంది. మాత్ర వేసుకుంటే బాగుంటుందేమో!''

"సరే! ఇక్కడే కూర్చోండి! ఇప్పుడే వస్తాను. గదిలో లైటు వేసుకోండి!''

పది నిమిషాల్లో ఓ గాజు గ్లాసుతో వేడి వేడి కాఫీ, రెండు మాత్రలూ తీసుకువచ్చాడు చంద్రశేఖరం.

"మిమ్మల్ని చాలా శ్రమపెట్టాను. ఇప్పుడు కాఫీ ఎందుకు?''

"పెళ్ళింట్లో కాఫీ టీలకి టైమేమిటండీ? తెల్లవార్లూ ఉంటాయి. శుభ కార్యానికి మీరు మా ఇంటికి వస్తే మీ మంచి చెడ్డలు చూసుకోవలసిన ధర్మం మాది కాదూ?... వెళ్తాను. కాఫీ తాగి కాసేపు కూర్చునేరండి.''

సుజా మాత్రలు మింగి వేడి వేడి కాఫీ తాగింది. కూజాలో చల్లటి నీళ్ళు వంచుకుని గుమ్మం బైట వాకిట్లో మొహం కడుక్కుంది. కాసేపటికి తేలిగ్గా ఉన్నట్టు తోచి, అద్దం ముందు నిలబడి ఒక్కసారి జుట్టు సర్దుకుని గది తలు పులు దగ్గరగా వేసి పందిట్లోకి బయలుదేరింది.

పందిరి మధ్య ఎత్తుగా అమర్చిన పూల మందిరంలో వధూవరులు సింగారించిన బొమ్మల్లా కూర్చుని ఉన్నారు.

బ్యాండు మేళం ఉలిక్కి పడ్డట్టు ఒక్క సారిగా తారాస్థాయికి లేచింది. మేళ తాళాల మధ్య ఒకరి గొంతు ఒకరికి వినిపించటం లేదు. వరుడు లేచి ధగ ధగలాడే సూత్రాల పసుపుతాడు పురోహితుడి చేతుల్లోంచి అందుకున్నాడు.

వసుంధర సిగ్గుతో మొగ్గలా ముడుచుకు పోయింది. నూతన వధూవరుల మీద అక్షింతల వర్షం కురిసింది. వరుడు మాంగల్యం ముడి వేస్తుంటే పై నుంచి పువ్వుల జల్లుపడింది.

గుప్పెడు మల్లెలు వరుని జుట్టు మీద నిలిచి పోయాయి. ఓ గులాబీ వధువు పాపిడిలో చిక్కుకుంది.

సుజా చేతిలో అక్షింతలు అలాగే ఉన్నాయి.

ఈ కళ్యాణ కాండలో ఎంత మర్మం ఉందో! ఇక ఆ వ్యక్తులిద్దరూ ఒక్కటి గానే జీవించాలి.

ఒకరు పూవు, ఒకరు తావి!

ఒకరు తనువు, ఒకరు మనసు!

చటుక్కున పద్మజ మెదిలింది సుజా మన సులో! "అక్కయ్య కూడా తల వంచుకుని పెళ్ళి పీటల మీద కూర్చుని ఉంటే అమ్మ ఎంత సంతోషించేదో!"

"జానకి మండపం దగ్గరే ఉందండీ! ఇక్కడ నిలబడిపోయారేం?" ఎటో వెళ్తూ చంద్రశేఖరం ఆగి అడిగాడు.

"ఫర్వాలేదు. ఇక్కడికి బాగానే కనిపిస్తోంది"

"తల నొప్పి తగ్గిందా?"

"ఆఁ తేలిగ్గానే ఉంది."

చంద్రశేఖరం వెళ్ళిన కాస్సేపటికే జానకి వెతుక్కుంటూవచ్చింది. "నీ మూలంగా నేను చీవాట్లు తినలేక చస్తున్నాను. ఇలా స్తంబాలు పట్టుకుని వేళ్ళాడటం ఫ్యాషనా ఏమిటి? నిన్ను ఎక్కడి కక్కడే వదిలేసి తిరుగుతున్నానని ఆయన గారు నన్ను సతాయిస్తున్నాడు. రా తల్లీ! అక్కడికి వెళదాం, పెళ్ళికూతురితో ఉంగరాలు తీయిం చాలి" అంటూ బలవంతంగా సుజా చెయ్యిపట్టు కొని లాక్కుపోయింది.

పెళ్ళికొడుకునీ, పెళ్ళికూతుర్నీ అంత దగ్గిరగా చూడటానికి సిగ్గు వేసింది సుజాతకి. నెమ్మదిగా, వదినగారి చెయ్యి వదిలించుకుని కాస్త వెనక్కు వెళ్ళి నించుంది.

తెల్ల వారు జామున నిద్రకు ఉపక్రమిస్తూ ఆడ బిడ్డతో అంది జానకి. "నీకో మాట చెప్తాను. ఏమీ అను కోవుగా?"

"ఏమిటి వదినా? నేనేం అనుకుంటాను?"

"అది కాదమ్మా! రేపే వసూని అత్తారింటికి తీసుకుపోతారట. తనతో నన్నూ రమ్మంటోంది. నిన్ను అడిగి చెప్పవచ్చునని ఏ మాటా చెప్పలేదు నేను. తిరిగి వచ్చే వరకూ నువ్వు ఇక్కడ ఉండ గలనంటే..."

"నేను ఒక్క దాన్నేనా?" తెల్లబోయింది సుజా.

"నీకు ఇష్టం లేకపోతే నేను వెళ్ళను. అయినా నీకేం భయం? వసూ వాళ్ళ అమ్మా, అన్నయ్యా వెయ్యి కళ్ళతో చూసుకుంటారు. లేక పోతే నేను మాత్రం వదిలేసి వెళ్తానా?"

"మళ్ళీ ఎప్పుడొస్తావు?"

"అక్కడ మూడు రోజులు కాగానే నాలుగో నాటికి అంతా కలిసి వచ్చేస్తాంగా? రాగానే మన ఊరు వెళ్ళిపోదాం, ఏమంటావు?"

"మూడు రోజులు వుండాలా?"

"నిజంగా చెప్పు! నువ్వు ఉండలేనన్నా నేనేం అనుకోను."

"పోనీ వదినా! నేను మీ అమ్మా వాళ్ళింటి కెళ్ళి వుంటే?"

"ఎక్కడున్నా ఒకటే సుజా! అమ్మావాళ్ళ కన్నా వీళ్ళేం పరాయి వాళ్ళు కారు. ఈ పెళ్ళి గొడవలతో వసూ అమ్మగారు అన్నీ చూసుకోలేక పోతు న్నారుగానీ, లేకపోతే ఆవిడ ఒక్క క్షణం ఆద మరచి ఉండదు. ఇక్కడైతే పుస్తకాలూ అవీ చదువుకోవచ్చు. నీ ఇష్టం, మా వాళ్ళింట్లో ఉంచటం నిజంగా నా కిష్టం లేదు. ఎందుకో చెప్పమంటావా? మా బామ్మా వాళ్ళూ వెనకటి గొడవలన్నీ తవ్వి నానా ప్రశ్నలూ వేస్తారు. వాళ్ళ విమర్శలకి నాకే బాధగా ఉంటుంది. నువ్వయితే తట్టుకోలేవు."

"సరే వదినా! నీ ఇష్టం. ఇక్కడే ఉంటాను." సుజా ఒప్పుకుంది.

మర్నాడు మధ్యాహ్నం రైలుకి పెళ్ళికూతురి తోసహా పెళ్ళి వారంతా బయల్దేరారు. చాలా వరకూ చుట్టాలు కూడా వాళ్ళతోనే ప్రయాణమయ్యారు. చంద్రశేఖరం పెళ్ళికూతుర్ని సాగనంపటానికి వెళ్ళాడు. వసుంధర తల్లి సామాను గదిలో ఏమిటేమిటో సర్దుకుంటూంది.

సుజాత నిశ్చింతగా పుస్తకాల గదిలో కూర్చుంది.

చంద్రశేఖరం స్టేషన్ నుంచి తిరిగి వచ్చాడు. స్టేషన్లో విషయాలన్నీ తల్లికి చెప్పాడు. తర్వాత తన గది ముందుకు వచ్చి "సుజాత గారూ!" అని పిలిచాడు.

పుస్తకంలోంచి తలెత్తి చటుక్కున లేచి నిలబడింది సుజాత. "రండి, రండి!" అంది. చంద్రశేఖరం గదిలోకి వచ్చి, ఒక కుర్చీలో కూర్చుంటూ అన్నాడు! "ఇంటికి వెళ్ళగానే మీకు కనిపించమని చెప్పింది జానకి. రైలు కదిలే లోపల ఎన్ని సార్లు చెప్పిందనుకున్నారూ!"

"ట్రెయిను ఖాళీగా ఉందా?"

"ఖాళీగానే ఉంది. అయినా సీట్లు రిజర్వు చేయించాం కదండీ?" అంటూ రుమాలుతో మొహం తుడుచు కున్నాడు.

సుజాత చంద్రశేఖరం కేసి చూసింది. ఆ మొహం నిండా అలసటే కనిపించింది. కళ్ళు కూడా చెమర్చి ఎండిన వాటి లాగ తడిగా పొడిగా ఉన్నాయి.

"ఈ పెళ్ళి పనులతో మీరు బాగా అలసి పోయి నట్టున్నారు. ఇక ఇవ్వాళ నుంచీ విశ్రాంతి తీసుకోవచ్చనుకుంటాను" అంది సానుభూతిగా.

"అప్పుడే విశ్రాంతెక్కడండీ? వాళ్ళు తిరిగి రావాలి. బావగారిని మర్యాదలు చేసి పంపించే వరకూ విశ్రాంతి లేదు."

ఇకేం మాట్లాడాలో తోచలేదు సుజాతకు.

"పెళ్ళికొడుకు బుద్ధిమంతుడి లాగే ఉన్నాడు లెండి. లోటు పాట్లున్నా సర్దుకుపోగల డనుకుం టాను" అన్నాడు.

"సర్దుకుపోక ఏం చేస్తారు? ఏ లోటూ రాకుండా ఎవరు చూడగలరు?"

"అలా అనకండి. అల్లుడి హోదాతో ఉన్న మనిషి ఏదైనా చెయ్యగలడు. అదో రాజ శాసనమే!"

"భరించే వాళ్ళుంటే అందరూ చేస్తారు శాస నాలు!" అని నవ్వింది సుజాత.

"ఎదిగిన ఆడ పిల్ల గుండెల మీద కుంపటే నంటారు కదా? తీరా ఆ కుంపటిని దించేసు కుందామంటే చేతులాడవు. ఎవ్వరూ లాక్కు పోకుండా దాచేసుకోవాలనిపిస్తుంది."

చంద్రశేఖరం మాటలు ఆసక్తిగా వింటూ కూర్చుంది సుజాత.

"మా వసూ ఆ కొత్త వ్యక్తి పక్కన కూర్చుని వెళ్ళిపోతోంటే నిజంగా... ఎంత బాధ కలిగిందను కున్నారూ? దుఃఖం వచ్చేసింది!" శేఖరం కళ్ళు నిజంగా చప్పున చెమ్మగిల్లాయి.

తెల్లబోయింది సుజాత. అతనలా కళ్ళు తుడుచుకుంటూంటే జాలి కూడా వేసింది. "అదే మిటి? మీరు... ఏడుస్తున్నారేమిటి?" అంది కొంచెం నవ్వుతూ.

"ఛ! కాదండీ! ఏడవటం కాదు. ఏదో బాధగా ఉంది. వసూ, నేనూ ఎప్పుడూ ఇలా విడిపోలేదు!"

కొంచెం నవ్వుతూనే అంది సుజాత. "మూడు రోజుల్లో వచ్చేస్తారు కదండీ?"

"వస్తే మాత్రం ఎంత కాలం ఉంటుంది? మళ్ళీ తనతోనే తీసుకుపోతానంటాడో యేమో! అలాగే కనిపించాడు. అస్తమాను దానికేసి చూట్టం, నవ్వటం!"

గట్టిగా నవ్వేసింది సుజాత. బిత్తరపోయాడు చంద్రశేఖరం. నవ్వు ఆపుకోలేక పోయినందుకు సిగ్గుపడిపోయింది సుజా. తన పొరపాటు గ్రహిం చుకుని తనూ నవ్వుతూ అన్నాడు చంద్రశేఖరం! "ఒక నెల్లాళ్ళలో పూర్తిగా వెళ్ళిపోతుంది. వాళ్ళకో ఇల్లూ సంసారం అన్నీ ఏర్పాటైపోయాయి!"

"రేపు మీ ఇంటికీ ఒకమ్మాయి వస్తుంది కదా? వాళ్ళు బాధపడరూ?"

"అయ్యో, ఎందుకు బాధపడరూ? ఏ ఇంట్లో నించి ఆడపిల్ల వెళ్ళినా, ఆ ఇంట్లో చాలా బాధపడతారు. మా అమ్మ చాలా బాధపడు తోంది. స్టేషన్ నుంచి రాగానే చెప్పటానికి వేళ్తే ఏడుస్తూ కూర్చుంది. నాలుగు మాటలు చెప్పేసి ఇలా వచ్చాను."

"వసుంధర కేమండీ? మీ అందరి ఇష్ట ప్రకారం పెళ్ళిచేసి పంపించారు. వస్తూ ఉంటుంది, వెళ్తూ ఉంటుంది." ఆ మాటలు అంటోంటే అంతలోనే సుజా మొహం పాలి

పోయింది. "మా అక్కయ్య మా ఇంటి గడప మళ్ళీ ఎక్కలేదు" అని ఏడ్చెయ్యాలనిపించింది.

కళ్ళెత్తి చంద్రశేఖరాన్ని చూస్తే, తన బాధ చెప్పుకుంటే అతను అర్థం చేసుకో గలడనిపించింది.

"కాస్సేపలా మొక్కలకేసి వెళ్దాం, వస్తారా?" అంటూ లేచాడు చంద్రశేఖరం.

అతని మాట కాదనలేక లేచింది సుజా. అతను మెత్తని మనస్సుకల సహృదయుడనిపించింది. అతనితో కలిసి తోట కేసి నడిచింది.

సంధ్య వెలుగులో కెంపుల్లా మెరుస్తూ పిల్ల గాలి తాకిళ్ళకు వయ్యారంగా కదులుతూ, ఆకుల మధ్య దాగి విస్మయంగా లోకాన్ని పరికిస్తున్నాయి రక రకాల పువ్వులు.

చంద్రశేఖరం ఒక గులాబీ తెంచి సుజాతకు అందించాడు. సుజాత దాన్ని ఒక్కసారి ఆఘ్రాణించి జడ మీద సర్దుకుంది.

★ ★ ★

**కూ**తురు లేని ఇంట్లో సుజాత తిరుగుతూంటే వసుంధర తల్లికెంతో నిండుగా తోచింది. కొడుకు సుజాతతో మాట్లాడుతోంటే కూడా ముచ్చటగా కనిపించింది. పరాయి పిల్ల అలా ధైర్యంగా తన ఇంట్లో ఉందని ఆవిడ సుజాతను వేయి కళ్ళతో చూసుకొంటూనే ఉంది.

జానకి చెప్పినట్టు ఆవిడ ఎంత మంచిదో అనిపించింది సుజాతకి.

"మీరు నదుల మీద ఆనకట్టల్ని ఎప్పుడైనా చూశారా? ఈ దగ్గర్లో చూడొచ్చు" అన్నాడు చంద్రశేఖరం సుజాతతో.

"లేదు లెండి, వదినా వాళ్ళూ వచ్చాక వెళ్దాం" అంది సుజాత.

"వాళ్ళు వస్తే మళ్ళీ వెళ్ళకూడదా? పదండి అలా తిరిగివద్దాం. చిన్న ఆనకట్ట ప్రాంతం ఉంది చూపిస్తాను."

సుజాత సంశయంగా చూసింది.

"వెళ్ళిరా, అమ్మా!" అంది చంద్రశేఖరం తల్లి. ఆవిడ అపార్థం చేసుకుంటుందేమోనన్న శంక తీరగానే స్లిప్పర్సు తొడుక్కుని బయల్దేరింది సుజాత.

ప్రశాంతంగా ప్రవహిస్తున్న చిన్న నీటిపాయ కనపడింది. ఒడ్డు వెంట నడుస్తూంటే అంది సుజాత. "ఎక్కడైనా కాస్సేపు కూర్చుందాం."

"ఏం? అప్పుడే అలిసిపోయారా? ఇంకా కాస్త దూరం నడవండి, అక్కడ కూర్చుందాం, బాగుంటుంది" అంటూ ముందుకు సాగాడు శేఖరం.

వెళ్ళి వెళ్ళి గుబురుగా ఉన్న చెట్ల నీడన ఆగాడు. "ఇక్కడ నించుని, ఒక్కసారి నీటికేసి, పరిసర ప్రాంతాలకేసి చూడండి! ఉత్త కళ్ళతో కాదు, కళా హృదయంతో చూడండి! ఎంత మనోహరంగా కనిపిస్తుందో!"

"అలాంటి కళా హృదయం నాకు లేదే!"

"పోనీ. ఎలాంటి హృదయం ఉంది మీకు?"

"రక్తాన్ని శుద్ధిచేసి శరీరానికి సరఫరాచేసే హృదయం!"

"ఆగండి, ఆగండి. మనం బొత్తిగా అంత పచ్చి నిజాల జోలికి పోవద్దు. ఇక్కడ కూర్చున్న కాస్సేపూ ప్రకృతి అందాలు తిలకించడానికే ప్రయత్నిద్దాం. ఏమంటారు?"

సుజాత నవ్వింది. "ఆ అందాలు తిలకించడం ఎలాగో మీరే చెప్పండి."

"చూడండి, ఆ నది పాయ వెన్నెలలా ఎంత ప్రశాంతంగా, హంసలా ఎంత వయ్యారంగా..."

"హంసని మీ రెప్పుడైనా చూశారా?"

"ఏం, చూడకపోతే?"

"హంస ఎలా ఉంటుందో తెలీకుండానే, అది ఎలా నడుస్తుందో చూడకుండానే, దానితో పోలుస్తారా?"

"అన్నీ మనం చూడగలమా?"

"అయితే, మీ కళ్ళకి ఎలా కనిపిస్తోందో, మీ మనస్సుకి ఎలా తోస్తోందో, అదే చెప్పండీ. ........!"

"అయితే అటు చూడండి, దిగువ లోయ లోకి. పాతాళంలా లేదూ? అందులోనే ఎత్తుగా

ఎదిగిన ఆ చెట్లు శాపగ్రస్తులైన గంధర్వుల్లా లేవూ?''

''పాతాళాన్ని మీరు చూశారా? గంధర్వుల్ని చూశారా?''

''అయితే నా వల్ల కాదు. మీ కళ్ళతో మీరే చూసుకోండి!''

''నా కళ్ళకి నది నిండా నీళ్ళూ, గట్టు నిండా చెట్లూ... అంతే కనపడుతున్నాయి!''

''అయితే మీది కళా హృదయం కాదన్న మాట!''

నవ్వింది సుజాత.

శ్రావ్యంగా ధ్వని చేసుకుంటూ మంద మందంగా సాగుతూంది నదీ ప్రవాహం. ప్రేమికుల మూగ భాషలా ప్రశాంతంగా నిశ్శబ్దంగా ఉన్నాయి, దూరంగా కనిపిస్తూన్న దృశ్యాలు.

''ప్రకృతీ పురుషుడూ ఒకటే అంటారు. ఇదంతా ప్రకృతే అయితే పురుషుడేడీ?'' అంది సుజా.

''వెదుకుదాం రండి, ఎక్కడ దాక్కున్నాడో!''

ఆనకట్ట వరకూ నడిచారిద్దరూ. చంద్రశేఖరం తన ఇంజనీరింగు స్కిల్ అంతా బోధించబోయాడు.

ఇబ్బందిగా మొహం పెట్టింది సుజాత.

''ప్లీజ్, నా ప్రాణాలు తియ్యనని మాట ఇవ్వండి!''

''నా ప్రాణాలైనా తీసి మీకు పోస్తాను, సరేనా?''

''నా ప్రాణాలే నాకు ఉంచండి, చాలు! ఎవరి ప్రాణాలూ నా కొద్దు!

తిరిగి తిరిగి ఇంటికి చేరేసరికి దీపాలు కాంతిగా వెలిగేంత చీకటి అలుముకుంది.

★ ★ ★

**జా**నకీ, సుజాతా, ఇంటికి వెళ్ళిపోయే రోజు! ప్రయాణానికి రెండు మూడు గంటల వ్యవధి ఉంది.

''ఇది నా బహుమతి మీకు!'' అంటూ చంద్రశేఖరం, ఒక పుస్తకాల కట్ట సుజాతకు అందించబోయాడు.

''ఎందుకండీ? మీ లైబ్రరీలో కొరత'' — తీసుకోవటానికి నిరాకరించింది సుజాత.

''ఆ కొరతని మళ్ళీ పూరించుకుంటాను. ఈ పుస్తకాలు చదవండి తప్పకుండా!''

అప్పటికీ ఆ కట్ట అందుకోలేదు సుజా''— నేను కొనుక్కుంటాను. వాటి పేర్లు రాసి ఇవ్వండి!''

''నేను ఇస్తున్నాను మీ కోసం, తీసుకోరా?''

సుజా, శేఖరం కళ్ళల్లోకి చూసింది. ''నేను ఇస్తున్నాను'' ఆ మాటల్లో ఎంతో ఆప్యాయత!

అటుగా వచ్చిన జానకి సంగతంతా తెలుసుకుని ''బెట్టు చెయ్యక తీసుకోవమ్మా! పుస్తకాల పురుగువేగా? తగ్గ బహుమానమే ఇస్తున్నాడు'' అంది వంతపాడుతూ.

సుజా చెయ్యిచాచి ఆ కట్ట అందుకుంది. ఇచ్చిన ఆనందం చంద్రశేఖరం మొహంలోనూ, తీసుకున్న సంతోషం సుజా మొహంలోనూ స్పష్టంగా కనిపించాయి.

చంద్రశేఖరం అక్కడి నుంచి వెళ్ళినట్టే వెళ్ళి అంతలోనే మళ్ళీ వచ్చాడు. ''జానకి లేదా?''

''వసుంధర పిలిస్తే వెళ్ళింది'' — సుజాత పేపరులో మునిగింది.

నిట్టూర్చి వెళ్ళిపోబోయాడు చంద్రశేఖరం.

సుజా పేపరు తీస్తూ, ''ఏం వెళ్ళిపోతున్నారు?'' అంది. మర్యాద కోసం.

''ఎందుకులెండి! చదువుకోండి. వెళ్తాను'... మీరు వెళ్ళిపోతున్నారంటే నా కెందుకో చాలా బాధగా ఉంది!''

వసుంధర కొత్తగా వెళ్ళినరోజు కనిపించిన బాధే కనిపించిందా మొహంలో. అలాగే ధ్వనించాయి ఆ మాటలు.

''నేను వెళ్తోంటే మీకు బాధ దేనికి?''

''అది తెలిస్తే బాగానే ఉండును!''

''చుట్టం చూపుగా వచ్చిన వాళ్ళు వెళ్ళకుండా ఉండిపోతారా మీ ఇంట్లో? పెళ్ళికి వచ్చినవాళ్ళంతా వెళ్ళిపోతోంటే మీ రిలాగే బాధపడ్డారా?''

"అదే నేనూ అనుకుంటున్నాను. మీరు వెళ్ళిపోతారంటే నా కెందుకింత బెంగగా ఉందో అర్థం కావడంలేదు. నేను గుర్తు ఉంటానా మీకు? పుస్తకాలు జాగ్రత్తగా ఉంచుకుంటారా? అలాగైతే నేనూ గుర్తు ఉంటాను."

చురుగ్గా చూసింది సుజాత. "అంత నమ్మకం లేని వ్యక్తుల కెప్పుడూ బహుమతు లివ్వకండి!"

అతను కొంచెం నవ్వాడు దిగులుపడు తున్నట్టు.

సుజాత పేపరు పడేసి లేచింది. చంద్రశేఖ రానికి కాస్త దగ్గిరగా వెళ్ళింది. "మీరు నిజంగా బాధపడుతున్నారే! తప్పండీ!"

విషాదంగానే నవ్వాడు చంద్రశేఖరం.

ట్రెయిన్ కదులుతూంటే కనిపిస్తూన్నంత వరకూ బయటికి చూసింది సుజాత. "మిమ్మల్ని విడిచి వెళ్ళిపోవటం నాకూ బాధగానే ఉంది. నిజం!" అని చెప్పాలనిపించింది ఆఖరి క్షణాల్లో. వీలు కాలేదు. ప్లాట్‌ఫారం మీద మూగవాడిలా నించున్న శేఖరం దూరం అయిపోయాడు.

"ఏమిటి ఆ ఆలోచన! చేతులు లోపలికి పెట్టుకుని సరిగ్గా కూర్చో!" అంటూ మాటల్లోకి దించింది జానకి.

వారం తిరక్కుండా సుజాతకో ఉత్తరం వచ్చింది. అది చంద్రశేఖరం రాసిందని తెలీగానే సుజా హృదయం ఆగిపోయినట్టయింది. భయం భయంగా ఉత్తరంతో మేడ మీదికి పరిగెత్తింది.

**"సుజా!**

మీ అనుమతి తీసుకోకుండా ఇలా ఉత్తరం వ్రాసినందుకు ముందు నన్ను క్షమించమని కోరుకుంటున్నాను. మీరు వెళ్ళిపోయిన రోజు నేను అన్నం తినలేదంటే, నిద్రే పోలేదంటే, నమ్ము తారా? అసలిలా ఉత్తరం వ్రాద్దామనే ఉద్దేశ్యం అప్పుడు నాకు లేదు. ఉంటే ఇక్కడే మీ అనుమతి కోరేవాణ్ణి. ఎందుకో ఇప్పటికిప్పుడు మీకు వ్రాయాలనిపించి ప్రారంభించాను.

వసూ లేనప్పుడు మీరు మా ఇంట్లో ఉంటే ఎంతో తృప్తికలిగింది నా మట్టుకు నాకు. అమ్మ కూడా మీరు ఉన్న నాలుగు రోజులూ ఇల్లు కళగా ఉందని పదే పదే అంటోంది.

ఈ నాలుగైదు రోజుల నుంచీ నా మనసు స్థిమితంగా లేదు. నే నేదో పోగొట్టుకున్నాను. వెదికి తెచ్చుకోవాలి అనిపిస్తోంది, అసలేం పోగొట్టుకున్నాను? ఎలా తెచ్చుకోగలను?

ఏమిటో పిచ్చిపిచ్చిగా వ్రాస్తున్నాను కదూ? నిజమే. నా కేమీ తోచటం లేదు అంతా పిచ్చిగానే అనిపిస్తోంది. మీరు ఇక్కడే ఉండి, మనం మళ్ళీ అలా నది కేసి నడిచివెళ్తే! ప్రకృతికి తోడుగా పురుషుణ్ణి వెతుకుతూ మీరు ఫక్కుమని నవ్వితే! ఒక్కసారి అదంతా మళ్ళీ జరిగితే బాగుండు నని పిస్తూంది! మీరు చుట్టం చూపుగా మళ్ళీ రాకూడదూ? పోనీ, మా ఇంట్లో మరో పెళ్ళిచేసి మిమ్మల్ని పిలుద్దామా అంటే నేను తప్ప ఎవ్వరూ లేరు. నేనే పెళ్ళికొడుకై మిమ్మల్ని పిలిస్తే బాగుంటుందా? బాగుంటుంది కదూ? పోనీ, మీరే పెళ్ళి కూతురై నన్ను పిలిచినా వస్తాను తప్పకుండా!

సుజా! నా బాధ మీకు ఎలా చెప్పుకోను? ఇంత మధురమైన బాధకు ఇంత సున్నితమైన భాష లేదే! మూగ భాష ఒక్కటే దానికి శరణ్యం! ఈ చిన్న లేఖ నా హృదయాన్ని మీ పాదాల ముందు పరిచి పెట్టగలిగితే ధన్యుణ్ణి! మెత్త మెత్తగా దాన్ని తొక్కుకుంటూ పోరుగా?

**చంద్ర శేఖర్."**

ఏదో ఉద్వేగంతో దుఃఖం పెల్లుబికి వచ్చింది సుజాతకి. ఆ ఉత్తరంలో అక్క డక్కడా కొన్ని కొన్ని మాటలు మళ్ళీ మళ్ళీ చదివింది. నిశ్శబ్దంగా అలా ఆ కాగితాల కేసి చూస్తూ కూర్చుంది చాలాసేపు. చటుక్కున కలం తీసుకుంది చేతిలోకి.

**"చంద్రశేఖరం గారికి,**

హృదయ పూర్వక నమస్కృతులతో. మీ ఉత్తరం చదివాను. చాలా సార్లు చదివాను. మీ రెందుకలా వ్రాశారో అర్థంకాలేదు. అర్థం కానందుకు కన్నీళ్ళు కూడా వచ్చాయి.

ఆ నాడు రైలు కదిలి పరుగెత్తుతూంటే, మీరు క్రమంగా దూర దూరం అయిపోతూంటే, నా కెంతో బాధవేసింది. మీరూ మాతో వచ్చేస్తే బాగుంటుందనిపించింది. ఆ మాటే మీతో చెప్పాలనుకుంటే మీరు లేరు. పాపిష్టి రైలు శరవేగంతో మీ నుంచి దూరంగా లాక్కుపోయింది నన్ను. మీరు ఇంటికి పోయి హాయిగా ఉంటారనుకున్నాను.

అర్థం లేని బెంగలతో ఉపవాసాలూ, జాగారాలూ చెయ్యటం వివేకం కాదు. అది నావంటి అవివేకులకు చెల్లుబడిగానీ, మీలా పెద్ద చదువులు చదివిన వారికీ, ఎంతో జ్ఞానం తెలిసిన వారికీ కాదు.

మీ రేదో పోగొట్టుకున్నానని వ్రాశారు. వెదు క్కోవాలని కూడా వ్రాశారు. లేదు, మీ రేమీ పోగొట్టుకుని ఉండరు. ఒక్కోసారి మన వస్తువులు మన దగ్గరే ఉంచుకుని పిచ్చివాళ్ళలాగే ఎక్కడెక్కడో వెదుక్కుంటూ ఉంటాం. కొన్నాళ్ళకు పరధ్యానం పోయి మీరేమీ పోగొట్టుకోలేదని మీరే తేలిగ్గా నవ్వుకుంటారు.

నిజమే! మీ రన్నట్టు ఆడ పిల్లలు ఇంట్లో తిరిగితే చాలు కళ వస్తుదంటారు పెద్ద వాళ్ళు. అలాంటప్పుడు ఏ ఆడ పిల్ల ఏ ఇంట్లో తిరిగినా కళ రావాలిగా? ఉహూఁ! అలా ఒప్పుకోరు మళ్ళీ! ఏ ఇంటి ఆడపిల్ల ఏ ఇంట్లో తిరగాలో, ఏ ఇంట్లో తిరగకూడదో, ఎన్నెన్నో నియమాలూ నిబంధనలూ విధిస్తారు! మరెన్నెన్నో రీతులూ, రివాజులూ వల్లె వేస్తారు!

మీ ఇంటికి మరోసారి రమ్మంటారా నన్ను? మీరే పెళ్ళికొడుకై నన్ను పిలుస్తారా? వసుంధర భర్త ఒక్క క్షణం కూడా విడవకుండా భార్య వెంట వెంట ఎలా తిరిగాడో మీరే చెప్పారుగా? అలాగే మీరూ మీ ఆవిడ కొంగు పట్టుకుని తిరుగుతూంటే నా గతేంగాను? పోనీ, నన్నే పెళ్ళి కూతురినై పిలవ మంటారా? నేను పెళ్ళి సిగ్గుతో ముడుచుకు పోతూంటే మీతో మాత్రం ఎలా మాట్లాడగలను? నేను భర్త కోసం కలలు కంటూ ఉంటాను గానీ, మీ కోసం కాదు కదా?

అయినా మీ రెందుకలాంటి ఉత్తరం వ్రాశారు? నాకు నచ్చలేదు, నిజంగా నచ్చలేదు. మా అన్నయ్యకు తెలిసినా, మా అమ్మకు తెలిసినా, ఏమవుతుందోనని భయంతో తల్లడిల్లి పోయానంటే నమ్మండి! నా కిష్టం లేదు. క్షమిస్తారు కదూ? ఎందుకిదంతా? క్షమించండి!

**సుజాత"**

వారం దాటేసరికి మరో కవరు వచ్చిపడింది సుజాత పేర వసుంధర నించి.

**"సుజాతా!**

సాహసించి ఈ ఉత్తరం వ్రాస్తున్నందుకు నన్నపార్థం చేసుకోకు. నువ్వు నాకు బొత్తిగా పరాయి దానివి కాదు. జానకి, నా చిన్ననాటి స్నేహితురాలు. అన్నయ్యకు జానకి కూడా ఓ చెల్లి వంటిదే! మా కుటుంబంతో స్నేహం చేసు కోవటానికి నీకు అభ్యంతర మేమీ ఉండదను కుంటాను. అన్నయ్య ఉత్తరం కూడా ఇందులో జతపరిచి పంపుతున్నాను. తను నేరుగా వ్రాయ టానికి ఇష్టంలేక నాకు ఇచ్చాడు. నీ జవాబు తిరిగి నా అడ్రస్‌కే పోస్టుచేస్తే అన్నయ్యకు అందిస్తాను. ఈ వ్యవహారం మన ముగ్గురి మధ్యే ఉంటుంది. జానకికి కూడా తెలియనీయనని మాట ఇస్తున్నాను. నీ మనసును మభ్యపెట్టు కోకుండా నీ ఇష్ట ప్రకారం ప్రవర్తించమని కోరు తున్నాను. వదిన కోరిక మన్నిస్తావని ఆశిస్తూ — **వసుంధర"**

నిర్ఘాంతపోయింది సుజాత.

వసుంధర తనకిలాంటి ఉత్తరం వ్రాయ టంలో ఉద్దేశ్యమేమిటి? అన్నగారి కోరికేనా? చంద్రశేఖరానికి ఇక ముందు కూడా తను ఉత్త రాలు వ్రాస్తుందా? ఎందుకు? ఇంత గోప్యంగా ఈ వ్యవహారం నడపాలా? ఇదేం పని?

కవరు లోంచి రాలిపడ్డ మరో కాగితం తెరిచింది.

**"సుజా!**

మీ ఉత్తరానికి జవాబు వ్రాయకుండా ఉండలేననిపించింది. మీరు వ్రాసినంత తేలిగ్గా ఈ ఆలోచనలు నన్ను వదలడం లేదు.

వసు ద్వారా పంపుతూన్న ఈ ఉత్తరాన్ని క్షమించి చదువుకుంటారని ఆశిస్తాను.

మీ జవాబు చూచి.........."

ఎవరో వస్తూన్న అలికిడైతే చేతిలో కాగితం గబ గబా మడిచి పుస్తకంలో పెట్టి లేచిపోయింది సుజాత.

★ ★ ★

దోషిలా తలదించుకుని కూర్చున్న సుజాను చూస్తే ఎంతో జాలి కలిగింది పార్వతికి. కొంతసేపటికి ఏదో అభిప్రాయానికి వస్తూఅంది. "ఆ మొట్టమొదటి ఉత్తరాలతోనైనా నువ్వతనికి రాయడం ఆపుచెయ్యాల్సింది సుజా! చాలా పొరపాటు చేశావు!"

సుజా తనను తను నిందించుకొంటూ న్నట్టు అంది. "నిజంగా పొరపాటే చేశాను పార్వతీ! ఎప్పటికప్పుడు నన్ను నేను హెచ్చరించు కొంటూ కూడా శేఖరం దగ్గిర్నుంచి వచ్చిన ఉత్తరాలకు జవాబులు వ్రాయకుండా ఉండలేక పోయాను. నేను ఉత్తరాలు వ్రాయకపోతే, అతను తిండి తినలేని పరిస్థితికి వచ్చాడు. అత నేమైపోతాడోనన్న బాధతో మరేమీ ఆలోచించ లేకపోయాను. చివరికిలా గాలిలో కొట్టుకొనే దీపంలాగా దారీ తెన్నూతోచక, ఎవరితోనూ చెప్ప కోలేక, ఎంత నరక యాతన అనుభవిస్తున్నానను కున్నావు! ఇప్పుడు నా కెంతో తేలికగా ఉంది. అంతా నీకు చెప్పేశాను!"

పార్వతేమీ మాట్లాడలేకపోయింది.

"ఒక్క సారి జరిగిదంతా తల్చుకుంటే, ఎంతో ఆశ్చర్యంగా ఉంటోంది. నేనేనా ఇంత సాహసం చేస్తున్నానని అపనమ్మకం కలుగు తోంది. నేనూ అక్కయ్య లాగేనా చెయ్యడం? నేనూ అమ్మని ఏడిపించడమేనా? తప్పంతా నాదే పార్వతీ! తప్పంతా నాదే!" సుజాతకు దుఃఖం ముంచుకు వచ్చింది.

పార్వతి శాంతంగా చూస్తూ అంది — "నీ తప్పేంలేదు సుజా! పెరిగి పెద్దవాళ్ళవుతూంటే ఈ ప్రేమలూ అనురాగాలూ కలుగుతాయి కదా? అవి కులాల్నీ మతాల్నీ చూసి ఆగి పోతాయా?... పెద్ద వాళ్ళందరూ మారిపోతే ఎంత బాగుండునో అనిపిస్తుంది నా కెప్పుడూ!..."

రఘు తల్లితండ్రులు రఘు ఇష్టాయిష్టాలు పట్టించుకోకుండా ప్రవర్తించిన విషయమే పార్వతి మనసులో ఎప్పుడూ దొలుస్తూ ఉం టుంది — "పిల్లలకు ఇష్టమైన వాళ్ళతోటే వాళ్ళ పెళ్ళిళ్ళు చేస్తే వాళ్ళు చాలా సంతోషంగా ఉంటారు. పిల్లల సంతోషం చూసి పెద్ద వాళ్ళు కూడా సంతోషంగా ఉండొచ్చు కదా! ఇంత చిన్న విషయం పెద్ద వాళ్ళకు తెలీదు సుజా!"

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటావు పార్వతీ?" కన్నీళ్ళతో అడిగింది సుజాత. అవును, సుజా ఏం చేయ్యాలి? ఏమని సలహా ఇవ్వాలి? ... పద్మ చేసిన పనే, సుజా కూడా చేస్తుందా?... అయ్యో! తల్లి కుంగిపోతుంది కదా?

"నువ్వే చెప్పు! ఏం చేద్దామను కుంటు న్నావు?" అంది పార్వతి.

సుజాత అధైర్యంగా నవ్వింది— "అది తెలిస్తే ఎందుకిలా బాధపడతాను?"

"తెలియడానికేముంది?... అతన్ని మర్చి పోలేవా?"

"... మర్చి... పోవాలా! మర్చి పోయి? ఆ తర్వాత నేను బతకడం ఎందుకు?"

"అతనంటే అంత ఇష్టమా సుజా?"

నిరుత్సాహంగా నవ్వింది సుజాత.

"...అయితే అతన్నే పెళ్ళిచేసుకో! అతన్ని

రమ్మని రాయి! అతనితో వెళ్ళి పో!"

"అమ్మో!... అలా చేస్తానా? అది సాధ్య మేనా?"

"గట్టిగా అనుకుంటే ఎందుకు సాధ్యం కాదు?... పోనీ సుజా... అమ్మకి చెప్పేస్తే?"

"అమ్మో! అమ్మ బతుకుతుందా?"

"అయితే... నువ్వే ధైర్యం చేసి వెళ్ళిపో!"

"అది అమ్మకి మరీ అవమానం పార్వతీ! అమ్మ ఒక్క పూట కూడా బతకదు!"

"నిజమే... నాకూ అలాగే అనిపిస్తోంది, మరి ఇంకేం మార్గం ఉంది?"

"... ఒక్కోసారి నాకేమనిపిస్తోందంటే, అతన్ని పెళ్ళిచేసుకోవడం ఎలాగూ జరగదు. అంత సాహసం చెయ్యడానికి ఈ ఇంట్లో ఒక్క ళ్ళకే అవకాశం ఉంది. దాన్ని అక్కయ్య ఉపయో గించుకుంది. నాకు ఆ దారి లేదు. అసలు నేను పెళ్ళే చేసుకోను... ఇలాగే ఉండిపోతాను!"

"అయ్యో, అదేం ఆలోచన సుజా?... అమ్మా వాళ్ళు సంబంధాలు చూస్తారు కదా?"

"ఆ పని చేస్తూనే ఉన్నారు. అందుకే పెళ్ళే వద్దనుకుంటున్నాను. అమ్మ దగ్గిరే ఉంటాను!"

"అమ్మ...పెద్దదై పోతుంది కదా?"

"ఫర్వాలేదు... అన్నయ్య ఉంటాడు. నువ్వు లేవూ పార్వతీ, పెళ్ళి లేకుండా?"

"నా పరిస్థితి వేరు కదా?"

"నా పరిస్తితీ వేరే. పెళ్ళి లేకుండా నువ్వు ఉన్నట్టే నేనూ ఉంటాను. ఎప్పుడో సమయం చూసి అమ్మకి ఆ మాటే చెపుతాను. నీ దగ్గిరే వుండిపోతానమ్మా అని చెపుతాను."

"కాదు సుజా!... నా కేమినిపిస్తోందంటే... వసుంధర జానక్కి స్నేహితురాలే కదా? ఆవిడ జానక్కి చేప్తే, జానకి మీ అన్నయ్యకి చెప్పొచ్చు. అన్నయ్య అమ్మని వొప్పిస్తాడు."

"అమ్మో! అమ్మకి గుండె ఆగిపోతుంది. ఎవరు చెప్పినా ఒకటే. నా కసలు పెళ్ళీ వొద్దు, ఏమీ వొద్దు!"

"సుజా! నేనే మీ అమ్మనైతే నీకు చక్కగా అతనితో పెళ్ళి చేసేసే దాన్ని! పద్మనీ వాళ్ళా యన్నీ ఇంటికి రమ్మని చక్కగా పిల్చేదాన్ని! ఎందుకొచ్చిన గోలలు ఇవన్నీ? అందరూ మను షులే కదా?"

"అమ్మ చిన్నప్పట్నించీ వేరే ఆలోచనల్తో పెరిగింది. చదువు లేదు. తనకు తెలిసిన సాంప్ర దాయాలు తప్ప ఇంకేమీ అర్థం కాదు. చెప్పినా ఇష్టపడదు."

"కారణం అది కాదు సుజా! నా కేమని పిస్తుందంటే... అమ్మ తన వయసులో ఎవర్న యినా ప్రేమించిందనుకో. ఆ పెళ్ళి జరగలే దనుకో. అలాంటప్పుడే ఆ బాధ తెలుస్తుంది. చిన్న వయసులోనే పెద్ద వాళ్ళు కుదిర్చిన పెళ్ళిళ్ళు చేసుకుని కాపరాలు చేసే వాళ్ళకి, ప్రేమలు కలగడం అదీ ఏం తెలుస్తుంది? అదేదో చెయ్య కూడని పని అనుకుంటారు. వాళ్ళకే ప్రేమ గురించి తెలిస్తే పిల్లల్ని అర్థం చేసుకోరూ?"

"చాలా సార్లు నాకూ అలాగే అనిపించింది పార్వతీ! 'అమ్మకి తన చాదస్తాలు తప్ప ఇంకేమీ తెలీదు' అనిపించింది. పాపం అమ్మ మాత్రం ఏం చేస్తుంది? చిన్నప్పుడే పెళ్ళి చేసేశారు. స్వంత ఇష్టాయిష్టాలేమున్నాయి?"

"పద్మజ చేసిన పని మంచి పనే అని పిస్తోందా నీకు ఇప్పటికైనా?"

"ఎప్పటి నించో అనుకుంటున్నాను అలాగ. అక్కయ్య ఎంతో అదృష్టవంతురాలను కుంటు న్నాను."

"అయితే అక్కయ్యలా నువ్వూ ధైర్యం చేసెయ్యి!"

"చెయ్యలేను. నా వల్ల కాదు, అమ్మ ఈ సారి గుండెలు పగిలి చచ్చిపోతుంది. అన్నయ్య ఇంకో సారి సిగ్గుతో చితికిపోతాడు. ఈ కుటుం బాన్ని చూసి ఇంకో సారి అందరూ నవ్వుకుం టారు. ఈ అన్నిటి కన్నా నా సంతోషం నాకు ఎక్కువా? ఇవన్నీ జరిగితే అసలు నాకేం సంతోషం ఉంటుంది?"

బాధగా అంది పార్వతి — "అన్నీ తెలిసి కూడా అంత అవివేకంగా ఎందుకు ప్రవర్తించావు

సుజా? అతనికి ఉత్తరాలు రాయడం అదీ ఎందుకు చేశావు?''

"నన్నిలా అడిగితే నేనేం చెప్పను పార్వతీ? బుద్ధిలేకుండా చేశాను. అతన్ని ఎంత దూరంగా ఉంచాలనుకున్నానో నీకు తెలీదు.''

కొంచెం సేపు నిశ్శబ్దంగా గడిచింది.

"అయితే అమ్మావాళ్ళు చూసే సంబంధం వద్దని చెప్పేస్తావా?''

"అదీ భయంగానే ఉంది పార్వతీ! నాకైనా సాంప్రదాయకంగా పెళ్ళి చెయ్యాలని అమ్మ ఎంతో ఆశ పెట్టుకుని కూర్చుంది. పెళ్ళే చేసుకోనంటే కూడా అమ్మకి పిడుగుపాటు లాగే ఉంటుంది.''

"నీకు ఏమని సలహా ఇవ్వాలో కూడా తోచటంలేదు, సరే! అమ్మకి మరే చికాకూ కలిగించకు. జరిగినదంతా కలే అనుకుని మరిచిపో. అతనికి ఉత్తరాలు రాయకు. అతన్ని ఇంకా ఆశపెట్టడం ధర్మం కాదు. నీ మనస్సులోమాట తేల్చి వ్రాసెయ్యి!''

సుజా చెంపల మీదుగా జారుతున్న కన్నీళ్ళను చూడనట్టే ఊరుకుంది పార్వతి.

★ ★ ★

పార్వతి ఇంటికి వచ్చేటప్పటికి సూర్యం లేడు. ఎప్పటికో వచ్చాడు — "సుశీలకి చాలా ప్రమాదంగా ఉందట! నీ కోసం రెండు మూడు రోజుల నుంచి మనుషులు వస్తూనే ఉన్నారు.'' అన్నాడు ఎప్పటికో.

"ఏమిటీ, సుశీలకా? ప్రమాదంగా ఉందా? ఎవరు చెప్పారు?'' కంగారుగా అడిగింది పార్వతి.

"మళ్ళీ ఏదో జబ్బు చేసిందని పుట్టింటికి తీసుకొచ్చి ఆస్పత్రిలో చేర్చారట. రెండు రోజులు చూసి డాక్టర్లు, లాభం లేదు, తీసుకుపొమ్మంటే ఇంటికి తీసుకొచ్చేశారట! అస్తమానూ నీ కోసం అడుగుతోందట! నువ్వు ఊరెళ్ళావని విని నా కోసం మా అత్తారింటికి కూడా వచ్చారు. రెండు మూడు రోజుల్లో వచ్చేస్తావని చెప్పాను నిన్న.''

పార్వతికేమిటో నమ్మశక్యంగా లేదు. సుశీలకు మళ్ళీ ఎందుకంత జబ్బు చేసింది? 'చాలా ప్రమాదం' అంటే చచ్చిపోదు కదా?

రైలు దిగగానే ఈ కబురు తెలిస్తే పార్వతి ఎప్పుడో వెళ్ళిపోయేదే.! ఇంటి కొచ్చి గదులు తుడుచుకుని, గిన్నెలు తోముకుని, స్నానం చేసి కుంపటి అంటించి ఎసరు పెట్టింది. అప్పటికి వచ్చాడు సూర్యం. "సుశీలకి చాలా ప్రమాదం...'' అంటూ.

"అన్నం వార్చేశాను. ఈ పూట కూరా అదీ చెయ్యలేను. ఏ పచ్చడి ముక్కో వేసుకుని తినొచ్చు. నే నొక్కసారి వెళ్ళొస్తాను. ఉంటావా ఇంట్లో?''

"ఉంటాలే. ప్రయాణం కబుర్లు చెప్పేవే కాదు. రుక్కు కొడుకెలా ఉన్నాడు? అసలేం సుస్తీ చేసింది?''

"అంతా బాగానే ఉన్నారు. అట్నుంచి వచ్చి చెప్తాగా?'' అంటూ ఆత్రుతగా బయలుదేరింది పార్వతి.

గేటుకు ఇవతల నుంచే ఆ ఇంట్లోకి వచ్చే పోయే జనాన్ని చూస్తే పార్వతి గుండెలు దడదడలాడాయి. తడబడే కాళ్ళతో అతి ప్రయత్నం మీద వేగంగా నడుస్తూ లోపలికి వెళ్ళింది. ఇద్దరు ముగ్గురు కొత్త వాళ్ళు దిగాలుగా కనపడ్డారు. ఎవరో పార్వతిని గుర్తుపట్టి పిలుచుకు వెళ్ళారు.

"పార్వతి వచ్చిందర్రా! రా అమ్మా, రా! ఇలారా'' అంటూ కంగారుగా పిలిచింది ఒకావిడ.

"ఈవిడేనేమిటి పార్వతంటే?'' అన్నట్టు చాలా కళ్ళు పార్వతి కేసి చూశాయి.

ఏమీ పట్టించుకోకుండా గబ గబా సుశీల మంచం దగ్గిరికి వెళ్ళింది పార్వతి.

సుశీల పక్క మీద పడి ఉంది.

తల్లి, దగ్గిరే ఉంది. "అమ్మా సుశీ! ఒక్క సారి చూస్తావూ? పార్వతి వచ్చిందమ్మా!''

ఎంత అనునయంగా పిలిచినా కళ్ళెత్తి చూడలేదు. పార్వతి కూడా దగ్గిరే కూర్చుని సుశీల తల మీద చెయ్యి వేసింది. జుట్టంతా చిక్కులు పడి ఉంది. ఎముకలు తేలిన వీపు మీద చేతితో నిమిరింది.

సుశీల దాదాపు బాహ్య స్మృతి కోల్పోయి పడి ఉంది. రాత్రి నుంచి అలాగే ఉందనీ, పల కడం కూడా మానేసిందనీ, తల్లి ఏడుస్తూ చెప్పింది.

"పార్వతి అక్కయ్య... అక్కయ్య లేదా అమ్మా? రాలేదా?" అంటూ ఎన్నో సార్లు అడి గిందట. అక్కడ ఉన్న వాళ్ళ మొహాల్లోకి ఆశగా చూసిందట! సుశీల తల్లి అన్నీ ఏడుస్తూ చెప్పింది.

"పాపిష్టి పెళ్ళి చెయ్యకుండానైనా ఉన్నారు గాదు. నా తల్లి ప్రాణాలు నిలువునా తీశారు. నా బిడ్డని నాకు దూరం చేశారు" అంటూ ఆవిడ ఏడుస్తుంటే పార్వతి భయం భయంగా చుట్టూ చూసింది. రఘుపతి రాలేదేమో అన్న సంశయం కూడా అప్పుడే వచ్చింది. అతని ప్రసక్తి ఎవ్వరూ ఎత్తటం లేదు. సుశీల చావు బ్రతుకుల్లో ఉంటే రఘుపతి దగ్గిర లేకపోవటం ఏమిటి? రఘూకి కబురు తెలీలేదా? తెలిసి కూడా రాలేదా?

డాక్టరు వచ్చాడు. అందరూ కాస్త దూరంగా జరిగి ఖాళీ ఇచ్చారు. సుశీలకు ఇంజక్షన్ ఇవ్వ డానికి సిద్ధపడ్డాడు డాక్టరు.

"డాక్టరుగారూ! నా బిడ్డని బతికించలేరా డాక్టరుగారూ? ఇరవై ఏళ్ళనుంచీ అపురూపంగా పెంచుకున్నాను. కష్టానికీ నిష్టూరానికీ కడుపులో దాచుకున్నాను. కడుపుతీపి మీకు తెలియదా డాక్టరుగారూ? నా బిడ్డని బతికించి పుణ్యం కట్టు కోండి డాక్టరుగారూ! గర్భశోకం నేను భరించ లేను డాక్టరుగారూ!" సుశీల తల్లి డాక్టరు పాదాల మీదికి ఒరిగి భోరుమంటూ ఏడ్చింది.

డాక్టరు తడబడుతూ "చూడండమ్మా! మీ రిలా అధైర్యపడకూడదు. కష్టాలు వచ్చి నప్పుడే ధైర్యంగా ఉండాలి. నా శక్తికొద్దీ ప్రయత్నిస్తు న్నాను. కంగారుపడకండి!" అంటూ రెండడు గులు వేసి కట్టెలా పడి ఉన్న సుశీలకు ఇంజక్షన్ ఇచ్చాడు. నోటికి కొంగు అడ్డం పెట్టుకుని ఏడుస్తూ కూర్చుంది తల్లి.

పార్వతి కనుకొలుకుల్లో నిండిన నీటిబొట్టు విదుల్చుకొంది.

గంట కావస్తున్నా సుశీలలో ఏ మార్పూ కని పించలేదు. అలాగే కళ్ళు మూసుకుని, చేతులూ కాళ్ళూ నిర్జీవంగా పడేసుకుని పరుపు మీద పడి ఉంది.

కాళ్ళు తిమ్మిర్లు పుడుతూంటే కాస్త దూరంగా వెళ్ళి గోడవారగా కూర్చుంది పార్వతి. తన నెవ్వరూ పలకరించకపోయినా, తనకేసి ఎవరూ చూడకపోయినా, అసలు తనక్కడున్న సంగతి కూడా ఎవ్వరూ పట్టించుకోక పోయినా, అక్కడి నుంచి కదలాలనిపించలేదు పార్వతికి.

"అయితే, ఆ పిల్లాడింకా ఇంటికి చేర లేదూ?"

"ఎటు పోయాడని ఎవరు వెదుకుతారు? నెల్లాళ్ళనుంచీ అతీ గతీ లేదట! అదేం పోయే కాలమో! లక్షణంగా కాపరం చేసుకోలేడూ?"

"అసలు మూడు ముళ్ళూ వేసిన దగ్గి ర్నుంచీ అలాగే కాల్చుకు తిన్నాడట కదూ? మాటా మంచా, ముద్దా ముచ్చటా?"

ఉలిక్కిపడి చూసింది పార్వతి. ఆ ఆడ వాళ్ళిద్దరూ మాట్లాడుకునేది ఎవరి మాట? రఘు పతి గురించేనా?

"పోనీ, అత్తగారైనా రాలేదేమిటో, చోద్యం!"

"ఆవిడా మనేదితో తీసుకు చస్తోందిట! కొడుకు దేశాలు పట్టిపోయాడు. కోడలు రోగిష్టి మారిదై పోయింది. ఏం చూసుకుని సంతోషి స్తుంది. అలాగే పోతాయి బతుకులు!"

"ఏమైంది పిన్నిగారూ? సుశీల భర్త రాలేదా?" అని అడిగి అన్నీ తెలుసుకుందా మని పించింది పార్వతికి. ఎంత ప్రయత్నించినా నోరు పెగలలేదు. కంఠం దుఃఖంతో పూడుకుపో యింది. చటుక్కున కళ్ళు ఒత్తుకుంది కొంగుతో.

హఠాత్తుగా ఏదో జరిగింది. ఘొల్లుమంది సుశీల తల్లి. "అయ్యో తల్లీ! వెళ్ళిపోయావా, నన్ను వదిలి వెళ్ళిపోయావా? భగవంతుడా! తీసుకుపోయావా? నా బిడ్డని తీసుకుపోయావా? నా కడుపులో చిచ్చుపెట్టావా? దేవుడా!"

సుశీల అస్తమించింది!

సూర్యుడూ అస్తమించాడు! చిమ్మచీకటి అలుముకుంది. పార్వతి కూర్చున్న చోటే

కూర్చుండిపోయింది. సుశీల చచ్చిపోయింది! సుశీల చచ్చిపోయింది! రఘుపతికి తెలీనే తెలీదు. అతను రానే లేదు! దుర్మార్గుడు! నిండు ప్రాణాన్ని పొట్టన పెట్టుకున్నాడు. అయ్యో! సుశీల తనకేదో చెప్పాలనుకుంది. తన కోసం ఎంతో ఎదురుచూసింది. చివరి క్షణాలలో ఎంత బాధపడింది! వెళ్ళిపోయింది! ఎవ్వరితోనూ చెప్పు కోని లోకానికి, ఎవ్వరికోసమూ ఎదురు చూడని లోకానికి, దేని కోసమూ బాధపడని లోకానికి, వెళ్ళిపోయింది శాశ్వతంగా!

నిన్నయినా వచ్చి ఉంటే.... సుశీల ఏదో చెప్పేది. తను ఓదార్చితే ధైర్యం తెచ్చుకునేది. తప్పకుండా బతికేది... తప్పకుండా...!

పసుపు కుంకాలతో ముస్తాబయిన సుశీల, ప్రశాంతంగా నిద్రపోయిన సుశీల, ఇహలోక బంధాలకు అతీతురాలైన సుశీల, పూలకారులో ఊరేగుతున్న సుశీల, పార్వతి కన్నీటిలో కరిగి పోయింది! మరి కనిపించలేదు!

★ ★ ★

కొన్నాళ్ళ వరకూ మనిషి కాలేకపోయింది పార్వతి. జబ్బుపడి లేచినట్టు నీరసించి పోయింది. ఎటు చూసినా విషాదం తప్పితే ఏమీ కని పించడం లేదు. ఈ బంధాలూ బాంధ వ్యాలూ, ప్రేమలూ మమతలూ, బొత్తిగా అర్థ రహితాలే! ఏది శాశ్వతం? ఏదీ కాదనిపించింది.

"అక్కయ్యా! నా పచ్చఅట్ట నోట్సు కనిపిం చదేం? నిన్న ఇక్కడేగా పెట్టాను?" కంగారుగా వెతుక్కుంటూ అడిగాడు సూర్యం.

"నాకు తెలియదురా. కొంచెం నెమ్మదిగా వెతుక్కో... అదే కనిపిస్తుంది."

సూర్యానికి చికాకు ఎక్కువైంది. "ఇంకా ఎలా వెతుక్కోవాలి? అసలు ఇంట్లో ఉంటే కని పించకేం చేస్తుంది? ఏ పిల్ల వెధవలు పట్టుకు పోయారో? దొంగ వెధవ లందర్నీ చేర్చు క్కూర్చుంటావు!" అని రుసరుస లాడాడు.

"అదేమిటి సూరీ? పిల్లలేదో సరదాగా ఆడు కోటానికి వస్తారు. నీ పుస్తకాలూ అవీ ఎందుకు తీస్తారు? నేను జాగ్రత్తగా చూస్తూనే ఉంటాను గానీ తియ్యనిస్తావా?"

"అయితే ఆ నోట్సు కనిపించదేం? దేవు డెత్తుకుపోయాడంటావా?"

తమ్ముడెందుకంత చిరాకుపడిపోతున్నాడో పార్వతికి అర్థం కాలేదు. తన మటుకు తను ప్రశాంతంగానే అంది. "రాత్రిగాని వెళ్తూ వెళ్తూ చేత్తో పట్టుకుపోయావేమో, కాస్త జ్ఞాపకం చేసుకో సూర్యం!"

వినిపించీ వినిపించకుండా సణుక్కోవటం మొదలెట్టాడు. వినీ విననట్టు ఊరుకుంది పార్వతి.

"సూర్యం! మరదల్ని ఇంటికి తీసుకు రాకూడదూ, ఇల్లు కాస్త సందడిగా ఉంటుంది" అంది పార్వతి గతంలోనే. ఆ మాటే మళ్ళీ అంది.

"తను ఇక్కడెలా ఉంటుంది? మన మిద్దరం బయటికిపోతే రోజంతా ఒక్కతీ ఉండద్దూ?" అన్నాడు సూర్యం.

పార్వతికేం చెప్పాలో తోచనట్టయింది. మరి పెళ్ళయిన తర్వాత అత్తవారింటికి రాదూ ఆడ పిల్ల? ఎవళ్ళ సంసారం వాళ్ళు చేసుకునేటప్పుడు ఒక్కళ్ళూ ఉండక, ఇంకెవరొస్తారు? తన ఉద్దే శ్యం చెప్పకపోయినా ఏదో అనకుండా ఉండలేక పోయింది పార్వతి. "నువ్వు ఉన్నా లేకపోయినా రాత్రిళ్ళు కూడా ఒక్కదాన్నీ ఉంటున్నాను. పగలు కాస్సేపు ఉండటానికేం ఫర్వా లేదు. సాయంత్రం ఐదయ్యే సరికి రానే వస్తాను నేను. అందాకా ఏ పుస్తకాలో చదువుకుంటూ ఉంటుంది."

"ఆవిడ గారికేం వంటా గింటా రాదు. వచ్చి మాత్రం ఏం చెయ్యాలి?" పెళ్ళానికి పని పాటలు రానందుకు తనెంతో బాధపడిపోతున్నట్టు! పైకే అలా మాట్లాడుతున్నాడని తమ్ముడి మనసు గ్రహించినా ఊరుకోలేకే అంది. "ఇక్కడికొస్తే మాత్రం వంటా వార్పూ ఆ పిల్ల మీద పెడతానా నేను? ఇంట్లో ఉండవలసిన మనిషి కదా, తీసు కొస్తే బావుంటుందని అన్నాను. పోనీ నీ కిష్టం లేదంటే అలాగేకానీ!"

"నాకు కాదు, అసలు తనకే ఇష్టం లేదంది.

పోనీ, ఊళ్ళోనే వాళ్ళ పుట్టిల్లు ఉంది గదా అక్కడే ఉంటుందిలే అని నేనూ ఊరుకున్నాను. నా చదువు అయిపోతే అప్పుడు చూద్దాం.''

చదువుకీ, పెళ్ళాన్ని తీసుకురావటానికీ సంబంధం ఏమిటో బోధపడిందికాదు పార్వతికి. చదువు సాగదని భయపడుతున్నాడేమో అనుకుందామా అంటే, ప్రతి రాత్రీ అక్కడికే బయల్దేరుతున్నాడయ్యే!

సూర్యం మూడు రోజుల వరకూ ఇంటికి రాకపోతే కంగారుపడి కబురు పంపింది పార్వతి.

''రేపు వాళ్ళిద్దరూ కలిసివస్తామని చెప్పమన్నా రత్తా!'' అనేసి పరిగెత్తాడు పొరుగింటివాళ్ళ పిల్లవాడు.

పార్వతి ఆ సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూ కొట్లోకివెళ్ళి కాస్త గోధుమ రవ్వా, శెనగ పిండీ, జీడి పప్పూ, ఏవేవో తెచ్చింది.

మర్నాడు ఆదివారం పొద్దున్న తొమ్మిది గంటలవేళ, తమ్ముడూ మరదలూ రిక్షా దిగుతూంటే గబ గబా కుంపటి అంటించి కాఫీ పెట్టింది. ఇద్దరికీ చెరో కప్పూ ఇచ్చి తర్వాత వంట గదిలో కూర్చుని వంటలు చేసింది, మిట్ట మధ్యాన్నం దాకా.

అప్పటి దాకా భార్యాభర్తలిద్దరూ పేకాడుకుంటూ కూర్చున్నారు. ''సూరీ! లేచి భోజనాలు చెయ్యకూడదూ?'' అంది పార్వతి. ఇద్దరికీ నీళ్ళూ, తువ్వాళ్ళూ అందించి భోజనాలు వడ్డించింది. తింటూ తింటూ, ''రాణీ! మా అక్కయ్య దగ్గిర నువ్వు వంట నేర్చుకోరాదూ?'' అంటూ హాస్య మాడాడు సూర్యం, భార్యతో.

''ఈమాత్రం వంట నాకు రాదేమిటి?'' అని మూతి తిప్పింది రాణి.

''కోస్తావ్ మరీ! వంకాయ ఉల్లికారం పెట్టి ఇంత రుచిగా వండగలవూ? పెసర పచ్చడి ఇంత కమ్మగా రుబ్బగలవూ?'' నవ్వుతూ చూశాడు సూర్యం.

రాణి మొహం జేవురించిపోయింది. ''మీకు మహా గొప్పగా ఉన్నాయేమో! నా కిలాంటి గొడ్డు కారాలు తినటం అలవాటే లేదు, రుచీ పచీ తెలీకుండా!''

కూరల మీద లేచిన వాదాలు కీచులాటల దాకా పోతాయేమోనని భయం వేసింది పార్వతికి. ''సూరీ! ఆ అమ్మాయిని ఎందుకలా అంటావు? ఆడ పుటక పుట్టాక వంటా వార్పూ రాకుండా ఎవరు ఉంటారు?'' అంది సామరస్యంగా.

రాణీ కొంచెం నవ్వుతూ — ''మీకు కోపం వచ్చిందేమిటి? నాకింత లేసి కారాలు తినటం అలవాటు లేదు. అందుకే అన్నాను'' అంది.

''అబ్బే! ఇందులో కోపం రావటానికేముంది? మా అమ్మ పోయే నాటికి నేనే వంటా నేర్చుకోలేదు. తీరా అన్ని పనులూ మీద పడితే ఎలాగో అలవాటు చేసుకున్నాను. పెద్ద వాళ్ళు నేర్పని వంటలూ అవీ ఏం బావుంటాయి? మీ అమ్మ గారి దగ్గిర శ్రద్ధగా నేర్చుకుంటే అన్నీ చక్కగా చెయ్యగలవు.''

తర్వాత పెద్దగా మాటలేమీ జరగలేదు.

తమ్ముడూ మరదలూ గదిలోకిపోయి తలుపులు వేసుకున్న తర్వాత తనూ రెండు ముద్దలు తిని, లేచి మళ్ళీ కుంపటి అంటించి మధ్యాహ్నం తింటారని కాసిన్ని పకోడీలు వేయించింది. వేడి కుంపటి మీద కాఫీకి నీళ్ళు పడేసి వంటింటి గడపలో తుంగచాప పరుచుకుని పడుకుంది.

మధ్యాహ్నం కాఫీలు అవీ అయ్యాక ఇద్దరూ మళ్ళీ కాసేపు పేకాడుకున్నారు.

''అక్కయ్యా, నువ్వూ వచ్చి కూర్చోకూడదూ?'' అన్నాడు సూర్యం మధ్యలో గుర్తు వచ్చినట్టు.

''నాకు పేకాడటం రాదు'' అంది, పుస్తకం చదువుకుంటూన్న పార్వతి.

''పేకాడటం తప్పా?'' ముక్కలు పేర్చుకుంటూ వారగా చూసింది రాణి.

''అలా ఎవరన్నారు? నా కేమిటో చిన్నప్పట్నుంచీ పేకాటంటే ఇష్టం ఉండదు. సరదాకి నేర్చుకోబోయినా పట్టుబడలేదు. నాతో ఏమిటి? మీ రాడుకోండి.''

రాణీ పార్వతి కేసి ''ఇదేం మనిషి!'' అన్నట్టు

చూసి తనలో తను నవ్వుకుంది.

పెళ్ళయిం తర్వాతే సూర్యం సిగరెట్లు కాల్చడం, సెలవు పూట వస్తే పేక ముక్కలు పరుచుకుని కూర్చోవటం, అలవాటు చేసుకున్నాడు. పార్వతి రెండు మూడు సార్లు అడగాలనుకునే విరమించుకుంది.

రాణీ తన చేతులతో తనే సూర్యం సిగరెట్లకు అగ్గి పుల్లలు అంటించటం చూస్తే ఒళ్ళంతా జలదరించినట్టయింది పార్వతికి.

కాని, తనేమీ చూడనట్టే ఊరుకుంది.

వాళ్ళిద్దరూ పేకాటలో మునిగిపోయి కోపాలు ప్రదర్శించుకుంటున్నారు. రాణీ ఇక్కడికి రావలసిన విషయం ఆ పిల్ల దగ్గిరే ఎత్తుదామా అనుకుంది పార్వతి కొంతసేపు. సూర్యానికే ఆ ఉద్దేశ్యం లేనప్పుడు తను అడిగి ప్రయోజనం ఉండదేమో నని అప్పటికా ఆలోచన విరమించుకొంది.

అయినా ఇంటికి తను పెద్దది. అమ్మాయిని పంపించమని అడగకపోవటం మర్యాదగా ఉండదు. ఆ ఉద్దేశ్యంతో తమ్ముడి అత్తగార్ని అడిగిందో రోజు. "మంచి రోజు చూసి మరదల్ని పంపించండి అత్తగారూ!" అంది.

ఆవిడ పట్టించుకోనట్టు నవ్వేస్తూ, "ఆం దానికే ముందమ్మా? ఊళ్ళో మేమెలాగూ ఉన్నాం. అబ్బాయి వచ్చిపోతూనే ఉన్నాడు. అది ఎక్కడుంటే నేమిటి? నువ్వు ఆఫీసుకి పోతే అది ఇంటి పనులూ అవీ చేసుకోలేదు. చిన్న పిల్ల! ఏదో పెళ్ళి చేశాంగానీ..." అంటూ చెప్పుకుపోయింది.

పార్వతి మరేమీ మాట్లాడలేకపోయింది. వాళ్ళ అయిష్టాలు తెలిసి కూడా పెద్దరికం వహించి తను అడగటానికి రావటం తనదే తప్పని చీవాట్లు పెట్టుకుంటూ లేచింది.

ఇంటికి వచ్చేసరికి సూర్యం బట్టలన్నీ వెతికి వెతికి పెట్టెలో సర్దుకుంటున్నాడు. "నా నీలం టెర్లిన్ షర్టు కనిపించటం లేదక్కయ్యా! చాకలికి పడిందంటావా?" అన్నాడు పార్వతి రాగానే.

"మాసిందని ఇచ్చావు కదూ? సబ్బుపెట్టి ఉంచాను. అదేమిటి, బట్టలూ అవీ సర్దుకున్నావు?" ఆశ్చర్యంగా అడిగింది పార్వతి.

సూర్యం ఆ మాట వినిపించనట్టే టవల్సు మడిచి పెట్లో అణచడానికి ప్రయత్నిస్తున్నాడు.

"బైల్దేరే ముందు అడగగూడదుగానీ, ఎక్కడికైనా బయలుదేరుతున్నావా సూర్యం?"

భార్యా భర్తలిద్దరూ ఏ విహార యాత్రకో ప్రయాణమౌతున్నారేమోననిపించింది పార్వతికి.

సూర్యం అదోమాదిరిగా నవ్వాడు. "అడక్కూడదంటూనే అడిగావుగా? ఈ పెట్టి తీసుకెళ్ళి అక్కడ పడేస్తానక్కయ్యా! అక్కడ బట్టలకు ఇబ్బంది అవుతోంది."

పార్వతికేం అర్థం కాలేదు, "ఎక్కడ పడేస్తావు?" అంది.

"బట్టలు మాసినప్పుడల్లా ఎన్ని పనులున్నా ఇక్కడికి రావలసివస్తోంది. పెట్టి అక్కడే ఉంటే అంత ఇబ్బంది ఉండదు."

అదిరిపడింది పార్వతి. "నువ్వు వాళ్ళింట్లోనే ఉంటావా?"

"ఎన్నాళ్ళుండిపోతాను? అప్పుడప్పుడూ వస్తూ ఉండనూ?"

సూటిగా చెప్పకపోయినా తమ్ముడి ఉద్దేశ్యం పూర్తిగా తెలిసిపోయింది. "కాస్త వెనకా ముందూ ఆలోచిస్తున్నావా సూర్యం? నువ్వు లేకుండా నే నొక్కదాన్నీ ఉండగలనా?"

"ఛ! నేనెక్కడికెళతానక్కయ్యా?"

"బట్టలు మార్చుకుందుకైనా రెండు రోజులు కోసారి వస్తున్నావు. ఇక అ అవసరం కూడా లేకపోతే ఇక్కడ నీకేముంది?... ఉద్యోగం మానేస్తానన్నావు, మానేశావు. నా కిష్టం లేకపోయినా నీకు నచ్చిన పెళ్ళి చేసుకున్నావు. నేనూ సంతోషించాను. మామ గారు చదివిస్తోంటే చదువుకుంటున్నావు. నీ పెళ్ళాన్ని ఇక్కడికి తీసుకు రాకపోయినా అక్కడికి వెళ్ళివస్తూనే ఉన్నావు. బాగానే ఉందనుకున్నాను. పోనీ, ఇలాగే జరగనివ్వరాదూ? కాదన్నది ఎవరూ? ఇక నువ్వు కూడా బయలుదేరి వెళ్ళిపోతావా?" పార్వతికి - ఎన్నడూ ఎరగనంత

దుఃఖం ముంచు కొచ్చింది.

"అంత బాధపడతా వెందుకక్కయ్యా? అక్కడికి కాలేజీ దగ్గిర. నా చదువు విషయంలో కూడా మామగారు సహాయం చేస్తుంటారు. కాస్త సౌకర్యంగా ఉంటుందని గానీ... అయినా వారం వారం వస్తూ ఉండనా? ఊరు వదిలి వెళ్ళిపో తున్నానా ఏమిటి, నువ్విలా నిష్ఠూరంగా మాట్లా డ్డానికి? ప్రతీ ఆదివారం రాణీని తీసుకొస్తూనే ఉంటాగా?"

పార్వతి, మాటలు మరిచిపోయిన మని షిలా మూగగా చూస్తూనించుంది.

ప్రతీ ఆదివారం భార్యతో వస్తాడా! తను వంటలు చేసి వడ్డిస్తూ ఉంటే వాళ్ళు పేకాడు కుంటూ కూర్చుని సాయంత్రానికి వెళ్తారా!

సూర్యం ఓ క్షణం వెనకా ముందూ తచ్చా డాడు. బయట నుంచి అరుస్తూన్న రిక్షా అతని మీద "ఏమిటోయ్ ఆ కంగారూ? పోతే పో?" అంటూ విరుచుకుపడ్డాడు.

"ఆలస్యం అయిపోతంది బాబూ! మళ్ళీ నేను సినిమా హాలుదగ్గిరికి పోవాల" అంటూ సంజాయిషీ చెప్పుకున్నాడు అతను.

"అయితే మాత్రం, ఏమిటా అరుపులూ? ఇవతల మా పని తెమలాలా అక్కర్లేదా? సరేలే, ఇలారా! అదిగో, ఆ పెట్టి తీసికెళ్ళి జాగ్రత్తగా పెట్టు!"

"బరువుగా ఉంది బాబూ! కసింత చెయ్యే స్తివా ..."

రిక్షా అతనికి సాయంపట్టి బోషాణం లాంటి బట్టలపెట్టి రిక్షాలోకి ఎక్కించాడు సూర్యం.

"వెళతానక్కయ్యా! రేపొద్దుటే వచ్చి కనిపి స్తాను" అన్నాడు.

అంత బరువు రిక్షా పార్వతి గుండెల మీదుగా కదిలింది.

"సూరీ" అంటూ మొహానికి చేతులు కప్పుకుంది.

"నీకు స్వార్థం లేదక్కయ్యా! స్వార్థమే లేదు! .... నువ్వు దేవతవి అక్కయ్యా! నాకు అమ్మవే! .... అక్కయ్యా, నీ రుణం ఏ నాటికీ తీర్చుకో లేను!" అన్న సూరి! అయ్యో, సూర్యం! ఈ నాటి కింత పరాయి దాన్నయి పోయానా నాయనా? నీ కష్ట సుఖాలు విస్మరించానా? నీ ముద్దు ముచ్చట్లు చూడనన్నానా? నీ సంతో షానికి దుఃఖపడ్డానా? ఏం చేశాను సూర్యం? ఏం చేశానని వెళ్ళి పోయావు?

ఎంత ఏడ్చినా బాధ తీరలేదు! రుక్కూ, సూరీ —తనకు రెండు కళ్ళే అనుకొంది! జీవితం ఇంత విచిత్రమైందని తనకేం తెలుసు? తన నింత అనాధని చేస్తారనా వాళ్ళని పెంచింది? ఇంత దుఃఖం ప్రసాదిస్తారనా తన సుఖాలన్నీ వదులుకుంది? అందరిలా తనకూ సుఖపడటం చేతనైతే? బావురుమంటూ కూలబడిపోయింది పార్వతి.

★ ★ ★

సంభ్రమంగా పేపరు పట్టుకుని తల్లి దగ్గరికి వెళ్ళింది సుజాత. "అమ్మా, నీకో మాట చెప్పేదా?"

"ఏమిటే అదీ? అంత విచిత్రంగా అడుగు తావూ?"

"మరి కోప్పడవు కదూ?"

"చెప్పరాదూ? నీ అనుమానాలూ నువ్వూనూ."

సుజా కాస్సేపు తటపటాయించి చెప్పే సింది. "అక్కయ్యనీ బావ గారినీ మన ప్రభుత్వం వారు విదేశాలు పంపిస్తున్నారటమ్మా! ఇవ్వాళ పేపర్లో పడింది!"

కామేశ్వరమ్మ మొహం చిట్లిస్తూ అంది - "ఈ కబురేనా నువ్వు చెప్పొచ్చింది? సిగ్గు లేదూ? ఆవిడేదో వెలగబెడుతోందని మురిసి ముక్క లౌతున్నావా? ఇల్లు విడిచిపోయింది, దేశాలు తెగించిపోతే విడ్డూరమేమిటీ? ఎలాగో తగల బడుతుంది. నీ కెందుకా గొడవా? అయినా ఈ వెధవ కాయితాలు తెప్పించకురా అని మొత్తు కుంటే వాడు వింటున్నాడా నా మాట? అంతా రాత! ఖర్మ!"

సుజాత నెమ్మదిగా అక్కడనుంచి వెళ్ళి పోయింది. ఆ రోజంతా సుజాత మనస్సు మరీ

ఆందోళనగా అయింది. చంద్రశేఖరం, ఉత్తరాలు రాస్తూనే ఉన్నాడు. తను పరిస్థితులకు బానిసనని మనసు విప్పి ఏ నాడో తెలియజేసింది. అయినా అతను తన ఆశలు విడుచుకోవటానికి అంగీక రించటం లేదు.

"వసు ద్వారా మీ ఇంట్లో జరిగిన సంగతులు నాకు తెలుసు. అక్కగారి అడుగు జాడల్లో నువ్వు నడవగలవన్న ధైర్యంతోనే ఈ స్నేహాన్ని బతికించుకుంటూ వస్తూన్నాను. నువ్వు కాదన్ననాడు, నిజంగా నువ్వు నాకు దూరమైపోయిననాడు, నేనేమైపోతానో నాకు తెలీదు. చచ్చిపోకపోయినా పిచ్చివాణ్ణి కావచ్చు. ఈ కాలంలో సామాన్యమైపోయిన వర్ణాంతర వివాహాన్నే నువ్వింత ఘోరంగా భావిస్తే ఇక నేనేమీ చెప్పలేను."

చంద్రశేఖరం రాతలు సుజాతని పిచ్చిదాన్ని చేస్తున్నాయి. పులిమీద పుట్రలా అన్నయ్య తీసుకొచ్చిన సంబంధం వాళ్ళు త్వరలో నిర్ణయించుకోటానికి వస్తామంటూ ఆ రోజే ఉత్తరం రాశారు.

ఇన్నాళ్ళకు అమ్మ తేలిగ్గా నిట్టూర్చింది. "నాబిడ్డకీ శుభకార్యం జరిగిపోనీ వెంకటేశ్వరా! నూతనదంపతుల్ని తీసుకుని నీ కొండకొస్తాను" అంటూ అందరూ వింటూండగానే చేతులెత్తి మొక్కుకుంది. సుజా, గుండెలు అదిమి పట్టుకుని గదిలోకి నడిచింది.

చంద్రశేఖరం ఆఖరి ఉత్తరం రాశాడు.

అమ్మ ధోరణేమీ మారేటట్టులేదు.

ఏం చెయ్యాలి తను?

సుజా వెర్రిగా తిరిగింది ఇల్లంతా.

గదుల్లో ఎక్కడా లైట్లు లేవు. వదినా అన్నయ్యా ఎటో వెళ్ళినట్టున్నారు. అమ్మ ఏం చేస్తూంది? "అమ్మా" అని పిలుస్తూ పెరటి వేపు వెళ్ళింది. కొంగు చాటున ఏదో అడ్డం పెట్టుకుని నూతి వెనకనుంచి వచ్చేస్తున్న అమ్మ సుజాతను చూడటంతోనే కూలబడిపోయి ఏడవటం మొదలుపెట్టింది.

విస్తుబోతూ సుజా తల్లి దగ్గిరికి వెళ్ళాలో కూడదో తెలీనట్టు నిలబడి పోయింది.

కామేశ్వరమ్మ కొంగు చాటు నించీ పేపరు గాలికి దూరంగా వెళ్ళిపడింది. సుజా గమ్మున దాన్ని అందుకుంది. అంతా అర్థమైపోయింది. అక్కయ్య గురించి పేపర్లో ఏదో ఉందని తను చెప్పినప్పుడు కసిరేసిన అమ్మ, ఒంటరిగా రహస్యంగా నూతి చాటున కనిపించని వెలుగులో ఏదో వెదుక్కుంటోంది పేపర్లో.

"అమ్మా!" అంటూ దగ్గిరిగా కూర్చుంది సుజా.

కామేశ్వరమ్మ కళ్ళు తుడుచుకుంటూ అడిగింది. "అక్కయ్య బొమ్మ లేదే అందులో?"

"లేదమ్మా! వార్త ఒక్కటే వేశారు. బహుశా వాళ్ళు బయల్దేరి వెళ్ళేటప్పుడు ఫోటో కూడా వేస్తారేమో!"

"అక్కయ్య ఎక్కడికి వెళ్తోందసలు?"

"హోల్ వరల్డు టూర్ అంటారమ్మా! దాదాపు ప్రపంచంలో ముఖ్య దేశాలన్నీ తిరుగుతారు. ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించి, మెడికల్ అసోసియేషన్ తరపున పంపిస్తున్నారు. ఆరు నెలల్లో తిరిగి వస్తారు."

"ఎలా వెళ్తారే సుజా? రైళ్ళ లోనే!"

"విమానాల్లో వెళ్తారమ్మా. రైళ్ళల్లో అయితే చాలా రోజులు పడుతుంది కదా? అదీగాక, సముద్రాలు దాటాలి కదా?"

"ఆ పసి ముండని కూడా తీసుకెళతారా ఏమిటి?"

"ఏమో! మన కెలా తెలుస్తుంది? బావగారికి తల్లీవాళ్ళు ఉన్నారు కదా? అక్కడే ఉంచేసి వెళ్తారేమో?"

కామేశ్వరమ్మ మరి మాట్లాడలేదు. అక్కడే కూర్చుని ఎప్పటికో లేచింది.

అక్కయ్య గురించి ఎప్పుడూ మాట్లాడని అమ్మ, అలా మనసు విప్పి అన్నీ అడగడం చిత్రంగా తోచింది సుజాకి.

కామేశ్వరమ్మ కూడా ఎంతో తప్పు పనిచేసిన దానిలా సిగ్గుపడిపోతూ ఇంట్లోకి పోయి పడుకుంది.

అర్ధరాత్రి సుమారు ఒంటి గంట ప్రాంతం! కామేశ్వరమ్మ పడుకున్న గది చాలా చీకటిగా

ఉంది. ఎంత ప్రయత్నించినా నిద్రపట్టని కామే శ్వరమ్మ నిశ్శబ్దంగా ఆలోచిస్తూ పడుకుని ఉంది. పద్మ కోసం ఆ తల్లి ఆలోచించని ఘడియ లేదు. అందర్నీ ధిక్కరించి వెళ్ళి పెళ్ళంటే చేసుకుంది గానీ పద్మ కూడా ఎవర్నీ మరిచిపోదని తల్లి మనస్సుకు తెలుసు. పార్వతి పద్మని చూశానని చెప్పినప్పుడు కూతురు గురించి ఎంతో తెలుసు కోవాలనీ, ఎన్నో అడగాలనీ, ఆవిడ విలవిల్లాడి పోయింది. ఏదో రాక్షస హస్తం ఆమె నోటిని బల వంతంగా మూసివేసింది. విననట్టు నటిస్తూనే కూతురి క్షేమ సమాచారాలన్నీ వింది.

పద్మ గర్భవతిగా ఉందని వింటే, ఆనందం అణుచుకోటానికి అశక్యమైపోయింది. గబ గబా ఏదో గొణుక్కుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది. పద్మ కడుపుతో ఉంది. ఎలా తింటోందో, ఎలా తిరుగుతోందో! అన్న ధ్యాసతో ఆరాటపడింది. ఆడ పిల్ల పుట్టిందని తెలిసినప్పుడు తేలిగ్గా హాయిగా గాలి పీల్చుకుంది, సుఖంగా ప్రస వించిందని. "అదీ కూతుర్ని కంది. దానికీ కష్ట సుఖాలు తెలిసివస్తాయి. తల్లి చేసినట్టే పిల్ల చెయ్యక పోతుందా? తన బిడ్డ ధిక్కరించి పోయి నప్పుడుగాని దానికి తెలిసిరాదు!" అంటూ శపించింది చాలా సేపు. అంతలోనే ఆవిడకో అనుమానం రేగింది. "నేను కాబట్టి తల బద్దలు కొట్టుకుంటున్నాను. పద్మే అయితే, కూతురు ఏం చేసినా ఊరుకుంటుందిగా? ఆ కాలానికి ఎవ్వరేం చేసుకున్నా తప్పుపట్టరేమో! నీకిష్టమైన వాణ్ణి చేసుకో అని తల్లే ఒప్పుకుంటుందిగా!" అని కాస్సేపు విచారించింది.

ఆ రోజే సాయంత్రం ఒక బంధువు వచ్చాడు "అమ్మాయీ!" అని కామేశ్వరమ్మని నోరారా పిలుస్తూ. డెబ్భయ్ ఏళ్ళు దాటిన వాడు. కామేశ్వ రమ్మకి అన్న వరస అవుతాడు. పేదవాడు. పంచాంగాలు చూసి, తిథీ వారాలూ అవీ చెప్పి, బతుకుతూంటాడు. మంచి వాడని పది మంది లోనూ పేరు.

ఆయన్ని చూడగానే కామేశ్వరమ్మకి పుట్టెడు సంతోషం కలిగి "రా అన్నయ్యా!" అని విక సించిన మొహంతో లోపలికి తీసుకువెళ్ళి కూర్చో బెట్టింది. గ్లాసుతో పెరుగుతెచ్చి ఇచ్చింది. అరటి పళ్ళు ఉంటే తెచ్చి పెట్టింది పళ్ళెంలో.

ఆయన సంతోషంగా, "అమ్మా! నీ కూతు రెంత కీర్తి మంతురాలైందమ్మా!" అన్నాడు.

కామేశ్వరమ్మ తెల్లబోయింది.

"ఇంకెవరు? నీ పెద్ద కూతురి మాట! మా వాడు పేపర్లో చదివి వినిపించాడు. ఆనందంతో నా మనసు నిండిపోయిందనుకో! ప్రపంచం అంతా తిరిగి రావడం అంటే మాటలా అమ్మా? ఎంత తెలివైందైతే అంత గౌరవం దొరుకు తుంది!"

"దాని సంగతి ఎందుకులే అన్నయ్యా! అదంతా ఎప్పుడో మరిచి పోయాను. మనల్ని వదిలేసి పోయిన్నాడే అది మన పిల్ల కాదు!"

"ఆఁ...కాదనుకుంటే కాకుండా పోతుందా? మనం వెనకటి వాళ్ళం. మన లాగే నడవమంటే చిన్న వాళ్ళు నడుస్తారామ్మా? మా కాలంలో నాలు గేళ్ళ పిల్లలకే పెళ్ళిళ్ళు చేసే వాళ్ళు. ఇప్ప డలా చేస్తే ఖయిదులో పెడతారు. మార్పులు వస్తున్నాయి. అదీ మంచిదే! మన పిల్ల ఏం నేరం చేసిందని అంత వదిలేసుకోవాలి? తన మన సులో అనురాగం కలిగిన కుర్రవాణ్ణి వివాహ మాడింది. అంతేగామ్మా! అందులో తప్పు పట్ట డానికేముంది? అయిందేదో అయింది. ఇద్దర్నీ పిల్చి నాలుగక్షింతలేస్తే మన తప్పు లేకుండా పోతుంది!"

కామేశ్వరమ్మ నిర్ఘాంత పోతూ చూసింది— "అది జరిగే పని కాదులే అన్నయ్యా! ఆ బంధం ఎప్పుడో తెగిపోయింది!"

"అలా అనెయ్యకు! కాలు జారితే తీసుకో గలంగానీ, నోరు జారితే తీసుకోలేం!"

ఆయన మాటలన్నీ గుర్తొచ్చాయి కామేశ్వ రమ్మకి ఆ అర్ధ రాత్రి వేళ.

అది చేసిన దాంట్లో అంత పెద్దాయనకి తప్పు కనపడ లేదా? తన లాంటి వాళ్ళెన్ని ఆడి పోసుకుంటే మాత్రం అదేం చెడిపోయింది? లోకంలో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుంటోంది.

కోరుకున్న భర్తతో, బిడ్డతో ఆనందంగా ఉంది!

అలమారు దగ్గిరేదో అలికిడైంది. గాజులు ఘల్లుమన్న చప్పుడు వినిపించింది. భయంతో లేచి కూర్చున్న కామేశ్వరమ్మ చీకట్లోకి కళ్ళు చిట్లించి, చిట్లించి చూసింది, అలమారు దగ్గిరే నిలబడిఉన్న వ్యక్తి ఆడ మనిషని మాత్రం గుర్తు తెలుస్తూంది.

"ఎవరదీ?" వణకుతూన్న గొంతుతో అంది.

జవాబు రాలేదు. ఏడుపు బలవంతంగా అణచుకుంటూన్నట్టు వెక్కిళ్ళ చప్పుడు వినిపించింది.

కామేశ్వరమ్మ కేదో అనుమానం కలిగింది. చటుక్కున లేచి తడుముకుంటూ వెళ్ళి లైటు వేసింది.

కుప్పలా కూలబడిపోయింది సుజాత, తల్లి ముందు!

దిగ్భ్రమతో తల్లడిల్లిపోతూ కామేశ్వరమ్మ కూడా నేల మీదకి ఒరిగి కూతుర్ని పొదివి పట్టుకుంది. సుజాత తల్లి ఒడిలో తలదాచుకుని భోరున ఏడ్చింది.

కూతురి వీపు నిమురుతూ అయోమయంగా కూర్చుండిపోయింది కామేశ్వరమ్మ.

గట్టిగా బిగుసుకుంటూన్న సుజా గుప్పిడి పట్టుకుంది. "సుజా! అమ్మా! ఏమిటే ఇదీ!"

సుజా గుప్పిడి విడిపోయింది. గుప్పెడు మాత్రలు రాలి పడ్డాయి. అదిరిపడింది కామేశ్వరమ్మ. "ఇవి నిద్ర మాత్రలు కావూ? ఇవెందుకు తీశావూ? ఎందుకూ?"

వణకుతూన్న కంఠంతో నెమ్మదిగా అంది సుజా. "నీకు... నిద్ర మాత్రలు... ఇవ్వలేదు... జ్ఞాపకం వచ్చి..."

"ఎనిమిది గంటలకే నాకు మాత్రలిచ్చావు. అవి మింగినా నిద్ర రావటం లేదు. నువ్వెలా మరిచిపోయావనుకోనే? ఎందుకమ్మా, ఎందుకు తీశావు?"

"లేదమ్మా? నిజంగా నీ కిద్దామనే..."

"అయితే గుప్పెడు మాత్రలా నాకు? నన్ను చంపేద్దామనుకుంటున్నావా ఏమిటే?... చెప్పు! నువ్వే మింగాలనుకున్నావా?"

భయంతో తల దించేసుకుంది సుజా.

అమాయకురాలైన కూతురు ఎందుకింత సాహసానికి పూనుకుందో అర్థంకాక తల్లి మనస్సు కొట్టుకు లాడింది.

"చెప్పు తల్లీ! నాతో చెప్పవూ? నీకేం కష్టం వచ్చింది? నిన్నెవరే మన్నారు? ఎందుకే అర్ధరాత్రి లేచి ఇలాంటి పని చెయ్యబోయావు?"

మాట్లాడలేదు సుజాత.

"నీ కళ్యాణం కన్నులపండుగులా చూచుకోవాలని కలలు కంటున్నాను. ఎందుకమ్మా ఇంత తెగించావు? నాకు చెప్పు తల్లీ! కడుపులో దాచుకుంటాను. నీకేం కష్టం కలిగింది? నిన్ను నేనేం బాధపెట్టాను?" తల్లి కంఠం రుద్ధమైపోయింది.

"అమ్మా!" బావురుమంది సుజా. "వద్దమ్మా, నన్ను బతకమనకు! నాకు బతకాలని లేదు. బతికి నే నేమీ సుఖపడలేనమ్మా! చచ్చిపోతే హాయిగా ఉంటాను. నిజమేనమ్మా! నాకు బతకాలని లేదు!"

"సుజా! ఏమిటీ పిచ్చి మాటలు? పిచ్చి దానిలా మాట్లాడకు! సంగతేమిటో నాకు చెప్పు! నిన్నెవరు కష్టపెట్టారో చెప్పు!"

"అమ్మా!... నాకీ పెళ్ళి ఇష్టంలేదమ్మా!"

"పెళ్ళి ఇష్టం లేదా? అదా! అందుకా! అందుకా ఇదంతా! ఇష్టంలేకపోతే ఆ సంబంధం మానేస్తాం కదమ్మా? ఆ మాటే చెప్పొచ్చుగా తల్లీ? ఇది గాకపోతే ఇంకోటి చూస్తాం. నీకు నచ్చకపోతే బలవంతంగా చేస్తామా? పిచ్చి దానివా, మంచి దానివా? ఇంత మాత్రానికి చచ్చిపోదామనుకున్నావా? నేను చూడకపోతే ఏమయ్యేది? నిద్ర పట్టక కూచున్నాను గానీ... లేకపోతే? రేపొద్దున్నే చెప్పేస్తాను అన్నయ్యకి. వాళ్ళని రావొద్దని రాయమని చెప్పేస్తాను. ఇది గాకపోతే బోలెడు సంబంధాలు దొరుకుతాయి..."

"వొద్దమ్మా! ఏదీ వొద్దు! నా కసలు పెళ్ళే వొద్దు! నేను నీ దగ్గిరే ఉంటాను. నిన్ను వదిలేసి ఎక్కడికీ వెళ్ళను. నువ్వు పెద్ద దానివై పోతున్నావు.

నిన్ను చూసుకుంటూ ఉంటాను...''

''నేను చచ్చిపోయాక?''

''అన్నయ్య దగ్గిర ఉంటాను.''

''ఇదేం పిచ్చి? ఈ సంబంధం నచ్చకపోతే మానేద్దామని చెప్పాను కదా? నీకు బాగా నచ్చేది చూస్తాం కదమ్మా?''

''వొద్దమ్మా! ఏదీ నచ్చదు నాకు! అసలు సంబంధాలే చూడొద్దని అన్నయ్యకి చెప్పెయ్యి! లేకపోతే నాకు బతకాలని ఉండదు.''

''ఇవేం మాటలే? ఇదేం పిచ్చి? నీకు నచ్చే సంబంధమే చూస్తామంటున్నాను కదా?''

''నచ్చదు, ఏదీ నచ్చదు! మీరు ఎవర్ని తెచ్చినా నాకు నచ్చదు. నా కొద్దు?''

''పిచ్చిదానిలా మాట్లాడుతున్నా వేమిటి? ఎందుకు నచ్చదు? నాకు చెప్పు! ... చెప్పమ్మా!''

''...వొద్దమ్మా, నన్నడక్కు! చెప్తే నీకు చాలా కోపం వస్తుంది. నీ నోటితో నువ్వే నన్ను చచ్చిపొమ్మని తిడతావు! అక్కయ్యని అలాగే తిట్టావు!''

నిర్ఘాంతపోయింది కామేశ్వరమ్మ. ''అక్కయ్యకూ నీకూ పోలికేమిటి? అది జాతీ మతం చూడకుండా పోయింది! నిన్నలా ఎందు కంటాను?''

''అమ్మా!... నన్నడక్కమ్మా! నేనూ అలాంటి దాన్నే! ... నీ కడుపున చెడబుట్టాం!''

స్థాణువులా బిగుసుకు పోయింది కామేశ్వరమ్మ.

''అమ్మా! నా మీద నీకు చాలా కోపం వస్తుంది... అక్కయ్య తప్పుచేసిందని ఇప్పుడు నాకనిపించడం లేదమ్మా! ఎవ్వరైనా సరే కోరుకున్న మనిషినే పెళ్ళి చేసుకోవాలి. ఆనందం అంటే అదే! లేకపోతే పెళ్ళే మానెయ్యాలి! కులాలూ మతాలూ ఎందుకు పెట్టారో గానీ... వాటి వల్ల ఎవరికీ సంతోషం కలగదు... కానీ నేను అక్కయ్య చేసినట్టు ఎప్పుడూ చెయ్యను. నిన్ను బాధపెట్టను. నా మాట నమ్ము!... నన్ను పెళ్ళి చేసుకోమని మాత్రం అడక్కు! నాకిష్టమైన మనిషిని మీరు చెయ్యకపోయినా నేను బాధపడను. నిజంగా బాధపడను. నాకోసం వేరే సంబంధాలు మాత్రం తీసుకురావద్దు! అక్కయ్యాలాగ చేసి మీకు అవమానం కలిగిస్తేనే కదా నన్ను తప్పు పట్టాలి? నే నలా చెయ్యనని చెపుతున్నాను...''

ఎన్నడూ చొరవగా కూడా మాట్లాడని కూతురు అలా నిర్భయంగా మాట్లాడుతోంటే కామేశ్వరమ్మ నిర్ఘాంతపోతూనే వింది — ''నీ కిష్టమైన మనిషా? ఎవరా అబ్బాయి?''

''ఎందుకమ్మా అదంతా?... అలా చెయ్యనని చెప్పేశాను కదా? అతను నా మనసులోనే ఉంటాడు, అంతే! అంతకన్నా ఏమీ జరగదు. అతను మన కులం కాదు. అంతే, అంత కన్నా వివరాలెందుకు? అతని పేరు కూడా మీకు వొద్దు.''

కూతురు మాటలు వింటూ, కూతురి ఆవేశం చూస్తూ, మ్రాన్పడిపోయింది కామేశ్వరమ్మ—'' మన కులం కాదా!... మన కులం కాదా!...'' అని తల్లడిల్లిపోతున్నట్టు చూసింది. చెంపలు తడిసిపోతున్నాయి.

సుజాతకి కళ్ళు నిండిపోయాయి. ''అమ్మా! మనింట్లో మళ్ళీ అలాంటి పని జరగదు. నన్ను నమ్ము! నీ సంతోషం కోసం ఎంత బాధైనా భరిస్తాను. అక్కయ్యలాగ నేను చెయ్యను. నీకు మాట ఇస్తున్నాను.''

''పెళ్ళే చేసుకోనంటున్నావు. అప్పుడు నాకు సంతోషంగా ఉంటుందా?''

''కాదమ్మా! ఈ ఒక్క దానికీ నన్ను అర్థం చేసుకో! ఇష్టమైన పెళ్ళి చేసుకోడానికి హక్కు లేదంటారు. పెళ్ళి మానెయ్యడానికి కూడా హక్కు లేదా? ఇష్టం లేకపోయినా మీరు తెచ్చే మనిషిని చేసుకుని ఏడుస్తూ బతకాలా? అలా చేస్తే ఆ మనిషిని కూడా మోసం చేసినట్టు కాదూ? అదేం న్యాయం? అందుకే పెళ్ళే వొద్దంటున్నాను.''

''పెళ్ళి లేకుండా ఇంట్లో ఉండిపోతే నలుగురూ ఏమంటారు? అందరూ నన్నడగరూ?''

''అడుగుతారు. 'అది చేసుకోనంటోంది, దానికి ఇష్టం లేకుండా చెయ్యలేం కదా అని ఊరుకున్నాం' అని చెప్పొచ్చమ్మా!''

''ఎందుకు ఇష్టం లేదూ —అని అడ గరూ?''

"అడిగితే అడుగుతారు. ప్రతీ దానికీ చెపుతామా? చెప్పాలా?"

కూతురు మాట్లాడే మాట మాటకీ తల్లి తెల్లబోతోంది. "ఎన్ని మాటలు మాట్లాడుతున్నావే! ఎప్పుడైనా ఇలా మాట్లాడావా?"

"ఏమో! ఇప్పుడు ఇలాగే మాట్లాడాలనిపిస్తోంది. రేపు నువ్వు అన్నయ్యకి గట్టిగా చెప్పేస్తావు కదా? సుజాకి పెళ్ళి ఇష్టం లేదట, దానికి ఏ సంబంధాలూ చూడొద్దు' అని చెప్పేస్తావు కదూ అమ్మా?"

"అన్నయ్యకి చాలా కోపం వస్తుంది!"

"అవును, అందరికీ కోపాలు వస్తాయి. ఏ కోపాలూ రాకూడనిది నాకే! నిష్కారణంగా నా చదువు మానిపించాడు. అయినా నేను భరించాను. ఇక, నా పెళ్ళి కూడా ఆయన ఇష్టమేనా? అందుకే కదా ఈ బాధలేవీ లేకుండా నిద్ర మాత్రలే శరణ్యం అనుకున్నాను. అదీ వల్ల కాదంటావు నువ్వు! నేనేం చేస్తానో నాకే తెలియడం లేదమ్మా!"

"ఏవిటమ్మా ఈ మాటలు? అప్పుడు మాత్రం నలుగురూ నన్నడగరూ? పిల్ల ఎందుకిలా చేసిందని అడగరూ?"

"నిన్నటి దాకా అలా ఆలోచించాను గానీ, అలా కూడా చెయ్యను. నీకు చెప్పేశాక నాకెంతో తేలిగ్గా ఉంది. నాకూ బతకాలనే ఉంది. పెళ్ళి చూపులనీ అదనీ ఇదనీ నన్ను బాధపెట్టొద్దు! నేను మళ్ళీ చదువుకుంటాను. లేకపోతే వీణ నేర్చుకుంటాను. నీ దగ్గిరే ఏ బెంగా లేకుండా ఉంటాను..."

"కాదమ్మా, చెప్పు! ఆ కుర్రాడెవరు?"

"వొద్దమ్మా! మర్చిపో! నే నలా చెయ్యనని చెప్పాను కదా? నన్ను నమ్ము! నీకు మాట ఇచ్చాను కదా అమ్మా?"

"కాదు, చెప్పు! ఆ అబ్బాయి నీ కెలా తెలుసు?"

"మన కులం కాదని చెప్పాను కదా? మిగతా వివరాలెందుకు?"

"కులం కాకపోతే పోయిందిలే! నీకు అదే ఇష్టమైతే నే నెందుకు కాదనాలి? నేను ఇవ్వాళ ఉండి రేపు పోతాను. నూరేళ్ళూ బతకవలసిన దానివి నువ్వు! నువ్వు మోడు లాగ పడివుంటే నే నెలా భరిస్తాను?... అసలు అక్కయ్య మాత్రం నాతో చెప్పిందా? తన మనసులో మాట నాకు చెప్పెయ్య కూడదూ? నేను ఒప్పుకోకపోతే నాతో పోట్లాడకపోయిందా? అది చెప్తే నాకు నచ్చేదేమో! చెప్పకపోతే నాకేం తెలుస్తుంది? చదువా సంధ్యా? మీ నాన్న అయినా నాకు చెప్పొద్దూ? 'ఇదుగో కాముడూ, పద్మ ఇలా అంటోంది. దానికి ఇష్టమైన పెళ్ళే దానికి చేద్దాం' అని చెప్పొద్దూ? ఆయన చెప్తే నేను కాదంటానా? ఆయన కన్నా ఎక్కువ తెలుసా నాకు? ఇంత కాలం పాటు పిల్లని దూరం చేసుకున్నాను కదా? అక్కయ్య మాత్రం అతన్ని తీసుకుని ఒక సారి రాకూడదామ్మా? గుమ్మంలోకి వచ్చిన దాన్ని పొమ్మంటానా? అంత జ్ఞానం లేదా నాకు?... నువ్వు మాత్రం ఎంత అఘాయిత్యం చెయ్యబోయావు! నేను చూడకపోతే ఏమయ్యేది? ఈ పాటికి అంతా అయిపోయేది. సీసాలో మిగి లిన మాత్రలు నేను మింగేదాన్ని. అందరం కట్ట కట్టుకుని పోతే సరిపోతుంది. మీకు మీరే పెద్దలమ్మా! తల్లి ఉందనీ, తల్లికి చెప్పుకుందామనీ లేదు. మనసులో మాట చెప్తే ఏ మంటాను? నాలుగు చివాట్లేస్తే వేస్తాను. ఏం, తల్లి అనకూడదా, పిల్లలు పడకూడదా? చివాట్లేస్తే నీ ఒళ్ళు చిల్లులు పడిపోతుందా? నన్ను అల్లరి పెట్టడానికి కాకపోతే, గుప్పెడు మాత్రలు తీసుకుని మింగాలనుకున్నావా?"

తల్లి మాటలు వింటోంటే సుజాత కళ్ళు చెరువులైపోతున్నాయి — "అమ్మా, అమ్మా! నువ్విలా మాట్లాడతావనుకోలేదమ్మా! చావు తప్ప ఇంకో దారి లేదనుకున్నాను..."

"పిల్లల్ని కనిపెంచేది వాళ్ళని చంపేసుకోడానికామ్మా? మీకూ పిల్లలు పుట్టి పెరుగుతోంటే అప్పుడు తెలుస్తుంది మీకు. అది ఇల్లు వదిలేసి పోయింది. నువ్వు చావుకి సిద్ధమయ్యావు. ఇక నేను బతకాలా మోడు లాగ? నే నెందుకు మిమ్మల్ని హింసపెట్టాలి? 'ఈ తల్లి కడుపున ఎందుకు పుట్టామా' అని మీరు భోరుమని ఏడ్చే

లాగ నే నెందుకు చేసుకోవాలి? నీకు ఎలా కావాలంటే అలా చేసుకోమ్మా! రేపే అన్నయ్యకి చెపుతాను! సుజాకి సంబంధాలేవీ చూడకు! దానికి నచ్చిన వాణ్ణి అదే 'ఎంచుకుంది' అని చెపుతాను. నీ కిష్టమైనట్టే చేసుకో! నాలుగు అక్షింతలు వేస్తాం. అంత కన్నా మాకేం కావాలి?''

"అమ్మా!'' అంది సుజాత, జల జలా కన్నీళ్ళు రాలాయి. అమ్మ, బాధతో తల్లడిల్లిపో తుందేమో అనుకుంది. నిరాశతో కుంగిపోతుం దేమో అనుకుంది. అసహ్యంతో వొదిలేస్తుం దేమో అనుకుంది. ఏదీ కాదు! ఎంత వింతగా మాట్లాడుతోందో అమ్మ!

"అమ్మా వద్దమ్మా! నేను బాధతో చెప్పడం లేదు. నే నలా చెయ్యను. నన్ను నమ్ము! రోజూ నిన్ను చూస్తూ, నీ పనులు చేస్తూ సంతోషంగా ఉంటాను. నువ్వు లేకపోయినా నీ ఫోటోకి పూజ చేసుకుంటూ సంతోషంగా బతుకుతాను. అంత కన్నా నాకేం వొద్దు!''

"పిచ్చిదానా! నువ్వు నా కళ్ళముందు మోడు లాగా పడివుంటే నేను సంతోషంగా ఉంటానా అమ్మా? అక్కయ్యలాగే నువ్వూ నీ కిష్టమైన వాడినే పెళ్ళి చేసుకుని పిల్లా జెల్లాతో సంతో షంగా ఉండు! అదే నాకూ సంతోషం!''

"... మన బంధువులూ వాళ్ళూ ఏమన్నా అనుకుంటే నీకు బాధగా ఉంటుంది కదమ్మా!''

"ఉంటే ఉంటుంది. నువ్వు పెళ్ళి చేసు కోకుండా ఉంటే అది ఇంకా బాధమ్మా నాకు. 'ఈ చాదస్తాలన్నీ ఎందుక'ని మీ నాన్న ఎప్పుడూ అనేవారు. ఆయన మాత్రం చాదస్తంగా లేరూ? పెద్ద దాన్ని ఆయనే పిలిచి నాలుగక్షింత లెయ్యకపోయారా?''

సుజాత, తన చెవుల్ని తను నమ్మలేకపో తోంది— "అన్నయ్య ఒప్పుకుంటాడామ్మా?''

"ఎందుకొప్పుకోడూ? అయినా ఒకళ్ళు ఒప్పుకునే దేవిటమ్మా? నీ కష్ట సుఖాలు నువ్వు ఆలోచించుకోవాలి గానీ...''

"అమ్మా! నా మీద కోపంగా ఉండి ఇలా మాట్లాడుతున్నావు కదూ?''

"కోపం ఎందుకమ్మా? పది కాలాలు బతక వలసిన వాళ్ళు మీరు! ఈ తెలివి ఆ నాడే ఉంటే నాన్న కూడా సంతోషంతో బతికి ఉండేవారేమో! నా దుఃఖం చూసి ఆయన ఓర్చుకోలేకపోయారు. ఆయన్ని చేతులారా నేనే చంపుకున్నాను!''

"... అక్కయ్యని రమ్మని రాయనా అమ్మా!''

"వొస్తుందా అది? దానికెంత తలపొగరు!''

"కాదమ్మా, అలా అనొద్దు! నిన్ను బాధపెట్ట కూడదని అక్కయ్య దూరంగా ఉంది.''

"ఏడిసిందిలే! కన్న బిడ్డ గుమ్మంలోకి వొస్తే తల్లి బాధపడుతుందా, సంతోషిస్తుందా? చదివారు చదువులు, ఎందుకూ?''

"అమ్మా, వెయ్యి జన్మలకైనా అక్కయ్యా నేనూ నీ కడుపునే పుడతాం అమ్మా!''

కన్నీళ్ళతో సుజాత మొహం కళ కళ్ళాడి పోయింది.

★ ★ ★

**చె**వుల మీదుగా ముసుగు వేసుకుని ఒళ్ళంతా పాత చీర కప్పుకుని కాళ్ళు నేల మీద ఆన్చుకుని నులక మంచం మీద కళ్ళుమూసు కుని కూర్చుని ఉంది పార్వతి. అలా ఎంత సేపటి నుంచి కూర్చొని ఉందో ఆమెకే తెలీదు. రెండు రోజుల నించీ జ్వరం! పచ్చి మంచి నీళ్ళు కూడా ముట్టుకోలేదు. రెండు రోజుల నించీ పొయ్యే అంటించలేదు.

సాయంత్రం కను చీకటి పడుతోంది. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. శ్మశానంలా ఉంది. రెండురోజుల నించీ ఆ ఇంటి తలుపులు తెరు చుకోలేదు. ఇంటికీ బయటికీ పూర్తిగా సంబం ధాలు తెగిపోయినట్టుంది. ఇక లోకంలో తనకే బాంధవ్యమూ లేదేమోననిపిస్తోందామెకు, ఆ క్షణాల్లో!

నిట్టూర్చడం కూడ కష్టమైపోయింది. తల కిందికి దించుకుని అలాగే కూర్చుని ఉన్న పార్వతి ఏదో అలికిడిని గ్రహించగలిగినట్టు నెమ్మదిగా తల ఎత్తింది. వీధి తలుపులకేసి చూసింది. చూస్తోనే ఉంది. వరండాలో ఎవరో నించున్నట్టూ, బరువుగా గాలి పీల్చుకుంటు న్నట్టూ... భ్రమో ఏమో... అనిపించింది.

కప్పుకున్న చీర సర్దుకుంటూ అలాగే కూర్చుంది... తలుపుల ముందు అడుగుల చప్పుడు, మళ్ళీ!

నీరసంగా లేచింది. ముసుగు జారుతోంటే తడబడే అడుగులతో నడిచింది. గదిలో చీకటి! వరండాలో చీకటి!

నెమ్మదిగా తలుపులు తీసింది. తన భ్రమ భ్రమ కానందుకు విస్తుపోయింది.

ఎవరో నిలబడి ఉన్నారు! ఒత్తుగా పెరిగిన గడ్డం, వదులుగా వేళ్ళాడే బట్టలూ, అతని రూపాన్ని దాచడానికి ప్రయత్నిస్తున్నాయి. అత నెవరో స్పష్టంగా తెలియడం లేదు. కానీ, పార్వతి పోల్చింది.

"నువ్వా... రఘుబాబూ?"

"................................"

"నువ్వేనా రఘూ? ఇదేమిటి?... ఇలా వచ్చావు?"

"ఆఁ... వచ్చాను..."

"... ఏదన్నా పని మీద వచ్చావా?"

"................................"

"నాకు బాగాలేదు. నీరసంగా ఉంది. నిల బడలేను... లోపలికి వస్తావా?"

"ఎందుకు బాగాలేదు?"

"కొంచెం జ్వరం... అంతే!"

"ఏం తిన్నావు?"

"... ఏదో తిన్నాను."

"ఎవరూ లేరా ఇంట్లో?"

"ఎవరు ఉంటారు?"

చీకటిని చీల్చేందుకు చిన్న దీపమైనా వెలి గిద్దామనుకుంది. నీరసంగా వంటింట్లోకి నడి చింది. చీకట్లో తడుముళ్ళాడి లాంతరు పట్టు కుంది. అగ్గిపెట్టె పట్టుకుంది. దీపం వెలిగిచింది. అది చేతిలోది చేతిలోనే ఆరిపోయింది. మళ్ళీ వెలిగించింది. మళ్ళీ ఆరిపోయింది. నూనె లేదు. అది రెండు రోజుల కిందటి నాటి రాత్రి వెలిగి వెలిగి కొడిగట్టి ఆరిపోయింది. నూనె పోసే ఓపిక లేక దాన్ని అక్కడే వదిలేసి గదిలోకి వచ్చింది.

చీకట్లో బల్ల మీదకూర్చుని ఉన్నాడు రఘు!

"దీపంలో నూనె లేదు!"

"...ఫర్వాలేదు... ఇప్పుడు అదంతా ఎందుకు?"

నీరసంగా మంచం మీద కూర్చుంది.

"ఈ పూట ఏం తిన్నావు పారూ?"

"... ఇందాకే జావ తాగాను."

"ఇంకా ఉందా జ్వరం?"

"ఫర్వాలేదు. తగ్గింది."

"సూర్యం ఇక్కడ ఉండడం లేదా?"

"ఆఁ... ఉండడం లేదు."

సందె వెన్నెల గుడ్డి గుడ్డిగా వరండాలో పడుతోంది.

గది ఎప్పటిలా నిశ్శబ్దంగా అయిపోయింది.

సుశీల పోయాక... పార్వతి రఘుని చూడ లేదు. అతను కనపడితే చాలా అడగాలనుకుంది చాలా సార్లు.

సుశీల గుర్తొస్తే మనసంతా కలిచి వేసి నట్టయిపోతుంది పార్వతికి. ఎప్పటికో తలె త్తింది. వేడి కన్నీటి బొట్లు పాత చీరలో రాలి పడ్డాయి.

"సుశీల చచ్చిపోయింది. ఆ సంగతి తెలుసా నీకు?" పార్వతి స్వరం హఠాత్తుగా కోపంగా పలికింది.

"................................"

"ఎందుకు చచ్చిపోయింది?" పార్వతి స్వరంలో ఆవేశం పెరిగింది. "ఎందుకు చచ్చి పోయింది రఘూ?"

"నాకు తెలీదు పార్వతీ! ఏదో జబ్బు చేసింది!"

చీకట్లో ఎర్రగా చూసిన పార్వతి చూపుకి రఘుబాబు చలించలేదు. కదలని విగ్రహంలా బల్లకు అంటుకుపోయాడు.

"రఘూ!" పార్వతి పిలుపులో స్పష్టమైన తీవ్రత! పార్వతి గొంతులో చిత్రమైన ఆవేశం!

రఘుబాబు సూటిగా చూడలేకపోయాడు. చూడటానికి ప్రయత్నించలేకపోయాడు.

"నీకు కోపం వస్తోంది పార్వతీ! నేనేం చెయ్యను?"

"ఏం చేస్తావా? కనిపించే ప్రతీ ఆడదాని కంఠానికీ ఉరి బిగించి చంపెయ్! చంపెయ్ రఘూ! అది నువ్వు బాగా చెయ్యగలవు!"

"................................"

"సుశీల ఎందుకు చచ్చిపోయిందో నాకు తెలుసు. ఎవరు చంపేశారో కూడా నాకు తెలుసు. జీవించాలనే కోరికలేని మనిషి చావటంలో ఆశ్చర్యం లేదు. నీ అంతరాత్మని ప్రశ్నించుకో ఒక్క సారి! సుశీల ఎందుకు చచ్చిపోయిందో నీకు తెలియదూ? అంత జబ్బెందుకు చేసిందో నీకు తెలి యదూ?

"................................"

"మాట్లాడవేం రఘుబాబూ? సుశీలని ఏ నాడయినా భార్యగా ఆదరించావా? తోటి మనిషి మీద చూపవలసిన కనీసపు సానుభూతైనా చూపించావా? మాట్లాడు రఘూ! ఇప్పటికైనా నీ మనస్సు విప్పి చెప్పు! ఇప్పటి కైనా ..."

"... లేదు పార్వతీ! ... సుశీలని పెళ్ళి చేసుకున్నందుకు ఏడవని రోజు లేదు. సుశీలను నేను కోరి బాధించకపోయినా, తను బాధతో మగ్గిపోతోందని నాకు తెలుసు. దానికి బాధ్యత నాదేనని కూడా నాకు తెలుసు. కానీ పార్వతీ! సుశీలని ఓదార్చేపాటి సానుభూతి కూడా ఈ మనసులో కరువై పోయింది. నా కోసం కలవరిస్తోన్న మనిషి కోసం నే నేమీ చెయ్యలేదు. అప్పుడూ ఇప్పుడూ కూడా!"

పార్వతి ఆశ్చర్యపోయింది. రఘు ఏ నాడైనా అన్ని మాటలు మాట్లాడాడా? "అప్పుడూ ఇప్పుడూనా?... 'అప్పుడు' అంటే?"

"నా పెళ్ళయినప్పుడు! అప్పుడు నా మనస్సు నా ఆధీనంలో ఉందని భ్రమ పడ్డాను. తల్లి దండ్రుల్ని ఆనందపెడితే నేనూ ఆనందంగా ఉంటానని అపోహ పడ్డాను!"

"అది భ్రమా కాదు, అపోహా కాదు. అహంకారం! డబ్బు ఉందన్న అహంకారం! కట్నం ఇచ్చి మీ తల్లిదండ్రుల్ని సంతోష పెట్టమని అడిగావు. గుర్తు వుందా?"

"నేను చేసిందంతా తప్పే పార్వతీ!"

"ఆ తప్పు ఎంత పెద్ద తప్పో ఇప్పటికీ గ్రహించి ఉండవు."

"పార్వతీ!" రఘు కంఠం దీనంగా ధ్వనించింది. "గ్రహించాను పార్వతీ! నీకూ సుశీలకి కూడా అన్యాయం చేశాను. నాకు నేను అంత కన్నా అన్యాయం చేసుకున్నాను!"

"నీకు నువ్వు చేసుకుంటే నువ్వే అనుభవించు! మాకు చేసిన దానికి మేము అనుభవించాం కదా?"

"క్షమించు పార్వతీ! నా తప్పుని ఇప్పటికైనా దిద్దుకోవాలనిపిస్తోంది. ఈ దౌర్భాగ్యుణ్ణి క్షమించలేవా పార్వతీ?"

పార్వతి వెటకారంగా నవ్వింది. "నీ దౌర్భాగ్యం ప్రసక్తి నా దగ్గిర తీసుకురాకు! రెండు నిండు జీవితాలతో చెలగాటా లాడావు! సుశీల లాగే నేను కూడా పోయాక అప్పుడు... తీరిగ్గా క్షమాపణలు అడిగితే ఇంకా బాగుండేది!"

"పార్వతీ! నేను ఎంత సిగ్గుతో చితికి పోతున్నానో నీకు చెప్పుకోలేక పోతున్నాను ... ఈ పూట మొండి ధైర్యం చేసి వచ్చాను. నీతో మాట్లాడితే నా మనసు కొంచెమన్నా తేలిక పడుతుందని వచ్చాను."

"నీ మనసు ఎప్పుడూ తేలిగ్గానే ఉంది. నీ తల్లిదండ్రులు ఇంకో సంబంధం చూస్తారు. కట్న కానుకలతో మేళ తాళాలతో మళ్ళీ పెళ్ళి చేస్తారు! నాలాటి ఇరుగుపొరుగుల్ని దర్పంగా వచ్చి పేరంటానికి పిలుస్తారు. నా సిగ్గు మాలిన తనంతో నేనూ పేరంటానికి వస్తాను... మళ్ళీ పెళ్ళి కొడుకయ్యే సందడితో ఉండు! అంత విచారం ఎందుకు? ఈ సారైనా సుశీల గతి ఆ పిల్లకి పట్టించకు!"

ఎంతోసేపు నిశ్శబ్దం ఇద్దరి మధ్యా!

"నన్ను క్షమించు పారూ! ఒక్క సారి ఆ మాట చెప్పు!"

"అసలు నువ్వేం తప్పుచేశావని అన్ని సార్లు అడుగుతున్నావు? నన్ను పెళ్ళి చేసుకుంటానని నువ్వేమైనా నాకు వాగ్దానం చేశావా? వాగ్దానం తప్పావా? ఇక నీ తప్పేముంది? నేనే నీ మీద ఆశ పెట్టుకున్నాను. అది నా తప్పుగానీ... నీ జీవితం నీ ఇష్టం! నీకు ఎలా కావాలంటే అలా నడిచావు! ఇందులో నాకు చేసిన అన్యాయం ఏముంది?"

" నేను నీకు నోటితో వాగ్దానాలు చెయ్యలేదు గానీ, మనసుతో చాలా వాగ్దానాలు

చేశాను. ఆ వాగ్దానాలు నిలబెట్టుకోలేక నాకు నేనే అన్యాయం చేసుకున్నాను. నిన్ను క్షమించమని అడగడానికి కూడా నాకు సిగ్గుగా ఉంది. అడగకుండా ఉండడం కూడా అసాధ్యం పార్వతీ! నువ్వు ఎలా నిందించినా నేను నోరెత్తను! నాకా అర్హత లేదు! క్షమించానని ఒక్క మాట చెప్పలేవా?"

"ఏమిటీ మాటలు? నేను క్షమిస్తే ఎంతా, క్షమించకపోతే ఎంతా? అదంతా ఎందుకు ఇప్పుడు? జీవితం అంతా ఇప్పటికే శూన్యంగా అయిపోయింది! దీనికి ఇంత కన్నా హాని ఏమైనా జరుగుతుందా? ఆ నాటి నించీ ఈ నాటి వరకూ నీ గురించి నేనేమీ ఆలోచించలేదు.

నీ ఇష్ట ప్రకారం నువ్వు నడిచావు. నీ జీవితం నీ ఇష్టం! దాని కోసం ఇన్ని సార్లు క్షమాపణలు అడగడం ఎందుకు?... వెళ్ళు రఘుబాబూ!"

" పార్వతీ! పద్మజ సాహసం విన్నాకే నా తప్పు నాకు తెలిసింది. ఇక నించీ నీ లాగే నేనూ మోడులా బతుకుతాను. మళ్ళీ మళ్ళీ పెళ్ళిళ్ళు చేసుకుంటా ననుకుంటున్నావా? ఒక సారి చేసిన తప్పు దిద్దుకోవడానికే ఈ జీవితం చాలదు. నాకు నిజం పెళ్ళి ఎప్పుడోనే అయింది. నువ్వే నా భార్యవి! ఆ కలల తోటే బతుకుతాను. నీ ముందు నా తప్పు ఒప్పుకున్నాను. ఇక సంతోషంగా బతుకుతాను. వెయ్యి జన్మలకైనా నీ కోసం ఎదురుచూస్తూ బతుకుతాను. వెళ్తాను పారూ, వెళ్తాను."

హఠాత్తుగా చీకటి గది మూగ బోయింది. ఆ ఇద్దరి మధ్యా మరే మాటలు జరగలేదు. నిట్టూర్పుల శబ్దాలు కూడా లేవు.

సందె వెన్నెల మాసిపోయింది. చీకటి గది, మరీ చీకటైంది.

లేచాడు రఘుబాబు ఎప్పటికో! నిర్జీవంగా నడిచాడు —— చీకటి గదిలోంచి, చిమ్మ చీకటి లోకంలోకి!

దుఃఖం పొంగి వచ్చింది పార్వతికి!

నిస్తేజమైన దృక్కులతో ఆ కారు చీకటి లోకి తరచి తరచి చూసింది. ఏమీ కనిపించ లేదు. నిట్టూర్చింది పార్వతి.

**పద్మా!**

రఘుబాబు ఇప్పుడే వచ్చివెళ్ళాడు! క్షమాపణలు కోరాడు మళ్ళీ మళ్ళీ! నాకు చాలా అన్యాయం చేశానన్నాడు. తనకు తానే అన్యాయం చేసుకున్నానన్నాడు! ఎన్ని జన్మల వరకైనా నా కోసమే ఎదురు చూస్తానన్నాడు. నా కేమనిపించిందంటే అతను పిరికివాడే, బలహీనుడే, మూర్ఖుడే! కానీ, మోసగాడు కాదు! దుర్మార్గుడు కాదు!... ఇదే నాకు తృప్తిగా అనిపించింది. ఈ ఆలోచనతో కొంచెం సంతోషం కలిగింది. నేను అతని మనసులో ఉన్నాననిపిస్తోంది. కానీ, నా మనసులో అతను లేడు! ఎప్పుడు అంతర్ధానమై పోయాడో నాకే తెలీదు! పోయింది అదంతా! పద్మా! రఘుని క్షమించాలనిపించడం లేదు నాకు! ఇప్పటికి మాత్రం నాకు అలా అనిపించడం లేదు. చిన్న పిల్ల నెవరి నైనా పెంచుకుందామా అని ఆలోచన కలుగుతోంది అప్పుడప్పుడూ! నువ్వు విదేశాల నించీ వచ్చే దాకా నీ కూతుర్ని నేను పెంచుతాను, నా దగ్గర వుంచరాదూ పద్మా!..."

మనసులోనే అదంతా రాసేసింది పార్వతి పద్మకి!

రఘు మనసులో తను ఎప్పుడూ వుందా?

ఎప్పుడూ వుంటే....?

అయ్యో! ఎంత అశక్తుడు!

మనసంతా నిండిపోయిన ఆలోచనలతో, నిశ్చలంగా కూర్చుని ఉందా స్త్రీ!

# అయిపోయింది!

# చివరి మాట

[ఇది, 8 వ ముద్రణ సమయంలో, 2002 డిసెంబరులో రాసిన ముందు మాటలో భాగం. ఈ భాగాన్ని ముందు మాటలో నించి తీసివేసి, పుస్తకంలో చివరికి చేర్చే పని, 9 వ ముద్రణ సమయంలో, 2008 డిసెంబరులో చేశాను. ఈ భాగాన్ని చివర్లోనే చదవాలి.]

**ఈ** 'స్త్రీ' నవలని 1965లో రాశాను. ఇప్పుడు ఇది **8** వ ముద్రణ. ఒక ముద్రణ కాపీలు అయిపోగానే వెంటనే రీ ప్రింటు చెయ్యడం ఈ పుస్తకానికి ఎప్పుడూ జరగలేదు. ప్రతీ సారీ రీ ప్రింటు పని ఆలస్యం అవుతూనే వచ్చింది. ఇప్పుడు కూడా అలాగే జరిగింది.

ఈ నవలకి **5** వ ముద్రణ సమయంలో ఒక సారీ, **7** వ ముద్రణ సమయంలో ఇంకో సారీ చిన్న చిన్న కొత్త ముందు మాటలు రాశాను. ఆ గత ముందు మాటల్ని ఇక్కడ పూర్తిగా గాక, వాటిల్లో నించి కొన్ని పేరాల్ని మాత్రమే ఇస్తున్నాను.

ఆ తర్వాత ఇప్పుడు చెప్పదల్చిన అంశాలు చెపుతాను.

✳ **5 వ ముద్రణకు రాసిన 'కొత్త ముందు మాట' నించీ :**

"నేను, ఈ మధ్య కాలంలో నా పుస్తకాలు రీ ప్రింట్లు అయ్యేటప్పుడు అవసరమైతే 'కొత్త ముందు మాటలు' రాస్తున్నాను. ఈ నవలకు కూడా ఆ అవసరం ఉంటుందేమోనని దీన్ని శ్రద్ధగా చదివాను.

కథావస్తువులో 'అభివృద్ధి నిరోధకమైన' అంశాలేమీ లేవు. ప్రధాన పాత్రలు 'ఆదర్శ వంతంగానే' ఉన్నాయి. పద్మజ అభ్యుదయ భావాలతో ప్రవర్తించింది. పార్వతి కూడా కథ పొడుగునా సంస్కారం తోటీ, ఆత్మగౌరవం తోటీ ప్రవర్తించింది.

అయితే, సంభాషణల్లో కొన్ని చోట్ల 'చాలా అసహజత్వం' కనపడింది. ఒక నవల, 'మంచి నవల'గా లెక్కకు రావాలంటే, సంభాషణలు సహజంగా లేకపోవడం ఒక లోపం గానే ఉంటుంది. ఆ లోపం ఈ నవలలో కొన్ని చోట్ల కనపడింది.

అంతే కాక —— కొన్ని సందర్భాల్లో చిన్న చిన్న అభిప్రాయాలు సరిదిద్దుకోవలసినవిగా ఉన్నాయి.

పద్మజ తన పెళ్ళి వ్యవహారం గురించి తండ్రితో మాట్లాడే సందర్భంలో తండ్రి వాదనకు జవాబుగా ఒక చోట, "ఈ నాడు బ్రాహ్మణ్యపు పవిత్రత చాలా వరకు అంతరించి పోయింది. శ్రోత్రీయ కుటుంబాలలో పుట్టి పెరిగిన బ్రాహ్మణులే మద్య మాంసాలకూ, అనాచారాలకూ దాసులై పోయారన్న సంగతి అందరికీ తెలిసిన నిజం" అంటుంది. అంటే, ఈ మాటల్లో "పూర్వం బ్రాహ్మణ కులం మాంసాహారం వంటి అనాచారాలు లేకపోవడం వల్ల పవిత్రంగా ఉండేది. ఈ నాడు ఆ పవిత్రత అంతరించిపోయింది" అనే అర్థం వస్తోంది.

అంటే, మాంసాహారం తినడం 'అపవిత్రత' అనీ, తినకపోతే 'పవిత్రత' అనీ, చెప్పినట్టు అయింది. అలా గాకుండా — "బ్రాహ్మణ కులంలో కూడా ఈ నాడు ఆహారపు టలవాట్లు మారి పోతున్నాయి" అని చెప్పినట్టయితే అది సరిగా ఉండేది. "బ్రాహ్మణ్యపు పవిత్రత" అనే మాట వాడడం వల్ల అది అపార్థాలకు దారితీస్తుంది.

ఇంకో విషయం: ఒక సందర్భంలో జార్జి ఆవేశంగా ప్రవర్తించినందుకు పద్మజ ఇష్టపడి — "జార్జిలో పసితనమే కాదు, పురుషత్వం కూడా ఉంది" అనుకుంటుంది. "పురుషత్వం, మగసిరి" లాంటి మాటలు వాడటం ఈ నాడు నాకు చాలా అసహ్యం. సందర్భాన్నిబట్టి ఆవేశంగా ప్రవర్తించడం పురుషులూ చేస్తారు, స్త్రీలూ చేస్తారు. 'ఆవేశం' 'కోపం' 'సాహసం' లాంటి లక్షణాలు పురుషులకే ఉంటాయనీ, ఆ లక్షణాలతో ప్రవర్తిస్తే అది పురుషత్వమనీ భావిస్తూ ఉంటాము. అలాంటి తప్పు భావాల వల్లనే ఆవేశంగా ప్రవర్తించడాన్ని పురుషత్వంగా వ్యక్తం చేశాను నేను. 'స్త్రీత్వం, పురుషత్వం' అనే మాటల్ని కేవలం ప్రకృతి సహజంగా వుండే శారీరకమైన లక్షణాలకు వాడడం ఒక్కటే సరైనది. — ఇలాంటి పొరపాట్లు ఈ రచనలో కొన్ని ఉన్నాయి. వాటిని పాఠకులు సరైన అవగాహనతో సరిదిద్దుకోవాలి.

✳ **7** వ ముద్రణకు రాసిన 'కొత్త ముందు మాట' నించీ :

ఇప్పుడు ఈ పుస్తకం మళ్ళీ చదివాను. కథావస్తువు 'మంచిదే'. కానీ, 'శైలి' విషయంలో అసంతృప్తి గతంలోకన్నా పెరిగింది. అయినా దానితోనే సరిపెట్టుకోవాలి. చేసేదేమీ లేదు.

'రాజకుమారి రీవీ', 'హుందా'లాంటి మాటలు కొన్ని తీసేశాను. ఇలా కొన్ని మాటలు తీసి వెయ్యడం అంటే, "ఈ పుస్తకం మొదట రాసినప్పుడే నేను అన్నీ మంచి భావాలతోనే రాశాను" అని చూపించాలని నా ఉద్దేశ్యం కాదు. అన్నీ మంచి భావాలే ఇవ్వడం అప్పుడు నాకు చేతకాలేదు, నేనే కొన్ని తప్పు భావాల్లో ఉన్నాను గనక. ఒకప్పుడు తెలివి తక్కువగా ఇచ్చిన తప్పు భావాల్ని, అలాగే మళ్ళీ మళ్ళీ పాఠకులకు అందిస్తూ ఉండడం వల్ల వారికి హానే గానీ మేలు జరగదు. కాబట్టి, రచయితే జీవించి ఉంటే, రీ ప్రింటు సమయాల్లో పుస్తకాన్ని మళ్ళీ చదవగల స్థితిలో వుంటే, అందులో ఏమైనా పొరపాట్లు కనపడితే, వాటిని పాఠకుల దృష్టికి తేవడం చాలా అవసరం.

రచయిత జీవించి లేకపోతే, ఆ పుస్తకాల్ని రీ ప్రింట్ల కోసం సిద్ధం చేసే ఇతరులు, ఆ పుస్తకాల్లో అచ్చు తప్పుల్ని సరిచెయ్యడం తప్ప, మిగిలిన విషయాల్లో ఏ దిద్దుళ్ళూ చెయ్యకూడదు. ఆ రచనల్లో ఏ విషయాల గురించైనా పాఠకుల దృష్టికి తేదలిస్తే, 'ముందు మాటల' ద్వారా గానీ, 'ఫుట్ నోట్ల' ద్వారా గానీ, ఆ పని చెయ్యాలి.

కానీ, రచయిత జీవించి ఉండి, తన రచనలో లోపాల్ని తనే గ్రహించుకోగలిగితే, అలాంటి సందర్భాల్లో కొన్ని అవసరమైన సవరణలు చెయ్యడం తప్పుకాదు. కానీ, అలాంటి సవరణలు చేసిన సంగతి, పాఠకులకు తప్పకుండా చెప్పాలి.

ఈ దృష్టి తోనే నేను, నా పుస్తకాల్లో అక్కడక్కడా మార్పులు చెయ్యడమూ, వాటి గురించి కొత్త ముందు మాటలు రాయడమూ చేస్తూ ఉంటాను.

✳ **8** వ ముద్రణ సమయంలో :

ఈ పుస్తకం ఇప్పుడు మళ్ళీ చదివాను. గతంలో రాసిన ముందు మాటల్లో చాలా తక్కువ

విషయాలే ప్రస్తావించాను. ఇంకా కొన్ని పొరపాట్ల గురించి కూడా వివరించి ఉండవలసింది — అనిపించింది మళ్ళీ. అక్కడక్కడా కొన్ని వాక్యాలు తీసేశాను. అక్కడక్కడా కొన్ని వాక్యాలు చేర్చాను. అక్కడక్కడా కొన్ని మాటలు సవరించాను. అంటే, ఒక మాటకి బదులు ఇంకో మాట పెట్టడం.

— చిన్నప్పటి పద్మజ లక్షణాల్ని వర్ణించేటప్పుడు "పద్మజ రాకుమార్తె లాంటి అందగత్తె. పచ్చటి శరీరచ్ఛాయ. విశాలమైన నేత్రాలు. సుదీర్ఘమైన తలకట్టు" అని రాశాను. ఇలాంటి వర్ణనల్ని, పూర్తిగా తీసెయ్యడంగానీ, చాలా తగ్గించడంగానీ చేశాను, ఇప్పుడు.

— పద్మజ, తన కాలేజి చదువు గురించి తండ్రితో మాట్లాడేటప్పుడు "ఆడ పిల్లలకు వైద్యశాస్త్రం కన్నా ఉచితమైన చదువేమిటి నాన్నా? వైద్యం ఆడ వాళ్ళ చేతుల మీదే జరగాలి" అంటుంది. ఈ వాక్యాలు తీసేసి 'నేను మెడిసిన్ చదువుతాను నాన్నా!' అనే వాక్యం రాశాను.

— "కన్నబిడ్డ, వంశానికి పేరు ప్రతిష్టలు తెస్తుంది" లాంటి వాక్యాలు తీసేశాను.

— పద్మజ, జార్జిని "నువ్వు నన్నెందుకు ఇష్టపడుతున్నావు?" అని అడిగితే, దానికి జార్జి "నీ కళ్ళు నల్లగా తళ తళలాడతాయి" అనే రకం జవాబు చెపుతాడు. ఆమె కళ్ళు నల్లగా తళ తళ్ళాడకపోతే అతనికి ఆమె మీద ప్రేమ కలిగేది కాదన్నమాట! ఇలాంటి 'తప్పు' అభిప్రాయాల్ని తీసేశాను.

— చీటికీ మాటికీ అన్ని పాత్రలూ "భగవంతుడా!" అని భగవంతుణ్ణి తల్చుకునే సందర్భాల్ని చాలా తగ్గించాను. ఆ పాత్రల్ని 'నాస్తికులు'గా మార్చాలని కాదు. మరీ చాదస్తపు భక్తులైతే తప్ప, మామూలు వాళ్ళు చీటికీ మాటికీ భగవంతుణ్ణి తల్చుకోరు.

— పద్మజ, తను 'ఇష్టపడే' జార్జి గురించి తండ్రితో చెప్పినప్పుడు, ఆయన చాలా బాధ పడతాడు. అప్పుడు పద్మజ "... కన్న తండ్రిగా నన్ను ఆజ్ఞాపించు! నీ ఆజ్ఞ మీరను నాన్నా!" అంటుంది. ఆ తండ్రి, కూతుర్ని ఆజ్ఞాపించలేదు గానీ, ఒకవేళ ఆయన, కూతురితో "జార్జిని పెళ్ళి చేసుకోవడం మానెయ్యి!" అంటే, అప్పుడేమయ్యేది? కుల మత భేదాల్ని లక్ష్యపెట్టకుండా నిలబడడం అంటే, పెద్ద వాళ్ళ దయా ధర్మాల కోసమూ, వాళ్ళ అనుమతుల కోసమూ, ఎదురు చూడడం కాదు గదా? పెద్ద వాళ్ళు మూర్ఖంగా ఉంటే అది వాళ్ళ తప్పే! వాళ్ళు బాధపడుతున్నారు కదా అని జాలిపడి వాళ్ళకి లొంగిపోతే, అది వాళ్ళ లాగే మూర్ఖంగా ఉన్నట్టే అవుతుంది. కానీ, పద్మజ. అంత మూర్ఖత్వంలో లేదు. కానీ, తండ్రి మీద ప్రేమతో, ఆవేశంగా ఆ మాటలు అంది. ఎంత ఆవేశంలో అయినా ఆ మాటలు అనకూడదు.

— రఘుపతికి పెళ్ళయిన తర్వాత అతని తల్లి పార్వతిని పేరంటం పిల్చి, కోడల్ని చూడడానికి రమ్మంటుంది. కానీ, అప్పుడు పార్వతి వాళ్ళ ఇంటికి వెళ్ళడం ఎందుకు? వాళ్ళతో ఇంకా సంబంధం పెట్టుకోవడం ఎందుకు? ఇది చదివితే "అయ్యో! పార్వతి ఇంత ఆత్మాభిమానం లేని పని చేసిందే!" అని, నాకు చాలా విచారం కలిగింది. కానీ, దాన్ని అలా ఉంచవలసిందే. మార్చడానికి లేదు కదా? పార్వతికి, రఘు భార్యతో పరిచయం కలగాలంటే, అది ఇంకేదైనా రకంగా జరగాలి. ఏ ఆస్పత్రి లోనో, ఏ ప్రయాణం లోనో, ఇంకేదో రకంగా! పార్వతి, రఘూ వాళ్ళ ఇంటికి ఎప్పుడూ వెళ్ళకుండానే కథ నడవాలి. అలా

నడవడం సాధ్యమే.

పార్వతికి, రఘు భార్య మీద కోపం ఉండదు. ఉండకూడదు. సుశీల ప్రవర్తన మంచిగా ఉంటే పార్వతికి ఆమె మీద అభిమానం కలగవచ్చు. సుశీల జబ్బు పడ్డాక ఆమెని చూడ్డానికి, ఆమె పుట్టింటికి పార్వతి వెళ్ళవచ్చు. ఆ రకంగా, సుశీలని అప్పుడప్పుడూ కలిసినప్పుడు, పార్వతి, రఘు గురించి వింటూ ఉండవచ్చు. ఆ రకంగా కథ నడిస్తే, పార్వతికి సుశీలతో సంబంధమూ ఉంటుంది, పార్వతి ఆత్మ గౌరవంతో ప్రవర్తించినట్టూ అవుతుంది. ఈ 'ఆత్మ గౌరవం' సమస్యని అప్పట్లో నేను సరిగా ఆలోచించలేకపోయానన్న మాట! నా తప్పే పార్వతి తప్పు అయింది!

— ఈ పుస్తకం ఇంకా తర్వాత ఎన్ని ముద్రణలు పడ్డా, ఈ కొత్త ముందు మాటల హెచ్చరికలు ఇక అవసరం లేదు. ఇప్పటి వరకూ చెప్పిన వాటి ఆధారంతో పాఠకులు దీన్ని సరిగానే అర్థం చేసుకోవచ్చు. కాబట్టి ఇదే 'చివరి మాట!'

**రంగనాయకమ్మ**
డిసెంబరు, 2002

✳ **9 వ ముద్రణ సమయంలో :**

సాంప్రదాయాలంటే పడి చచ్చే కుటుంబాల్లో పిల్లలకు, కులాంతర, మతాంతర వివాహాలు చేసుకోవడం పెద్ద సమస్యే. ఈ కథలో వున్న పద్మజ విషయంలో అయితే, ఆమె ఇంకా జాగ్రత్తగా ప్రవర్తించి వుండవలసింది - అనిపిస్తోంది ఇప్పుడు.

ఎలాగంటే : పద్మజ, జార్జిని మొదట, తన స్నేహితుడి గానూ, తోటి డాక్టరు గానూ, తల్లి దండ్రులకు పరిచయం చెయ్యాలి. వాళ్ళు అతన్ని చూసి, అతని కుటుంబ విషయాలన్నీ తెలుసుకుంటారు. తర్వాత కొన్నాళ్ళ పాటు పద్మజ, జార్జిని గురించి అతని మంచి ప్రవర్తన గురించి ఇంట్లో చెపుతూ వుండాలి. కొన్నాళ్ళ తర్వాత, అతని మీద తన ఇష్టాన్ని చెప్పాలి. తల్లిదండ్రులు తప్పకుండా వ్యతిరేకిస్తారు. అయినా, తల్లిదండ్రుల్లో మార్పు కోసం పద్మజ 1, 2 సంవత్సరాలు నిరీక్షించాలి. వాళ్ళతో తను వాదిస్తూనే వుండాలి. అప్పటికీ వాళ్ళు మారకపోతే, ఇక వాళ్ళకి విలువ ఇవ్వనక్కరలేదు. తన ఇష్ట ప్రకారమే తను నడుచుకోవాలి. పెళ్ళి చేసుకున్న తర్వాత, అతనితో ఒక సారి ఇంటికి రావాలి. తల్లిదండ్రులు, 'వెళ్ళిపో' అనరు. పోనీ అలా అంటే, సరే వెళ్ళిపోవాలి. పద్మజ ఇలాగే చేసి వుండవలసింది. ఇది పద్మజకు సాధ్యమే. ఇప్పుడు వున్న కథలో కూడా ఈ సంఘటనలన్నీ జరగడం సాధ్యమే. 'ప్రారంభం' ఇప్పుడు వున్నట్టే వుండవచ్చు. తమకు తెలియకుండానే కూతురు పెళ్ళి చేసేసు కుంటుందని తల్లిదండ్రులు ఊహించరు కాబట్టి, ఒక రోజు పేపర్లో ఆ పెళ్ళి ఫొటో చూసి విచారపడినట్టు ప్రారంభం ఇప్పటిలాగే జరగవచ్చు. గతంలో జరిగిన సంఘటనలన్నీ తర్వాత కథలో వస్తాయి. జార్జిని, తల్లిదండ్రులకు మొదటే పరిచయం చేస్తే పద్మజ తెలివిగానూ, బాధ్యతగానూ ప్రవర్తించినట్టు అయ్యేది.

**రంగనాయకమ్మ**
18-12-2008

★

# రంగనాయకమ్మ రచనలు

## నవలలు —12 రూ.లు

| | | |
|---|---|---|
| 1. | కృష్ణవేణి ( ప్రచురణ ఆపేశాం ) | — |
| 2. | పేక మేడలు | 15 |
| 3. | బలి పీఠం | 60 |
| 4. | కూలిన గోడలు | 30 |
| 5. | స్త్రీ | 35 |
| 6. | రచయిత్రి | 70 |
| 7. | ఇదే, నా న్యాయం! | 50 |
| 8. | చదువుకున్న కమల | 15 |
| 9. | కళ ఎందుకు? | 45 |
| 10. | స్వీట్ హోమ్ ( 3 భాగాలూ కలిసిన సంపుటం ) | 140 |
| 11. | అంధకారంలో... | 40 |
| 12. | జానకి విముక్తి ( 3 భాగాలూ కలిసిన సంపుటం ) | 125 |

## నవలా పరిచయాలు —3

1. స్పార్టకస్ ( హోవర్డ్ ఫాస్ట్ నవల )
2. టామ్ మామ ఇల్లు ( హారియట్ బీషర్‌స్టోవే నవల )
3. స్వేచ్ఛాపథం ( హోవర్డ్ ఫాస్ట్ నవల )

( ఈ 3 పుస్తకాలూ, ఒకే సంపుటంగా) ........................ 50

## నవలికలు —5

1. ప్రేమకన్నా మధురమైనది!
2. చుట్టాలు
3. ఆండాళ్ళమ్మ గారు
4. పల్లెటూరు
5. నా డైరీలో ఒక పేజీ (కొంత భాగం)

( ఈ 5 పుస్తకాలూ, ఒకే సంపుటంగా) ........................ 45

## కథల సంపుటం —1

1. అమ్మకి ఆదివారం లేదా?

( 50 కథలు ఒకే సంపుటంగా ) ........................ 170

## పెద్ద వ్యాసాలు —14

1. నిశిత పరిశీలనా, దగాకోరు పరిశీలనా?
2. జనసాహితి తో మా విభేదాలు
3. తీగ లాగారు, డొంకంతా కదిలింది!

( ఈ 3 పుస్తకాలూ, ఒకే సంపుటంగా) ........................ 80

4. నీడ తో యుద్ధం! ............................................ 35
[ నాస్తిక, హేతు, నవ్య మానవ వాదాలపై 3 పుస్తకాలు కలిసిన సంపుటం ]
5. చలం సాహిత్యం ............................................ 30
6. 'యజ్ఞం' కథ మీద 2 వ్యాసాలు ........................ 10
7. తులసి దళం కాదు, గంజాయి దమ్ము! ................ 12
8. జల్లెడ కి ఎన్ని చిల్లులో అన్ని చిల్లులు!
(ఈ పుస్తకం ఇప్పుడు 'చైనాలో ఏం జరుగుతోంది?"లోనే కలిసి ఉంది)
9. 'అసమానత్వం'లోనించి 'అసమానత్వం'లోకే! ...... 15
10. వాడుక భాషే రాస్తున్నామా? ............................ 30
11. తెలుగు నేర్పడం ఎలా? .................................. 50
12. ఇంటి పనీ - బైటి పనీ .................................... 25
13. దళిత సమస్య పరిష్కారానికి.... ......................... 60
14. ఇంగ్లీషు కీకారణ్యంలోకి ప్రవేశించండి!
( తెలుగు విద్యార్థులకు ఇంగ్లీషు గ్రామరు పాఠాలు ) .... 100

## వ్యాసాల సంపుటం —1

1. మానవ సమాజం - నిన్నా, నేడూ, రేపూ ............ 90

## ప్రశ్నలూ, జవాబులూ — 2

1. శాస్త్రీయ దృక్పథం ............................................ 14
2. పాఠకుల ప్రశ్నలూ,
రంగనాయకమ్మ జవాబులూ .............................. 22

## అనువాదాలు —2

1. చైనాలో ఏం జరుగుతోంది? ................................ 50
[ 'జల్లెడకి ఎన్ని చిల్లులో అన్ని చిల్లులు'
పుస్తకం కూడా దీనిలోనే కలిసి వుంది ]
2. చైనాలో సాంస్కృతిక విప్లవమూ,
పరిశ్రమల నిర్వహణా! ........................................ 50

## ఇతర రచనలు —3

1. రామాయణ విషవృక్షం ( 3 భాగాలూ కలిసి ) ........ 200
2. మార్క్స్ "కాపిటల్" పరిచయం ........................ 330
( 2 సంపుటాలుగా)
3. ఒకటవ తరగతి తెలుగు వాచకము .................... 15

ఈ పుస్తకాలు దొరికే చోటు :

అరుణా పబ్లిషింగ్ హౌస్

ఏలూరు రోడ్డు, విజయవాడ - 500 002. ( ఫోన్ : 0866 - 2431181 )

# చదివారా?

పేక మేడలు

బలి పీఠం

కూలిన గోడలు

రచయిత్రి

ఇదే, నా న్యాయం!

చదువుకున్న కమల

కళ ఎందుకు?

స్వీట్ హోమ్

అంధకారంలో

జానకి విముక్తి